భారతి

సంపుటము 25 | నవంబరు, 1948 | సంచిక 11

సర్వధారి ఆశ్వయుజ, కార్తికములు

సానుభూతి

శ్రీ బెళ్లూరి శ్రీనివాసమూర్తి

తరుణము వేచి నీ మృదుపదమ్ముల దాపున వ్రాలిపోవ ము
మ్మరమగు కాంక్షతో పయనమైతిని, నాదగు రాచబాటలో
పరచిన దోయి లోకము నవప్రభ లొల్కఁగ పుష్పమాలికో
త్కరములు స్వామి! నా హృదయతాపము సైఁని సానుభూతితోన్.

తరుణము వేచి నీ మృదుపదమ్ముల దాపున వ్రాలిపోవ ము
మ్మరమగు కాంక్షతో పయనమైతి, విషాదవిశీర్ణపత్రముల్
బిరబిర రాల్చి నాహృదయవీథుల నవ్యవసంతమాధురీ
భరము వెలార్చి వీచె, తొలివాయువు లత్యనుకూలరీతులన్.

తరుణము వేచి నీ మృదుపదమ్ముల దాపున వ్రాలిపోవ ము
మ్మరమగు కాంక్షతో పయనమైతిని, నాహృదయమ్ములో వ్యథా
భరము సహింపనోపని కృపామయి కోకిలబాల పంచమ
స్వరమున నాలపించినది చల్లని పాటల నాదు త్రోవలోన్.

శరజ్జ్యోత్స్న

శ్రీ బులుసు వెంకటేశ్వర్లు

౧

వెండికొండను గరఁగించి విశ్వకర్మ
నైపుణి యొసంగఁ జంద్రమండలములోన
మూఁడు పాళ్లుంచి శేషము భూమిమీఁదఁ
జల్లె ననఁబోలు నీ శరచ్చంద్రికఁ గన.

౨

విపులసకలప్రపంచదుర్భిక్షవేళఁ
గనికరముతోడ లోకముల్ గన్నతల్లి
పిండివంటలతో విందువెట్టఁ బ్రజకు
ఆరఁబోసిన పిండి నా నలరు జ్యోత్స్న.

౩

అప్సరోభామినీదివ్యహాసశోభఁ
బుణికి పుచ్చుకొని శశాంకపూతజీవి
భూప్రజానీకకృతపురాపుణ్యమునకుఁ
జంద్రికారూపమునఁ జూపు సరణి తోఁచు.

౪

మల్లికాసుమజాలంపుఁ దెల్లఁదనము
క్రమకలహంసికాపక్షకాంతిజాల
మమల నీహారరుచియు సౌమ్యప్రదీప్తి
దాఁచుకొనఁబోలు నీజ్యోత్స్నఁ దమశిరములు

౫

విరహిరోగులపట్టున వెజ్జతనము
యోగులయెడాటమున మహాయోగగురుత
సర్వజనములపట్టులఁ జల్లఁదనముఁ
జూపి వెలుఁగొందు నీ శరజ్జ్యోత్స్న ప్రియత.

ప్రాచీన వ్యాకరణములు :

(గత సంచిక తరువాయి)

ప్రాక్ - పాణిని

శ్రీ శివశంకరశాస్త్రి

చాక్రవర్మణీయ వ్యాకరణము

అథో వ్యాకరణం జాతం యచ్చాక్రవర్మణాహృతమ్.

అష్టాధ్యాయిలో "ఈఙ్ చాక్రవర్మణస్య" (౬-౧-౧౩౦) అను సూత్రమున చాక్రవర్మణుని నామము గోచరించుచున్నది. కాతంత్రపరిశిష్టములోని "ఇతో వా" (సంధి ౪౩) సూత్రముపై వృత్తిలో శ్రీపతిదత్తుడు చాక్రవర్మణుని పేర్కొన్నాడు. శకటి-శాకటి-శాకటాయనీయ త్రితయుని వ్యాకరణమున "కప శ్చాక్రవర్మణస్య" (ఉణ్ ౫-౧౧౪) అను సూత్రము కలదు. దానిపై వ్యాఖ్యలో ఉజ్జ్వలదత్తుడు "కపాతే రేవ చాక్రవర్మణస్య ఆచార్యస్య మతేన కపప్రత్యయః సంప్రసారణంచ. కుపాపః సవివ. స్వరేతు విశేషః"అని వివరించినాడు. దీనినిబట్టి యితడు శాకటాయనునికి పూర్వుడని ఉపపన్న మగుచున్నది. ఈ సూత్రములను, వృత్తులను జూచుచో ఆకాలమున నితని వ్యాకరణము తప్పక యుండెడి దనిపించును, "కపః చాక్రవర్మణస్య"వలన చాక్రవర్మణు నకు మహర్షి శాకటాయనునకు పూర్వమే ప్రాతిపదికమాత్ర ములకు ధాతుజత్వకల్పన సమ్మతమని తేలుచున్నది. అది కానిచో ఔణాదిక సూత్రమున నీతని నామ మేల నిబద్ధమగును? ఈయనవ్యాకరణమున ద్వయశబ్దమునకు సర్వవిభక్తులలో సర్వనామత్వము స్వీకృతమయినట్లు ప్రతీతి. అందుచేతనే మాఘకవి "ద్వయానాం ద్వయేషా మపి మేదినీభృతామ్" (౧౭-౧౩) అనుటయు, భట్టోజిదీక్షితుడు ఖండించుటయు సంభ వించినది.

చాక్రవర్మణుడు చక్రవర్మపుత్రుడు. వాయు పురాణప్రకారము చక్రవర్మ కశ్యపదాయాదుల పౌత్రుడు. దానవసంబంధ ముండుటచేతనే ధర్మశాస్త్ర కారులలో నతని నామము కానరాదు. కశ్యపుడు బహుప్రాచీనమహర్షి. ఆయనప్రపౌత్రుడనుటచేత చాక్రవర్మణుడు ప్రాచీను డనవలసివచ్చినది.

ఆపిశల వ్యాకరణము

ఆపిశలం తతో జ్ఞేయం యత్పురాపిశలిస్మృతమ్.

అష్టాధ్యాయిలో "వాసుప్యాపిశలేః" (౬-౧-౯౨) అను సూత్రమువలన శబ్దాధికారమున పాణినికి ఆపిశలి ప్రామాణికు డని తోచును. "అపిశల స్యానంతరాపత్య మాపిశలిః. ఇఞ్ ఆద్యచో వృద్ధిః" అని శాబ్దికు లన్నారు. అందుచే ఆపిశలుని పుత్రుడు ఆపిశలి. అతడు సామతంత్రప్రణేత యని ప్రసిద్ధి. పౌరాణిక మతప్రకార మీతడు యాజ్ఞవల్క్యునికి శ్వశురుడు. యాజ్ఞవల్క్యుడు వైశంపాయనుని మేనల్లుడు, శిష్యుడు.

"కృత్వా చాధ్యయనం తేషాం
శిష్యాణాం శత ముత్తమమ్
విప్రియార్థం సశిష్యస్య
మాతులస్య మహాత్మనః"
(మహాభారత. శాంతి. ౩౪౩-౫.)

అని యాతడు స్వయముగా జెప్పినాడు. తరుణ యాజ్ఞవల్క్యుడు వృద్ధశాకల్యునితో బ్రహ్మవిచార మున ప్రవృత్తు డయినాడు. (బృహ. ఉప.) కావున ఆపిశలి, శాకల్య, వైశంపాయనాదులు సమకాలికులు. కురుక్షేత్రయుద్ధకాలమున ఆయన యుండెనని యూహించుట పురాతత్త్వవేత్తలకు అసమ్మతము కాదు. శ్రీ హేమచంద్రరాయ చౌధురి '*Political History of Ancient India*' అను గ్రంథమున ౧౩౧ పుటలో నిట్లు చెప్పినాడు:

"*The Malloi : They occupied the valley of the* Hydraotes (*Ravi*) *on both banks of the river. Their name represents the Sanskrit Malava Weber informs us that Apisali, one of the teachers cited by Panini speaks of the formation of the compound—'Khandraka-Malava'. Dr Smith pointed out that the Mahabharata coupled the tribes in question as forming part of the Kaurava host in Kurukshetra war.*"

భారతయుద్ధానంతరము యుధిష్ఠిరుడు ప్రభు వయినాడు; అప్పుడే కల్యబ్దము ప్రారంభమయినది. శ్రీముఖశకము ప్రారంభ మగునప్పటికి ౩౧౦౦ కల్యబ్దములు గడచినవి. మత్స్యపురాణప్రకారము ఆపిశలి భృగువంశమున నొక గోత్రప్రవర్తకుడు; ఒకప్పుడు పార్వతీదేవి పుణ్యకవ్రతమునకు నిమంత్రితుడు.

ఆపిశలిప్రోక్తవ్యాకరణనామము ఆపిశలము (పాణిని ౪-౩-౧౦౧,౧౧౫). ఈ గ్రంథము లక్ష్యమున నుంచికొని కాశికావృత్తిలో "ఆపిశలపాణినీయే శాస్త్రే" (౬-౨-౩౬) అని లిఖితమయినది. శ్రీ తత్త్వనిధిమతప్రకారము ఉల్లేఖయోగ్యము లగు నవవ్యాకరణములలో ఆపిశల మొక్కటి.

"అష్టకా ఆపిశలపాణినీయాః" అని అమోఘవృత్తిలో అభినవశాకటాయనుడు లిఖించినాడు. పాణిని వ్యాకరణమువలెనే ఆపిశలము సూత్రాత్మక గ్రంథ మనియు, అది అష్టకమనికాని, అష్టాధ్యాయి యనికాని ప్రసిద్ధి చెందెననియు దీనివలన గ్రహింప వచ్చును. "ప్రోక్తాల్లుక్" (౪-౨-౬౪) సూత్రముపై కాశికాదివృత్తులవలన, ఆపిశలవ్యాకరణపఠనపాఠములు చేయువారి వర్గమునకు ఆపిశల మను పేరు వచ్చిన దని చెప్పవగును.

బహుకాలముక్రిందటనే ఆపిశలము పోయినది. అయినను వివిధగ్రంథములలో ఆపిశలిసూత్ర మేదో యొకటి కానవచ్చుచుండును:

(౧) "తురుస్తుశమ్యమః సార్వధాతుకాసు చ్ఛందసి"— కాశికలో వామనా'చార్యుడు "ఆపిశలాస్తు తుస్తుశమ్యమః సార్వధాతుకాసు చ్ఛందసీతి పఠంతి" (౭-౩-౯౫) అన్నాడు. శ్రీపాదకృష్ణపండితుడు ఈ స్థానమున "*A rule of Apisali is given by the Kasika* 7-3-95 (S. S. O.)" అని వ్రాసినాడు.

(౨) "శతాచ్చ ఠన్యతావగ్రంథే"— కైయటుడు ప్రదీపములో దీనిని వివరించుచు, నిది ఆపిశలి వచన మన్నాడు. వేంకటాచలపండితుని యభిప్రాయముకూడ నిట్టిదే.

(౩) "సమయాదీనాం కర్మప్రవచనీయత్వమ్"- కాతంత్రకారకప్రకరణములోని "ద్వితీయైనేన" (చ. ౨౨౮) అను సూత్రముపై టీకలో దుర్గసింహుడు "ఆపిశలీయవ్యాకరణే కర్మప్రవచనీయత్వం దృష్ట మితి మతమ్" అని వ్రాసినాడు.

"ఆపిశలవ్యాకరణమున సమయా నికషా హా ధిక్ అంతరా అంతరేణ శబ్దసమూహము కర్మప్రవచనీయమని నిర్ధారితము. తదనుసారముగా శర్వవర్మయు 'కర్మప్రవచనీయైశ్చ' (౨౨౯) అను సూత్రమున ఈ శబ్దము లన్నియు ఆపిశలిమతప్రకారము కర్మప్రవచనీయాంతర్గతము లని చెప్పినాడు" అని భావము.

(౪) "ధేను రనఞి క ముత్పాదయతి"—పదమంజరిలో హరదత్తమిశ్రుడు "ధేను రనఞి క ముత్పాదయతి ఇ త్యాపిశలేః సూత్రమ్" అని వ్రాసినాడు (పద. ఖండ. ౨. ౧౩౬ పుట). "జ్ఞాపకం స్యాత్ తదంతత్వే తథా చాపిశలే విధిః" (౪-౨-౪౫) అని కాశికా

వృత్తి. ఆపిశలివిధి రేదియో తెలుపుటకు హరదత్త గ్రంథమున ఈ సూత్ర ముద్ధృతమయినది.

(౫) "మన్యకర్మ ణ్యనాదర ఉపమానాత్ విభాషా ఽప్రాణిషు"—ఈపాఠము శ్రీపతిసమ్మతము. (కాతంత్రపరిశిష్టము. కారక. ౩౯ సూత్ర) "మన్యకర్మ ణ్యనాదర ఉపమానే విభాషా ఽప్రాణిషు" అను పాఠము కైయటాచార్యసమ్మతము (౨-౩-౧౭ సూత్ర ప్రదీపము). హరినామామృతవ్యాకరణమున కారక ప్రకరణములో శ్రీజీవగోస్వామి "మన్యకర్మ ణ్యనాదర ఉపమానే విభాషా-ఽప్రాణిషు-ఇత్యేవాపిశలసూత్రం చ. జయాదిత్యాదయ స్తూపమానా దితిచ నాద్రియంతే ప్రత్యుదాహరంతి చ" (ఖండ ౧. ౭౪౨ పుట) అని వ్రాసినాడు.

(౬) "ధాత్వంతరయోగేవా"—ఇది ఆపిశల సూత్రము కావచ్చును. కాతంత్రప్రదీపమున "ఆపిశలీయమతే ధాత్వంతరయోగే పాక్షికం కర్తృత్వం తదనుసారేణ సంగత మిత్యదోషః" అని యున్నది. (విద్యాసాగరీయప్రదీపము. కారక ౪౧౯ పుట.)

"తదర్హమ్" (౫-౧-౧౧౭) అను పాణినీయ సూత్రమువంటి సూత్ర మేదియు ఆపిశలమున లేదని వినికిడి. "తదర్హ మితి నారబ్ధం సూత్రం వ్యాకరణాంతరే" అని భర్తృహరియు, "వ్యాకరణాంతరే ఆపిశలే కాశకృత్స్నే చ" అని హేలరాజును వ్రాసినారు. కాని భర్తృహరి యే గ్రంథమును జూచి, ఏ కింవదంతి విని యిట్లు లిఖించెనో తెలియదు.

సంప్రదాయనివృత్తికయి కేవలసూత్రపాఠమే కాక, ధాతుపాఠప్రాతిపదికపాఠము (గణపాఠము), శిక్షాశాస్త్రముకూడ ఆపిశలి రచించినాడు. అందు శిక్షాసూత్రము నేటికిని కలదు. అది ఆపిశలీయశిక్ష యని బహుస్థానములందు ముద్రితము. కాతంత్రమున నామ ప్రకరణములో ౧౪౩ సూత్రికలో దుర్గసింహు డిట్లు లిఖించినాడు: "ఆపిశలీయంతు—

పాద స్త్వర్థసమాప్తి ర్వా శ్లోకో వృత్తస్య వా పునః
మాత్రికస్య చతుర్భాగః పాద ఇత్యభిధీయతే."

దీనినిబట్టి ఛందస్సంబంధమున ఆపిశలి యొక గ్రంథము రచించినట్లు ఊహింపవచ్చును.

ఆపిశలిధాతుపాఠము లభింపలేదు. కాని ఒకానొకకాలమున అది ప్రచారములో నుండె ననుటకు సందేహము లేదు. "సమస్రవిభక్తిః స్థః" (౧-౩-౭౭) అను సూత్రముపై భాష్యమున "అస్తిం సకారమాత్రమా తే" అని స్మరించినాడు. దీనిపై మహాభాష్య దీపికలో "ఇహాస్తిః కేచిత్ సకారమాత్ర ముపదిశ్య పిత్స్వడాగమం విదధతి"అని భర్తృహరి లిఖించినాడు. (మహాభాష్యము, ద్వితీయఖండము, ***Kielhorn intro.***) భర్తృహరివాక్యమును పరిస్ఫుటము చేయుటకై కాశికాన్యాసమున జినేంద్రబుద్ధి యిట్లు వ్రాసినాడు: "సకారమాత్ర మస్తిధాతు మాపిశలాచార్యః ప్రతిజానీతే. తథాహి స తస్య పాణినే రివాస భువీతి పాఠః. కిం తర్హి? స భువీతి. సర్వేష్వాగమా గుణవృద్ధీ ఇతిష్యతి ఇతి. ఏవంహి సప్రతిజానీత ఇత్యర్థః" (౧-౩-౭౭). అమోఘవృత్తికారుడు శాకటాయనుడును జినేంద్రబుద్ధి వలెనే చెప్పినాడు. భర్తృహరి కించుమించుగా సమకాలికుడు స్కందస్వామి "వసి-జఘుర్తి ఛాందసౌ ధాతూ. వ్యాకరణస్య శాఖాంతర ఆపిశలాదౌ స్మరణాత్"అని నిరుక్తభాష్యమున లిఖించినాడు. ఈ ప్రాచీనోక్తులవలన ఆపిశలధాతుపాఠ ముండె ననవచ్చును.

ధాతుపాఠమువలెనే ఆపిశలగణపాఠముకూడ లభింపదు. గణపాఠమనగా ప్రాతిపదికపాఠము. ఆపిశల సర్వాదిగణపాఠము వర్తమానగణపాఠముకంటె భిన్నమని దీపికలో హరి వ్రాసినాడు. పాణినికి పూర్వమే సర్వాదిగణపాఠ మొకటి భాష్యాదికమునుండి యుపపన్నమయి యుండును. పాణినీయసర్వాదిపాఠ మిట్లున్నది: "సర్వ విశ్వ...సిమ...పూర్వపరావర...వ్యవస్థాయా మసంజ్ఞాయామ్...స్వమజ్ఞాతి ధనాఖ్యాయామ్...అంతరం బహిర్యోగోప సంవ్యానయోః...త్యద్ తద్ యద్...కిమ్...సర్వాదిః" ఆపిశలీయసర్వాదిగణపాఠ మిట్లుండె ననవచ్చును: "సర్వ విశ్వ...సిమ త్యద్ తద్ యద్...కిమ్...పూర్వ పరావర...వ్యవస్థాయా మసంజ్ఞాయామ్. స్వమజ్ఞాతిధనాఖ్యాయామ్. అంతరం బహిర్యోగోపసంవ్యానయోః. సర్వాదిః."

అష్టాధ్యాయిలోని "పూర్వ పరావర..." (౧-౧-౩౪) సూత్రభాష్యమున, సూత్రప్రయోజనాధికరణప్రసంగమున మూడుపక్షము లుపన్యస్తములయినవి. పతంజలి ప్రథమద్వితీయపక్ష ప్రత్యాఖ్యానపూర్వకముగా తృతీయపక్షమును గ్రహించినాడు.

(౧) ఇదం తర్హి ప్రయోజనం వ్యవస్థాయామసంజ్ఞాయా మితి వక్ష్యామీతి. ఏత దపి నాస్తి ప్రయోజనమ్. ఏవం విశిష్టాన్యేవైతాని గణే పఠ్యంతే.

(౨) ఇదం తర్హి ప్రయోజనం ద్వ్యాదిపర్యుదాసేన పర్యుదాసో మాభూ దితి. ఏతదపి నాస్తి ప్రయోజనమ్, ఆచార్యప్రవృత్తిః జ్ఞాపయతి నైషాం ద్వ్యాది పర్యుదాసేన పర్యుదాసో భవతీతి. య దయం పూర్వత్రాఽసిద్ధ మితి నిపాతనం కరోతి. వార్తికకారశ్చ పఠతి జశ్ భావా దితి (౫-౩-౧౩: ౨ వార్తిక) చేత్ ఉత్తరత్రాఽభావా దప్రవాదప్రసంగ ఇతి.

(౩) ఇదం తర్హి ప్రయోజనం—జసి విభాషాం వక్ష్యామీతి.

వర్తమానసర్వాదిగణపాఠము మనసులో నుంచి కాని ప్రథమపక్షమును, ఆచార్యప్రవృత్తిని భావించి ద్వితీయపక్షమును మహర్షి ప్రత్యాఖ్యానము చేసినాడు. కాని, వర్తమానసర్వాదిగణపాఠముకంటె భిన్నపాఠము లేనియెడల "ద్వ్యాదిపర్యుదాసేన పర్యుదాసో మాభూ దితి" అని యేల చెప్పవలసివచ్చినది? దీనిని వివరించుచు కైయటుడు ప్రదీపములో నిట్లు వ్రాసినాడు: "...త్యదాదీని పఠిత్వా గణే కైశ్చిత్ పూర్వాదీని పఠితాని. తత్రాఽద్వ్యాదిభ్య ఇతి తసిలాదీనాం ప్రతిషేధః ప్రాప్నోతి. తత్ర పునః సర్వనామసంజ్ఞా తసిలాదివిధానార్థం విధీయతే. తేన ద్వ్యాది పర్యుదాసో బాధ్యతే." పాణినికాలమునగూడ ఆపిశలము వ్యాప్తిలో నున్నట్లు పదమంజరిలో హరదత్తు డిట్లన్నాడు: "అత్ర యే పాఠవ స్తే...కథం పున రాచార్యేణ పాణినినా అవగత మేతే పాఠవ ఇతి? ఆపిశలేన పూర్వవ్యాకరణేన." ఆపిశలగణపాఠమును గూర్చియే యీవిషయము లన్నియు సంభావితము లయ్యె ననవచ్చును.

ఆపిశలసంప్రదాయ మొకటి ప్రబలముగా నుండెను. ఇప్పటికిని వివిధగ్రంథములలో ఏతత్సంప్రదాయోక్తులు కానవచ్చును.

(౧) కాతంత్రసంధి ౮ - సూత్రపంజీయందు త్రిలోచనదాసు డిట్లన్నాడు: "తథా చాపిశలీయాః పఠన్తి—

సామీప్యేఽథ వ్యవస్థాయాం
ప్రకారేఽవయవే తథా
చతుర్ష్వర్థేషు మేధావీ
ఆదిశబ్దంతు లక్షయేత్...ఇతి..."

(౨) కాతంత్రసంధి ౨౮ సూత్రముపై టీకలో దుర్గసింహు డిట్లు లిఖించినాడు: "తథా చాపిశలీయ శ్లోకః—

అగమోఽనుపఘాతేన వికారశ్చోపమర్దనాత్
ఆదేశస్తు ప్రసంగేన లోపః సర్వాపకర్షణాత్..."

సుపద్మములోని సుబంత ప్రకరణమున ౪౮ సూత్రముపై 'మకరందము'న విష్ణుమిశ్రుడు నీశ్లోకము నుద్ధరించుచు "ఇత్యాపిశలీయాః" అన్నాడు. ఆపిశలి స్వయముగా దీనిని చెప్పెనో, లేదో అనుసంధానము చేయవలెను. దీనిని సంప్రదాయోక్తిగా ప్రస్తుతము గ్రహింపనగును.

(౩) నవీనకౌమారమతమున నిట్లున్నది:
"గత్యర్థాదిషు కస్మైవ నీఖ్యాద్యాదిషు కర్తృతా
శేషే కర్మచ కర్తాచ యథాసంభవ మిష్యతే."

ఇది ఆపిశలసంప్రదాయశ్లోకము. కాని శ్రీపతి, లోచన, దుర్గసింహాదుల ప్రాచీనకౌమార గ్రంథములలోగాని, అన్యసంప్రదాయప్రాచీనరచనలోగాని యీ శ్లోకము కానరాదు. ఇయ్యది ఆపిశల సంప్రదాయములోని దని యూహించుటకును వీలు లేదు. పాణినీయసూత్రములు—"గతిబుద్ధి......సణౌ" (౧-౪-౫౨) "హృక్రో రన్యతరస్యామ్" (౧-౪-౫౩) అను రెండిటిలో మొదటిదానిపై లఘువృత్తిలో పురుషోత్తము డిట్లు వ్రాసినాడు: "తతశ్చ గత్యర్థాదివ్యతిరిక్తానా మణౌ కర్తుర్ణౌ పృథగుం భః౭ి కర్తృత్వం కర్మత్వం చేతి వదంతః కేచిత్ పాఠయ న్త్యేదమం

దేవదత్తం దేవదత్తే నేత్యాద్యపి భవతీ త్యాహుః. ఏవంచ హ్యస్త్రోర్వేతి ప్రపంచార్థం వేదితవ్యమ్."

ఉక్తశ్లోకమును పురుషోత్తము డెరుగడు. కాని చెప్పిన విషయము తాత్పర్యశ్లోకోపలబ్ధమయియుండును. కాతంత్రపరిశిష్టమున శ్రీపతి యిట్లు లిఖించినాడు: "తదా హ్యస్త్రంచో ర్వ్యాకచన మకర్మకాభ్యవహారా ర్థయో ర్నిత్యం మాభూ దితి, కథం ప్రపంచార్థమితి లఘు వృత్తికృతోక్తమ్." (కారక ౧౮ సూ). శేషోక్త సూత్రము అనర్థకప్రపంచార్థకము కాదని యభిప్రాయము. అందుచే దీని వ్యాఖ్యలో గోపీనాథతర్కాచార్యుడు తొలుత ఆపిశలీయసంప్రదాయమును పేర్కొని యిట్లు వ్రాసినాడు: "తథా చాహుః గత్యర్థాదిషు కర్తరి...అత్రైవ మాపిశలీయదిశా వా హ్యస్త్రంచో రిత్యనర్థకమ్; తథాచ పురుషోత్తమో వాకచన మనర్థక మిత్యాహ రక్షితి...హీనమహీమత్వాత్ లఘువృత్తి ర్న్యాల్పాక్షరా దితి భావః." అక్కడ చెప్పిన శ్లోకమును శ్రీపతి వినలేదనికాని, ఆపిశలవాద మాత డెరుగ డనికాని చెప్పుట యుక్తము కాదు. ప్రసంగాంతరములో నతడు ఆపిశలిని పేర్కొని "మన్యకర్మణ్యనాదరే..."ఇత్యాదిసూత్రము నుద్ధరించినాడు(కారక ౩౯). ఏమయినను శ్రీపతిగోపీనాథుల వాక్కులనుబట్టి కౌమారసంప్రదాయములోని పుండరీకవిద్యాసాగరుడు కాతంత్రప్రదీపములో నిట్లు వ్రాసినాడు: "ఆపిశలీయమతే హ్యస్త్రంచో ర్వ్యాకచనం ప్రపంచార్థ మితి పురుషోత్తమః. అత్రాకర్మకత్వేఽభ్యవహారార్థేన సాఫల్య మితి శ్రీపతిప్రలాపో నిరస్తః" (కారక ౨౧౯). కలాప దీపికయందును భట్టి యిట్లే వ్రాసినాడు.

అష్టాధ్యాయిలోవలెనే చాంద్రమునందును "గతి బోధాహారశబ్దార్థానాహ్యానాం ప్రయోజ్యే" (౨-౧-౪౪) అనియు, "హ్యస్త్రోర్వా" (౨-౧-౪౫) అనియు సూత్రము లున్నవి. ఆపిశలీయశ్లోకమును వర్ణతఃగాని, తాత్పర్యతఃగాని యెరిగియున్న చో చంద్రగోమి యేల యూరకుండును? శ్రీపతికి పిమ్మటను, గోపీనాథునికి పూర్వమునను ఆపిశలీయ సంప్రదాయసంబంధి యని యీ శ్లోకము నెవరో కృతించియుందురు. మండనాచార్యుని దొర్లచెప్పిన యీశ్లోకమున కాకరము కావచ్చును. మండనాచార్యుడు క్రీ. శ. ౧౩, ౧౪ శతాబ్దులలోనివాడు. కావున నతడు శ్రీపతికి పరవర్తి, గోపీనాథునకు పూర్వవర్తి.

వ్యాడీయ వ్యాకరణము

మునినా వ్యాడినా గ్రంథః ప్రణీత స్తదనంతరమ్.

వ్యాడినామకు లగు వైయాకరణు లిరువురు కలరు. వేదనిధియగు శౌనకభార్గవుని శిష్యు డొకడు; ఆయన పాణినికి పూర్వుడు. రెండవయాతడు పాణిని శిష్యుడు,మాతులపుత్రుడో పౌత్రుడో యగు దాక్షాయణ వ్యాడి. అష్టాధ్యాయిలో వీరిపేరులు కానరావు. పేరు కనబడకున్నను పాణినికి ముందువెనకల నున్న వివిధ గ్రంథములవలన వృద్ధవ్యాడినామధేయ ముపపన్న మగును. దాక్షాయణవ్యాడి సంగ్రహకారు డని ప్రసిద్ధి. మహాభాష్యములోను, దీపికాదిగ్రంథముల లోను ఆయననామము గోచరించుచున్నది.

వికృతవల్లిలో వ్యాడి యిట్లు చెప్పినాడు:

"శైశిరీయే సమామ్నాయే వ్యాడినైవ మహర్షిణా
జటాద్యా వికృతీ రష్టౌ లక్ష్యంతే నాతివిస్తరమ్."

వ్యాడి మహర్షి యని తేలినది. "శౌనకాదిభ్యశ్ఛందసి" (౪-౩-౧౦౬)అను సూత్రమున పాణిని శౌనకుని పేర్కొన్నాడు. శౌనకుని ఋక్ప్రాతిశాఖ్యలో వ్యాడిపేరు కలదు. శునకవంశముకంటె అర్వాచీనుడు (గృహపతికాని, కులపతికాని) శౌనకుడు పాణినికి పూర్వుడు. ఆయన ఋక్ప్రాతిశాఖ్యలో నిట్లు కానవచ్చును—"ఉభే వ్యాడిః సమస్వరే" (౩-౧౩); "పరేషాం న్యాస మాచారం వ్యాడి స్తౌచేత్ స్వరౌ పరౌ" (౩-౮); "వ్యాడేః సర్వత్రాభిధానలోపః" (౬-౨౧) ఇత్యాదులు. ఉవటాచార్యుడు "పరేషాం......"అను సూత్రవ్యాఖ్యలో "అవార్షా దితికరణాత్ పరేషా మక్షరాణాం న్యాస ముదాత్తత్వ మాచారం మన్యతే వ్యాడి రాచార్యః" అన్నాడు. దీనివలన శౌనకోక్తవ్యాడి పాణినికి పూర్వుడని యుపపన్న మగుచున్నది.

వ్యాడివిరచితమగు వ్యాకరణగ్రంథ మేదో యుండవలెను. శౌనకీయఋక్ప్రాతిశాఖ్యలో—

"సమాపాద్యం నామ వదంతి సత్వం
తథా ణత్వం సామవశాంశ్చ సంధీన్
ఉపాచారం లక్షణతశ్చ సిద్ధ
మాచార్యా వ్యాడిశాకల్యగార్గ్యాః" (౧౩-౧౨)

అను శ్లోకము దానికి ప్రమాణము. వ్యాకరణాధికారమున సుప్రసిద్ధులగు శాకల్యగార్గ్యులతోపాటు వ్యాడి నామముకూడ లిఖితము. బహుశః వ్యాడివ్యాకరణములో వైదికలౌకికభాగము లుండవచ్చును. పూర్వ ముద్ధరించిన వచనములు వైదికభాగమునకు ప్రమాణములు. "ఇకాం యణా వ్యవధానం వ్యాడిగాలవయో రితి వక్తవ్యమ్" అన్నాడు పురుషోత్తముడు. "యణాఽవ్యవధానం వ్యాడిగాలవయోః" అని సుపద్మమున పద్మనాభుడు లిఖించినాడు. గాలవీయవ్యాకరణమున లౌకికభాగము నుండి పాణిని వివిధవాదములను గ్రహించినాడు (౬-౩-౬౧; ౭-౩-౯; ౮-౪-౬౭).

"ఇకాం యణ్భి ర్వ్యవధానమ్" అనునదియు లౌకికనియమసంబంధిసూత్రము. కావున గాలవ వ్యాకరణములోవలె వ్యాడివ్యాకరణమున లౌకికభాగ మున్నట్లు భావించుట అసంగతముకాదు. పాణిని-అష్టాధ్యాయిలోకూడ లౌకికవైదికభాగము లున్నవి. వ్యాడివ్యాకరణముగాని, గాలవవ్యాకరణముగాని అష్టాధ్యాయివలె నుండె నని యూహింపవచ్చును. అష్టాధ్యాయిలో లౌకికభాగము ప్రధానము, గాలవాదులలో వైదికభాగమే ప్రధానము. వ్యాడిశిష్య డిట్లు చెప్పె నాడు:

"అసీన్ గృహపతి ర్యోవై
నైమిశారణ్యవాసినామ్
శతానీకాయ రాజ్ఞే వై
జనమేజయసూనవే."—ఇత్యాది...

శౌనకు డనగా ఋక్ప్రాతిశాఖ్యకారుడు, కులపతి గృహపతియగు శౌనకుడు. ఈయన పితామహుడు ఇంద్రోతనైవాప శౌనక భార్గవుడు. శౌనక భార్గవునకు వేదనిధి యని పేరు దుండెను. ఆతడు పెద్ద వ్యాసపెరువు. వ్యాడి స్వయముగా—

"నత్వాఽఽదా శౌనకాచార్యం
గురుం వేదమహానిధిమ్
మునీంద్రం సర్వవేదజ్ఞం
బ్రహ్మజ్ఞం లోకవిశ్రుతమ్,
అని స్తుతించినాడు.

ఋక్ప్రాతిశాఖ్యకారుడగు శౌనకుడు జనమేజయు పుత్రుడగు శతానీకుని కాలమున నున్నట్లు వద్గురు శిష్యుడు భావించినాడు. అందుచే తత్పితామహ శిష్యుడు వ్యాడి జనమేజయుని కాలమునగాని, పరీక్షిత్తు కాలమునగాని ఉన్నట్లు తలంపవచ్చును.

"స్వాగతాదీనాంచ" (౭-౩-౭) అను పాణినీయసూత్రస్వాగతాదిగణమున వ్యడనామము కాన వచ్చుచున్నది. వ్యడుని అపత్యము వ్యాడి. ఈయన గోత్రప్రవర్తకములలోనివాడు. అత్రిగణమున వ్యాడి గోత్రపాఠముకూడ కలదు. ఆత్రేయ, అర్చనానస, శ్యావాశ్వమునిత్రయ మీ గోత్రప్రవర అని గ్రంథాంతరములవలన తెలియవచ్చుచున్నది. వీరందరును వేద మంత్రద్రష్టలు, పాణినికి పూర్వులు. స్వాగతాదిగణము లోని వ్యడమునిపుత్రుడు వ్యాడియు పాణినికి పూర్వుడు. ఈయన శౌనకశిష్యుడగు వ్యాడి యయి యుండను కావచ్చును.

"సరూపాణా మేక శేష ఏక విభక్తౌ" (౧-౨-౬౪) అను సూత్రముపై "ఆకృత్యభిధానాదేకం విభక్తౌ వాజప్యాయనః" అని కాత్యాయనవార్తిక మున్నది. దీనిపై పతంజలి యిట్లు వ్రాసినాడు: "ఆకృత్యభిధానాదేకం శబ్దం విభక్తౌ వాజప్యాయన ఆచార్యో న్యాయ్యం మన్యతే. ఏకా ఆకృతిః, సా చాభిధీయత ఇతి." ఈ సూత్రముపై కాత్యాయనుడు "ద్రవ్యాభిధానం వ్యాడిః" అను వేరొక వార్తికము రచించినాడు. దీనిపై పతంజలి "ద్రవ్యాభిధానం వ్యాడి రాచార్యో న్యాయ్యం మన్యతే ద్రవ్య మభిధీయత ఇతి" అన్నాడు. దీని యభిప్రాయ మిది. ప్రవృత్తినివృత్తిభేదముచే శబ్ద మయిదువిధములు: జాతి, ద్రవ్య, లింగ, సంఖ్యా, కారకములు. వానిలో వాజప్యాయనుడు జాతిపదార్థవాది; వ్యాడి ద్రవ్య పదార్థవాది. ఉభయులలో ఈ మతభేద మున్నది. అనంతరము పాణినిముని ఉభయపదార్థవాది. కావుననే ఈ యాభాణకము వినవచ్చుచున్నది:

"ఇహ జగతి సంసారే
పదార్థో ద్విధ్యతే ద్వయమ్."
క్వచిద్ వ్యక్తిః క్వచిత్ జాతిః
పాణినే స్తూభయం మతమ్.

వ్యక్తి యనగా ద్రవ్యము. పాణినికి పిమ్మట కాత్యాయనముని జాతిద్రవ్యలింగపదార్థవాది. ఆయన తరువాత వ్యాఘ్రపాదుడు చతుష్టయవాది. అనంతరము పతంజలి పంచకవాది.

అందుచే వైయాకరణభూషణసారములో—
"ఏకం ద్వికం త్రికం చాథ
చతుష్కం పంచమం తథా,
సామర్థా ఇతి సర్వేఽమీ
పక్షాః శాస్త్రే నిరూపితాః."
అని యున్నది.

ఏకపదార్థవాది వాజప్యాయనుడు యాజ్ఞవల్క్యుని సమకాలికుడు. కావున పాణినికి పూర్వుడు. వాజప్యాయనుని మొదలు పతంజలివరకును ఉత్తరోత్తరోక్తుఁడగు ముని పూర్వపూర్వోక్తుని కంటె అర్వాచీనుడు. వాజప్యాయనునివలె వ్యాడికూడ ఏకపదార్థవాది. కావున వ్యాడి పాణినికి పూర్వు డనవలెను. ఏకపదార్థవాది యగు వ్యాడి వైయాకరణు డని కాత్యాయనుడు చెప్పినాడు. ఈ సంగతులను బట్టి శౌనకోక్త వ్యాడియే కాత్యాయనోక్తవ్యాడియని తోచును.

వ్యాకరణాధికారమున 'సంగ్రహ'మను గ్రంథము బహుకాలమునుండి ప్రచారములో నున్నది. "ససూత్రవృత్త్యర్థం పదం మహార్థం ససంగ్రహం సిధ్యతి వై కపీంద్రః" (ఉత్తరకాండ, ౮౧-౮౫) అను శ్లోకము రామాయణమున కలదు. లక్షణసంబంధమున ప్రాచీనులు "బహ్వర్థకవాక్యానా మేకత్ర సంకలనం సంగ్రహః" అన్నారు. పతంజలికాలమునగూడ సంగ్రహ మను గ్రంథ ముండెను. ఆయన మహాభాష్యమున నిట్లు లిఖించినాడు: "సంగ్రహ ఏతత్ ప్రాధాన్యేన పరీక్షితం నిత్యో వా స్యాత్, కార్యో వా స్యాత్... సంగ్రహే తావత్ కార్యప్రతిద్వంద్విభావాత్ మన్యామహే నిత్యపర్యాయవాచినో గ్రహణ మితి." ఈగ్రంథ రచయిత యెవరో మహాభాష్యమునుండియే గ్రహింపవచ్చును. "ఉభయప్రాప్తౌ కర్మణి" (౨-౩-౬౬)అను సూత్రవ్యాఖ్యావసరమున పతంజలి "శోభనా ఖలు దాక్షాయణస్య సంగ్రహస్య కృతిః. శోభనా ఖలు దాక్షాయణేన సంగ్రహస్య కృతిః" అన్నాడు. పతంజలి చూచిన సంగ్రహకృతి దాక్షాయణునిది. అత డెవరు? మహామహోపాధ్యాయ శివదత్తశర్మమతమున దాక్షాయణుడు పాణినికి మేనమామకొడుకు. దీనిని విశ్వసింపవచ్చును. దాక్షీపుత్రుడగు పాణినిముని దక్షుని దౌహిత్రుడు. దాక్షీపుత్రదాక్షాయణుడు ఆయనపౌత్రుడు. పాణిని దాక్షాయణశిష్యు డని కొంద రందురు. మహాభాష్యదీపికలో భర్తృహరి యిట్లన్నాడు: "సంగ్రహో వ్యాడిశ్చైవ శాస్త్రం నైకదేశః. తత్రైకతంత్రత్వాత్ వ్యాడేశ్చ ప్రామాణ్యా దిహాపి తత్రైవ సిద్ధశబ్ద ఉపాత్తః." సంగ్రహకారదాక్షాయణుడు కూడ వ్యాడినామప్రసిద్ధు డనియు, తత్సంగ్రహాదిని 'సిద్ధ'శబ్దమును జూచి కాత్యాయనుడు వార్తికపాఠప్రారంభమున సిద్ధశబ్దము ప్రయోగించె ననియు దీనివలన నుపపన్నమగుచున్నది.

"సంగ్రహో వ్యాడికృతో లక్షశ్లోకసంఖ్యో గ్రంథ ఇతి ప్రసిద్ధిః" అని నాగేశభట్టు వ్రాసినాడు. "చతుర్దశసహస్రాణి వస్తూని అస్మిన్ సంగ్రహగ్రంథే" అని భర్తృహరి లిఖించినాడు. వాక్యపదీయద్వితీయ కాండలోని "ప్రాయేణ సంక్షేపరుచీ నల్పవిద్యాపరిగ్రహాన్......" ఇత్యాదిశ్లోకవ్యాఖ్యలో పుణ్యరాజు "ఇహ పురా పాణినీయేఽస్మిన్ వ్యాకరణే వ్యాడ్యుపరచితం * లక్షశ్లోకపరిమాణం సంగ్రహాభిధానం నిబంధ మాసీత్" అన్నాడు. స్మృత, ప్రణీత, రచితప్రభృతిశబ్దములకు బదులుగా పుణ్యరాజు ఉపరచిత అనికాని, ఉపచరిత అనికాని యేల ప్రయోగించెను? ఒకవేళ దాక్షాయణుడు సంగ్రహగ్రంథ

---

* వ్యాడ్యుపరచిత మనుచోట నొకానొక విమర్శకుడు వ్యాడ్యుపచరితమ్ అన్నాడు. "ఉపరచితం ప్రతిసంస్కృతమ్" "ఉపచరిత మారాధితం సేవితంవా". ఉపచరిత—**approached, attended** అని **Monier Williams** వ్రాసినాడు. నష్టము లేదు.

మునకు ప్రతిసంస్కర్త యగునా? అయినను చిక్కు లేదు. సామాన్యజీవితకాలములో పదునాలుగు వేల విషయములనుగూర్చి లక్షశ్లోకాత్మకగ్రంథము రచించుట సహజము కాదు. కావుననే వృద్ధుడైయున్న వ్యాడిగ్రంథమును చేకొని, పాణినినయానుసారముగా తత్కాలోపకారకముగా దాక్షాయణవ్యాడి ప్రతిసంస్కారము చేసియుండవచ్చును. ఇట్టి యుదాహరణములు కలవు. దృఢబలప్రతిసంస్కృతవర్తమానచరకసంహిత, చంద్రటపరిశోధితవర్తమానసుశ్రుతము, చంద్రగోమిప్రతిసంస్కృతవర్తమానచాంద్రవ్యాకరణము, దుర్గసింహాదికర్తృకప్రతిసంస్కృతపరివర్ధితవర్తమానకలాపము, జుమరనందపరిశోధితక్రమదీశ్వరీయ రసవతీవృత్తి ఇత్యాదులు కలవు.

మహారాజహర్షవర్ధనుడు, వామనాచార్యుడును వ్యాడిప్రణీతలింగానుశాసనమును జూచినారు. హర్షవర్ధనుడు "వ్యాడేః శంకరచంద్రయో ర్వరరుచే ర్విద్యానిధేః పాణినేః సూక్తాన్ లింగవిధీన్ విచార్య......" అన్నాడు. వామనీయలింగానుశాసనమున నిట్లున్నది: "వ్యాడిప్రణీత మథ వారరుచం సచాంద్రమ్......... య ద్వ్యాడిప్రముఖైః ప్రపంచబహులం లింగస్య లక్ష్మోదితం తం సంహృత్య మయా యథా నిగదితం వ్యాఖ్యాయతే జానతామ్." ఈ వ్యాడి పాణినికి పూర్వవర్తియో సమకాలికుడో చెప్పుట కష్టము. కాని యీతడు దాక్షాయణవ్యాడి కాని, వృద్ధవ్యాడి కాఁజేరడు.

వ్యాడివిరచితమైన ఉత్పలినీకోశము చిరకాలముక్రిందనే లోపించినది. కావ్యకల్పలతా పరిమళమున అమరచంద్రుడు "వ్యాడికృతోత్పలినీ మభ్యాక్" అన్నాడు. ఉత్పలిని ప్రామాణికకోశము. అభిధానచింతామణివ్యాఖ్యలో హేమచంద్రుడు "ప్రామాణ్యం వాసుకేః వ్యాడేః..." అన్నాడు. మహేశ్వరుని విశ్వప్రకాశములో "భోగీంద్రకాత్యాయనసాహసాంకవ్యాడేప్రరస్న రాజాం......"అని యున్నది. టీకాసర్వస్వమున సర్వానందవంద్యోపాధ్యాయుడు బహువారములు వ్యాడీయకోశమతమును, వచనములను ఉద్ధరించినాడు. "చాషః కికీదివిః స్మృత ఇతి వ్యాడినా దీర్ఘ ఉక్తః" (అమర. కాండ ౨) "ఆజ్యేచ ఘృతమ్—

అయాచితే యజ్ఞశేషే నిర్యాసేచాపి సుందరి
అమృతం వారిణి ప్రోక్త మతిహృద్యేచ వస్తుని.
ఇతి వ్యాడిః."

దీనిని లక్ష్యమం దుంచికొని త్రికాండశేషమున పురుషోత్తముడు "వ్యాడిః వింధ్యస్థో నందినీసుతః" అన్నాడు. ఈతడు పాణినికి పూర్వవర్తియగు వ్యాడియో, దాక్షాయణవ్యాడియో తెలియదు. లింగానుశాసనము ఉత్పలినిలో భాగము. ఇట్లసచో నీతడు దాక్షాయణవ్యాడియే యగును.

పండితప్రవరశ్యామాచరణ కవిరత్నమహోదయుడు తాను వెలయించిన ముగ్ధబోధవ్యాకరణమున ఉత్పలమాలినిని ఉత్పలినిగా భావించి—

"క్రోడా దారా తథా హారా
త్రియమీతే యథాక్రమమ్,
క్రోడే దారేషు హారేచ
శబ్దాః ప్రోక్తా మనీషిభిః."

అను శ్లోకము వ్యాడిప్రణీత మన్నాడు. ఇది యుక్తము కాదు. సంక్షిప్తసారరసవతిలో ౧౬వ శతాబ్దిలోని మహారాజజుమరనంది యీశ్లోకము నుద్ధరించుచు "ఇత్యుత్పలమాలినీ"అన్నాడు. (క్రుత్. ౩౬౬ సూ.) ఉత్పలమాలినీకోశము శుభాంగకర్తృకము. శుభాంగుడు క్రీ. శ. ౧౦వ శతాబ్దిలో ధారానగరమున వాక్పతిముంజప్రభుసభలో నుండెడివాడు. సర్వానందుడు టీకాసర్వస్వములో ఈశ్లోకము శుభాంగుని దని స్పష్టముగా వ్రాసినాడు. శుభాంకశబ్దము శుభాంగుని నామాంతరము.

పాలకురికి సోమనాథుడు

○

శ్రీ చిలుకూరి నారాయణరావు

"విమర్శకాగ్రేసర" బండారు తమ్మయ్యగారి నెరుగని ఆంధ్రు లుండరు. వీరు దేవరలు, వీరమాహేశ్వరాచారసంపన్నులై వీరశైవ మతమును గురించిన అభినివేశము నిండుకొన్న ఆంధ్రమున గల వీరశైవవాఙ్మయమును లోకమునకు పరిచితముగా చేయడానికి నేటికి ౩౦, ౩౫ ఏండ్లుగా పరిశ్రమ చేస్తూ, దానినిగురించిన ఎన్నో విషయములనే కాక గ్రంథములనుకూడా బయటికి తీసి, వాటి ప్రచారము కోసము బహుముఖముల కృషి చేసి, చేస్తూఉన్న పండితపరిశోధకులలో ప్రథములు, ముఖ్యులు, ప్రామాణికులు అయినవారు. వీరి నిరంతరకృషిఫలముగానే ఆంధ్రమున వీరశైవవాఙ్మయశాఖకు గొప్ప స్థానము లభించినది. ఆ వాఙ్మయప్రాముఖ్యమును వీరు బయటపెట్టకపోతే అది యే జంగపుపాటలక్రిందనో నామరూపాలు లేక పడిఉండేది.

వీరశైవవాఙ్మయస్రష్ట పాలకురికి సోమనాథుడు. ఇతడు రచించిన బసవపురాణ, పండితారాధ్యచరిత్ర, వృషాధిపశతకములు సుప్రసిద్ధములు. ఈ మూడును ఆంధ్రగ్రంథమాలలో ప్రకటితములయినవి. బసవపురాణమును శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిలుగారును, పండితారాధ్యచరిత్రమును నేనును, వృషాధిపశతకమును కీ. శే. కళాప్రపూర్ణ దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావుగారును సంస్కరించి పీఠికలతో సిద్ధముచేసినాము. సోమనాథుడు రచించిన ఆంధ్రగ్రంథము లింకా ఉన్నవి. వాటి స్వరూపమును శ్రీ తమ్మయ్యగారు లోకమున కెరుకచేస్తూనే ఉన్నారు.

పాల్కురికి సోమనాథుని జీవితవిశేషములను గురించిన్ని, అతడు సాధించిన కార్యములను గురించిన్ని బసవపురాణపీఠికలోను, పండితారాధ్యచరిత్రపీఠికలోను విపులముగా నిరూపింపబడిఉన్నది. ఈ జీవితవిశేషములనుగురించిన్ని, మతాదికవిషయములను గురించిన్ని కొన్ని అభిప్రాయభేదము లుండడము సహజము; ఉండకపోవడ మసహజము. అభిప్రాయభేదము లున్నంతమాత్రముచేత ఒకరి నొకరు తక్కువచేసుకో నక్కరలేదు. ఎవరికి తోచిన అభిప్రాయములను వారు, తమకు నిష్పక్షపాతము లని తోచినవానిని వెల్లడించడాని కధికార మున్నది. ఒకరి కిష్టములు కావన్న భీతితో స్వీయాభిప్రాయముల నణచిపెట్టడము తప్పు. అందులో ఏనాడో గతించిన ఒక వ్యక్తినిగురించి ఇటు గాని,అటు గాని ప్రత్యేకాభినివేశముతో ఇప్పటివా రొకరిపైనొకరు దుముకుటకు కారణ మగపడదు.

పాల్కురికి సోమనాథుడు మహాకవి. మహాశైవభక్తుడై, వీరమాహేశ్వరవీరాచారసంపన్నుడై, జంగముగురుడై, దేశాటనముచేసి, అన్యమతములను ఖండింప నమకట్టి, తన యనన్యవాచాపాండిత్యములచేత వీరశైవమతము నాంధ్రదేశమున నిండజేసి కర్ణాటకములోనికి పొంగిపోజేసిన దీక్షా నిష్ఠాదిగుణగరిష్ఠుడు. అట్టివాని చరిత్రమునుగురించిన విశేషములను కొన్నిటిని గ్రంథపీఠికలలోను, పత్రికావ్యాసములలోను చదువుకొనవలసిన కష్టమును తొలగించడానికి శ్రీ తమ్మయ్యగారు "పాల్కురికి సోమనాథుడు"అనే యీ పెద్ద గ్రంథమును రచించి, ప్రకటించి ఆంధ్ర పాఠకలోకమునకు మహోపకారము చేసినారు.

---

* శివధర్మగ్రంథమాల—౧౨ బిల్వము, మటికె నాగయ్య ధర్మనిలయము, సికింద్రాబాదు. గ్రంథకర్త: "విమర్శకాగ్రేసర" బండారు తమ్మయ్యగారు. ౩౩౫ పుటలు. వెల రు ౨-౮-౦ లు.

శ్రీ తమ్మయ్యగారి లేఖిని చాలా బలమైనది. అదియే ఆయనపాలిటి లింగపసాయితఖడ్గము. దానితో సమయము చిక్కించుకొని దెబ్బకొట్టడములో నేమి, ప్రేటుతగులకుండతప్పించుకొనడములో నేమి ఈయన ఆరితేరిన సాముకాడు. సామునేర్చినవాని కెవరితోనైనా సాముచేస్తూఉండవలెనదే ఉండబట్టదు. అత డెవరినైనా సరే పోరితమున కాహ్వానిస్తూఉంటాడు. ఓపికగలవారట్టి యోధులతో వాగ్లడాయికి దిగితే లోకానికి కొంత వినోదముగా ఉండి ఊసుపోతుంది. సహజవీరశైవులయిన శ్రీ తమ్మయ్యగారి కీ వీరత్వ ముగ్గ పాలతో నలవడినదే కాని క్రొత్తది కాదు.

శైవ మనేదే ఆవేశము కలిగించేది. "ఆవగింజంత బూది మై నలదికొనిన, కెలది, గుమ్మడికాయంత వెఱ్ఱిపుట్టు"నని శ్రీనాథు డన్న మాటలో ఎంతో సత్య మున్నది. ఇది సాధారణశైవుల విభూతిధారణముమాట. బూదికితోడు రుద్రాక్షలు (శివుని మూడోకళ్లు), దానికి తోడు లింగముకూడా ధరించిన వారి మాట వేరే చెప్పవలెనా? ఇది వీరశైవము విషయములోనే కాదు, ఏ మతము విషయములోనైనా తన్మతాభినివిష్టుల కందరికిన్ని ఇదే అవస్థ. ఇట్లు మతావిష్టులయినవారికి పరమతసహిష్ణుతమాట అటుంచగా, పరమతములవారు తమ మతమునుగురించి ఏపాటి ప్రస్తావించినా సంశయమే, సందేహమే, అపనమ్మకమే. ఇతరులు తమ మతమును పొగడినాసరే అనుమానమే; ఇక విమర్శిస్తే చెప్పే దేమున్నది?

పాల్కురికి సోమనాథుడు వీరశైవుడు; ఆంధ్రదేశములోనేమి, కర్ణాటకదేశములోనేమి అతని మూలముగానే వీరశైవము వ్యాపించినది. శ్రీ తమ్మయ్యగారు వీరశైవులు. నేను వీరశైవుడనుకాను; తుదకు శైవుడనయినా కాను. పండితారాధ్యచరిత్రము వీరశైవవాఙ్మయములో ఉత్తమోత్తమకావ్యము; కావ్యము మాత్రము కాదు; వీరశైవమతగ్రంథము; వీరశైవసర్వస్వము. అట్టి గ్రంథమును నేను తప్పులులేకుండ సవరించడ మొకతప్పు; దానికి పీఠిక వ్రాయడము రెండోతప్పు. ఆ వ్రాయడములో అంతకుపూర్వము శ్రీ తమ్మయ్యగారు నిర్ణయించిన సిద్ధాంతములకు విలక్షణముగ, విరుద్ధముగ అభిప్రాయములను దెలుపడము తప్పాతితప్పులలో మహాతప్పు కాదా! నా కేమి అధికార మున్నది?

నిజమే—తప్పే— ఒప్పుకొంటు న్నాను. సుమారు ౫౦ తాటాకుప్రతుల నెదురుగా పెట్టుకొని పాఠభేదములను గుర్తించి, సరియైన పాఠములను నిర్ణయించి సాధ్యమైనంతమట్టుకు నిగ్రష్టముగా సంతరించి, ఎన్నో వీరశైవమతగ్రంథములను డబ్బిచ్చి కొని, చదివి, ఎన్నో చరిత్రగ్రంథములను, శాసనములను పరిశోధించి సత్యచరిత్రముకోసము రాత్రింబవళ్ళు శ్రమించి ౩౫౦ పుటల పీఠికను, ౨౦౦ పుటల అకారాదిపదసూచికలను ఘటించి, ప్రతిఫలాపేక్షారహితుడనై చేసిన పనిచేత దృష్టిసౌందర్యమును సంపాదించుకొన్న నాది తప్పుకాక మ రేమవుతుంది? వీరశైవమతము శ్రుతి, స్మృతి, పురాణేతిహాససమ్మతము కాదనీ, అది హిందూమతము కాదనీ ఒకానొక వీరశైవనిరాచారిమతము ధనకాంక్షాప్రేరితమై కోర్టు కెక్కి తెలివితక్కువగా సంచరిస్తున్నప్పుడు నే నడ్డుపడి శతాధికగ్రంథపరిశోధనము చేసి వీరశైవమతవైదికత్వమును ౫౦౦ అరటావుపుటలలో ఇంగ్లీషున వ్రాసి కోర్టుఎదుట పెట్టి, బోనులోని కెక్కి సాక్ష్య మిచ్చి వీరశైవవైదికత్వమును చిరస్థాయిగా నిలబెట్ట తోడ్పడడము తప్పుకాదా!

అవును,— నేను వీరశైవుడను కాను, నిజమే. కాని, వీరశైవలోకము నేను వీరశైవుడ నని భ్రమించి, అట్లే సంబోధిస్తూ లేఖలు వ్రాయడముకాక, వారి మతసభలలో అధ్యక్షత వహించవలసినదనీ, ఉపన్యసించవలసినదనీ పిలువడాని కాస్పదము కలిగే అంతటి వీరశైవత్వము నారోపించుకొనడము తప్పు కాదా?—తప్పే.

కాని, ఇందులో వింత ఏమి టంటే: నే నేకోర్టు ఎదుట నిలబడి వీరశైవమతము శ్రుతిస్మృతిసమ్మతమని సాక్ష్యమిచ్చినానో ఆ కేసులోనే నాకు ప్రతిపక్షిగా నిలబడి, తాను వీరశైవుడయి, తన వీరశైవము శ్రుతి, స్మృతి, పురాణేతిహాసవిరుద్ధ మనిన్ని, అది ఆర్యసమ్మతము కాదనిన్ని వ్రాతమూలకముగా వాఙ్మూలము

నివ్వడమే కాక, ప్రమాణపూర్వకముగా, శివునితోడుగా సాక్షిపత్యమునుకూడా ఇచ్చిన టి. హెచ్. ఎమ్. సదాశివయ్య ఎమ్. ఏ., బి. ఎల్. గారిచేత తమ గ్రంథమునకు శ్రీ తమ్మయ్యగారు Foreword (తొలిపలుకు) వ్రాయించుకొనడము. శ్రీ సదాశివయ్యగారు సబుజడ్జిగారు. ఎవ రేమి చేయగలరు?

ఇంతకంటె వింత ఏమి టంటే, తాము తమ వీర శైవమతౌత్కృష్ట్య ప్రకటనమునకుగాని, వీర శైవ వాఙ్మయప్రాశస్త్య ప్రచారమునకుగాని ఎట్టి కృషినీ చేయకపోయినా వారి వీరశైవ వాఙ్మయములో శ్రేష్ఠగ్రంథము లని ప్రసిద్ధికెక్కిన బసవపురాణమును శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారున్ను, పండితారాధ్యచరిత్రమును నేనున్ను, శివతత్త్వసారమును కొమర్రాజు లక్ష్మణరావుగారున్ను, వృషాధిపశతకమును కాశీనాథుని నాగేశ్వరరావుపంతులుగారున్ను పరిశ్రమించి ప్రచారమునకు తేగా ఆ కృషినిగురించి ఒక్క మంచి మాట అయినా తమ ౩౩౫ పుటల గ్రంథములో పొందింపలేకపోవడము. పోనీ, తక్కిన ముగ్గురమున్ను భవుల మయితే అయినాముగాని, నాగేశ్వరరావుపంతులుగారు కూడా భవులేనా అట్టి ఉపేక్షాభావముతో చూడబడడానికి? అబ్బే! ఇతరులు తమకోసము చేసిన పనిని గుర్తింపనీయని మతావేశము నిండుకొన్న వారివల్లనే ఇకముం దిట్టి జోక్యములోనికి పోగూడ దని విరక్తి పుట్టిస్తుంది. పండితారాధ్యచరిత్రమువలెనే పిడుపర్తివారి ప్రభులింగలీలలనుకూడా అనేకతాళపత్రప్రతులు పరిశోధించి సరియైన పాఠములను నిర్ణయించి పీఠికతో ముద్రణమునకు సిద్ధముచేసిఉంచినాను. తమ్మయ్యగారి ఈ గ్రంథమును చదివినతరువాత "వృథా! వృథా! ప్రకటించకూడ" దనిపిస్తున్నది. కాని, ఇంతమాత్రముచేతనే విరక్తి పుట్టగలవాడను కాను. భ్రమరకీటన్యాయముచేత నేనున్ను జంగముడనై పోవలసిఃస్తుందేమో!

తమ్మయ్యగారి పుస్తకములో సుమారు సగము భాగము 'విమర్శ'తో నిండిఉన్నది. 'విమర్శకాగ్రేసర' బిరుదాంచితులగువారి గ్రంథములో ఆపాటి విమర్శ లేకుంటే అది గ్రంథమే కాకుండేది. ఆ విమర్శకు వేటూరివారొకసారి చాలవరకు గురితప్పినారు. అమ్మకచిక్కిన మేకను నేను గురి అయినాను. నాకు విమర్శ అంటే భయమని కాదు. సరియైన విమర్శ అయితే నాకుహా తప్పయినప్పుడు తప్పక ఒప్పుకొంటాను. కాని, మీదికి దూకుడుగా వస్తే కొంచెె మాత్మరక్షణము చేసుకోవలసివస్తుంది. పండితారాధ్యచరిత్రపీఠికలో తమ్మయ్యగారి అభిప్రాయము ప్రకారము నేను చేసిన నేరములు ముఖ్యముగా మూడు. అవి (౧) సోమనాథుని జన్మస్థానము మైసూరుసంస్థానము, తుమ్కూరుజిల్లా, తిప్టూరు తాలూకాలోని పాలకురికి అనే గ్రామము అనడము; (౨) సోమనాథుడు వీరశైవబ్రాహ్మణుడుగా జన్మించి వర్ణాశ్రమాతీతుడైన జంగమముగా వీరశైవమతప్రచారము చేసినా డనడము; (౩) అతడు కాకతీయ మొదటి ప్రతాపరుద్రుని కాలములో లేడనిన్ని, గణపతిదేవ, రుద్రాంబా, ద్వితీయప్రతాపరుద్రుల కాలములో ఉన్నవాడనిన్ని అనడము. —ఈవిషయములనుగురించే కాక ఇంకా కొన్ని స్వల్పవిషయములనుగురించికూడా నామీద చెణుకు లున్నవి. వీటి కన్నిటికీ సమాధానమును సంగ్రహముగా చెప్పుకొంటాను. కాని, శ్రీ తమ్మయ్యగారికిన్ని, పాఠకలోకమునకున్ను చిన్న మనవినిమాత్రము ముందుగా చేసుకొంటున్నాను. తమ్మయ్యగా రన్నట్లు (పుటలు ౬౯, ౭౦) నాహృదయమును అభిమానమాత్సర్యము లావరింపలేదు. నేను దురభిమానమునే ప్రధానముచేసికొని సత్యదూరములగు నభిప్రాయములను వెలువరించడము లేదు. నేను వీరశైవుడను కాను. కాబట్టి అభిమానముగాని, దురభిమానముగాని, మాత్సర్యముగాని ఉండ నవకాశమే లేదుగదా. వీరశైవము 'వీరుల' శైవమని నాకు తెలియకపోలేదు. ఆ వీరత్వము బౌద్ధజైనములను భరతఖండములో నేమిచేసినదో నాకు తెలియకపోలేదు. అందుచేతనే దానినిగురించి వ్రాయవలసినప్పుడు చాలా జాగ్రత్తగా, సమస్త విషయములను పరిశీలించనిదే, స్పష్టముచేసుకొననిదే నే నొక్క వాక్యమును వ్రాయ సాహసించలేదు. నాకు తెలియని దానిని తెలియ దని చెప్పినాను. నాకు సందేహముగా

తోచినదానిని సందేహముగానే నిరూపించినాను. నాకు సత్యమని తోచినదానిని తగినకారణములను నిరూపించి నిర్భయముగా ప్రకటించినాను. అభిమాన, దురభిమాన, మాత్సర్యాదులు తమ్మయ్యగారి కుంటే ఉండవచ్చునుగాని నా కుండడాని కావశ్యకత లేనే లేదు.

ఇంతకూ ఏమి మహావిషయములుగనుక అభిమానమాత్సర్యములు ప్రకోపించడానికి? పాల్కురికి సోమనాథుడు మైసూరుప్రాంతములో పుట్టితే నా కేమి? ఓరుగల్లుప్రాంతములో పుట్టితే నా కేమి? క్రీ. శ. ౧౧౯౫లో ఉంటే నా కేమి? ౧౩౦౦ సం.ర ప్రాంతములో ఉంటే నా కేమి? అతని కులగోత్రములుకూడా నా కంతటి ముఖ్యములైనవి కావు. పండితారాధ్యచరిత్రమును దానిలో విస్తరింపబడిన మతముకోసము పరిదిద్ది ప్రకటించి, దానికి పీఠిక వ్రాయలేదు. దానిలోని కావ్యత్వమును నే ననుభవించి ఆంధ్రులచేత అనుభవింపజేతామనే ఉద్దేశము తప్ప నాకు మరొక ఉద్దేశము లేదు. అయినా, నేను పైవిషయములనుగురించి తెలిపిన అభిప్రాయములను శ్రీ తమ్మయ్యగారు అనవసరతీవ్రత నుపయోగించి "శోచనీయము, శోచనీయము" అని పదేపదే వక్కాణించినారు కాబట్టి వారి విమర్శకు ప్రతివిమర్శగా కాకుండా సవినయనివేదనముగా సంగ్రహించి చెప్పుకొంటున్నాను.

(౧) పాలకురికి

లోకములో ఉన్న 'పాలకురికి' ఒక్కటే ఉన్నది. అది మైసూరు సంస్థానము, తుముకూరు జిల్లా, తిప్టూరుతాలూకాలో ఉన్నది. దానికి ప్రాచీనకన్నడశాసనములలో పాలకుఱికె అనిన్ని, హాల్కురికె అని తరువాతిశాసనములలోను పేరున్నది. అది కుగ్రామము కాదు. తాలూకా హెడ్ క్వార్టర్సు కాకపోయినా కొన్ని ప్రభుత్వ కార్యాలయాలున్నవి. ఆ గ్రామములో తెనుగువా రనాదిగా ఉన్నారు. ఇటీవల రాజభాష కన్నడము కావడము చేతను, తెనుగుబడుల నెత్తివేసి కన్నడబడులను మాత్రమే ఉంచడముచేతను కన్నడమున కెక్కువ ప్రచారము కలిగినా ముఖ్యవృత్తుల నవలంబించి ప్రాతకాపులై అచ్చట నున్నవారు తెనుగువారే. వీరి తెనుగుభాష గోదావరిజిల్లావారికి కొంచెము వీసగా కనిపించవచ్చును. ఒక మండలపు వ్యవహారభాష ఆప్రక్క మండలమువారికే వీసగా కనబడేటప్పుడు, దూరముగా ఉన్నవారికి కనబడడము వింతకాదు. కాని, అది తెనుగుభాషే. అందుచేతనే తెనుగుభాష ఇంకా మైసూరురాజ్యములో మిగిలిఉండగానే దానిలోని తుముకూరు, బెంగుళూరు, కోలారు, చిత్రదుర్గము జిల్లాల నాంధ్రదేశములో వెంటనే కలిపివేయవలె నని ఘోషిస్తున్నాను. పాలకురికిలోనే కాక తిప్టూరు తాలూకా అంతటా తెనుగు ప్రచారములో ఉన్నది. ఇక్కడి జనులు సాధారణముగా లింగాయతులు, వీరశైవులు. సోమనాథుని జన్మస్థానములో వీరశైవము ప్రబలడ మెంత వింత కాదు. ఈ పాలకురికిలో జన్మించి పరదేశములకు పోవడముచేతనే సోమనాథునికి పాలకురికి సోమనాథు డనే పేరు కలిగినది. కాకుంటే అట్టి యింటిపేరే కలుగదు. ఈ పాలకురికి తన జన్మస్థానముకాబట్టే సోమనాథుడు తన వృద్ధాప్యములో అచటికి చేర తొందరపడి ఓరుగల్లు, శ్రీశైలము మొదలయిన ప్రాంతములను విడిచిపెట్టినాడు. కాకతీయరాజ్యము అచిరకాలములో తురుష్కాక్రాంతము కాబోతుం దని తెలుసుకొని తన నిష్ఠకు భంగము కలుగకుండా జన్మస్థానమును చేరుకోవలెనని వృద్ధుడయిన సోమనాథునికి తొందర పుట్టడము సహజమే. అతడు తిరిగి తన పుట్టినఊరయిన పాలకురికికి చేరుకొన్నాడో లేదో తెలియదుగాని, దానికి దగ్గరగానే ఉన్న 'కల్యా' (కల్కె ?) ములో సమాధి అగుటనుగురించి సాక్ష్య ముండనేఉన్నది. తమ్మయ్యగా రచ్చటి సోమనాథుని సమాధికి తీసిన ఛాయాపటమునుగూడా అచ్చొత్తించినారు. కాబట్టి మైసూరుసీమలోని పాలకురికియే సోమనాథుని జన్మస్థాన మనడానికి సందేహము లేదు.

ఓరుగల్లుప్రాంతములో 'పాలకుర్తి' అనే గ్రామమున్నది. అదే పాలకురికి అని నమ్మవలసిన దని శ్రీ

తమ్మయ్యగారంటున్నారు. 'క్రొత్త ఒక వింత, ప్రాత ఒక రోత' అని వారు నామీదికి ప్రయోగించిన సామెతనే వారిమీదికిప్పుడు నేను ప్రయోగింపవలసి వచ్చినందుకు విచారిస్తున్నాను. చిదిరేమఠము వీరభద్రశర్మగారితోబాటు తమ్మయ్యగారు పాలకుర్తియే పాలకురికి అని చెప్పేవరకున్నూ ఎవ్వరున్నూ అట్టి అనుమానము పడలేదు. వీరేశలింగముగారు సోమనాథుడోరుగల్లుప్రాంతమువాడని ధ్వనింపజేస్తే, ప్రభాకరశాస్త్రిగారెవడో అనామధేయుడు పాలకురికి ఓరుగల్లుప్రాంతములో ఉన్నదని చెప్పినదానినిబట్టి ఉన్నదట అని వ్రాస్తే, దానినిబట్టి వీరభద్రశర్మగారు పాలకుర్తిని పట్టుకొని పాలకురికి అని చెప్పితే, చాంగుభళా! అని తమ్మయ్యగారు దాని నామోదిస్తే, పోతన్నతోబాటు మరొక్క ప్రసిద్ధాంధ్రకవి అయినా నైజాములోనికి రానీ అని శేషాద్రిరమణకవులు వెనుకతాళము వేస్తే, దానిని స్థిరపరుచుకొని అచ్చట సోమనాథాలయములోని సోమనాథలింగము పాలకురికి సోమనాథుని సమాధిపై నిలుపబడినదని చిన్నకథ లేవదీస్తే, పాలకుర్తియే పాలకురికి అని లోకము నమ్మే స్థితిలోనికి వస్తూ ఆ సోమనాథాలయమును, మఠమును బాగుచేయించడానికి ప్రయత్నాలు జరుగుతూఉంటే, ఇంతలో ఆ పాలకుర్తి పాలకురికి కాదు, పాలకురికి మైసూరురాజ్యము తుమ్కూరుజిల్లాలో ఉన్నది అని రుజువులతో చూపేసరికి ఎంతమందికో ఆశాభంగము కలిగిఉంటుంది. దానికి నేనేమిచేయగలను? 'పాలకుర్తియే 'పాలకురికి' అని అష్టోత్తరశతవారములు జపముచేసినా కావడానికి సాధ్యమా? పాలకురికి పాలకురికే, పాలకుర్తి పాలకుర్తే. పాలకుర్తి అనేది పాలకుఱ్ఱు అనే పదానికి ఔపవిభక్తికమప్యేకవచన రూపము. పాలకురికి కేవలప్రథమైకవచనరూపము. పాలకుర్తికి పాలకురికి అనే వ్యవహారమున్నట్టు ఇంత ఆర్భాటము చేసి 'శోచనీయము' అనకపోతే ఒక్క, ఒకటైనొక్క ప్రమాణము చూపిస్తే ఎంత బాగుండేది! తమ్మయ్యగారంతటి ఆవేశముతో అన్నిపుటలు నింపడము వ్యర్థమేకదా! సోమేశ్వరాలయమునకు దగ్గరగా ఉన్నదిగదా అని దానికి సోమనాథలింగమని పేరుపెట్టి, సోమనాథలింగము పాల్కురికి సోమనాథుని పేరనే, అతని సమాధిమీదనే నిలుపబడినదని ఒక కథను లేవదీస్తేమాత్రము పాలకుర్తి పాలకురికి అవుతుందా?

సోమనాథనామము కనబడినచోట్లనెల్ల పాల్కురికి సోమనాథమయము చేయడమేనా? ఇంకా నయము—గజనీమహమ్మదు పగులగొట్టిన సోమనాథలింగముకూడా పాల్కురికి సోమనాథుని పేర వెలసినదే అనలేదు! తమ్మయ్యగారి నీ సందర్భములో అడుగవలసిన ప్రశ్న ఒకటి ఉన్నది: పాల్కురికి సోమనాథుని సమాధి శివగంగకు సమీపమున 'కల్లె' (కల్కె) ములో ఉన్నదని తెలియగానే పాలకుర్తి నుంచి పాలకురికి సోమనాథుని సమాధి పరారీఅయి, ఆ సమాధిస్థానములో ఒక తొమ్మిదిఅంగుళముల ఎత్తుగల 'గద్దె' వెంటనే తయారయినదేల? దానిమీద పాలకురికిసోమనాథుడు తపస్సుచేసుకొనడానికా? గ్రంథములో ౧౮ పుటలో సమాధిగా వర్ణింపబడినది ౩౨౫ పుట వ్రాయనారంభించేసరికి అకస్మాత్తుగా గద్దెగా ఎట్లు మారినది? ఈమధ్యకాలములో పాల్కురికిసోమనాథుని మాహాత్మ్యమేమయిన వెలసినదా! ఇట్టి కల్పనములను చేసి ఏమి సాధించినట్లు?

(౨) సహజవీరశైవత్వము

తమ్మయ్యగారు సోమనాథాదులను సహజవీరశైవులనమంటారు. సహజవీరశైవులంటే ఏమిటో? ఈపదమును తమ్మయ్యగారు సృష్టిచేసినట్టు కనబడుతుంది. తమతోబుట్టిన వీరశైవులు కలవారు, వీరశైవులు తమకు తోబుట్టువులుగా గలవారు; తమతోడబుట్టిన వీరశైవము గలవారు; పుట్టుకతోడనే వీరశైవులు; వీరశైవులైన తల్లిదండ్రులకు పుట్టినవారు; తమలోపలనుంచి పుట్టుకొనివచ్చిన వీరశైవము గలవారు; తమకు పుట్టిన వీరశైవులు గలవారు; తమకు తాము పుట్టినవీరశైవులు — ఇటువంటి అర్థములను ఇంకా చెప్పవచ్చు నీ సమస్తపదానికి. ఈ అర్థముల ప్రకారము వీరశైవులందరున్నూ సహజవీరశైవులే అవుతారు. (తమకు తాము పుట్టినవారంటేనే అర్థము సరిపోదు.) ఇక అసహజవీరశైవు లెవరైనా ఉంటా

రని తమ్మయ్యగారి అభిప్రాయమా? ఉంటే, వారెవరు? ఇ దేమిటో అగమ్యగోచరముగా ఉన్నది. సహజవీరశైవు లంటే అచ్చమైన వీరశైవు లనిన్ని, అచ్చమైన వీరశైవులు కాని, అవాంతరముగా వీరశైవ రక్షను పుచ్చుకొన్న, ఇతర మతములను విడిచి లింగదీక్షను పుచ్చుకొన్న వీరశైవులు ఆరాధ్యబ్రాహ్మణుల వంటివారుకూడా ఉంటారనిన్నీ తమ్మయ్యగారి అభిప్రాయ మేమో! ఆ అర్థ మేమిటో స్పష్టముగా బయటికి చెప్పివేస్తే ఎంత బాగుండేది!

పాల్కురికి సహజవీరశైవుడే; అసహజవీరశైవుడు కాడు. ఇక తమ్మయ్యగారు సంతోషించవచ్చు. అత డసహజవీరశైవు డని ఎవరన్నారు గనుక ఇంత ఆర్భాటము చేయడానికి? అంతటి వీరశైవుడు అతడే అనీ, అతనిమూలముగానే ఆంధ్రకర్ణాటదేశములలో వీరశైవము ప్రబలినదనీ నేను చెప్పినానుగదా! ఇంక ఏవిషయములో నాతో తమ్మయ్యగారికి విప్రతిపత్తి? వీరశైవుడు కానివాడు వీరశైవమునుగురించి వ్రాయడాని కధికార మేముంది అనే అభిప్రాయమా? తమ్మయ్యగారు వీరశైవమును గుత్తగొనలేదుగదా!

అదేమో కొందరు తమ మతమును గురించి యితరులు తలపెట్టితే చాలును తుసుక్కుపడుతారు. నీడను చూచుకొని భయపడుతారు. తమ మతమునకు న్యూనత కలుగుతుందేమో అని దిగులుపడుతారు. లేనిపోని అనుమానాలు కల్పించుకొని, ఆక్షేపణల నాకాంక్షించుకొని, ఎక్కడనూ లేని డిబిద్ధుల నెదురుగా నిలబెట్టుకొని ఆ కల్పితపురుషులతో కొట్లాటకు దిగుతారు. పాల్కురికి సోమనాథుడు తన తండ్రి విష్ణురామిదేవు డనిన్ని, తల్లి శ్రియాదేవి అనిన్ని చెప్పుకొంటే, ఎవరయినా వైష్ణవసంప్రదాయబోధకమైన పేళ్లుగల వారికి సోమనాథుడు పుట్టినా డని అంటారేమో అని ఆశంకించుకొని, దానిని సమర్థించుకొనడానికి విష్ణువు శివునికి కింకరుడు కాబట్టి అట్టే భయము లేదనీ, విష్ణురామిదేవుడు, శ్రియాదేవి అనే వారు సోమనాథు నాదరించి పెంచినవారుగాని అసలు తలిదండ్రులుకారనిన్ని ఏమేమో చెప్పుకొని తంటాలు పడడ మెందుకు? శివద్విజులు, శివబ్రాహ్మణులు అనే పేళ్లతో వ్యవహరింపబడే కొందరి పేళ్లు శాసనముల లోను, వాఙ్మయములోను కనబడుతున్నవి అని నేను వ్రాసేటప్పటికి ఏమేమో ఎగబారించుకొని, కొట్టవచ్చినట్టు మీదికి దుముకుతూ వచ్చి, నారాయణరావుగారు ఘంతలు అనే అర్థము వచ్చేటట్టు ఏమేమో పుటలు నింపివేస్తే తజ్ఞు లేమంటారు?

తమ్మయ్యగారు స్మార్తబ్రాహ్మణులనీ, స్మార్తులు కాని బ్రాహ్మణులనీ ఉంటారని చెప్పినారు. బ్రాహ్మణుల కందరికీ స్మృతులు ప్రమాణములే కదా! స్మృతి సంప్రదాయానుసారముగ నేకదా తామందరున్ను బ్రాహ్మణశబ్దవాచ్యు లయినారు. అందుచేత బ్రాహ్మణు లెవ్వరయినా స్మార్తులే అవుతారుగదా! అయితే స్మార్త, స్మార్తేతరసిద్ధాంతములు తమ్మయ్యగారెందుకు లేవదీయవలెను? స్మృతులప్రకారము బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రవర్ణము లున్నవి. (నాస్తి పంచమః—కొందరి ప్రకారము.) ఇట్లేర్పడిన బ్రాహ్మణవర్ణమువారిలో శైవబ్రాహ్మణులు, శైవేతర బ్రాహ్మణులు ఉన్నారు. శైవబ్రాహ్మణులలో లింగధారి బ్రాహ్మణులు, లింగధారులుకాని బ్రాహ్మణులు ఉన్నారు. లింగధారణము ప్రత్యేకముగా శైవబ్రాహ్మణులలోనే కాక ఇతరవర్ణములవారయిన క్షత్రియ, వైశ్య, శూద్రాదులలోకూడా ఉన్నది. లింగధారులలో నాలుగువర్ణములవారున్ను ఉన్నారు. గృహస్థులయిన లింగధారి బ్రాహ్మణులలో హారితసభారద్వాజాది ఋషిగోత్రము లున్నవి. ఇట్టి గోత్రములుకాక వీర, వృష, భృంగి, నంది, స్కంద అనే శివప్రమథగణ గోత్రములుకూడా లింగధారులలో ప్రచారములో ఉన్నవి. జంగమగురువులలోమాత్రమే ఈ పంచగోత్రములును ఉన్నట్టు కనబడుతుంది. సాధారణ వీరశైవులు కూడా తమకు శివదీక్ష నిచ్చిన గురువుగోత్రము నీ రెండింటిలో నొకదానిని స్వీకరింపవచ్చును. బ్రాహ్మణేతరులలో ఈ సంప్రదాయము ప్రబలినట్లున్నది. లింగదీక్షను పొంది లింగధారణము కాగానే వ్యక్తి చరలింగమాతాడని వీరశైవసిద్ధాంతము. లింగధారణము స్త్రీపురుషుల కిద్దరికిన్ని వీరశైవులలో విహితమే. ఈ లింగధారణము గర్భాష్టమములో మాతృగర్భమునకే చేయ

వచ్చును. లేదా కొందరు పుట్టగానే చేస్తారు. కొందరు నామకరణదినమున చేస్తారు. కొందరు ఎనిమిదోఏట చేస్తారు. బ్రాహ్మణులయితే ఉపనయనమున యజ్ఞోపవీతధారణముతోబాటు లింగధారణముకూడా చేస్తారు. కొందరు లింగసూత్రమే యజ్ఞోపవీతసూత్ర మంటారు. కొందరు లింగదీక్షయే గాయత్రీదీక్ష అంటారు. లింగధారిబ్రాహ్మణులకు శివపరమైన అర్థములో గూడిన గాయత్రీఉపదేశ మున్నది. సిద్ధాంతముప్రకారము లింగధారణము చేసినవారందరూ చరలింగరూపులే అయినా, 'చర' అనే పదానికి 'జంగమ' అనే అర్థమున్నా వ్యవహారములో లింగధారణము చేసినవా రందరున్ను జంగమశబ్దవాచ్యులుగా ఇప్పుడు లేరు. ఆరాధ్యబ్రాహ్మణులు లింగధారులయినా వారిని జంగములంటే ఒప్పుకోరు. ఇం తెందుకు? తాము లింగధారులయినా, లింగధారిలింగాయతపదముల కర్థ మించుమించు వొక్కటే అయినా ఆరాధ్యబ్రాహ్మణులను లింగాయతు లని పిలిస్తే కొట్టవస్తారు. ఎందుచేతనంటే, వ్యుత్పత్తిప్రకారము శబ్దముల కేర్పడే అర్థము నానాటికీ మారిపోయి ఒకానొక విశిష్టమైన అర్థము కలుగుతూ ఉంటుంది. జంగమశబ్ద మట్టిది. స్థిరము కానిది చరము; స్థావరము కానిది జంగమము. వ్యుత్పత్తినిబట్టిమాత్రమే ఆలోచిస్తే మనుష్యులేకాక పసు, పక్షి, కీటాదులన్నీ జంగమములే. సైకిళ్లు, మోటారులు, రైలుబళ్లు, ఓడలు, విమానాలు, అన్నీ జంగమములే. కాని, జంగమశబ్దము అతివిశిష్టమైన అర్థములో మతవాఙ్మయములోను, మతవ్యవహారములోను స్థిరపడినది. లింగధారులందరున్ను జంగములు కారు. వారిలో కొందరుమాత్రము జంగములు. వీరశైవులలో సామాన్యవీరశైవులు, విశేషవీరశైవులు, నిరాచారులు అని మూడుతెగలవా రున్నారు, వీరందరున్ను లింగధారులే. పుట్టుకతో వీరశైవులై సాధారణగృహస్థులుగ లోకయాత్రను గడపుకొనేవారు సామాన్యవీరశైవులు. వీరిలో షట్స్థలసిద్ధాంతము ననుసరించి భక్త, మాహేశ్వర, ప్రసాది, ప్రాణలింగి, శరణ, ఐక్యస్థలములను సాధించిన సాధకుల అంతరవులనుబట్టి విశేషవీరశైవు లేర్పడుతారు. నిరాచారులనేవారు కేవలవిరక్తులు, యత్యాశ్రమమును దాటి అత్యాశ్రమమును పొందినవారు.

ఇది యిట్లుండగా విశేషవీరశైవులలో కొందరు సామాన్యవీరశైవులకు గురువులయి వారికి లింగదీక్ష నిస్తూ జంగము లనే ప్రత్యేకనామముతో వ్యవహరిస్తున్నారు. సామాన్యవీరశైవులకున్ను, వీరికిన్ని వ్యావహారికముగ చాలా భేద మున్నది. అసలు వీరి వేషమే వేరు. వీరి సంప్రదాయమే వేరు. జంగముల వేషమును సోమనాథు డెట్లు వర్ణించినాడో పండితారాధ్యచరిత్రమును (పుటలు ౩౦౪-౩౧౪) చదివిన తమ్మయ్యగా రెరుంగనిది కాదు.

"చందనకావులు సరిసాటికావు
లందంబులగు కఱ కంచుకావులును
వలిపొత్తిపచ్చడంబులను గాసీన
ములు, మీద గూడకట్టులు కానుపింప—"

ఇట్లే వారి సంబువులు, గొడుగులు, పావలు, పేరెములు, కళుకులు, కుప్పసములు, పట్టుత్రాళ్లు, బతపట్టువస్త్రములు, తొంగళ్లు, వీణెలు, పటికపుసరములు, కావిపచ్చడములు, కావిదుప్పటులు, కావుమంజళ్లు, బూరవడములు, కలశములు, కంచుగుబ్బలు, వివిధములయిన మకుటములు, టిప్పరములు, కుండలములు, బెత్తములు, సైరణగోలలు, గొడుగులు మొదలయిన చిహ్నములతో మకుటవర్ధనజంగమములున్ను, ఇతరలక్షణములు గల జంగములున్ను కలిసి ఉభయజంగమకోటులు శ్రీశైలయాత్రకు పోయిన పరుసలో ఉన్నారుకదా. అట్లే 'రారోరి బసుత! లేరా లంజ కనుచు, బసవన్నకరుణరా-బసుత వీకనుచు' విలాసాతిశయత మించే మిండజంగమములుకూడా ఉన్నారు. వీరందరున్ను సామాన్యవీరశైవకోట్లకంటె విశిష్టులేకదా. ఈ విశిష్టజంగములే కాక యింకా విశిష్టులయిన వృద్ధలింగితపోధనులు, విరక్తులు, శివయోగులు మొదలయినవారినికూడా సోమనాథుడు వర్ణించినాడు. వీరినందరినీ సామాన్యవీరశైవులతో, లింగధారిమాత్రులతో చేర్చివేయవీలు లేదుగదా.

అట్లే సోమనాథుడున్ను ఒక విశిష్టవీరశైవుడు. విశిష్టజంగముడు, విరక్తుడు, సంసారహేయస్థలమును సాధించి, సంసారవర్జితుడయి, లోకసంగ్రహార్థము దేశాటనము చేసిన జంగమోత్తముడు. అతనిని "సహజ వీరశైవు"లతో సాటిగ ఒక సామాన్యునిగ తలంచ వచ్చునా? జంగముల ప్రత్యేకవేషము, ప్రత్యేక వ్యవహారము లోకమునకంతటికీ విదితమే. దానిని కాదని వీరశైవులందరున్ను జంగములే అని యిప్పుడు తమ్మయ్యగారు చెప్పవస్తే ఎట్లు నమ్మగలము? జంగములలోనే వీర, భృంగి, నంది, వృష, స్కంద గోత్రము లున్నవి. సాధారణవీరశైవులలో అవి ఉండ డానికి కారణము వారు తమ గురువులయిన జంగముల గోత్రముల నవలంబించడమే అని నొక్కి వక్కాణింప వలెను. ఈ వీరాదిగోత్రపంచకసంప్రదాయ మెప్పటి నుంచి వస్తున్నదో తెలియదని నేను వ్రాసినంత మాత్రమున బుస్సుమని తమ్మయ్యగా రంత మీదికి లేచినారు. అవి అనాదిగా ఉన్నవని వారి అభి ప్రాయము. ఉంటే ఉండునుగాక, ప్రమాణమమాత్రము కనబడ దని నేను చెప్పినానేకాని మరేమీ చేయలేదే! దాని కింత ఆగ్రహ మెందుకు? ప్రమాణ ముంటే చూపితే తీరిపోయేదే! సోమనాథుడు ఒకసారి భృంగిరిటి గోత్రుడ ననీ, ఒకసారి బసవగోత్రుడ ననీ చెప్పు కొన్నాడే? మరి వృషగోత్రమునకున్ను, బసవగోత్ర మునకున్ను భేద మున్నదా యేమి? వృషగోత్రము బసవగోత్రము కాదా? సోమనాథుడు రెండు గోత్రాలవా డెట్లవుతాడు? సూరార్యునికివలె ఆయన కున్ను ఒక ఋషిగోత్ర ముండి, శివభక్తిపారవశ్యము చేత ప్రమథగణములయిన భృంగి, వృషులను తనకు గోత్రకర్తలుగా చెప్పుకొన్నా డనవచ్చునుగదా! ఉన్న గొడవలు చాలక నా కెందుకీ క్రొత్తగొడవ? జంగములు సామాన్యవీరశైవులకు భిన్ను లన్నమాట సత్యము. వీరి ఛాయాచిత్రములను **Thurston: Castes and Tribes of Southern India**లో 'లింగాయితు' అనేపదముక్రింద చూచుకోవచ్చును.

నేను శివద్విజ శివబ్రాహ్మణప్రస్తావనను ప్రాసంగికముగా తెచ్చేసరికి ఎందుకో అకారణముగా తమ్మయ్యగారు నామీద రేగిపోయినారు. రేగితే భయము లేదుగాని నన్ను తృతీయపంక్తీయునిగా వర్ణించినవారు చతుర్థపంథ ననుసరించి అపూర్వప్రసక్తమైన, ఎన్ని ఉపాయములచేతనైన సమర్థింపరాని ఒక వింతలోవింతవాదము లేవదీసినారు. శివద్విజులు, శివబ్రాహ్మణులు, హరద్విజులు అనేవా రొకరట; శైవబ్రాహ్మణు లనేవారు వేరొకరట. శివాలయముల లోని స్థావరలింగార్చనము చేస్తూ లింగధారణముచేయని తమ్మళ, నంబి మొదలయినవారు శివద్విజులు, హర ద్విజులు, శివబ్రాహ్మణులునట. శివాలయములలో అర్చకులు కాని లింగధారులు శైవబ్రాహ్మణు లట. ఇట్లు చెప్పడానికి తమ్మయ్యగారి విపరీతపాండిత్యమే ఆధారముగాని మరి యెట్టి ప్రమాణమున్ను లేదు.

The Sivabrahmins of the temple agreed to provide for offerings in the shrine (M. E .R. 415 of 1909) అనేదానిలోని శివ బ్రాహ్మణు లంటే ఆలయములోని అర్చకులని అర్థము చెప్పవచ్చునా? శివబ్రాహ్మణులు ఇస్తే పూజారులు పూజచేస్తారుగాని, అచ్చటి శివబ్రాహ్మణులే పూజారు లని చెప్పకూడదు. అట్లే **M E. R 513 of 1911 "There being some of the Sivadvija community at the place three priests were appointed** అంటే శివద్విజులే అర్చకులు అని ఎట్లు చెప్పగలము? పెరియనంగ శివద్విజురా లని ఉదాహరించినారే, ఆమె శివాలయములో అర్చకురాలా? స్త్రీలకర్చకాధికార మున్నదా? అరుణత్తుగూపురలో ఒకడయిన జనయూరి శివాలయములలోని స్థావర లింగార్చకుడయిన శివద్విజు డనడము తమ్మయ్యగారి ప్రతిపాదనకే మూలచ్ఛేదము చేస్తున్నదిగదా! కాళ హస్తిమాహాత్మ్యమునుంచి తమ్మయ్యగా రుదాహరించిన సీసపద్యములోని శివబ్రాహ్మణోత్తముండు లింగ ధారియే కదా. అతడు శివచిహ్నగోచరాంకుడని ఆ పద్యములోనే ఉన్నదిగదా. శివచిహ్నమంటే శివ లింగమే కాదా! మరేమయినానా? శివబ్రాహ్మణుడు తమ్మయ్యగారి మాట ననుసరించి లింగధారి కాక పోవలెనే! ఈ శివబ్రాహ్మణ్యమేకదా తరువాతి పద్యము

లోని హారద్విజుడు ? తమ్మయ్యగారి ప్రతిపాదనమే సరి అయితే జంగములందరున్ను శైవ బ్రాహ్మణులే కావలెను. ఆరాధ్యబ్రాహ్మణు లందరున్ను జంగములే కావలెను. ఇష్టలింగార్చకులు స్థాపితలింగార్చకులు కాకూడదు. ఇష్టలింగధారు లందరున్ను ఇష్టలింగార్చనము మాత్రమే చేయవలెను; స్థాపితలింగార్చనము చేయకూడదు. పైవాటిలో అన్నీ వ్యవహారమునకు విరుద్ధములే. ఈనాడు తమ్మయ్యగారు ప్రతిపాదించినారని లోకవ్యవహారము మారనేరదు. శెలిదేవి వేమనారాధ్యుడు లింగధారి కాడని యెవరన్నారు ? అతడు విరక్తుడయిన జంగమము కాడని తమ్మయ్యగా రెట్లు రుజావుచేయగలరు ? మడివాలు మాచయ్య జంగమప్రష్ఠుండు అంటే జంగములను గురువులుగా ముందిడుకొని ఆరాధించేవా డని అర్థముకాని అతడు జంగము డని కాదు. అందుచేత వీరశైవదీక్ష నొందినవారందఱును జంగములే అని తమ్మయ్యగారు వ్రాసిన వ్రాత పరాస్తమవుతున్నది.

(3) సోమనాథుని కాలము

ఎవ రెంత ప్రాకులాడినా సోమనాథుడు క్రీ.శ. ౧౨౪౦ సం.రమునకు పూర్వము పుట్టినవాడు కా డన డము, సిద్ధాంతము. అతడు మొదటి ప్రతాపరుద్రుని కాలమున ఉండడము సుతరాం అసంగతము. అతనికి బసవనిగురించిగాని, పండితారాధ్యునిగురించిగాని ఏమిన్నీ స్వయముగా తెలియ దన్నమాటను తమ్మయ్యగా రొప్పుకొన్నారుగదా ! మొదటి ప్రతాపరుద్రుని రాజ్యాభిషేకకాలము క్రీ. శ. ౧౧౬౩ సం.రము. బసవేశ్వరుడు ౧౧౬౭ సం. ర ప్రాంతమువాడు. అప్పటి కతడు బాలుడు. ఎంత వయసువాడో చెప్పలేము. ౨౫ ఏండ్లలోపలి వయస్సువా డనుకోవచ్చును. అందుచేత అప్పటికే ప్రసిద్ధుడయిన సోమనాథు డతనికంటె పెద్దవాడయియుండవలెనుగదా. 'బసవగోత్రుండ' అని బసవని కాలములో ఉన్న సోమనాథుడు చెప్పకొనడము అసంగతమేకదా ! శెలిదేవి వేమనారాధ్యుడు పండితారాధ్యునికి సమానమయిన వయస్సు గలవానివలె కనబడుతాడు. అతడున్ను పండితారాధ్యుడున్ను బసవనికి సమకాలికులు; అతనికంటె పెద్దవారు. శెల్దేవి వేమనారాధ్యుని మనుమని శిష్యుడే సోమనాథు డని ఒప్పుకొన్న మొదటి ప్రతాపరుద్రుని కాలములో ఉంటే వేమనారాధ్యునికంటె ౧౫,౨౦ ఏండ్లు మాత్రము చిన్నవా డయినట్లు కనబడే పాల్కురికి సోమనాథుడు వేమనారాధ్యుని మనుమని శిష్యుడు కావడము తటస్థించదు గదా. ఇదిగాక క్రీ. శ. ౧౧౪౦ నుంచి ౧౧౯౦ వరకు గల ౫౦ ఏండ్లలో సోమనాథుడు తన గ్రంథములలో పేర్కొన్న చారిత్రకపురుషులనందరినీ ఇరికించ సాధ్యముకాని పని. అట్లా ఇరికించడాని కంతటి తంటాలుపడి, ఉన్న మాటలను మార్చి, లేనిమాటలను దూర్చి, ఉన్నమాటల కపార్థములను కల్పించి సాధించే దేమయినా ఉన్నదా?

(౧) పిడుపర్తి సోమనాథుడు చెప్పినమాట కా దనడానికి కారణము కనబడదు. అతడు క్రీ. శ. ౧౪౮౦ సం. రమునకు తరువాతివాడు. పాలకురికి సోమనాథుని శిష్యుడయిన శివరాత్రికొప్పయ్యకు పిడుపర్తిసోమన్న ఆరోతరమువాడు కాబట్టి తరమునకు ౨౫ ఏండ్లచొప్పున లెక్కచేస్తే కొప్పయ్య కాలము ౧౪౮౦—౧౫౦=౧౩౩౦ ప్రాంతమవుతుంది. అది రెండో ప్రతాపరుద్రుని కాలము.

(౨) పాల్కురికి సోమనాథుడు శెలిదేవి వేమనారాధ్యుని మనుమనిశిష్యుడ నని చెప్పకొన్నాడు. ఈ వేమనారాధ్యుడు పండితారాధ్యుని సమకాలికు డయిన వేమనారాధ్యునికి మనుమడయి ఉంటాడు. అంటే సోమనాథుడు పండితారాధ్యునికి సమకాలికుడయిన వేమనారాధ్యుని మనుమడయిన వేమనారాధ్యుని మనుమని శిష్యుడు. ఇట్లాలోచించినా పాల్కురికి సోమనాథుని కాలము రెండో ప్రతాపరుద్రుని కాల మవుతుంది.

(3) సోమరాజు రచించిన కన్నడ ఉద్భట చరిత్రములోని "సాసిరదనానూర్" అనేపాఠమే అన్ని వ్రాతప్రతులలోను ఉన్నది. "సాసిరదనూఱిత్" అనే పాఠముగల ఒక్క ప్రతి అయినా కనబడేవరకున్ను సోమనాథుని కాలము శాలివాహనశకము ౧౪౪౪ + ౭౮ = క్రీ. శ. ౧౫౨౨ సం.ర

మవుతుంది. ౧౧౮౮ + ౩౪ = క్రీ. శ. ౧౨౨౨ ఎంత మాత్రమున్ను కాదు. క్రీ. శ. ౧౨౨౨ అయితే పాల్కురికి సోమనాథునికాలము బసవని కాలముకంటె పూర్వము కావలసివస్తుంది. ఇది అసంభవము గదా.

(౪) సోమనాథుడు బసవపురాణమును రచించిన అనతికాలముననే భీమకవి క్రీ. శ. ౧౩౬౯ లో కన్నడించినాడు. దీనినిబట్టి ఆలోచించినా సోమనాథుడు రెండో ప్రతాపరుద్రునికాలమువాడే అవుతాడు.

(౫) సోమనాథుని పండితారాధ్యచరితరచన కనతికాలముననే శ్రీనాథుడు క్రీ. శ. ౧౩౮౫ ప్రాంతమున పద్యకావ్యముగా వ్రాసినాడు. శ్రీనాథునికంటె సోముడు ౭౦,౮౦ ఏండ్లు పూర్వుడయినా రెండో ప్రతాపరుద్రుని కాలమువాడే అవుతాడు. కన్నడ భీమకవి తెనుగుశ్రీనాథుల కాలమునాటికే బసవపురాణ పండితారాధ్యచరిత్రములు ప్రసిద్ధి కెక్కియుండ వనడము ఆగ్రంథముల ప్రాశస్త్యమును గుర్తింపకుండడమే అవుతుంది.

(౬) కన్నడములో పద్మణాంకకవి సోమనాథుని కించుమించు సమకాలికుడయిన కెరెయపద్మరసును గూర్చిన కన్నడగ్రంథమును క్రీ. శ. ౧౩౮౫ లో వ్రాయడాని కాతనియెడల గల పరిచితభక్తియే కారణము. కాబట్టి పద్మణాంకునికి పద్మరసు ౫౦,౬౦ సం. రములకు పూర్వుడు కాజాలడు. అట్లు చూచినా పాల్కురికి సోమనాథుడు రెండో ప్రతాపరుద్రుని కాలమువాడే అవుతాడు.

(౭) కరస్థలి విశ్వనాథయ్య విశ్వేశ్వరాచార్యుడు కాడనిన్ని, సోమాచార్యుడు సోమనాథుడు కాడనిన్ని తమ్మయ్యగారు వ్రాసిన వ్రాత సమంజసముగ లేదు. ఆ శాసనము లున్న ప్రదేశము, ఆ శాసనముల కాలము, ఆ నామముల సాదృశ్యము, విషయ సాదృశ్యము వీటి నన్నిటినిబట్టీ ఆలోచిస్తే నే నూహించినది కేవలము పొరపాటు కా దని సహృదయులు గ్రహింపగలరు. నా యూహ సరియైన దయితే నేను చూపిన తక్కిన కారణముల కిది ఉపబలకముగా ఉంటుంది. కాకతీయరాజులకు ఇష్టలింగార్చకులయిన వీరశైవులే గురువులుగా ఉన్నారని పెద్ద అక్షరములతో ప్రకటించిన తమ్మయ్యగారు గణపతిదేవుని గురువయిన విశ్వేశ్వరాచార్యుడు వీరశైవుడు కాక శుద్ధశైవుడని యెట్లంగీకరించినారో తెలియదు. విశ్వేశ్వరాచార్యుడు శుద్ధశైవుడు కాడు. గోళకీమఠము వీరశైవమఠమే; గోడగి అన్నా గోళకి అన్నా ఒక్కటే. గోడగి త్రిపురారి ఆమఠమునకు సంబంధించినవాడే. కోణంగి ఆట ఆడడముచేత గోడగి అనే యింటిపే రాతనికి కలిగిం దని సోమనాథుడు చెప్పడ మొక కవిత్వమే కాని వాస్తవము కాదు. కోడగ మాడితే 'కోడగి' కావలెనుగాని 'గోడగి' కాజాలదు. ఏదయినా యిట్టి చిలిపికారణములు చరిత్రకు త్రోసిపుచ్చ జాలవు.

(౮) "పరిచితగురుపరంపర దేజరిల్లు"; "ప్రథితగురుపరంపర దేజరిల్లు" అన్నప్పుడు "తేజరిల్లు చున్నది" అని వర్తమానార్థబోధక మవుతుందిగాని అది ఆశీరర్థక మెంతమాత్రమును గాదు. ఈవిషయమై తమ్మయ్యగారు వ్రాసిన వ్రాత నాకు నచ్చలేదు.

(౯) శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు ప్రకటించిన కాకతీయచక్రవర్తుల సామంతుడయిన అంబయదేవమహారాజు క్రీ.శ. ౧౨౯౦ సం.ర శాసనములో నుదాహృతులయిన రెంటాల మల్లినాథ దోచమాంబలు పాల్కురికి సోమనాథుడు తనకు సమకాలికు లని చెప్పుకొన్న అవే పేళ్లు గలవారు కా రనడానికి తమ యిష్టము తప్ప తమ్మయ్యగారు మరొక కారణము చూపలేదు. కాలనిర్ణయము మన యిష్టానిష్టముల ననుసరించి చేయరాదుగదా! సోమశేఖరశర్మగారు చేసిన నిర్ణయమునుబట్టిన్ని సోమనాథుడు రెండో ప్రతాపరుద్రుని కాలమువాడే అవుతున్నాడు.

శ్రీ తమ్మయ్యగారు తమ గ్రంథములో తామింతకుపూర్వ మచ్చటచ్చట ప్రకటించిన వ్యాసఖండములలోని సారాంశము నొకచోట చేర్చినారు. ఈవిషయములలో చాలావరకు శ్రీ ప్రభాకరశాస్త్రిల వారు మొదలయినవారు చెప్పినవేకాని క్రొత్తవేమియు లేవు. అయినా, అన్ని విషయములను ఒకచోట చేర్చి గ్రంథరూపముగా ప్రకటించిన తమ్మయ్యగా రాంధ్రలోకమున కభివంద్యులే.

తీరని బాధ

[కథానిక]

శ్రీ గొల్లమూడి లక్ష్మినారాయణ

"'రామయ్యపంతులంతటిఅదృష్టవంతుడు ప్రపంచంలో మరోవాడు ఉండడు. అంత అదృష్టానికి ఇంతవరకూ ఎవ్వరూ పెట్టిపుట్టలేదు' అని అనుకుంటారుకదూ మీరందరూ.

'ఆయన కేం, మహారాజు! తను తిని, పదిమందికి పెట్టగలిగినవాడు. పేరు ప్రఖ్యాతుల కేమీ కొదువ లేదు.

'ఒకడికి కష్టం వస్తే, చూసి కరిగిపోతాడు. కష్టకాలంలో అయినవాడనీ, కానివాడనీ భేదం లేకుండా చేతనైన సాయం చేస్తాడు. ఆఖరికి, ఎంతటి బీద బ్రాహ్మడు చచ్చినా శవాన్ని మోస్తాడు' ఇలా అనుకుంటారు మీరంతా......"

పేరుప్రఖ్యాతులు బాగా ఆర్జించి, పెత్తనం మీదపడగా న్యాయవాదివృత్తిలోంచి విరమించుకున్న రామయ్యపంతులు, ఎదురుగావున్న గోడకు తగిలించిన పుష్పాలంకృతమైన ఒక యువకుడి చిత్రాన్ని రెప్పార్పకుండా చూస్తూ, వేదాంతుడిస్వరంలో అలా అనర్గళంగా చెప్పుకుపోతున్నాడు.

"నాకు దిగు లేమీ లేదనీ, సర్వం సలక్షణంగా వుందనీకూడా మీరు ఊహించుకుంటారు.

"అవును, మీరు అనుకుంటున్నది కొంతవరకు నిజమే. కాని మానవుడన్నాక దిగులంటూ ఉండక పోదు. నాకూ ఓ దిగులు వుందనీ, దానికి ఓ కారణం ఉందనీ ఎవ్వరూ కలలోనైనా అనుకోరు. ఆ దిగు లేమిటో, ఆ విషయ మేమిటో నా కొక్కడికే తెలుసు. నే నొక్కడినే బాధపడుతుంటాను. ఎన్ని సంవత్సరాల నుంచో ఆ బాధ గడ్డకట్టుకుపోయింది. ఏవిధానైనా తీరటంలేదు. ఏ క్షణంలోనైనా, నా హృదయాన్ని పిండుతోంది. నా ఇప్పటి దయాదాక్షిణ్యాలకు మూలమంతా నా విచారానికి కారణమౌతున్న సంఘటనే.

"ఇదంతా ఎందుకు చెప్పుతున్నానంటే నీవు యౌవనంలో ఉన్నావు. నా యీ బాధకి కారణమయిన సంఘటన యౌవనంలోనే జరిగింది. యౌవనంలో మూర్ఖాభిమానం, దురహంకారం ఎవడికైనా ఉంటాయి. అప్పుడు, ఎవడికి వాడే 'నేనే సరియైన దోవలో నడుస్తున్నాను. నాది అంతా న్యాయం' అనుకుంటాడు. అంచేతే నీకు చెప్పటం.

"అసలువిషయం చెప్తాను విను. చలపతి నాకు చిన్ననాటినుంచీ మిత్రుడు. మా మైత్రికి ఎక్కువగా దోహద మిచ్చింది—మేమిద్దరం ఒక క్లాసు చదవటం. చలపతి మాకు చాలా దూరపుబంధువు. ఆ బంధుత్వం విషయం బయటికి వచ్చింది స్నేహం ప్రారంభమైనాక. మా యిద్దరి మైత్రీ చాలామందిని ఆకర్షించింది. అసూయపడ్డవాళ్లుకూడా కొందరు లేకపోలేదు. ఎక్కడికెళ్లినా కవలల్లా మాజంట ఉండాల్సిందే.

"మాయిద్దరిభావాలూ సాహచర్యంతోపాటు అలా ఏకీభవించేవి. ఒకరు ద్వేషిస్తే మరొవాళ్లం తప్పకుండా ఆవ్యక్తినే ద్వేషించేవాళ్లం. ఒకరికి నచ్చితే తప్పకుండా

మరొవారికి అవస్తువే వచ్చేది. అలా మేమిద్దరం మనసా ఏకీభవించాం. అడవిలో స్వేచ్ఛగా ఒకదానికొకటి పెనవేసుకుని, అల్లుకుపోయే లతలు గుర్తుకువస్తాయి, మా స్నేహం గుర్తుకువస్తే.

"పదిహేను పదహారేళ్లవరకూ అలాగే ఉండే వాళ్లం. కాని, ఆతర్వాత మే మంతగా ఏవిషయంలో నైనా ఏకీభవించలేకపోయేవాళ్లం. అతను మారాడని నే ననుకునేవాణ్ణి. నేను మారానని వా డనుకునేవాడు. ఎవ్వరూ మారలేదు. ఎవళ్లకి వాళ్లే అహంకారం పెంచుకున్నారు—'వాడు చెప్పింది నే నెందుకు ఒప్పుకోవాలి?' అని.

"వాళ్లు మాఅంత భాగ్యవంతులు కారు. అంత మాత్రాన రెక్కాడకపోయినా, పస్తుండాల్సినఅవసరం లేదు.

" 'దూ, దూ బసవన్న' పద్ధతిగాకుండా మా యిద్దరిమధ్యా ఏ విషయంమీదపట్టినా వాదనలు జరుగుతుం డేవి. ఆవాదనల్లోనూ చలపతి బాగానే వాదించే వాడుగాని కాస్త తొందరపాటుమనిషి. వెంటనే మనిషి నిందకి దిగేవాడు. నే నేమీ అనుకోనని తెలిసే అనుకో. వాణ్ణి నిందించినా ఏమీ అనుకొనేవాడు కాడు. ఎంచేతంటే, ఎప్పుడూ అంటూండేవాడు—'కపటమంటూ నాదగ్గిర పనికిరాదు. మనసులో ఉన్నది బయటికి అనేయాల్సిందే' అని. కాని వాడుగూడా ఆ తర్వాత మారిపోయాడు.

"నేను నా శక్తికొద్దీ సాహిత్యసేవ చేశాను. నేను రచించిన గ్రంథాలన్నీ 'చలపతి' వ్రాసినట్లుగా చలామణిఅయినాయని నీకు తెలుసు. ఈ రచనాభ్యాసం అతనితో స్నేహముండగా ప్రారంభమైంది. వాడూ వికసిస్తూన్న మొగ్గ— చిత్రకారుడు, కవి.

"తిండీ , నిద్రా మరిచిపోయి వాదించుకునే వాళ్లం. అలాంటి వాదనల్లో ముఖ్యమైంది ఒకటిచెప్తాను:

'సాహిత్యమున్నాక, ఏదన్నా ప్రయోజనంతో ఒక విషయం, నీ పాఠకులకి తెప్పదలచుకుని రాయాలి చలపతీ!' అన్నాను—అతను కథ వకటి వినిపించాక.

'అంటే? నీ వనుకున్నది నాకు స్పష్టంగా అర్థం కాలేదు.' అన్నాడు చలపతి.

'ఏమీ లేదు. నీవు కథ ఒకటి వ్రాశావంటే పాఠకులకి ఒక నీతి బోధించటానికే నంటాను. లేకపోతే సాహిత్యంతో లోకాని కేం పని?' అన్నాను నేను.

'అదిగో అక్కడే పప్పులో కాలేశావు. ఏది నీతి, ఏది న్యాయం నీ వెలా చెప్పగలవు? నీ కేమి తెలుసని? నీవు ఒకటి న్యాయ మంటావు. మరొకడు అది అన్యాయమంటాడు. నీవు న్యాయ మని సమర్థిస్తూ కథ ఒకటి వ్రాస్తావు. అప్పుడు నీవేం చేస్తున్నావన్న మాట;— పాఠకుడి స్వాతంత్ర్యాన్ని నాశనంచేసి, ఒక గొఱ్ఱెలా నీ సిద్ధాంతాని కనుగుణంగా మార్చుకుంటున్నా వన్న మాట'—నొక్కిచెప్పాడు చలపతి.

'అయితే, నీదృష్టిలో, వాల్మీకి ప్రభృతులంతా అలా ప్రజలను గొఱ్ఱెలమందగా మార్చేవారనేనా?' —అడిగాను నేను.

'అక్కడే మీరంతా పొరబడేది. వాల్మీకికీన్నీ మీకున్నూ పోలికేమిటి అసలు? నక్క వాతలు పెట్టుకొని 'నేనూ పులి'నే' అంటే అవుతుందా? వాల్మీకి సకల ధర్మాలూ తెలిసినవాడు. ఏది ధర్మమో, ఏది నీతో తెలిసినవాడు. వారంతా ద్రష్టలు. వారికి స్వార్థాలు లేవు. ఉద్రేకాలు లేవు. పండిపోయిన ముదుసలులు.

'అంతదాకా ఎందుకు! నీవు యౌవనంలో చేసిన రచన వార్ధక్యంలో చదువుకుంటే, మరు క్షణాన్నే తగలబెట్టావు. మన మేం సర్వజ్ఞులం కాం. మన కేం తెలుసని, మన సిద్ధాంతాలు ఏం సరియైనవని ప్రపంచానికి చెప్పబోతాం. అక్కడే మీ గర్వం, మీ అహంకారం కనిపిస్తుంది. పంతులూ! నీవు చెడి పోతున్నావు. నీబుర్రలో పురుగు ప్రవేశించింది. నీవు పుట్టుకతోనే గర్విష్ఠివి. దాంతో ఆ పిచ్చిసిద్ధాంతా లన్నీ వంటపట్టున్నాయి. సాహిత్యం ఎప్పుడూ మాండ లికప్రయోజనాలకోసం పాటుపడ్తుందని, వర్గాభివృద్ధి కోసం కృషిచేస్తుం దని, ఏది పడితే అది నీతి అంటూ నెత్తిన రుద్దుతుం దనీ అనుకోబోకు. ఏది నీతి అని చెప్తాం! ఈ ప్రదేశంలో నీతి ఇంకోప్రదేశంలో అ

నీతి. 'విశ్వశ్రేయః కావ్యం' అనే మూడు మాటలు సరిగ్గా అర్థంచేసుకో !' సుక్కుతిప్పుకోకుండా ఉపన్యాస మిచ్చేవాడు చలపతి.

"కాని నాకుమాత్రం, అప్పట్లో చలపతి చెప్పిన వన్నీ గగనకుసుమాలుగా ఉండిపోయాయి. అతని ఆశయాలన్నీ గాలిమేడ లనిపించాయి. ఎంచేతో, నే నేకీభవించలేకపోయేవాణ్ణి. ఏవిషయంలోనైనా, మాకు భేదాలు వస్తే, అదంతా, ఇక నా భాగ్యానికి అంటగట్టేవాడు. నాకు మండిపోయేది.

"ఎలా అయితేనేం, ఇలాంటి చిన్న చిన్న విషయాల్లోనే మాలో విభేదాలు పొడచూపినాయి. చాలా చిన్నవి. పుట్టగొడుగుల్లాంటివి. మా స్నేహం మాత్రం తొణకలేదు. మనసులోమాత్రం కొన్ని కొన్ని విషయాల్లో నొచ్చుకున్నాను.

"బి. ఎ. మే మిద్దరం కలిసే చదివాం. చలపతి ఆషామాషగా చదివాడు. అంతగా శ్రద్ధపుచ్చుకోలేదు. రిజల్ట్సు వచ్చినపుడు చలపతి స్వగ్రామంలో వున్నాడు. నేను పాసయ్యాను. చలపతి 'గ్రూప్'లో తప్పాడు. పేపరు చూస్తుండగా చుట్టూ మాస్నేహితులు మూగి వున్నారు. ఎవ్వడూ నేలమీద నిలవటంలేదు. చలపతికి 'గ్రూప్'లో పోయిం దనగానే, అంతా ఆశ్చర్యపోయారు. 'అరె! వాడు, తప్పడ మేమిట్రా! మంచి తెలివిగలవాడుగదా? ఆఁ. ఏమిటే, ఈ చదువుక్కూడా పెద్ద...అని అంటూండేవాడు' అన్నారు. 'తెలివితేటలు ఇక్కడేం పనికిరావురా! తెలివిలేని పిచ్చిరాతలన్నీ పరీక్షలప్పుడుగూడా చూసుకుంటూ, నా అంత తెలివిగలవా డెవ్వ డని విర్రవీగితే ఏ మవుతుందిలే' అన్నాను. అన్నప్పుడు ఇలా అంటున్నానని తెలియకుండానే అనేశాను. ఆతర్వాత అన్న మాటలు మరిచిపోయాను. ఆ పొంగులో ఆ ఉద్రేకపు మాటలు పొంగిపొర్లాయి.

"మద్రాసు వెళ్లి, 'లా' కాలేజీలో సీటు సంపాదించి ఇంటికి వచ్చాను. రాగానే, ఇంట్లోవాళ్లు, చలపతి వచ్చాడనీ, జ్వరం తగులుకున్నదనీ చెప్పారు."

"చూడటానికి వెళ్ళాను. మంచంమీద పడుకుని ఉన్నాడు. నేను రావటం చూసి అటువైపు తిరిగి పడుకున్నాడు. మంచంమీద కూచొని, వంటిమీద చేయి వేశాను. వళ్లు వేడిగా ఉంది. స్పృహతోనే వున్నాడు. 'ఎన్నాళ్లనుంచి ? ఏం జ్వరం ? ఇత్యాదులన్నీ అడిగాను. కాని వాడు కదలలేదు ; మెదలలేదు. నిశ్చలంగా నేలవంక చూస్తున్నాడు. తప్పాడని దిగులు ఏమైనా ఉందేమోనని 'పోతే పోయిందిలేరా. దిగులు పెట్టుకోబోకు.' అన్నాను. దానికీ మాట్లాడలేదు. 'ఏంరా, మాట్లాడవేంటి ? ఎంచేత ?'—అడిగాను. ఊహుఁ. పావుగంటసేపు కూచుని ఎంతకీ మాట్లాడకపోతే 'ఏమన్నా, తప్పు చేస్తే, క్షమించరా !' అని లేచి వచ్చేశాను. నాకళ్లు చెమ్మగిలినాయి.

"కొన్నాళ్లకి వాడికి జ్వరం తగ్గింది. మామూలుగా తిని తిరుగుతున్నాడు. నేను 'లా' చదువుదామని మద్రాసుకు రేపు బయలుదేరుతా ననంగా, చెప్పివద్దామని వాళ్ల యింటికి వెళ్ళాను. విచారంగా పాడుతున్న పాటొకటి వినిపిస్తోంది వాళ్ల యింట్లోనుంచి. అది చలపతి పాడుతున్నదే. ఆవిషయం నేను గట్టిగా చెప్పగలను. చలపతిని పిలవమని వాకిట్లో కూర్చున్న వాళ్ల చెల్లిని అడిగాను. లోపలకి వెళ్లివచ్చి 'లేడు' అని చెప్పింది! కాళ్లీడ్చుకుంటూ వెనక్కి తిరిగాను. కళ్లవెంట నీళ్లు తిరిగాయి. చలపతి చెప్తూండేవాడు ; విరోధం రాగూడదుగాని, వస్తే కలకాలం ఉంటుం'దని. ఆమాటలు జ్ఞాపకం వచ్చి, నేను తపించిపోయేవాణ్ణి. ఎంతటి స్నేహితుడు ఎలా మారిపోయాడు ! ఏమిటి నేను వాడికి చేసిన అపకారం ? బుర్ర తిరిగిపోయేది. అంతా అయోమయంగా ఉండేది. నేను ఇప్పుడు మా స్నేహం చెడటానికి ఎవరు కారకులో చెప్పబోవటం లేదు. ఎవరిది తప్పోగూడా చూపించబోవటం లేదు. ఒకళ్లని ఒకళ్లం తప్పుగా అర్థంచేసుకుని ఉండాలి.

"నేను 'లా' చదివాను. ప్రాక్టీసుచేయటం మొదలుపెట్టాను. వాడు బి. యిడి. చదివి స్కూల్లో టీచరుగా చేస్తున్నాడు. ఇద్దరమూ ఒకే ఊళ్లో.

"అప్పుడప్పుడు తటస్థపడుతూండేవాళ్లం ఇద్దరం. ఎప్పుడన్నా 'ఏంరా ?' అని పొడ్డిగా పల్క-

రిస్తాడేమో, పోయి కౌగిలించుకుందా మనిపించేది. నాకూ పల్కరించుదామనే అనిపించేది. నాలుకవరకూ వచ్చేది. కాని అతనల్లా చూసీచూడనట్లు వెళ్తున్నప్పుడు పల్కరించటానికి వెనుకంజవేసేది నామనసు. ఇద్దరం తప్పుకుంటూ నడిచేవాళ్లం. ఎదురుపడ్డప్పుడు చలపతీ, నా మాదిరిగానే, పల్కరించుదామని ప్రయత్నించి, పల్కరించలేకపోతున్నాడని అనుకునేవాణ్ణి. మాయిద్దరి మాటలూ పెగిలివచ్చే సుముహూర్తంకోసం కాచుకు కూర్చునేవాణ్ణి.

"లోపల ఎంత ప్రేమ దాచుకున్నా, ఎదుటివాడి నిర్లక్ష్యం చూస్తే, ఎవరికైనా ఆ ఎదుటివాడిమీద నిర్లక్ష్యం పుట్టుకొస్తుంది. చలపతి అంతగా బిగిసివుంటున్నప్పుడు, నేను వాడి స్నేహంకోసం ఎంచేత అంతగా తాపత్రయపడాలి? అనే తర్కం నాలో బయలుదేరింది. నాలో చాలా మార్పు వచ్చింది.

"కొంతకాలం గడిచిపోయింది. దినకృత్యాలల్లో ఈస్నేహాలు, ఈవిరోధాలు అన్నీ అడుగున బడిపోయినాయి.

"చలపతి నాకు వారానికి మూడునాల్గు సార్లన్నా కనిపించేవాడు. ఊళ్లో లేడేమో ననుకున్నాను—పదిహేనురోజులనుంచీ కనిపించకపోతే. ఇద్దరు ముగ్గురు పాతస్నేహితుల్ని విచారిస్తే వాడికి 'టైఫాయిడ్' అని తెలిసింది! ఆ వార్త వినంగానే, మా సంబంధబాంధవ్యాలన్నీ తిరగబోసినట్లయింది. మనసు కలికింది. వెళ్లి చూసొస్తే?............ వెనక వాడికి జ్వరమొచ్చినపుడు వెళ్లటం; వాడు తృణీకరించటం—నామనసుకు క్లేశం చేసింది. వెళ్ల బుద్ధి కాలేదు. నాకుభయమూ వేసింది—ఈసారి పురుగును చూసినట్లు ఎంతగా చూస్తాడోనని...పూర్వం జ్వరంలో వచ్చిన మార్పు ఈసారి జ్వరంలో పోతే బాగుండు ననుకున్నాను. ఆమార్పు మాయమవుతుం దనీ, చలపతి నావాడు అవుతాడనీ, జ్వరం తగ్గాక నన్ను పల్కరిస్తాడనీ దృఢంగా విశ్వసించాను. మళ్లా మే మిద్దరం జీవితాలల్లో, ఎలా సహకారంగా తెల్లు చేసేదీ ఆనందంగా ఊహించుకున్నాను. ఈ నాలుగురోజుల్లో మనం బయటపడట మెందుకు? వాడు ఎలాగూ పల్కరిస్తాడు. మనం ముందరగా పల్కరించి, వాడి దృష్టిలో అలుసుకావట మెందుకు? మాట్లాడటం వాడు మొదట మానేశాడు కాబట్టి, పలకరించినా వాడే ముందరగా పలకరిస్తాడు. స్నేహితులంతా పోయి చూసి వస్తున్నారు. నాకూ చెప్పారు, చూసిరమ్మని. నేను 'ఆఁ' అంటూండేవాణ్ణి.

"ఇరవై రెండోరోజు......ఒక్కరోజు ఆగితే... మళ్లా నా చలపతి...

"ఆరోజు సాయంకాలం కోర్టునుంచి వచ్చి, విశ్రాంతి తీసుకుంటున్నాను. ఏవేవో ఆలోచనలు... అకస్మాత్తుగా 'రామన్నయ్యా!' అని కేక వినిపించింది. లలిత వచ్చి, నావళ్లోకి వాలింది. 'రామన్నయ్యా, అన్నయ్య నిన్నొకసారి వచ్చి, వెళ్లమన్నాడు.' అన్నది నా మొహంలోకి చూస్తూ.

'నన్నా! చలపతి రమ్మన్నాడా!.......... ఎల్లాగుంది అన్నయ్యకు? డాక్టర్లు తగ్గిం దంటున్నారు కదూ?'

'అలాగే వుంది! డాక్టర్లు ఏమీ చెప్పరు. మా కందరికీ దిగులుగా ఉంది'—విచారంగా అన్నది.

'దిగు లెందుకు? తప్పకుండా తగ్గుతుంది చలపతికి. ఎల్లుండికల్లా నిన్నెత్తుకోడూ?' అని ముద్దు పెట్టుకొని 'నీ వెళ్లు. నేను వీలుచూసుకుని వస్తా నని చెప్పు!' అని బెట్టుసరిగా చెప్పి పంపాను.

"అలా బెట్టుసరిగా పైకి అన్నానేకాని, నా మనసు పరిపరివిధాల ప్రవహించింది. లలిత మాటలు చూస్తే, చలపతిరోగం ఏమీ సుముఖంగా లేదు...... నా హృదయం స్పందించింది. వాడు నోరారా పిలిచాడు. ప్రాణస్నేహితుడు...మనసులు అలా అతుక్కుపోయాయి. ప్రపంచంలో అంతకన్నా దగ్గిరవాడు లేడు......వాడి స్నేహం పోయినందుకు ఎలా విలపించాను! మళ్ళా వాడితో మాట్లాడి, హృదయంలో వున్న క్షోభంతా తో డేసుకుని ఏడుద్దామని ఎంతగా తాపత్రయ పడ్డాను!

"ఏమిటో...అలా ఆలోచనలు సాగిపోయి నాయి. తీరా చూసుకుంటూ రోడ్డుమీద నడుస్తున్నాను......అప్రయత్నంగా! చూపు కానింది చలపతిఇల్లు. అటూయిటూ చూసి గబగబా అడుగులు వేసుకుంటూ నడిచాను. ఇంకో పదిగజాలు చలపతి ఇంటి వీథివాకిలికి...నేను తేలిపోయాను. చలపతి ఎలా ప్రవర్తిస్తాడా అని నా మనసు ఆటుపోటుల్లో ఉంది. గుమ్మం దృష్టిలో నుంచుకొని గాలిలో ఈదాను. మా మిత్రుడు గోపాలం కనిపించాడు. ఎవళ్లకైతే నాకూ చలపతికీ మాటలు లేవని తెలుసో, వాళ్ల కళ్ల ఎదుట నాఅంతట నేను మొట్టమొదటగా చలపతిని చూడటానికా ?......అవమానం!

"ముఖం తిప్పాను. ఏదో పనిఉన్నవాడిలా చరచరా, చలపతియింటివంక చూడకుండా నడుద్దా మనుకున్నాను. కాళ్లు పట్టుకుపోయినాయి. ఆలస్య మైంది నడక.

'అరేయ్, పంతులూ!' అంటూ భుజంమీద చేయి వేయనేవేశాడు గోపాలం. భుజాలు ముడుచుకున్నాను. 'చలపతికి చాలా సీరియస్‌గా వుందిరా! నే నిప్పుడే చూసివస్తున్నాను. అయినా, చూసివద్దాం రారా, ఇద్దరం' అని నన్ను వెనక్కి తిప్పాడు. 'ఇప్పుడు కాదురా — మాఅమ్మ తలనొప్పితో చాలా బాధపడుతోంది. 'ఆస్ప్రో' కొనుక్కురావాలి. వీలైనప్పుడు వస్తాలే. అయినా, మధ్య నీబలవంతం ఏమిటెహే!' అని విదిలించుకొని వచ్చేశాను. గోపాలం బొమ్మలా నిలబడ్డాడు.

"ఇక ఆరోజుసాయంకాలం వెళ్లలేదు. రాత్రీ వెళ్లలేదు. మర్నాడు ప్రొద్దున్నే వెళదా మనుకున్నాను. ఏవేవో వి ధ వ ఆ లో చ న లు నా మనసును మథించాయి. అన్నం తినలేదు. నిద్రపోదా మని ప్రయత్నించాను. నిద్ర పట్టలేదు. కాని అనుకోకుండానే మైకం కమ్మింది—నిద్ర కాదు!

"ఏవేవో పీడకలలు—జంతువుల పీకలు తెగ కోసేస్తున్నారు...ఎవరో? అంతా భయంకరంగా వుంది. పెళ్లికూడా—ఎవరిదో జరిగిపోతోంది. వికటాట్టహాసాలు......అన్నీ......కుక్కల ఏడుపులు......మనుష్యరోదనమూ స్వల్పంగా బాహ్యస్మృతికి అందుతోంది.

"శరీరమంతా కంపనం కలిగించే ఆ పీడకలలే నన్ను ఒక్కసారిగా లేచి కూచోపెట్టాయి. ఇంట్లో గోలగా వుంది. మాఅమ్మా, నాన్నా ఎక్కడికో ప్రయాణ మవుతున్నారు.

"'ఎంత లేపినా, లేవ వేంరా?' చలపతి చనిపోయాట్ట!' చైతన్యం శూన్యం... ఏమి విన్నానో అర్థం కాలేదు. అలాగే నోరు తెరిచి చూస్తున్నాను. పావుగంట అయింది, ప్రాణంపోయి. వెళ్దాం రామరూ లే!' అన్నది మాఅమ్మ. బ్రహ్మ ఎంతటికళశిలలోంచి తొలిచి, నన్ను తయారుచేశాడో — అలా ప్రతిమలా కూర్చున్నాను. కాని ఎక్కడో భయంకరలోకంలో విహరిస్తోంది నామనసు. 'ఏమిటీఇదంతా, నే కంటున్న పీడకలల్లో ఇది ఒకటా?' అనుకున్నాను. 'రావూ?' అడిగింది అమ్మ. 'వద్దు, వద్దు. చలపతికి చావా! వద్దు' అని పీడకలల్లో అనుకుంటున్నట్లుగా, చేయి కళ్లకు అడ్డంపెట్టుకొని తల అడ్డంగా ఊపేను. మాఅమ్మా, నాన్నా బయలుదేరారు. మా పెంపుడుకుక్క నావంక ఒకసారి చూసి 'కుంయ్ కుంయ్' అంటూ తోక ఆడిస్తూ నాపాదం నాకింది. అదీ కదిలింది ...... చలపతిని చూడటానికి! కుక్క వెళ్లింది.... చలపతి కళేబరాన్ని చూడటానికి......!

"కాకుల గోల. తెల్లవారింది— చైతన్యం వచ్చింది. రాత్రి జరిగిందంతా బాగా అర్థమయింది. చలపతిఇంటికి చొక్కా లేకుండానే పరుగుతీశాను.

"పాడెమీద పడుకోబెట్టారు చలపతిని. చలపతి దగ్గిరికి వచ్చాను. వణికిపోతున్నది శరీరం ... పిచ్చ చూపులు చూశాను. ఎవరో నన్ను దూరంగా తీసుకెళ్లి కూచోపెట్టారు......

"పాడె లేచింది. లేచి, ఒకాయన్ని తోసి, కాళ్లవైపు పట్టుకున్నాను. హృదయంలో కన్నీటి కుండలు బద్దలయినాయి. నిరంతరం, దోవపొడుగునా కన్నీళ్లు కారినాయి. ఇదంతా ఊహించి చెప్తున్నాను.

అప్పుడు నేనేమి చేస్తున్నానో, ఇతరు లేంచేస్తున్నారో నాకు తెలియలేదు. బతికున్నప్పుడు నీలిగి, చలపతితో మాట్లాడలేదు. చలపతి చనిపోయాక శవం మోయటానికి హాజరయ్యాను. ఇదే నన్నెక్కువగా బాధపెట్టేది.

సూర్యాస్తమయంవరకూ, నేను శ్మశానంలో ఆకాలిపోతున్న శవంవంక, మంటవంక, పొగవంక, బూడిదవంకా చూస్తూ ఉండిపోయాను. ఎంతమందో ఏమిటేమిటో, నా చెవిలో అన్నారు. నా కర్థం కాలేదు. నే నక్కడినుంచి కదలలేదు.

"కాలరథం శరవేగంతో పోతోంది. నాజీవితం బూజుపట్టుతోంది. కాని, చలపతీ— నేను; మా మైత్రీ నాకర్కోటకత్వమూ, నా అహంకారం... అన్నీ కళ్లకు కట్టినట్లు స్పష్టంగా స్మృతిపథంలో నిత్యమూ సంచరిస్తుంటాయి.

"నిత్యమూ చలపతి వచ్చి, నాతో ఎంతో ఆప్యాయంగా మాట్లాడుతుంటాడు. అప్పుడప్పుడు ఇలా అంటాడు: 'పంతులూ! నీవంత రాతిగుండెవాడ వని నె నెన్నడూ అనుకోలేదు. నీకూ, నాకూ మధ్య మాట్లాడక పోయినంతమాత్రాన ఏమంత విభేదాలు ఉన్నట్లు నా మీద అంతగా కాఠిన్యం వహించావు ? కాని, నిజానికి, నీ హృదయం నాకు తెలుసు. నిన్నేమీ నే ననను. కాని నన్ను మాత్రం నీజీవితంలో చెరిపేయబోకు!'

"పదిమందిమధ్యలో సాధారణంగా కళ్ల నీళ్లు రావు. హృదయం ద్రవించిపోతుంది. అప్పుడప్పుడు, లోకదృష్టిలో అర్థం లేకుండా, నాకళ్లవెంట నీళ్లు రావటం జడ్జికళ్లల్లోనూ, మిత్రుల కళ్లల్లోనూ, భార్యాబిడ్డల కళ్లల్లోనూ పడేది.

"ఇదో తీరని బాధ, అవ్యక్తమైన వ్యథ, కనబడని గాయం—అశాంతికి కారణం...

"చలపతిఫోటోమీద పడి, కన్నీరు మున్నీరుగా ఏడుస్తే, కడవలక్కడవలు కన్నీరుకారిస్తే, తాత్కాలికంగా ఉపశాంతి కలుగుతుంది.

"నాకూ, చలపతికీ భేదం లేదు. నా ప్రతిబింబమే అతను. నేను కన్నీళ్లు కారుస్తున్నానని అతను కన్నీళ్లు కారుస్తున్నాడు — చూశావా, ఆ కన్నీటిచారలు !"



ప్రాచీనఖగోళము


౧౦. కాలము

శ్రీ వేలూరి శివరామశాస్త్రి

కొన్ని వేలవేల యేండ్ల క్రిందట నాక్షత్రమగు సౌర వత్సరము వాడుకలో నుండియుండును. సూర్యుడు స్థిరముగ నొక నక్షత్రమునుండి బయలుదేరి మరల నా నక్షత్రముకడకు వచ్చు కాలము నాక్షత్ర వత్సరము. ఆ సౌరవత్సరమున కారంభ మెప్పుడో మనకు తెలియదు. ఇది ఊహామాత్రము.

వేదకాలమున మహావిషువమునాడే సంవత్సరారంభ మయియుండును. సూర్యుడు విషువరేఖనుండి క్రమక్రమముగా ఉత్తరమునకు పోవుచున్నటులు మనకు కనబడును. అదినమే ఉత్తరాయణమునకును, ఋతువునకును, మాసమునకును, యజ్ఞమునకును ఆరంభము. అటుపిమ్మట నీసంవత్సరారంభము చైత్ర ఫాల్గునపౌర్ణమాసికి మారెను. సంహితాజ్యోతిస్సంహితలలో దీనికి సూచన లున్నవి.

ఒక నాక్షత్రవత్సరమునకును, ఒక అయనాంత వత్సరమునకును ఇంచుమించు ఇరువది నిమిషముల వ్యవధాన ముండును. నాక్షత్రవత్సరమే కాలమునకు మాపక మేని సుమారు రెండువేలయేండ్లకు ఋతువు లొక చాంద్రమాసము వెనుకకు పోవును. ఈ నిమిత్త సంవత్సరారంభము మార్పుచెందియుండును. 'ఇట్టి మార్పునకిది కారణ'మని మనకు విస్పష్టమగు ప్రమాణము దొరకదు. అయినా కారణములను మన మూహింపవలసినదే.



ఇటుతరువాత లగధాచార్యుడు సుమారు -౧౩౩౪వ సంవత్సరమున కనకు ముందు ప్రచారములోనున్న పూర్ణిమాంతమాసమును అమాంతమాసముగా నిర్ణయించెను.1 అనగా ఋతువు అప్పటికి చాల వెనుకబడెను. దీనికి కారణ మయనచలనము. లగధాచార్యుని వేదాంగ జ్యోతిషము చొప్పున రవి ఉత్తరాయణమున ప్రవేశించినంత సంవత్సరారంభము. రవి ఉత్తరాయణదినమున ధనిష్ఠయంశము, దక్షిణాయనదినమున ఆశ్లేషామధ్యభాగమునను ఉండెను. అపుడు చాంద్రమాసతిథి నక్షత్రములతో విషువముగాని, అయనముగాని, ఉగాదిగాని గణింపబడుచుండెడివి. ఐదేండ్ల కొక యుగము. అనగా ఐదవయేట మాఘశుద్ధప్రతిపత్తున ఉత్తరాయణము. శ్రావణశుక్లసప్తమి దక్షిణాయనము. వాయువిష్ణుమత్స్యపురాణములు ఈ పంచాంగమునే అనుసరించెను.

శ్రౌతసూత్రములుకూడ గవామయనము మొదలగు సాంవత్సరికయజ్ఞములను నాడే ఆరంభింపవలయు నని చెప్పును.

మహాభారతమున మరల నొక మార్పు చూపట్టును. ఆకాలమున ఋతుచక్ర మొకపక్షము వెనుకబడెను. అపుడు మార్పు జరపుటకు ప్రయత్నలోపము కలుగలేదుకాని దానిని లోకము లామోదింపకపోయినటులు తోచును. అది పాక్ష్యరూపముగా మహాభారతమునందే మణిగిపోయెను. రెండవ ప్రకరణము చూచునది.

ఈ మార్పులు జరిగినపిమ్మట-౩వ శతాబ్దిలో మరియొక మార్పు కనబడుచున్నది. అపుడు ఆషాఢము చివర కర్కాటములో వత్సరారంభము. అనగా వర్షర్తువుతో దక్షిణాయనముతో వర్షారంభము. అర్థశాస్త్రమున కాలమానాధ్యాయము చూచునది. దీని కుపోద్బలకముగా సూర్యప్రజ్ఞప్తి ఆషాఢమునుండి ఋతువుల నారంభించుచున్నది. సూర్యప్రజ్ఞప్తిలో వర్షాశరద్ధేమంతవసంతగ్రీష్మములు అయిదే ఋతువులు. వర్షర్తువుతోనైన యీ వర్షారంభము వేదములందుగాని, జ్యోతిషసంహితలందుగాని, వేదాంగజ్యోతిషమునందుగాని లేదు.

ఈ పైమార్పులు జరిగినపిదప ఆరవ క్రీస్తుశకమున వరాహమిహిరుడు నక్షత్రారంభమును అశ్వినినుండి చేసెను. దీనికి కారణ మీదియును:

శిశిర మాదిఋతు వని సంహితలలో పరిగణితమయినటులు బృహత్సంహితలోని ఆదిత్యచారాధ్యాయమువలన తెలియనగును. అనగా ఆసమయమునందు మకరముతో సంవత్సరారంభము. లగధునికాలమున గూడ మకరముతో సంవత్సరారంభము. ఆ వ్యవస్థయే వరాహమిహిరుని కాలమువరకును, అనగా సుమారు రెండువేల యేండ్ల వరకు వాడుకలో నుండెను. తన సమయములో విషువము రేవతీశేషభాగమునను, కర్కాటక్రాంతి పునర్వసునక్షత్రమునందును 2 అగుట చూచి వరాహమిహిరు డశ్వినిని నక్షత్రాదినిగా నిరూపించెను. అపుడు విషువమునుండి సంవత్సర మారంభింపబడెను. ఫాల్గునచైత్రములు వసంతర్తువుగా పరిగణింపబడెను. ఆనాడు వరాహమిహిరు డేర్పాటుచేసిన యీవ్యవస్థ నేటికిని వంగాదిదేశములందు వాడుకలోనున్నది.

ఋతువులు

వేదములం దెచటనో చంద్రునిమాట యున్నను ముఖ్యముగా సూర్యుడే ఋతుకారకు డని కలదు. ఋతువులు మూడని ఒకచోటను, ఐదని ఒకచోటను,

1. —ఈ గుర్తు క్రీస్తుశకమునకు వెనుక యనియు, + ఈ గుర్తు క్రీస్తుశకము పిదప యనియు గమనించునది. ధనిష్ఠను Alpha Delphini అని కొందరును, Beta Delphini అని మరికొందరును పరిగణించి నక్షత్రముల అంశముల యొక్క లెక్కలో కొలదిభేదము లూనుటచే లగధుని కాలము ఆయా మతములలో భేదించెను. అదియు ఈషద్భేదము.

2. పునర్వసునక్షత్రమున పాదవిభాగ మితడు చెప్పలేదు.

ఆఱని ఒకచోటను, ఏడని ఒకచోటను వేదములలో నచటనచట కనిపించుచున్నది. ఐతరేయబ్రాహ్మణము, తైత్తిరీయసంహితాబ్రాహ్మణములు 'హేమంతమును శిశిరమును ఒక ఋతువుక్రింద జమకట్టవచ్చును గాన అయిదే ఋతువులు' అని అనుచున్నవి.

శతపథబ్రాహ్మణమున షడృతువిభాగ మిట్లు గలదు: మధుమాధవములు వసంతర్తుమాసములు. ఈ కాలమున తరుగుల్మలతాదులు పూచును. శుక్రశుచులు గ్రీష్మర్తుమాసములు. ఈ కాలమున సూర్యుని కిరణములు తీవ్రగను, వాడిగను ఉండును. నభో 3 నభస్యములు వర్షర్తుమాసములు. నభస్సు లనగా మేఘములు. ఇషోర్జములు శరదృతుమాసములు. ఈ సమయమున ఖాద్యములగు ధాన్యములు పండబారుచుండును. ఊర్జ మనగా ఖాద్యము. సహ 4 స్సహస్యములు హేమంతర్తు మాసములు. ఈ ఋతువు ప్రాణుల నన్నిటిని తన శక్తి వశులను జేసికొనును. తప స్తపస్యములు శిశిరర్తు మాసములు. ఈ ఋతువునందు ద్రవ్యములు గట్టి పడును.5

---

3. కాళిదాసు మేఘదూతలో 'ఆషాఢస్య ప్రథమదివసే' నభఃకాలములోనిది. అనగా నాడు చాంద్రాషాఢ శుక్లప్రతిపత్తు. మరియు ఋతువునుబట్టి నేటి ఆషాఢము. ఈదినము అంబువాచి. దక్షిణాయనారంభము. విశేషము లేనిదే ఇట్టి మాసతిథి గ్రహణ మనావశ్యకము. చాంద్రాషాఢము సౌరశ్రావణము. 'నభః ఖం, శ్రావణో నభాః,' 'శ్రావణేతు స్యా న్నభాః' అని అమరసింహుడు. అనగా సౌరశ్రావణమున దక్షిణాయన మాయెనిది. వరాహమిహిరుని సమయమునను అంతయే. ఇట్లే కుమారసంభవమునందలి 'సహస్యరాత్రీ రుదవాస తత్పరా' (౫ సర్గ) అను శ్లోకమువలన నేటి సౌరమాఘమున ఉత్తరాయణ మని తెలిసికొనుచున్నాము. నేడు ౨౨ దినముల వెనుక నిది వచ్చుచున్నది. కావున కాళిదాసు + ౫౦౦ ఏండ్లకు పిదప లే డనవలెను. వరాహమిహిరున కన్యవహితపూర్వమగు పంచాంగము నవలంబించి చూచినచో + ౩౦౦ అబ్దములకు పిదప నున్నాడని అనుట కెట్టి అవకాశము లేదు.

4. 'సహ్యం తే శక్త్యా యుజ్యం తేఽత్ర ప్రాణిన ఇతి సహాః. 'సహః=శక్తి', దీనియందు ప్రాణులు శక్తి యుక్తు లగుదురు. తదుక్తం వైద్యశాస్త్రే—'దక్షిణాయనం వర్షాశ్శరద్ధేమంతాః, తేషూత్తరోత్తరం బలం వర్ధతే' ఇతి. దక్షిణాయనమునందు వర్షర్తువుకంటె శరదృతువునందును నంతకంటె హేమంతమందును ప్రాణులకు బలము వృద్ధి బొందు నని వైద్యశాస్త్రమునందు జెప్పబడినది' అని లింగాభట్టు అమరకోశమున వ్యాఖ్యానించెను. ఇది మార్గశీర్ష పర్యాయము. మూలాభిప్రాయమును వ్యాఖ్యాత్రభిప్రాయమును గమనించునది. ఈ మాసమునందు మకరాయనము. నాటగోలె తపోమాసము. ఇందు సౌరశిశిరర్తుప్రారంభము. ఇది తొల్లి మాఘమాసముగా నుండెడిది. ఇపుడు మార్గశీర్షములో నగుచున్నది. తప స్తపస్య మధుమాధవ శుక్రశుచి మాసములు ఉత్తరాయణ మాసములు. నభోనభస్య - ఇషూర్జ- సహస్సహస్యమాసములు దక్షిణాయనమాసములు. అయనవిషువములవలన ఈ పండ్రెండు నెలలు అపుడు నిరూపింపబడుచుండి యుండవచ్చును. ఇదియైన సాయననిరయనవిచారమున కట్టే ఫలము లేదు. ఈ ఋతుమాసములు అమలులోనికి రాకమునుపు అయనగతి తిన్నగా తెలియమి పండ్రెండు సౌరమాసములకు తెలుపుటకు ద్వాదశాదిత్యుల పేరులు పుట్టియుండును. ఆపేళ్లివి: వసంతమున ధాత-అర్యమ. గ్రీష్మమున మిత్ర-వరుణ. వర్షర్తువున ఇంద్ర- వివస్వత్. శరత్తున పర్జన్య-పూష. హేమంతమున అంశ (శ)-భగ. శిశిరమున త్వష్ట్రు - వి(జి)ష్ణు. పురాణకాలమున పైవానిలో రెండు మూడు పేర్లకు పర్యాయభంగ మాయెను. అపుడు వానకారును ఇంద్రాదిత్యమాసము వివస్వదాదిత్య మాస మనియో, లేక నభోమాసము నభస్యమాస మనియో వాడుకొనుచుండియుందురు.

5. ఋత్వయనములను సాయనమానముచేతను, మాసములను నిరయనమానముచేతను చూచుచో మకరాయనము శిశిరాది, మీనాయనము వసంతాది, వృషభాయనము గ్రీష్మాది, కర్కాటయనము వర్షాది, కన్యాయనము శరదాది, వృశ్చికాయనము హేమంతాదియు నగును. వరాహమిహిరుడు నాటి సాయనమానముచే ఫాల్గునచైత్రములు వసంత మని అనెను.

ఇక మాసములగురించి: వసంతాది వత్సరాదియగుచో వసంతారబ్ధమగు మాఘము చాంద్రవత్సరారంభము. మకరాయనము గల చాంద్రమాసము వత్సరాది యగు నేని మార్గశీర్షము వత్సరారంభము.

ఈ శతపథబ్రాహ్మణమునందే యింకొకచో— 'రథగృత్సరథౌజస్సులు వసంతఋతుమాసములు. రథస్వనరథచిత్రములు గ్రీష్మఋతుమాసములు. రథప్రోతాసమరథులు వర్షఋతుమాసములు. తార్క్ష్యారిష్టనేములు శరదృతుమాసములు. సేనజిత్ సుషేణములు శీతఋతుమాసములు. తపస్తపస్యములు హేమంతఋతు మాసములు' అని కలదు.

ఈ శతపథమునందే మరియొకచో ఋతువు లయిదని కలదు. ఈ గణనమునందు హేమంతము లేదు. అంతే మరియొకట నూడే ఋతువు లని కలదు. నాలుగు నెలలొక ఋతువుగా గొని యిటులు చెప్పియుండవచ్చును. లేక నూడు ఋతువు లున్న ప్రాంతములో నున్న విషయమిది కావచ్చును. అంతే ఇంకొకచోట 'ఋతువు లారే కాని పదమూడవ మాసములో, అనగా మలమాసములో రేయుంబవళ్లు నొక-ఋతువుగా గ్రహించి ఋతువులే డనియు ననవచ్చు'నని కలదు.

మధుమాధవాదినామములు చాలకాలముక్రిందట ప్రచారములో నుండెను. పిదప నవి మారి చైత్రవైశాఖాదులు వాడుకలోనికి వచ్చెను. ఈమార్పు ఎపుడు జరిగియుండును ?

మధుమాధవాదిపదములు ప్రకృతిధర్మమును చెప్పును. అనగా ఆకాలమున చెట్లు పూచును. ఆ పూవులలో తేనెయుండును అను నీరీతి వ్యుత్పత్తికలది. ఇక చైత్రవైశాఖాదిపదములు చిత్తానక్షత్రముతో కూడిన పున్నమ కల నెల యనియు, విశాఖానక్షత్రముతో గూడిన పున్నమ కల నెల యనియు ఈరీతి వ్యుత్పత్తి కలది. కావున మధ్వాదిపదములకంటె చైత్రాదిపదములకు జ్యోతిర్వివేకముతో సంబంధ మున్నది. దీనినిబట్టి వ్యతిరిక్తప్రమాణము దొరకనంతవరకును మధుమాధవాది వ్యవహారము ప్రాచీన మని అనుకొనవచ్చును.

వసంతము ఋతుముఖముగా పరిగణితమయినపుడు (తైత్తిరీయసంహితా బ్రాహ్మణాదుల సమయము) మధుమాధవాదినామములు చైత్రవైశాఖాదులకు మారియుండును. పురాణములందును సాహిత్యగ్రంథములందును చైత్రవైశాఖములు వసంతఋతుమాసము లని కలదు. కాని అటుతరువాత జ్యోతిషసిద్ధాంతములు ఫాల్గునచైత్రములను వసంతఋతుమాసములనుగా చెప్పెను. ఏ జ్యోతిశ్శాస్త్రముగాని, ఏ సాహిత్యగ్రంథముగాని వైశాఖజ్యేష్ఠములను వసంతఋతుమాసము లనిగాని, ఫాల్గునచైత్రములను హేమంతఋతుమాసము లనిగాని చెప్పలేదు. కావున వెనక నెప్పుడో చైత్రవైశాఖములు వసంతఋతుమాసము లని వాడుకలో నుండె ననియు, అంతకు వెనక ఆ చైత్రవైశాఖములే మధుమాధవమాసములుగా ప్రచారములో నుండెననియు తేలుచున్నది. ఇప్పుడు ఈ త్తరదేశములో ఫాల్గునచైత్రములే వసంతఋతువని వ్యవహారము.

అయనచలనమున జేసి వసంతఋతువింత వెనుకకేగెనని విస్పష్టముగా తెలియుచున్నది. అయనచలనపు లెక్కనుబట్టి సుమారు నాలుగయిదు వేలయేండ్ల నడుమ ఈమార్పు జరిగియుండు నని చెప్పవచ్చును. కాగా ఈ చైత్రవైశాఖాదినామములు శకారంభమునకు సుమారు రెండువేలయేండ్ల వెనక. ఆకాలమున వసంతము ప్రథమఋతువు. ఆగ్రయణేష్టియు అర్ధవార్షికయజ్ఞము మొదలగున వన్నియు అపుడే చేయబడవలయు నను వ్యవస్థ నా డేర్పడెను. 'సంవత్సర మొక పిట్ట. వసంతము దాని తల. గ్రీష్మము దాని కుడిరెక్క. శరత్తు ఎడమరెక్క. వర్షఋతువు తోక. హేమంతము పొట్ట' అని తైత్తిరీయబ్రాహ్మణము వసంతమును ఋతుముఖమునుగా వర్ణించెను. మరియు తైత్తిరీయసంహితలో వసంతము ఋతుముఖ మని కలదు. అపుడు ఫాల్గునపూర్ణిమ సంవత్సరమున కారంభకమై యుండెను.

సూర్యసిద్ధాంతము శిశిరమును మొదటి ఋతువుగను, హేమంతమును చివర ఋతువుగను చెప్పెను. ఆర్యభటుడు లగధాచార్యుని వ్యవస్థనే అంగీకరించెను. ఆరవ శతాబ్దివాడగు వరాహమిహిరుడు ఫాల్గునమునుండి విషువమునుండి సంవత్సరారంభము చేసెను. దీనినిబట్టి చూచినచో ప్రాచీనసూర్యసిద్ధాంతమునుండి ఆర్యభటుడీ యంశము చేకొనియుండు నని ఊహింపవచ్చును.

భాస్కరుడు సిద్ధాంతశిరోమణిలో వసంతఋతువును మొదటి ఋతువునుగా గ్రహించి వరుసగా అన్ని


ఋతువులను తవులకన్న భిన్నముగా వర్ణించుకొనుచు పోయెను.

ఇప్పుడొక్కసారి మనము వెనుదిరిగిచూచినచో ప్రాచీనజ్యోతిషికులు సంవత్సరారంభమునకును, ఋత్వారంభమునకును మాసారంభమునకును, ఎంత పరిశ్రమించిరో, మరియు అయనచలనమునుగురించి వారు చూపిన ప్రజ్ఞ యంత్రములకుగూడ ఎంత ఆశ్చర్యము కలిగించునో తెలిసికొనగలము.

మనదేశములో నిప్పుడు చైత్రమాసముతో సంవత్సరారంభము, వసంతర్త్వారంభముగదా, ఈ వైగడవ యంతరము నేమిటి? అని సామాన్యపాఠకునకు తోచవచ్చును. కావున మన దేశములో వాడుకలో నున్న కాలమానమును కొంచెము చూపుదును.

చాంద్రసౌరభేదముచే సంవత్సరము రెండు విధములు. అమావాస్యనుండి అమావాస్యవరకుగల కాలము చాంద్రమాసము. పండ్రెండు చాంద్రమాసములు లొక చాంద్రసంవత్సరము.

సూర్యుడు రాశిచక్రము తిరిగివచ్చు కాలము సౌరసంవత్సరము. సాయననిరయనభేదముచే సౌరసంవత్సరము రెండు విధములు. మేషాయనమునుండి (మార్చి ౨౦) మేషాయనమువరకు నగు కాలము సాయనసౌరసంవత్సరము. మేషసంక్రమణమునుండి (ఇప్పుడు ఏప్రిల్ ౧౩ లో నగుచున్నది) మేషసంక్రమణము వరకు నగు కాలము నిరయనసౌరసంవత్సరము. ఆంధ్రులును, మహారాష్ట్రులును వ్యవహరించు ప్రభవాది సంవత్సరములు చాంద్రమాసములచే నగుచున్నవి. వీనిలో అధికమాసములయు, క్షయమాసములయు పరిగణన మున్నది. అట్లగుటవలన ఇవి నిరయనసౌరసంవత్సరములే ఐనవి. పూర్వకాలమున మన దేశమునందు సాయనవ్యవహారము నిరయనవ్యవహారముగూడ నున్నటులు కనబడును. ఈ రెంటిలో సాయనవ్యవహార మెప్పుడో లోపించెను. ప్రకృతము నిరయనసౌరసంవత్సరమే వాడుకలో నున్నది. మనకు నిరయనసంక్రాంతులచే మాసనిర్ణయము నిరయనమేషారంభము అశ్విన్యాదిని స్థిరము.



[దీనిలో దక్షిణాయన వృత్తార్ధములో అధోముఖముగా నున్న శరచిహ్నను ఊర్ధ్వముఖముగా గ్రహించునది.]

నవ్య వైజ్ఞానికులు


పైని కల్యహోరములలో నున్న క్రీస్తుసంవత్సరములు సాయనములు. ఇంగ్లాండు దేశమున ఋతువులు నాలుగు. మన గ్రంథములలో మూడు, ఐదు, ఆరు, ఏడు ఋతువులని యున్నదిగాని నాలుగని యెచటను లేదు. ఇది గమనింపదగిన విషయము.

భూమిఅక్షము సూర్యునికేసి ౨౩½° డిగ్రీలు వంగియున్నది. మరియు నా యక్షము ఎప్పుడును ధ్రువదర్శనము చేయుచుండును. భూకక్ష్య అండాకృత్తాకారము. కావున భూగోళమున ఋతువులు కలుగుచున్నవి. దేశభేదముచే, మరియు భూచలనముచే ఋతువులలో మార్పు కలుగుచుండును. మనదేశమున ఋతువులారు.

వాసంతవిషువము మొదలుకొని మూడు నెలలవరకు రవి ఉత్తరముగ జరుగుచున్నటులు కనబడును. అపుడు పగళ్లు పెరిగి రేయి తరుగుచుండును. ఉత్తరధ్రువము క్రమక్రమముగా రవిదెస మొగ్గుచుండును.

జూన్ ౨౧ వ నాడు కర్కాటకరేఖ సూర్యున కెదురుగ నుండును. ఇదే కర్కాటాయనము. కర్కాసంక్రాంతి జూలై ౧౬. ఉత్తరకపాలమున సంవత్సరమంతటిలో ఈ ౨౧ వ జూన్ దినమున పగలు హెచ్చు. రేయి లొచ్చు. ఈనాడు లండనులో ౩-౪౪ నిమిషముల కుదయము. ౮-౧౮ అస్తము. నార్వే ఉత్తరధ్రువసమీప భూమిలో ఇరువదినాలుగుగంటలును పగలు. ఇది మనకు గ్రీష్మము.

జూన్ ౨౨ నుండి సూర్యుడు దక్షిణమునకు తిరుగును. భూమధ్యరేఖ సెప్టెంబరు ౨౨ న సూర్యున కెదురగును. ఈ కాలమున ఉత్తరకపాలమున పగళ్లు



ఈ పటమున ఆరు ఋతువులు కనబడును. మార్చి ౨౦ లేక ౨౧ వాసంతవిషువము మేషాయనము. నాడు ధ్రువద్వయము రవికి సమదూరమున నుండును. ఈనాడు రేయుంబవళ్లు సమము. ఉదయాస్తమయములు సరిగ తూరుపు పడమటలనే జరగును. ఇది ఈ దేశమున వసంతము.

తరగును, రేలు పెరుగును. ఈనాడు మరల ధ్రువద్వయము రవికి సమదూరములో నుండును. ఈనాడును రేయుంబవళ్లు సమము. ఇక యామ్యకపాలమున ఎండలు మొదలు. రేలు తగ్గి పగళ్లు హెచ్చును. ఇది మనకు శరదృతువు.

సెప్టెంబరు ౨౩ తో మొదలుకొని మార్చి ౨౧ వరకు యామ్యకపాలమున ఎంతో లెక్కుడు. డిసెంబర్ ౨౨ న మకరము రవి కెదురు. మనకు వీడాదిపాదు గులో నేడు పగలు తక్కువ. రేయి ఎక్కువ. నేడు మకరాయనము. (జనవరి ౧౩ మకరసంక్రాంతి) మకరాయన మను మార్చి ౨౧ నాడు లండనులో ౮-౬ నిమిషముల కుదయము. ౩-౫౧ నిమిషములకు అస్తమయము. ఇది మనకు హేమంతము. నేడు దక్షిణ ధ్రువప్రాంతమున ౨౪ గంటలును పగలే. ఉత్తరధ్రువ ప్రాంతమున ౨౪ గంటలును రాత్రియే.

వారములు

మన దేశమున రవిసోమాదిసప్తవారవిభాగమున కెంతమాత్రము ప్రయోజనము లేదు. దీనికి మూలము ఫలజ్యోతిషమున విశ్వాసము. వారమును మరచుచో దాని నుద్ధరింపగల నైపథ్యకోపాయము లేదు. సప్తసంఖ్య వలన పక్షముగాని మాసముగాని సంవత్సరముగాని సమానముగా విభజింపబడదు. సప్తవారవిభాగము అవైజ్ఞానికము. ఎన్ని దినములచే పక్షవిభాగము తొల్లి చేయబడుచుండెడిదో చెప్పజాలము. అష్టకము గణించి రెండుభాగములుగా చేయబడుచుండవచ్చును. అష్టకము మీద నాదరమున కదియే కారణము కావచ్చును. తరువాత పంచరాత్రము, లేక పంచాహము గణ్యమగుచుండెను. ఈ విభాగము వైజ్ఞానికము. పక్షమాససంవత్సరముల దినసంఖ్య 'ఐదు'చే విభాజ్యము. దక్షిణ-అమెరికాలోని పెరు దేశమునందలి ఇంకా జాతివారి పూర్వపురుషులు పంచాహముచే మాసవిభాగము చేయువారని తెలియుచున్నాము. నేటి రుషియా సప్తాహము వదలి పంచాహము నవలంబించెనని వినికి. కౌటిల్యుని అర్థశాస్త్రమునందు సప్తవారవిభాగము లేదు. పంచరాత్రవిభాగమున్నది. యవనఫలజ్యోతిషమునకు అంగభూతము సప్తవారవిభాగ మీ దేశమునకు దిగుమతి యాయెను. ఇది + ౧ వ శతాబ్దిలోనో + ౨ వ శతాబ్దిలోనో. వాయుపురాణమునందు చెప్పబడిన రవి సోమాది వారముల పేళ్లు లేవు. అమరకోశమునందును లేవు. కావున దిగుమతియయిన యీ వరస తొందరగా మన దేశమున పాతుకొనలేదని ఊహింపవచ్చును.

దినము

కాలమాపకమునకు దిన మనునది ఏకకము (Unit). ఇది మార్పురానిదని పలువుర తలపు. కాని తెలివిమీరినకొలదిని పలురకము లగు దినము లేర్పడెను. మొదట నాక్షత్రదినము. ఒక నక్షత్రము ధ్రువము చుట్టును ఒకసారి తిరుగుకాలము (౨౩ గంటల ౫౬ నిమిషముల ౪౦.౯ సెకనులు) నాక్షత్రదినము. సామాన్యవ్యవహారములో సౌరదినమే సహజము. సూర్యు డొక మధ్యాహ్నమునుండి మరియొక మధ్యాహ్నమునకు వచ్చుకాలము సౌరదినము (True Solar). కాని యిది ఋతువుతోపాటు మారును. పొడుగుపొద్దు గల దినమునకును, పొట్టిపొద్దు గల దినమునకును ౫౧ సెకనులు తేడా. పలుశతాబ్దులనుండి దీనికే నిత్యవ్యవహారము.

లంకలో సూర్యోదయము దినారంభముగా ఆర్యభటుడు చెప్పెను. వరాహమిహిరుడు నడిరేయి నుండి దినారంభమును స్వీకరించెను. ఈ దేశ సూర్యోదయమునుండియు మధ్యాహ్నమునుండియు సూర్యాస్తమునుండియు నడిరేయినుండియు దినారంభము కనబడుచున్నను సూర్యోదయమునుండియే దినారంభము పరిగణితమగుచున్నది. 'ఉదయా దుదయం వారః'. దీని యంతర్భాగములు కొంచెము పరికింతము.

'ప్రాహ్ణము మధ్యాహ్నము అపరాహ్ణము సాయాహ్నము' అను నాలుగు భాగము లొకటను, 'ఉష మధ్యాహ్నము అపరాహ్ణము సాయాహ్నము సంగవము' అను ఐదు భాగము లింకొకటను ఈదినములో కనిపించును. సంగవ మనగా పాలుపితుకు కాలము. దినము ౧౫ ముహూర్తములు. రాత్రి ౧౫ ముహూర్తములు. ౧౫ ప్రతిముహూర్తము లొక ముహూర్తము. ఇంతియ కాక కాలము కాష్ఠాకళాని మేషాదులచే పరిచ్ఛిన్నము చేయబడెను. మహాభారత మహోరాత్రములను లవ కాష్ఠాకలాముహూర్తములచే విభజించెను. మరియు నాడికాపలమాషద్రోణాఢకాది విభాగములే కాక యింకెన్నియో కలవు. '౩౦ ముహూర్తము లొక అహోరాత్రము. ౧ ముహూర్తము = ౧౫ ప్రతిముహూర్తములు లేక ౩౦ త్రుటులు. ౧ త్రుటి = ౩౦ కలలు. ౧ కల = ౩౦ లవములు. ౧ లవము ౧.౨ నిమేషములు' అని అథర్వశ్రుతి.

ఇక కాలప్రవాహము సాగునకీదుదము. సంహితలందును, బ్రాహ్మణములందును యుగముల మాట కలదు. ఋగ్వేదమునందు ప్రకృతార్థమున యుగపదము లేదని అనుకొనువారు అథర్వవేదమునందు మాత్రము చూచి తృప్తిపడవలెను. ఏదో ఒక కాలవిభాగమును చెప్పు యుగమహాయుగవ్యవహారము వైదికవాఙ్మయమునం దెల్లెడ గలదు. తైత్తిరీయబ్రాహ్మణము అయిదేండ్లు ఒకయుగ మని చెప్పెను. వేదాంగజ్యోతిషమునకు లగధుడు దానిని పదిలపరచెను. ఆ యేండ్లకు ఇవి పేర్లు: సంవత్సరము పరివత్సరము ఇదావత్సరము ఇద్వత్సరము లేక అనువత్సరము. నాలుగేండ్లు ఒక యుగ మనియు, ఆరేండ్లొక యుగ మనియు గూడ గొంతొక వ్యవహార మున్నది. ఆరవ ఏడు పేరు ఇదువత్సరము. ఈ యుగముల ఉద్దేశముగూడ ఈ అయిదారేండ్లనడుమ నొక అధిమాసమునుగాని, మలమాసమునుగాని యిరికించుటయై యున్నది. ఏ దేశమునందును వాడుకలేని అనంతకాలాలోచనము భారతీయులలో కనబడును. నిత్యవ్యవహారములో దానికి ప్రయోజనము లేకున్నను తుదమొదలు లేని యీ కాలమును శాస్త్రీయవ్యవహారమున కుపయోగించునటులు చేసి ప్రాచీనకాలజ్ఞులు తరతరములవారిని కృతజ్ఞతాపాశముచే బంధించిరి.

'రేయింబవళ్లకు రవియే కారకుడు. ఇవి రెండువిధములు. అందొకటి మానవులకు. రెండొకటి దేవతలకు. పగలు పనికి. నిశి నిద్రకు. మానవుల ఒకనెల పితాళ్లకు రేయింబగలు. ఈ నెలలో వెన్నెలరేలును, చీకటిరేలును ఉండును. వెన్నెలరేలు పనికి. చీకటిరేలు నిద్రకు. మానవుల ఒక ఏడు దేవతలకొక అహోరాత్రము. ఇదియు ఉత్తరాయణ మనియు దక్షిణాయనమనియు విభక్తము. ఉత్తరాయణము వారికి పగలు; దక్షిణాయనము రాత్రి. దేవతల ౪,౦౦౦ ఏండ్లు కృతయుగము. దీని ఆదిని ౪౦౦ ఏండ్లు. అంతమున ౪౦౦ ఏండ్లు. పదపడి త్రేతాద్వాపరకలియుగములు క్రమముగా దేవతల మూడువేల రెండువేల ఒకవేయి యేండ్లు. వీని ఆరంభశేషాంశములు క్రమముగా మూడు రెండు ఒక నూరు ఏండ్లు. ఈ నాలుగుయుగముల సమష్టి బ్రహ్మకొక దినము. రేయియు నంతే. ఈ కాలమునకు ౭౧ రెట్లు కాలము ఒక మన్వంతరము. లెక్కపెట్టలేని మన్వంతరములనడుమ సృష్టిప్రలయములు సంభవించిపోవుచున్న' వని మనువు చెప్పెను.

సూర్యసిద్ధాంతము ప్రథమాధ్యాయమున నిటు లున్నది: '౧౨ సౌరమాసము లొక సౌరవత్సరము. ఇది దేవతల కొక దినము. దేవతల ఒక అహోరాత్రము అసురులకు౬ ఒకరాత్రిం దివము. ఇట్టి ౩౬౦ అహోరాత్రములు దేవతలకును, అసురులకును ఒక యేడు. ఇట్టి ౧౨,౦౦౦ ఏండ్లు కృతత్రేతాద్వాపరకలిసమష్టి. ఈ నాలుగు యుగములును, వీని సంధ్యాసంధ్యాంశములు కలసి ౪౩,౨౦,౦౦౦ సౌరవత్సరము లగును; వీని పదింట నాలుగు పాళ్లు, మూడు పాళ్లు, రెండు పాళ్లు, ఒక పాలు క్రమముగా కృతత్రేతాద్వాపరకలియుగములు; వీనిలో ఆరవ పాలు యుగసంధ్యాసంధ్యాంశములు; ఈ నాలుగు యుగములు కలిసి ఒక మహాయుగము. ౭౧ మహాయుగములు అనగా ౩౦,౬౭,౨౦,౦౦౦ సౌరవత్సరములు ఒక మన్వంతరము. అనగా ఒక మనువు ఉండు కాలము. ఈ మనుకాలశేషమున ౧౭,౨౮,౦౦౦ సౌరవత్సరములు (ఒక కృతయుగసౌరాబ్దపరిమాణము) మన్వంతరసంధి కాలము. ఇట్టి పద్నాల్గు మన్వంతరము లును, వీని సంధికాలములును కలిసి ఒక కల్పము. దీని ఆరంభమున సంధికాలము కృతయుగముతో పాటు.'

ఈరీతి కాలవిభాగము వేదములలో చెప్పబడ లేదు. పదపడి పురాణములందును, సంహితలందును కలదు. కల్పకల్పనలో నొక విశేష మున్నది.

౧ కల్పము=౧౪ మన్వంతరములు+౧ కృతయుగము=౧౪ (౭౧ మహాయుగములు+౧ కృతయుగము)+౧ కృతయుగము; ఒక మహాయుగము=౧౦ × ౪,౩౨,౦౦౦ ఏండ్లు; కృతము × ౪ × ౪,౩౨,౦౦౦ ఏండ్లు; ఒక మన్వంతరము ౭౧౦ × ౪,౩౨,౦౦౦+౪ × ౪,౩౨,౦౦౦ ఏండ్లు; కావున ఒక కల్పము =(౧౪ × ౭౧౪+౪) × ౪,౩౨,౦౦౦ ఏండ్లు=౪౩౨ ౦౦౦ ౦౦౦౦.

ఇందు ౭౧౪ ను గుణకముగా గ్రహించుటలో అయనాంశవిచారము కలదని బ్రేనేండ్ మొదలగు పాశ్చాత్యపండితులు భావించిరి. ౭౧౪ ఏండ్లలో ౧౦ డిగ్రీల అయనాంశమును ఒకయేడాదిలో ౫౦.౪ సెకనుల అయనాంశమును ఉండును. కావున కల్పకల్పనము జల్పనము కాదు; మరి అయనాంశపరిమాణమును భావగర్భితముగా వ్యాకరించుటయే.

౬. ఉత్తరమేరువాసులు దేవతలు. దక్షిణమేరువాసులు అసురులు.

కృష్ణరాయబారము

శ్రీ పున్నవ లక్ష్మీనారాయణ

కర్మసిద్ధాంతము నంగీకరించినవా రెవ్వరును భగవంతుడు మనకు పనులు చేసిపెడతాడని అంగీకరించరు. ప్రతికార్యమునకు పురుషకారము అరు పాళ్లును, దైవము ఒకపాలు నని భారతమే చెప్పుచున్నది. ఈ దైవసహాయముకూడ ఫలప్రాప్తియందు తోడ్పడునుగాని కార్యకరణమున గాదు. భగవంతుడయిన కృష్ణున కిది యసాధ్యమునా యని వాదించువారు ఈ విషయమును మరచిపోవుచున్నారు. కనుక మనము శ్రీకృష్ణుడు సంధిపొసగించుటకు మనుష్యప్రయత్నములో చేయగలిగినదంతయు చేసినాడా, లేదా యనిమాత్రమే చర్చించవలసియున్నది. దుర్యోధనుడు సంధికి ఒప్పుకొనడని అందరు అనుకొనే విషయమే. ఉత్తరగోగ్రహణ సమయమున మొట్టమొదటి సారి భీష్మద్రోణులు సంధి ప్రశంస దెచ్చినప్పుడు దుర్యోధనుడు రాజ్యభాగ మీయనని స్పష్టముగ జెప్పినాడు. ద్రుపద పురోహితుడు రాయబారమునకు వచ్చినప్పుడును, ధృతరాష్ట్రుడు తనతో సలహాపడినప్పు డెల్లను, సంజయుని రాయబారమునకు బంపునపుడును, అతడు తిరిగివచ్చి ధర్మరాజు ఐదూళ్లయినను పుచ్చుకొనుటకు ఒప్పుకొని సంధికి సుముఖుడైయున్నాడనియు, లేనిచో భీమార్జున సహాయముగ మహాయుద్ధమునకు సంసిద్ధుడయి యున్నాడనియు, పాండవులకు కృష్ణసహాయ ముండుటచే వారికి విజయము తప్పదనియు చెప్పినప్పుడుకూడ సరేమిరా అన్నాడుగాని సంధిమాటలాడలేదు. చివరకు వ్యాస భగవానుడు ధృతరాష్ట్రునిచే నాహ్వానింపబడి పాండవ పక్షమున శ్రీకృష్ణు డుండుటచే వారికి విజయము తప్పదనియు, సంధి చేసికొనవలసినదనియు సలహాయిచ్చినపుడు శ్రీకృష్ణుడు అర్జునునికి స్నేహితుడట, ఈ స్వల్ప కార్యానికి ఆయనను నేను ఆశ్రయిస్తానా అన్నాడు. ప్రాయోపవేశసమయమున రాక్షససభలో విన్నదానిని బట్టి కృష్ణుడు తమపక్షమునకు శత్రువనియు, అతడు తన విజయమునకు భంగము చేయలేడనియు తలచెను. మీదు మిక్కిలి వ్యాస సంజయధృతరాష్ట్రులతోడి సంభాషణ లనుబట్టి పాండవులకు శ్రీకృష్ణు డాధారమనియు, అతడు రాయబారమునకు వచ్చినప్పుడు దారిలోనో, లేక హస్తినాపురములోనో పట్టుకొని గాని, లేక విషప్రయోగము చేసిగాని చంపివేసినయెడల పాండవులు నిరాధారులై యుద్ధమే తలపెట్టరని నిశ్చయించుకొని తత్ప్రయత్నములు చేసినాడు.

ఇక ధర్మరాజునకు దుర్యోధనుని నిజస్థితియంతయు తెలియును. ప్రపంచచరిత్రలో గాంధీమహాత్మునితో పోల్చదగిన వ్యక్తి ధర్మరాజొక్కడే. తన వాక్కులు వదలడు. సంధి కెప్పుడూ సిద్ధమే. ధర్మమార్గము దప్పడు. అహింస ఉత్తమ సాధనమని స్వీకరిస్తాడు. లోకచరిత్రలో యుద్ధములు, రాయబారములు జరిగినప్పుడెల్లను, రెంటి నిమిత్తము ప్రయత్నములు ఏకకాలమందే జరుగుతుంటవి. రాయబారములు జరుపుతూ యుద్ధప్రయత్నములు చేయడము సంధిపొసగుటకు ప్రతిబంధకము కాదా యని ప్రశ్నింపవచ్చును. యుద్ధప్రయత్నములు సంధి పొసగుటకు ప్రతికూలము కావని నా సమాధానము. పైగా యుద్ధప్రయత్నములే సంధికి తోడ్పడతవనియు చెప్పవచ్చును. శత్రువు బలవంతుడుగ నున్నప్పుడు సంధి పొసగనిచో యుద్ధము సంభవించి అపజయము కలుగునేమో యని సందేహము కలిగి సంధి జరుగుట కెక్కువ అవకాశ మిచ్చును.

కృష్ణుడు రాయబారమునకు బయలుదేరునప్పటికే భరతఖండములోని రాజులెల్లరును ఏపక్షమున నెవరు చేరునదియు తెలిసిపోయినది. సామాన్యదృష్టితో జూచువారలకు ఉభయసైన్యములును తమకే విజయము గలుగునని భావించుచుండిరి. ఉభయపక్షములలోని

వీరులయొక్క బలపరాక్రమములను లెక్కించుకొనుచు ఎవరు ఎవరిని జంపగలరనో వాటాలు వేసికొనుచుండిరి. ఉభయపక్షముల భేదాలు చెప్పమని దుర్యోధనుడు సంజయుని నడిగితే, అటు కృష్ణు డున్నాడు, మీ వైపున అతనికి ఈడు ఎవ రని అన్నాడు. అందుచేతనే కృష్ణుని చంపితే మనము తప్పక గెలుస్తా మనుకున్నాడు దుర్యోధనుడు.

ధర్మరాజుకు దుర్యోధనుడితో సంధి కుదురుతుందని నమ్మకము లేదు. కృష్ణుడు సంజయునితో సంధికి నేనే వస్తానని చెప్పేటప్పటికి ధర్మరాజు కాశ కలిగింది. ఐ దూళ్లిచ్చినా చాలునని ఇదివరకే అన్నాడు. ఇప్పుడు నీయిష్టము వచ్చిన షరతులతో సంధిచేసికొని రమ్మనమని సర్వాధికారము గూడ యిచ్చాడు. అన్నిటికంటే ఆశ్చర్య మేమంటే: కౌరవుల మాట యెత్తితే నిప్పులుగురిసే భీముడు "పాడు యుద్ధము వద్దు. ఏలాగయినా సంధిచేసికొని" రమ్మన్నాడు. అర్జునుడుకూడ అలాగే మెత్తబడి మాట్లాడాడు. కుర్రవాడు నకులుడుకూడ సంజయుడు రాకపూర్వ మున్న యుద్రేకము తమ మనస్సులలో లేదనియు, ఏలాగయినా సంధి కూలవేసికొనిరావలసినదనియు విసుగులో చెప్పాడు. ద్రౌపది మొదట తీవ్రంగా మాట్లాడినా చివరకు జారి నామనసులో వున్న క్రోధంకొద్దీ మాట్లాడితి నని, మీ. అందరికీ యుక్తమని తోచినప్రకారము చేసికొనిర మ్మన్నది. సాత్యకి, సహదేవులు మాత్రం తిరగబడ్డారు. పెద్దవీరంగులు పస్తుమణిగితే చిన్న టపాకాయలు పేలి ప్రయోజనమేమి? కాని కృష్ణునికే ఆశ్చర్యం వేసింది. సంధి కుదరక తాను తిరిగి వస్తే వీండ్లంతా యుద్ధమక్కరలేదు, అడవులకే తిరిగిపోదా మని అనేటట్లు కనుపడ్డది. ఇది రహస్యసంభాషణగూడ కాదు. యుద్ధానికి తోడువచ్చిన రాజలోకమంతా విన్నది. వారంతా నిరుత్సాహపడి వెళ్లిపోతా రని భయపడవలసినట్లు కనుపడింది. ఈ మాటలే శత్రువులే వింటే సంధికి పోయినప్పుడు నీళ్లుకూడ పుట్టేటట్లు లేదు. సంధికి పోయి ప్రయోజనమే ఉండ దనుకున్నాడు. కూలబడిపోయిన భీమార్జునులను లేవదీసి కర్రలు పోటిపెట్టి నిలువబెట్టాడు. తిరిగి మున్గరికే ప్రాణంపోశాడు. నేను రాయబారానికి వెళ్లితే సంధి అయితీరుతుందని మీ రనుకుంటున్నారు. ౧౦౦ కి ౯౯ పాళ్లు యుద్ధమే ఖాయమన్నాడు. అప్పుడు సమావేశమయిన రాజులంతా సంతోషించారు.

ఇదంతా జరిగి తీరా ప్రయాణంకాబోయేసరికి పెద్ద చిక్కొకటి తటస్థించింది. ధర్మరాజుయొక్క శుద్ధ సాత్వికబుద్ధికి రాబోయే పెద్ద విపత్తు గోచరమయింది. దుష్టులయిన కౌరవులు కృష్ణుని ప్రాణానికే మోసం తెస్తా రని గోచరమయింది. అసలు ప్రయాణమే వద్దన్నాడు.

"కుటిలమతు లవినీతులు క్రూరకర్మ
లట్టి నీచుల కడకు నిన్ననుపజాల!
నీవు సంకటపడితేని దేవపదవి
రైన నే నొల్ల నొంటి యందరును బుడుగు".

అని ధర్మరాజనేరకు కృష్ణుడు గ్రహించి "నీ భావము నే గ్రహించాను. నాకు కోపమువస్తే నన్నాదిరించగలవాం డ్లెచ్చట నున్నారా? అయినా ఆత్మరక్షణకు తగిన ఏర్పాట్లతోనే వెళ్లుతా"నని తన శంఖచక్రాది యుద్ధసాధనములు రథములో పెట్టించుకొని, తనకు శిష్యుడును, అతిరథశ్రేష్ఠుడు నయిన సాత్యకిని అంగరక్షకునిగా వెంట దీసికొని బయలుదేరాడు. వెళ్లుతూ కృష్ణుడు ధర్మరాజుతో ఆఖరున చెప్పిన మాటలు గమనింపదగియున్నవి:

"అన విని, కౌరవులకును మీ
కును హితము క్రియంబు జేయగోరియు కుంతీ
తనయాగ్రజా మని ధృతిరా
ష్ట్రునికడకుం బోయెదను కడుం బ్రీతి మెయిన్"

ప్రయాణమవుతూ చెప్పిన యీ పద్యములోని భావమునుబట్టి పైన భీమార్జునులను యుద్ధమునకు పురికొల్పిన వాక్యములు సంధిపొసగుటకే యనియు, సంధి పొసగించు విషయమై ఆయనభావమేమియు మారలేదనియు స్పష్టపడుచున్నది.

ఉపప్లావ్యంనుంచి ప్రొద్దున్నే బయలుదేరారు. సాయంకాలానికల్లా కుశస్థలం చేరుకున్నారు. ఇది పూర్వం యాదవుల పట్టణం. ఊరివారంతా వచ్చి ఆహ్వా

నించారు. వూళ్లో జనసమ్మర్దంగా వుంటుంది; రాత్రి వూళ్లో నిద్రించ నన్నాడు. వూరిబయట బహిరంగస్థలములో డేరాలు వేయించుకొని వూళ్లోకి పోయి ముఖ్యులను జూచి పొద్దుగూకేసరకు డేరాలకు వచ్చి భుజించి యచ్చట నిద్రించారు. ఉదయం తిరిగి ప్రయాణం సాగింది.

కృష్ణుడు వస్తున్నాడని హస్తినాపురంలో తెలిసింది. ఊరంతా ఉత్సవం పాటించారు. బ్రహ్మాండంగా అలంకారాలు చేయించారు. కొన్ని మైళ్ళ దూరములో వున్న వృకస్థలంలోనే పందిళ్లు వేయించి ఆహ్వానాలు చేశారు. కృష్ణుడు ఏది కావాలంటే అవన్నీ బహూకరిస్తా నన్నాడు ధృతరాష్ట్రుడు. ధర్మరాజుకు ఐదూళ్లే యివ్వలేని వాడవు, ఇన్ని యెలా ఇస్తావని చెప్పాడు విదురుడు. లంచాలకు కృష్ణుడు లొంగడు; అతడు కోరిన సంధిమరకు లంగీకరించవలసిం దన్నాడు భీష్ముడు. మర్యాదలు చేస్తాగాని, లంచములూ ఇవ్వను; ధర్మరాజుకు భాగమూ పెట్ట నన్నాడు దుర్యోధనుడు. మఱియు ఇంకొక రహస్యంకూడ బయటపెట్టాడు దుర్యోధనుడు. మునుపు తన ప్రాయోపవేశసమయములో రాక్షసమహాసభలో జరిగిన విషయములు ఇట్లని చెప్పకుండా బయట పెట్టాడు. పాండవుల కేతుగడయయిన కృష్ణుని పట్టి బంధించితే, రెక్కలు విరిగిన పులులులై పాండవులు తనకు లోబడుతారనీ, యాదవ, పాంచాల ప్రభృతులయిన పాండవబంధుమిత్రులు తనకు వశులవుతారనీ, అప్పుడు తను లోకమునకెల్ల ఏలిక నవుతాననీ చెప్పివేశాడు. ఇది జగద్ద్రోహమని తిట్టాడు ధృతరాష్ట్రుడు. ఇంతపని యితడు చేసినను, చేయలేకున్నను ఈ దుష్టవాక్యములు విననేలే నని లేచిపోయినాడు భీష్ముడు.

ఇంత జరిగినను - ఏమియు జరుగనట్లే ఆహ్వానపు టేర్పాట్లు జరుగుతున్నవి. పెద్ద కొలువుకూటం సభకోసం అలంకరించారు. దుర్యోధనదుశ్శాసనభవనాలలో కృష్ణసాత్యకులకు బస లేర్పాటుచేశారు.

అక్కడ శ్రీకృష్ణుడు కుశస్థలములో ఊరిబయటి డేరాలలోనే నిద్రించి తెల్లవారి కాల్యాలు తీర్చుకొని బయలుదేరాడు. దారిపొడుగునా ఆహ్వానములు జరిగినవి. ప్రతిమజిలీలోను పిండివంటలు, పండ్లు దుర్యోధను డందజేశాడు. అవన్నీ శ్రీకృష్ణుడు పుచ్చుకున్నాడుగాని ఒక ముక్కగూడ తానుగాని, తనవాండ్లు గాని తినలేదు. హస్తినాపురం చేరారు. ధృతరాష్ట్రదుర్యోధనులు దప్ప తక్కినవారందరు స్వయంగా వచ్చి ఆహ్వానించారు. హస్తినాపురమంతా పొంగివచ్చి ఆదరించింది. సరాసరి ధృతరాష్ట్రునింటికి పోయినారు. అన్యోన్యం కుశలప్రశ్నలు జరిగినతర్వాత శ్రీకృష్ణుడు లేచి విదురునింటికి వెళ్లి, తాను తరువాత పోవలసిన ఇతర చోట్లకు వెళ్లుతా నన్నాడు. ఎవ్వరూ కాదనలేదు. దుర్యోధన దుశ్శాసనుల ఇండ్లలో బసలు ఏర్పాటుచేశామని చెప్పలేదు. ఇదివరకు జరిగిన విషయము లందరికీ తెలుసును గనుక మాట్లాడలేదు. ఇప్పటి విమర్శకులు మాత్రము కొందరు దుర్యోధనుడు తిరువాత అన్నట్లే సంధిసేయ వచ్చినవాడు దుర్యోధనుడింట్లో బసచేసినట్లయితే సంధికి అనుకూలంగా వుండే దని అంటారు. కాని పైసందర్భములలో, అది సాధ్యమే కాదని, మహావిపత్తులకు కారణ మయ్యేదని అనుకుంటాను.

విదురుడు కృష్ణునికి పరమభక్తుడు. ధృతరాష్ట్రుని మంత్రులలో నొకడయినను కేవలధర్మాత్ముడు. అధర్మపక్షాన కత్తిబట్ట నిరాకరించాడు. విదురునిచేత కత్తి పట్టించకపోతి నని చివరకు దుర్యోధనుడు విచారపడ్డాడుగూడాను.

అయితే భీష్ముడింటికి ఎందుకు పోలేదు? రామాయణములో విభీషణుడు, భారతములో భీష్ముడు వైష్ణవసంప్రదాయములో ఒకవర్గావారేగాని శరణాగతిలో భేదా వున్నది. విభీషణుడు రాముని ప్రతిపక్షములో నిలువలేక పరుగెత్తివచ్చి రాముని పాదాల శరణుజొచ్చాడు. భీష్ముడు కృష్ణునిమీద తీవ్రంగా బాణాలు గొట్టి దెబ్బకు నొచ్చి బాధపడుతూంటే చూచి ఆనందంలో మునిగిపోయినాడు. భీష్మునిలో పురుషకారము లేదు. కృష్ణుడు ఏది చేస్తే అదే మంచిది. అంపశయ్యపై నుండి ఇట్లు ప్రార్థించినాడు :

"శరణాగతుండ భక్తుడ
పరమపదము గోరెదను, తిరంబుగ నన్నుం
బరికించి రేది వేల
య్యరవు దొరకొనంగ సేయవే పరమాత్మా."

అన్నాడు. ఈ శరణాగతికి ప్రాతికూల్య మని పేరు. కృష్ణుడు విదురుడింటికి పోయి సామాను లచ్చట పెట్టి కుశలప్రశ్న లయినతరువాత వంట చేయించమని విదురునితో చెప్పి, కుంతీసదనమునకు పోయి ఆయమ నూరార్చాడు. ఆమె కచ్చటి సంగతు లన్నీ తెలుసునుగనుక తన బిడ్డలను క త్తిమీద ఆధార పడి జీవించమని సలహా చెప్పింది. ఆ మాటలకు భీష్మా దులు గాబరాపడ్డారు. అంతట దుర్యోధనుడింటికి పోయినారు. సకలమర్యాదలు సక్రమముగా జరిగినవి. మాటల సందర్భములో ఏమేమి వంటకములు, కూర్లు చేయించమంటారని ఆచారప్రకారము దుర్యోధను డడిగాడు. ఇక్కడ భోజనము చేయ నొల్ల నని చెప్పి వేశాడు. కారణ మడిగితే క్రింది జవాబిచ్చాడు:

"పగవారి యింట గుడిచిన
నగు దమ కనుమాన మమృతమైనను దాథుం
బగతురకు నుడుకపెట్టగ
దగ దొడకుల కెప్పు డెవ్విధము వాటిలునో?"

అప్పటి పరిస్థితులలో దీనిపై వ్యాఖ్యాన మనవ సరము. తరువాత విదురుడింటికి పోయి భోజనాలు సుఖముగ చేశారు. కొంతసేపు విశ్రాంతి దీసికొన్న తరు వాత విదురుడు సవినయముగా కృష్ణుని దగ్గరకు వచ్చి కూర్చుండి యాయనతో "ఈ సంధినిమిత్తము నీ వెందుకు వచ్చావు? నీమాట వాండ్లు వినరు. నీవు వస్తున్నావని విని వాండ్లంతా సభజేసి, పాండవుల కేమియు నియ్య వద్దని నిశ్చయించుకున్నారు. పైగా వాండ్లు దుష్టులు. రాయబారమునకై నీవు సభకు పోనేవ"ద్దని గట్టిగా చెప్పాడు. ఇందులో కృష్ణుడికి క్రొత్త విషయము లేవీ లేవు. మొదట ధర్మరాజునకు కలిగిన అనుమానములే విదురుడు ధ్రువపరిచాడు. కాని ఈ పరిస్థితులలోగూడ తాను వచ్చిన పని నిర్వహించ బూనుకున్నాడు కృష్ణుడు; కురుపాండవవంశమునకును, వారితో గూడిన రాజలోకమునకును రానున్న వినాశమును నివారింప బూనుకున్నాడు; పాండవపక్షపాతియయిన విదురు నింటిలో జరిగిన రహస్యసంభాషణలో వెల్లడించిన కృష్ణుని భావములు ఆయనయొక్క నిజఉద్దేశమునే వెల్లడించుననియు, ఏమాత్ర మవకాశ మున్నను సంధి కుదుర్చుమని చెప్పిన ధర్మరాజుకోర్కెను నిర్వ హించబూనినా డనియు స్పష్టము కాగలదు. కృష్ణునికి సంధి యిష్టము లేదనియును, పైగా యుద్ధమును ప్రేరే పించినా డనియును చెప్పు విమర్శలకు తావు లేదని నిశ్చయింపవచ్చును.

ఆ భావముల నీక్రింది పద్యములు వెల్లడించు చున్నవి:

ఎరుగుదు నేను సుయోధను
కొరగామియు నతనితోడ గూడిన నృపు లం
దరు పగ మనమున నిడుకొని.
అరుగుటయును సంధి పొసగ దనియు మహాత్మా.

పుడమియెల్ల నొడ్డగెడవయి గజవాజి
యుతముగా గడంగి యుగ్రమృత్యు
ముఖము మెరగ దివురు మూర్ఖత మాన్పుట
అధికమయిన పుణ్య మనఘచరిత.

మానుపవచ్చునే యంచేని—
కొరకొని పుణ్యము పాపము
నరు డర్థిం జేయుచుండ నడుమ నొకట న
శ్వరనెడలి తప్పినను ద
త్పరిణతి ఫల మొందు నంద్రు ధర్మవిధిజ్ఞుల్.

చుట్టములలోన నొప్పమి పుట్టినప్పు
డడ్డపడి వారితోడ గొట్లాడిరైన
దాన యుడుపంగ జోరకున్న వాని క్రూర
కర్ముడని చెప్పుదురు కర్మకాండవిదులు.

కావున నీ రెండుతెరగులవారికి శాంతి గావింప బ్రయత్నించువాడ.

మహాసభకు వేళయింది. విదురుడు సభకు పోవ ద్దన్నా పోయి తన ధర్మము నిర్వర్తించడానికే నిశ్చ యించుకున్నాడు. స్వరక్షణయత్నములుమాత్రము విడువలేదు. సభలో తన కమర్చిన ఎత్తయిన రత్నపీఠము మీద గూర్చున్నాడు. ఒకపక్కను సాత్యకిని, రెండవ వైపున యాదవుడయిన కృతవర్మను కూర్చోబెట్టు కున్నాడు. వెనుక కుర్చీలో విదురు డాసీనుడై చేతులు రెండూ ముందున్న కృష్ణుని కుర్చీపై వేసుకున్నాడు. స్వరక్షణకై యిష్టులను చుట్టూ కోటవలె అమర్చు

కున్నాడు. ఎదురుగా వేదికపై సింహాసనములమీద ధృతరాష్ట్రుడును, దుర్యోధనుడును కూర్చున్నారు. ఇట్లమరిన సభలో శ్రీకృష్ణుడు మేఘగంభీరధ్వనితో నుపన్యసించాడు.

సంధి పొసగించుటకై సామదానభేదదండోపాయము లనే చతురుపాయములను ప్రయోగించాడు. సామవాక్యములకు గాని, హేతువాదమునకు గాని దుర్యోధనుడు లొంగడని తెలియును. సహృదయులగు భీష్మద్రోణాదులగు సభ్యుల హృదయములుగూడ మరల్చవలసియున్నది. పాండవులది న్యాయపక్షమనియు, బలవంతులయినను యుద్ధమునకు కాలుద్రవ్వక సౌమ్యమార్గమునందే వ్యవహారమును పరిష్కరించుకొన గోరుచున్నారనియు, అన్నివిధములుగ కౌరవులదే అక్రమమనియు వారి సహాయమునకు వచ్చిన రాజులకెల్ల తెలియపరచవలసియున్నది. కృష్ణుని యుపన్యాసము రాళ్లనుకూడ కరగించునట్లున్నను అది యంతయు వృథాశ్రమ యయినది. సామోపాయము నిరర్థకమయినది. కార్యనిశ్చయము సత్పురుషులయిన భీష్మాదిపెద్దల చేతులలో లేదు. దుష్టచతుష్టయమువారి మాటే చెల్లుబడియవుచున్నది. పేరునకు అధికారము ధృతరాష్ట్రుని చేతియందే యున్నను అతడు కొడుకుయొక్క నిశ్చయమునకు భిన్నముగా పోజాలడు. ఆయనకు ఓడిపోయి సర్వనాశ మవుతామేమో యని భయమున్నదిగాని గెలుస్తామేమో యని ఆశగూడ వున్నది. సభకు హాజరయిన మునిముఖ్యులును సౌమ్యముగను, తీవ్రముగను గూడ సంధి చేసికొనవలసిన దని చెప్పారు. దుర్యోధనుడు లేచి కృష్ణుడు చెప్పినదాని నెత్తుకొనక మునులకీ క్రింది విధముగ జవాబుచెప్పాడు:

"మునులార, నన్ను విధి యే
మని మును పుట్టించె నట్టు లయ్యెదుగాక
విన జవిగాని పలుకులకు
బనిగలదే; యుడుగు డింక బహుభాషణముల్".

దుర్యోధనుని అవినయవాక్యములకు మునులు కోపింతురని భయపడి ధృతరాష్ట్రు డందుకొని, "మునులారా, తమ సద్బోధలు విని యాచరించు భాగ్యమునకు నే నోచుకొనలేదు. క్షమింపుడు. శ్రీకృష్ణా, నీవు ఇహపరములు రెండూ కలిగే మార్గ ముపదేశించావు. నామాటలు పిల్లవాడు వినడు. వాడు మందబుద్ధి. నీవు నాకు ఆత్మబంధుడవు. దయార్ద్రచిత్తుడవు. మహానుభావుడవు. సౌమ్యమార్గమున వాడిని నీవే వినిపించి వృద్ధుడనయిన నన్ను రక్షించు"మన్నాడు.

ధృతరాష్ట్రుడి యీజవాబుతో సభవారి కాళ్లు చల్లబడ్డవి. అతడు స్వతంత్రించి యేమీ చేయడని తేలిపోయింది. దుర్యోధను డెవరు చెప్పినా వినడని అందరికీ తెలుసు. కాని శ్రీకృష్ణుడు నిరాశచెందలేదు. తిరిగి ధర్మా లుపన్యసించడం మొదలుపెట్టాడు. నయానా, భయానా కూడ చెప్పాడు. అర్జునుని ఎవరూ గెలవలే రన్నాడు. ఉత్తరగోగ్రహణయుద్ధమే దానికి తార్కాణ మన్నాడు. ఇప్పుడు తన సహాయముకూడ అతని కుంటుందన్నాడు. చివరకు దానోపాయము కూడ అవలంబించాడు. ప్రస్తుతము భాగమేమీ పంచియీయ నవసరములేదు. యావత్తురాజ్యమునకు ధృతరాష్ట్రుడే రాజుగాను, ధర్మజ దుర్యోధనులు యువరాజులుగాను ఏలుకోం డన్నాడు.

ఈ మార్గము సభలోని పెద్దల కందరికీ నచ్చింది. దీని కొప్పుకొనవలసినదని భీష్మద్రోణులు నొక్కి చెప్పారు. ధృతరాష్ట్రుడుకూడ పైకి బాగానే వున్న దన్నాడు. కాని, అంతరంగములో దుర్యోధను డొక్కడే యువరాజుగా నుండి పాండవులు కలిసి అనుభవిస్తూవుండటానికి కొడుకును వొప్పించ నను కున్నాడు. అప్పుడు దుర్యోధనుడు లేచి తన మామూలుమనోనిశ్చయమునే వెక్కిలి సౌమ్యముగను, చతురతతోను, అమాయకునివలెను జవాబుచెప్పాడు. ఆ జవాబిది:

"అయ్యా, ధర్మరాజు జూదరి. ఒకటికి రెండుసార్లు శకునివెంట బడి జూదమాడి సమస్తము పోగొట్టుకొని అడవులలోను, అజ్ఞాతముగను కష్టాలుపడ్డాడు. ఈ పాపమంతా నానెత్తిన చుడతా రెందుకు? దీనితో నాకేమి ప్రమేయ మున్నది? దీనిలో నా తప్పేమున్నది? ఇప్పుడు లోకములోనున్న నా శత్రురాజులందరిని పోగుజేసికొని నాప్రక్కను శిబిరము వేసి, నా

గొంతుమీద కత్తి పెట్టి షరతులు ఒప్పుకుంటావా, లేదా అని నిర్బంధిస్తే నే నేమి జవాబు చెప్పను? నేనూ రాచబిడ్డనే. నాకూ పౌరుష మున్నది. ఈ పరిస్థితు లలో దేవేంద్రుడు దాడెత్తివచ్చినా నేను లొంగి సలాం పెట్టలేను. నా సేనాముఖమున నిలిచి వీరునివలె ప్రాణములు వదలి, ఈలోకములో పేరు, పరలోక ములో స్వర్గసుఖము పొందదలచుకున్నాను. మొదటి జూదమప్పటిలాగ మాతండ్రి ధర్మజునకు రాజ్యభాగ మిచ్చి వేశానంటే నే నొప్పుకోను. అప్పటివలె కుఱ్ఱ వాడిని గాదు. అది సాగనియ్యను. అదీగాక, మా ఉభయపక్షములకూ మన స్సెప్పుడూ కలియలేదు. ఇప్పుడు వారు క్రోధావేశులై యుండుటచేత అసలే కలియదు. కలిసివుండడమూ, భాగమియ్యడమూ రెండూ జరగవు."

అందుమీదట కృష్ణుడు లేచి, సామవాక్యపద్ధతి వదలి తీవ్రంగా దుర్యోధను డిదివరకు చేసిన దుర్నయా లన్నీ వర్ణించాడు. అందుకు దుర్యోధనుడు కోపము తెచ్చుకొని మిత్రులతో సహా లేచిపోయినాడు. వెనుక కంసుని వధించి తండ్రి ఉగ్రసేనునకు పట్టము గట్టినట్లు ఇప్పు డేల చేయలే దని కొంద రనవచ్చును. కాని కౌరవపక్షమువా రెవ్వరును దానిని కోరలేదు. కృష్ణుడు సూచించినను అంగీకరించలేదు. ధృతరాష్ట్రుడు వ్యతిరేకించాడుగూడాను. ఇది దైవికముగ జరగవలసిన పని. పురుషకారము లేనిది భగవత్కృప రాదు. అందుచేతనే అందరు సహించారు.

తిరిగి దుర్యోధనుని పిలిపించి గాంధారిచేత సలహా చెప్పించారు. అదియును నిరర్థకమయినది. దుర్యో ధనుడు తిరిగి లేచిపోయి మిత్రులతో పోసజేసికొని కృష్ణుని బట్టి చెరపెట్ట బ్రయత్నించాడు. సాత్యకి యది కనిపెట్టి సభకు వెల్లడించాడు. కృష్ణ డంతట లేచి ధృతరాష్ట్రునితో నాకు సెలవిప్పించు, వెళ్లుతా నన్నాడు. ధృతరాష్ట్రుడు దుర్యోధనుని తిరిగి పిలిపించాడు. పెద్ద లందరు ఈ దుర్నయానికై అతనిని చీవాట్లుపెట్టారు. కృష్ణుడు విశ్వరూపం చూపించాడు. అదీ ప్రయోజనం లేకపోయింది. భీష్మాదులు చూచి ఆనందించారుగాని, రాక్షసశక్తులు వారి నావేశించడంచేత కృష్ణునివైపు చేరలేదు. ధృతరాష్ట్రుడూ మారలేదు. దుర్యోధనాదులు "కృష్ణుడు మేజిక్ చేశాడు. ఈ కనికట్టుకు మేము భయపడ" మన్నారు.

అప్పుడు కృష్ణ డందరిదగ్గిరా సెలవు తీసికొని సభ విడిచిపోయినాడుగాని ఇంకా సంధిప్రయత్నం మాత్రం విడువలేదు. తన ప్రయత్నం విఫలం కావ డానికి కారణం యోచించాడు. కౌరవసభలో పెద్దలకు పరపతి లేదనీ, 'కర్ణుడు లేని భారతమా' అన్నట్లు కర్ణ డొక్కనిమీదనే కౌరవు లాధారపడియున్నారనీ, అత నిని చీలదీసినచో సంధి సాగుననీ యోచించాడు. కర్ణుని స్వభావ మెరిగినవాడు గనుక అతనిని దూరముగ తీసికొనిపోయి అతని జన్మవృత్తాంతము చెప్పి, ధర్మ రాజుభాగమునకు అతనిని పట్టాభిషిక్తుని జేసి ద్రౌపదిని పట్టమహిషిని చేస్తాను, దుర్యోధనుని విడిచి రమ్మన్నాడు. కర్ణు డంగీకరించలేదు.

అంత కృష్ణుడు సంధి కాదని నిశ్చయించుకుని ధర్మరాజుదగ్గిరకు వెళ్లి జరిగినది నివేదించాడు. అంత పాండవులు సభజేసి సంధి సాగనందున యుద్ధము ప్రకటించారు.

సంధికై కృష్ణ డిన్ని ప్రయత్నములు జేసినను, అన్నీ తెలిసిన గాంధారి కడుపుదుఃఖమునకు వశమయి కృష్ణుడు యుద్ధ మాపలే దని శపించడంమాత్రం చిత్రం!

గర్భకవి-అక్కరలు

శ్రీ దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డి

అక్కరలు, యుద్ధమల్లుని బెజవాడశిలాశాసనము లోను, నన్నయభట్టు భారతములోను కనబడుచున్నవి. నన్నెచోడకవి కుమారసంభవములో అక్కరలను పేర్కొనలేదు. కాని, వ్రాసినట్లు లక్ష్యము లున్నవి.

మధ్యాక్కర

చంపకమాలావృత్తములో పాదాంతమందలి నాలుగు రగణములు—"జీవనం, సేలపై, క్రమ్మఁగ, అయ్యనిక"—లోపించినచో అది మధ్యాక్కరగా మారుచున్నది. పద్యార్థములో యుద్ధవర్ణన చెడదు.

"మురిసెడి రూపులఁ మురిసి
    మ్రొగ్గెడి రూపులు మ్రొగ్గి
తిరిగెడి రూపులం దిరిగి
    త్రెళ్లెడు రూపులు త్రెళ్లి
పొరలెడు రూపులం బొరలి
    పోరెడి రూపులఁ బోయి
మరలెడు రూపులఁ మరలి
    వ్రగ్గెడి రూపులు నరయ్య.*"

దీనిని నన్నయమధ్యాక్కరతో మొదట పోల్చుట యుక్తము.

"ధరణి జరాచరభూత
    సంఘంబు - దమ విషవహ్ని
నరగంబు లేర్చుచు నునికి
    కలిగి ప-యోరుహగర్భు
డురగవిషాపీతజీవ
    సంజీవ - నోపదేశంబు
గరుణ గశ్యపునకు నిచ్చె
    నఖిలలోక-హితంబుపొంటె."†

యతిస్థానములో ఒక గణము—నాలుగు + అయిదు—తేడా లేనిచో ఇవి రెండును సమకాలిక ఛందస్సు లన వీలున్నది. గర్భకవితలో ఇంతమాత్రము స్వేచ్ఛ లేకపోదనుట కిది విశిష్టలక్ష్యము. ఛందస్సులలో కూడ గర్భకవి—అక్కరలక్షణమే విధింపబడినది. "మనస్థయు, మధురయుం, ద్రిగణయతుల" చెల్లును.

అంతరాక్కర

పై మధ్యాక్కరలో పాదాంతమందు రగణములు చేర్చి, పాదాదిలో రెండు ఇంద్రగణములు విడిచిపెట్టినచో, అది అంతరాక్కర కాకపోదు.

"మురిసి మ్రొగ్గెడి రూపులు
    మ్రొగ్గి జీవనం
దిరిగి త్రెళ్లెడు రూపులు
    త్రెళ్లి సేలపై
బొరలిపోరెడి రూపులఁ
    బోయి క్రమ్మఁగ
నరలి వ్రగ్గెడు రూపులు
    నరయ్య నయ్యనిక."‡

ఇది తేటగీతి కాబో లన్న పాదాంతమందలి 'గురువు' హెచ్చుగా ఉన్నది. అంతరాక్కరకును, తేటగీతికిని వ్యత్యాస మీ గురువువల్ల కనిపెట్ట వీలున్నది.

గణముల కూర్పు మారినచో దీనిలో హెచ్చు గురువు లేదనుట కవకాశ మున్నది.

*. కుమార ౧౧-౬౭ 'చ.' పద్యము.

† భారత. ఆది ౨-౧౭౧ 'మధ్యా' పద్యము.

‡ కుమార. ౧౧-౬౭ 'చ.' పద్యము.

"సూర్య చంద్ర
ఇం*ద్ర ఇంద్ర."

లేక—

"సూర్య ఇంద్ర
ఇంద్ర *చంద్ర గ."

"త్రిగణాంతము-యతి" అన్నప్పుడిట్టి వ్యత్యాసము లేర్పడును. "ఏకోనాతుర త్రిగణ మంతరమున్—యతి" చెల్లును. ఇది లక్షణగ్రంథములకంటె విలక్షణముగా ఉన్నది.

అల్పాక్కర

పై పద్యాక్కరలలో అల్పాక్కరకూడ గోచరించుచున్నది.

"మురిసెడి రూపులుం
మురిసి క్రొమ్మొగ్గ
దిరిగెడి రూపులుం
దిరిగి త్రెళ్ళి
బోరలెడి రూపులుం
బోరలిపోయి
మరలెడు రూపులుం
మరలి మ్రగ్గ."

దీనిలో ఛందోభేద మేమియు లేదు.

ఇట్టిది అక్కరగర్భితవృత్తమయినను, దీనికా పేరు పెట్టక చంపకమాలపేరు పెట్టుట యుక్తమగునో, కాదో? నిర్ణయము కావలెను.

తెనుగ్గలము :

"మురిసెడి రూపులున్ మురిసి
క్రొమ్మొగ్గెడి రూపులు క్రొమ్మొగ్గి జీవనం
దిరిగెడి రూపులుం దిరిగి
త్రెళ్ళెడి రూపులు త్రెళ్ళి నేలపై
బోరలెడు రూపులుం బోరలి
పోయెడి రూపులు పోయి క్రమ్మఱన్
మరలెడు రూపులుం మరలి
మ్రగ్గెడి రూపులు నరయ్య నయ్యనిన్."

(కుమార. ౧౧-౬౯ 'చ.' ప.)

"నన్నిచోడుడు నన్నయ్యకు బూర్వుడో, తత్పూర్వింతనువాడో యయినచో నక్కర లుపయోగించియుండుట సహజము."* కనుక నే, పై గర్భకవి తాక్కర లుపయోగించినా డనుట సహజము. అక్కర లుపయోగింపని తిక్కనాదికవులకంటే—అక్కరలు వ్రాసిన చోళ(చోడ)కవి పూర్వు డనునే కాని "అనంతర కాలమువాడు" కా డన వీలున్నది.

భాషాతత్త్వకోల మెట్లు తారుమా రగుచున్నదో కనుగొనుడు.

* కుమారసంభవవిమర్శనము, ౧౭౫ పుట. "అక్కరలు" శీర్షిక.



అన్నదమ్ములు

[కథానిక]

శ్రీ బలివాడ కాంతారావు

'పరువునష్టం దావా వేసితీరాలి. మన పరువు ప్రతిష్ఠల్ని కులంలో యిలా కాల్చేస్తుంటే...'

'బావగారూ! యెంత చిన్నవాడైనా యిలా సంచరిస్తుంటే యెంతకాలం సహిస్తారండీ? చిన్నమ్మయి! మహారాజులాంటి సంబంధం కాకుండా చేసిన వాడిని యేం చేసినా తప్పుందా?'

'మీరందరూ వేద్దామంటే నా అభ్యంతరం యేమీ లేదు.'

'అమ్మయ్య! యిన్నాళ్లకు వచ్చిందండీ అభ్యంతరం లే దన్నమాట! శాంతం, శాంతం అనే యింతవరకూ తీసుకవచ్చారు' వియ్యంకుని వేపు తిరిగి 'యీ కష్టాలు యిప్పుడు అనుభవించేది మనమేకదా అన్నయ్యా! చేతులారా కట్టించిన రెండంతస్తుల మేడ దానం చేశారు!'

'పోనిద్దూ చెల్లమ్మా! మేడకన్నా భూఆస్తి యెంతో లాభం. మరికొన్నాళ్లలో మనం ఒక మేడ కట్టించ లేమా?'

'మనుషు లిలాంటివా రని చెప్తున్నా నన్నయ్యా! ఇంటిపెద్ద కళ్లు మూసే సరిగ్రపు కాసులు కొని దాచే వాడే. అల్లుడి చదువు క్రింద అంత డబ్బు తగలేశా డే— యేదీ సమిష్టి. వాళ్ల మనసుల్లో కుళ్లు వుంచుకొని వాళ్ల బాగు వాళ్లు చూసుకుంటూవుంటే యీయన కెందుకా తిన్ననని? తమ్ముడు అడగటంతో సరి, మేడ దానం చేశారు.'

'రత్నం! పోనీయవే. వే రైపోయినా మన కేం లోటొచ్చింది?'

'లోటు లేదండీ? ఆయన స్వంతయింట్లో వున్నాడు. నేడో రేపో కారు కొంటారట! మనం యెందుకు కొనలేం? మన కీ అర్థకొంపగ లేమిటి? మీ ధర్మమా అంటూ పైకొచ్చి, మీ గుండెనే బాకు నాటాడు. ఇంకా తమ్ము డనే అభిమానం చావదు' వియ్యంకుని వేపు తిరిగి 'తమ్ముడు విడిపోతానని, ఆస్తి పంచమని బలవంతం చేసివరకు నే నొక దెయ్యంలా కనిపించా నన్నయ్యా.'

ముక్కాళ్ల ముదుసలి; ముఖంనిండుగా పట్టె వర్ధనాలతో వరండాదగ్గర ఆగాడు.

'ఆలస్యం యెందుకూ? వాతల్లి కడుపులో చిచ్చుపోసినవాడు నా మర్దట. రేపే దావా వెయ్యాలి' రత్నమ్మ పౌరుషవాక్యాలను జారవిడిచింది.

'ఎందుకమ్మా యీ కక్షలు ఒక్క తల్లిబిడ్డల్లో? విభక్తం అయిపోయారుకదా, పాతరోజులు మరిచి పోయి మంచిగా వుండండమ్మా!'

'మధ్యనే మీ రెందుకు పుల్లంటి బుడ్డిలా. ఇక్కడి వక్కడ పెట్టండి. రామా కృష్ణా అని ఒక మూల కూర్చోక.' కటుస్వరంతో అన్న మాటలు విన్న వకీలు చుట్టపొగమధ్యనుంచి ఒకసారి ఆశ్చర్యమైన చూపులను ప్రసరించి యేదో అనబోయి ఆగి పోయాడు.

టక్ టక్ మనే శబ్దంతో త్రోవ చూపించింది చేతిలోని కర్ర. గదిలోనికి పోయి తన మంచంమీద చారబడ్డాడు ముదుసలి.

౨

'ఏడుస్తున్నా వేం తాతయ్యా! అమ్మ అన్నం పెట్టలే?'

'ఆకలి లేదు నాయనా'

'ఆకలిలేనిదే యేడుస్తా వేం తాతయ్యా?'

ఒడిలో కూర్చున్న ఐదేళ్ల మనుమడిప్రశ్నకు డెబ్భై యేళ్ల తాతయ్య జవాబీయలేకపోయాడు.

'చాకలెట్ యిస్తాను, వూరుకుంటావా తాతయ్యా?'

తాతయ్య తల కాస్త ప్రక్కకు త్రిప్పగానే తను తాతయ్యపేరు చెప్పి ఒక ముక్క తినొచ్చని ఒడిలో నుంచి దుమికి పరుగెత్తాడు.

'అమ్మా, అమ్మా! తాతయ్యకి చాకలెట్ కావాలటే'

'అబ్బా! ఉండరా...బడికి వేళైంది. వెళ్లు'

'తాతయ్యకు చాకలెట్ యిస్తే మరి యేడవడే'

'తాతయ్య యేడుస్తున్నారా?'

'నిజంగా యేడుస్తుంటే—చాకలెట్ యిస్తే'

రత్నమ్మ మామగారి గదిలోనికి వెళ్లింది.

'యీ యింట్లో యీదురోమని యెందుకీ రోదనం? యిక్కడ కొంతసేపు, అక్కడ కొంతసేపు. యే కొడుకునో ఒక్కడిని నమ్ముకొని వుండరాదూ?'

'యిద్దరూ నాకొడుకు లనే అభిమానం కాల్చుకో లేనమ్మా!'

'అభిమానం. అభిమానం! అయితే యెప్పుడూ మాకీ గోల యెందుకూ?'

'నాస్థితిలో వుంటే నాకడుపుమంట తెలుసు కొనివుందు వమ్మా.'

'మంట! యీయేడు పెండుకు మాయింట్లో. మీకొడుకుకుటుంబం నిలవాలా?'

'రామరామ! వూరుకో అమ్మా, వూరుకో. ముసలివాళ్లకు దేవుడు అన్యాయం చేస్తాడు. కన్నీరు తప్పించి మిగతావన్నీ కరువుచేస్తాడు. ఆ కన్నీరుకూడా కరువుచేసుంటే నీకువ న్నింత కష్టపడేది కాదు.'

'యేమన్నా నే చెడ్డదాన్ని. నిజం ఆడితే నిష్ఠూరం. చిన్నకొడుకుమీద అంత అభిమానం వుంటే యిక్కడికి యెందుకు రావటం? అక్కడే వుండండి.'

పైమీది గావంచాలో కళ్లు ఒత్తుకొని 'ముసలి వాళ్ళు పిల్లలతో సమానం అమ్మా. కాలానికి పక్ష పాతం వుండదు. అందరిమీదా దాని ప్రాభవాన్ని చూపిస్తుంది. ఒకనాడు నాకంట పడని కోడలివి యీ నాడు నా బాగోగులు స్వయంగా చూస్తున్నావంటే అది కాలప్రభావం కాదమ్మా. వెళ్లమ్మా, బాబుని తలదువ్వి బడిలోకి పంపించు' అంటూ లేచి పీఠి అరుగుమీదికి పోయి కూర్చున్నాడు—కోడలు యేదో గొణుక్కుంటున్నా వినిపించుకోకుండా.

3

ఒంటిగా మేడ యెక్కలేడు. యెవరైనా తోడుండాలి. మనుమరాలు రాధ గబగబా మెట్లు దిగి తాతయ్యదగ్గరకు వచ్చింది. పలుచని తెల్లైన శరీరం, ప్రశాంతమైన ముఖవర్చస్సు, ప్రేమ వుట్టిపడే మాటలూ—ఆమెభుజం వూతపట్టుకొని మేడ యెక్కాడు. రత్నమ్మకుకూడ రాధ అంటే అదొక విచిత్రప్రేమ—చాలా మంచిపిల్ల అని.

పడమటి సూర్యుని పవిత్రకిరణాలు తాతయ్య పాదాలపై పడి ప్రకాశిస్తున్నయ్.

'మనంకూడా వేర్దాం దావా. యెవరైతే నేం? కావలసింది న్యాయం.'

'వద్దండీ. మీరుకూడా కోర్టెక్కితే నలుగురూ ఛీ ఛీ అంటారు.'

'నోరు ముయ్. వాడు నా కన్నయ్యట! నా పిల్లకీ, నాకూ ద్రోహాన్ని తలపెట్టాడు.'

'అవన్నీ మరచిపోండి. విడిపోయాంగా.'

'యెందుకు నాయనా, ఒకతల్లి బిడ్డలు యిలా కొట్లాడుకుంటారు?'—అక్కడే వున్న తండ్రి కలుగ జేసుకొని హితవును బోధించాడు.

'యిందులో కొట్లాట యేం వుందండీ? వాడి పిల్లలకి పెద్దపెద్ద సంబంధాలుచేసుకొని ఒకే ఒక నా పిల్లని పేదయింటిలో పడవేస్తాడా? పెద్దవాడు—యింటి యజమానికి యిది సబబుగా వుందండీ.'

'ఆ పిల్లల అదృష్టంరా అది. పేదయింటిలో పడవేసినా నీఅల్లుడికి వచ్చిన లోటేమిటి? పర్కారు వారి డాక్టరు; బుద్ధిమంతుడు. మొగసంతానం లేనందుకు ఆ పేదయింటిపిల్లడు కాబట్టి యిల్లరికం వచ్చాడు.'

'నేను కలుగజేసుకొని చదివించబట్టి సరిపోయింది. లేదా అంటే మీ రిలా ఆ కొడుకుపక్షాన మాట్లాడకపోయుందురు.'

'నిన్ను వృద్ధిలోనికి తెచ్చిం దివా డేకదరా బాబూ! సమిష్టిగా వున్నపుడు యెవరు చదివితే యేమిటని వూరుకున్నాడు. మధ్యనున్న వాళ్లు యిక్కడి వక్కడ, అక్కడి విక్కడ చెపుతారురా. మాటవరసకి అనుంటాడు. నిజంగా వాడు దావా వేస్తాడురా? కోర్టుకెక్కి డబ్బు తగలెయ్యటమే కాదు—పరువు నష్టందావా వేస్తే వున్న పరువును కాల్చేసుకుంటారు.'

'మీకు తెలీదు, వూరుకోండి.' కసురుతూ అన్న యీమాటల్లో విద్యుత్తు వుత్పత్తియై షాక్ తగిలిన ట్లనిపించింది. మెల్లగా లేచి మనుమరాలి గదిలోనికి పోయాడు. కళ్లలో నీరునింపిన రాధప్రక్కనే కూర్చొని అప్యాయంగా—

'యేమమ్మా రాధా! అలా...'

'తమ్ముడు రోజూ వచ్చి పెద్దక్క పెద్దక్క అని విడిచి పెట్టేవాడు కాదు తాతయ్యా. నిన్నటినుంచి రానే లేదు. పెద్దమ్మ వెళ్లొద్దందేమో?'

'అయ్యో! తల్లీ! యింతా డబ్బుప్రభావమమ్మ. తల్లీ పిల్లలనీ, అన్నాతమ్ములనీ, అభిమానులనీ వేరుచేస్తుందమ్మ యీ హెచ్చుడబ్బు!'

౪

చలికాలం. సూర్యుడు కొంచెం మీదికి లేచాడు. చన్నీటిలో స్నానంచేసి గజగజ వణికిపోతున్నాడు తాతయ్య. 'రామా, కృష్ణా, కేశవా, నారాయణా...' అని బోసినోటితో వుచ్చరిస్తూ గదిలోకి పోయి ముఖాన్న పట్టెనామాలు దిద్దుకున్నాడు చేతిలో ఉన్న చిన్న అద్దాన్ని చూస్తూ.

'వేడినీరు స్నానం చేయ లేకపోయారా?'

'వేడినీరు కృత్రిమమైంది నాయనా. స్నానం చేసినంతసేపూ వెచ్చగా వుంటుంది. తరువాత చలే కదా—నాయనా, యిలా ఒక్కసారి వస్తావురా?'

పెద్దకొడుకు తండ్రిదగ్గర కూర్చున్నాడు.

విరక్తిలేని కంఠస్వరంతో అప్యాయంగా అన్నాడు—'బాబూ! బుద్ధిమంతుడివి. న్యాయశాస్త్రం చదువుకున్నావు. తొందర లేదు. బాగా ఆలోచించి చెప్పు, నన్నేయింట్లో కాలం చెయ్యమంటావో?'

కొడుకు మొదట విస్తుపోయినా తరువాత ఆ ప్రశ్నలోని వ్యంగ్యాన్ని అర్థంచేసుకొని సిగ్గుతో తల దించాడు.

'తొందర లేదు. అవసరం వుంటే ఆఫీసుగదిలోని ఆ పుస్తకాలన్నీ తిరగవెయ్ నాయనా.'

చేతికర్ర త్రోవ చూపించింది. నడుంకంగిన నాన్న నడకను చూస్తూ అలా కూర్చుండిపోయాడు కొడుకు.

'పేరుపొందిన వైద్యుడివి. వూరిలో అందరి జబ్బులూ బాగు చెయ్యగలవేమో కాని నీనాన్న రోగాన్నే కనుక్కో లేవు. మరి న న్నెక్కడ కాలం చెయ్యమంటావ్? నీయింట్లోనా, నీఅన్నయ్యయింట్లోనా? తొందరలేదులే. బాగా ఆలోచించి చెప్పు నాయనా!'—యీమాటలు విన్న చిన్నకొడుకు మొహంలో చెప్పదగిన మార్పేమీ గోచరించలేదు. పైగా ఆ మాటలు సరిగ్గా వినిపించుకోలే దనవచ్చు. ముసలివాళ్లు యేదో పిచ్చివేదాంతం మాట్లాడుతారని ఆ ఎల్. ఎమ్. పి. డాక్టరు నమ్మకం!

౫

పాండుమేళం. యింటినిండా చుట్టాలు. చాలా సందడిగా వుంది. తాతయ్య వీధిఅరుగుమీద కూర్చున్నాడు. 'నాయనా, యిలా రా' అని పిలిచాడు తాతయ్య. 'పెద్దవాడివి, తప్పు చెయ్యకురా' అన్నాడు. అడ్డుగా వచ్చింది కోడలు: 'మీరు వూరుకోండి. యిక బుద్ధులు చెప్పక్కరలేదు. కూతురుకడుపులో చిచ్చుపోసినవాడిని కూతురుపెళ్లికి తనుదునమ్మ అని వెళ్లి పిలుస్తాను?'

'శుభకార్యమమ్మ. యీక్షణమైనా విభేదాలు మరచిపోండి.'

'ఆయనమాటల కేమిటి? యిద్దరం యిక్కడ వుంటే యెలా? రండి' తీసుకపోయింది భర్తను రత్నమ్మ.

'ఒరే నరసింహులూ, యిలా రా నాయనా... పెద్దకుటుంబీకుడివి. యీనాటికైనా ఆలోచించురా. నీవియ్యంకుడిని యెలాగైనా చిన్నవాడిదగ్గరకు వెళ్లి పెళ్లికి రమ్మని పిలమనరా.'

'నామాట వింటారండీ మామయ్యగారూ ?'

'అయ్యో నాయనా ! మధ్యను మీలాంటివాళ్లుండీ వాళ్ళ మనసులు మరీ పాడుచేస్తున్నారురా !' యీసడించి ఒకసారి చూచి వెళ్ళిపోయాడు నరసింహులు.

౬

'ఆరోగ్యం మహాభాగ్యం నాయనా. ఇంత రాత్రివరకూ ఆ పుస్తకాలు తిరగవేసుక కూర్చోకు.'

'రేపు ఒకకేసు వుందండీ...'

'నాయనా ! అమ్మాయిపెళ్లి అయిపోయింది కదరా' అంటూ యెదురుగా కుర్చీమీద కూర్చున్నాడు తండ్రి.

'బుద్ధిమంతుడివి. వున్న ఆస్తిఅంతా నీఒక్కడి చదువుక్రిందే యెందుకు పెట్టాను? నా తను వుండగా యిద్దరూ యిలా ద్వేషంతో మెలగటం చూడలేక పోతున్నాను. దాఖలుచేసిన కేసు వుపసంహరించుకో నాయనా.'

'వాడింకా చిన్నవాడండీ ? పిల్లకు అంత గొప్పయింటి సంబంధం స్థిరమైతే యెలా విఘ్నం చేశాడో మీకు తెలీదా? అంతతో వూరుకోకుండా మేమేకో మాలకూడు తినేస్తున్నామనీ, మాయిల్లు పాని కొంపనీ అంటూంటే యెలా సహించమంటారండీ !

'నీయెదురుగా అన్నాడా ? పోనీ, అన్నాడే అనుకొందాం. వాడుచేసిన పాపానికి శిక్షించేవాడు శ్రీమన్నారాయణమూర్తి వుండగా మానవమాత్రుడవు నీవు దేవునిపని చేస్తానటం బాగాలేదు. నీ తిన్నసైన త్రోవలో నీవు పో బాబూ. విద్వేషాలు పెరగటం వలన లాభం యెప్పుడూ వుండదు. తొందర లేదు. బాగా ఆలోచించు. నీ అంతరాత్మను ప్రశ్నించు.'

తండ్రిమాటలకు మౌనాన్ని దాల్చాడు.

'నాయనా ! కాలం దగ్గరపడిందిరా. యీవేళ చెప్పవా, నన్నే యింట్లో కాలం చెయ్యమంటావో ?'

కొడుకు తల దించాడు. సమాధానం తోచక కాదేమో. పొంచి వింటున్న రత్నమ్మ రంగంలోకి దిగింది. 'ఆ కాలానికి మన యిష్టాయిష్టాలు పనికి వస్తాయా ? కొడుక్కి బాగా వేదాంతం బోధపరుస్తున్నారు. సన్యాసులం కాం !'

మెల్లగా లేచాడు. 'అమ్మా ! పులి చాలా క్రూరమృగమమ్మా. తన పిల్లలను చంపి తినటానికికూడ జంకదు. విద్వేషం ఆవరించిన మనిషి అలాంటివాడే. నీ ఒక్క కొడుకు తప్పుచేస్తే, క్షమిస్తావా లేదా ? నీ ఒక్క మరిదీ కొడుకుతో సమానం కాదమ్మా — క్షమించలేవా ?'

'చిన్నకొడుకు ముద్దు. ఏం అనలేరు. ఎటొచ్చీ మేం మెత్తగా కనిపిస్తున్నాంగా' రత్నమ్మ కటుస్వరంతో అన్న మాటలకు భర్త వెంటనే 'రత్నం ! వూరుకో' అన్నాడు మందలింపుస్వరంతో.

'వినేవాడికే చెప్పాలని వుంటుందమ్మా. యీ కేసుల్లో ఫలానావాడి కొడుకు లంటారే తల్లీ' అంటూ గదిలోనుంచి వెళ్లిపోయాడు.

౭

'ఒంటిగంట దాటింది. యింకా నిద్రపోరండీ' యెలుగెత్తి యేకకంఠంతో నైట్ ప్రార్థన చేసుకొంటున్న తండ్రిగదిలోనికి వచ్చి ప్రశ్నించాడు పెద్దకొడుకు.

'నాయనా ! నిద్రపోయేబదులు ఆ కాలంలో ఆ దేవుణ్ని ప్రార్థిస్తే నే చేసిన పాపాలను క్షమిస్తాడు.' మరల ప్రేమ వుట్టిపడే స్వరంతో తల దించికున్న కొడుకు కేసు చూస్తూ 'చిన్నబుచ్చుకోకురా నాయనా. నిన్ను ఆస్తిపాస్తులమ్మి చదివించటంవల్ల యీపాపం అంతా నాకే చుట్టుకుందిరా. పెద్దకొడుకు చదువుకొని జ్ఞానసంపన్నుడై పొట్ట పోషించుకొని చిన్నవాడిని పైకి తెస్తాడు; యిద్దరూ సఖ్యంగా వుంటా రనుకున్నానురా. కాని యింకోలా జరిగింది. చదువు చెప్పించకపోయినా, ఆ నాగలిని నమ్ముకొనైనా సఖ్యంగా వుందురేమో ? న్యాయశాస్త్రం నీకు న్యాయదృష్టిని ప్రసాదిస్తుం దనుకొన్నా-కాని...' గొంతులో కంపం బయలుదేరింది.

కొడుకుశరీరం ఝల్లుమన్నది. తను అపరాధం చేశానని బాధపడ్డాడు. తండ్రిమీది సహజమైన అభిమానం, భక్తి కట్టలు తెంచుకొని ప్రవహించింది. దగ్గర కూర్చున్నాడు.

బిగబట్టిన పెదిమలు దగ్గరగా వచ్చిన కొడుకును చూడగానే విడిపోయాయ్. గడ్డకట్టుకుపోయిన ఆవేదన

కొడుకు ప్రసరించిన తీవ్రకరుణాదృష్టులకు కరిగి అశ్రురూపంలో రాల సిద్ధంగా వుంది.

'నీ తాతముత్తాతలనుంచీ న్యాయానికి పేరు పడిందిరా మన వంశం. నీ తాత ఆముదందీపంయెదుట చదివించిన రామాయణభారతాలలోని సారంతో యీపొట్ట చల్లగా వుండేది. కాని, యీ ముడుతలుపడిన పొట్ట యెంతగా మండిపోతున్నదో చూడు నాయనా' అంటూ కొడుకుతలను అభిమానంతో పట్టుకొని పొట్టకు ఆన్చాడు.

శ్వాస బిగబట్టి అంతవరకూ దుఃఖాన్ని అపుకున్న న్యాయవాదికళ్లు తెకిసిపోయినై. ముఖం సిగ్గూ, ఆవేదనల్లో మునిగిపోయింది. జారిన రెండుగొండు కన్నీటిబిందువులు ముడుతల మధ్యనుంచి వడిగా జారిపోయాయ్.

మెల్లగా లేచి కూర్చున్నాడు తండ్రి. కొడుకు కన్నీటిని తుడిచి 'యెప్పటికైనా న్యాయానికి కట్టుబడతావని యిన్నాళ్లూ పూరుకున్నాను' తండ్రిమాటలకు హఠాత్తుగా మధ్యనే అడ్డి అప్రయత్నంగా చేతులు జోడించి 'క్షమించండి. కేసు వుపసంహరిస్తాను. రెండో విషయం, మీ కెలా న్యాయమని తోస్తే అలా చెయ్యండి' అంటూ నాన్నమీది అభిమానం ఆయన కాళ్లను బంధించినా తన వంశానికి అపకీర్తి తెచ్చానన్నే బాధ పిశాచమై వెంటతరిమింది. తన గదిలో పరుపుమీద పడి హృదయాన్ని గట్టిగా నొక్కిపట్టుకున్నాడు.

౭

చిన్నవాడికి యెన్నివిధాల చెప్పినా వినిపించుకోలేదు. 'మొదట కేసువేసింది నీవేకదరా? లేనివి కల్పించి వాడిమీద అలా అనవసరంగా విరుచుకుపడ్డావ్. కృతఘ్నుడివిరా. నీయింట్లో నేను చావలేను. నాకు ఒక్కడే కొడుకును దేవుడు ప్రసాదించాడనుకుంటాను' హృదయం విప్పిచెప్పి పెద్దకొడుకుయింటికి చేరుకున్నాడు.

రత్నమ్మ వియ్యంకుని యింటినుంచి తిరిగి వచ్చింది. ఆరాత్రి గదిలో భార్యతో అన్నాడు—'రత్నం, భూమి అమ్మటం నా కిష్టంలేదు. అంత బంగారం నీవు మోయలేక పోతున్నావ్. కాసులపేరు, వడ్డాణం నా క్కావాలి.'

రత్నమ్మ యీమాటలు విని చకితురాలయింది. 'అలా చూస్తావేం? నీకు డబ్బు ప్రధానమా? వంశమర్యాద నిలపటం ప్రధానమా?' అని ప్రశ్నించాడు.

రత్నమ్మ సబురా లైంది. ఆమెజవాబుకు యెదురుచూడకుండానే అన్నాడు: 'నాకు కావలసింది యీ వంశమర్యాద నిలపటం. యెవరు అడ్డురానీ నా ప్రోవలో నే పోతాను.' ఆరాత్రి స్వార్థం గెలిచానన్నది. కాని అది నైతికవిజయం కాదు.

వేకువజామున తండ్రి హరినామస్మరణ వినగానే 'ఛీ! స్వార్థానికి తె సెప్పుడూ తలవంచి దాసోహం అనొనని భీష్మించుకున్నాడు.

గృహంలో భీకరసంగ్రామం జరిగింది. అకస్మాత్తుగా తగిలిన దెబ్బదెబ్బతో రత్నమ్మ అలా కూర్చుండిపోయింది.

'నాయనా! తప్పురా. గృహలక్ష్మి!' అంటూ తలవేసి చెవులు మూసుకున్నాడు ముసలి.

బంగారం అమ్మి ఒక వేయి కోర్టులో కట్టి తిరిగి వచ్చాడు. కేసులగొడవ పోనే తను హాయిగా యీలోకం విడిచిపెట్టగలనని తండ్రి ఆశించాడు. కాని, యీ గృహకలహం దావానలం అయింది. ఆశతో బ్రతికే గృహిణిని యిల్లువిడిచి పొమ్మన్నాడు.

ఈగలభా చూచి మృత్యువులోనే తనకు శాంతి వరిస్తుందని ముసలిమనస్సులో ఆలోచన ప్రవహించింది. మూతిపోటులు తప్పించి, కర్ణకఠోరమైన మాటలకు గుండె పగిలి పెద్దపెట్టున యేడ్చుకుని కుమిలిపోయాడు. యిదంతా అశయొక్క ప్రభావమని సంభావించుకుని కొడుకున్యాయప్రవర్తనను శ్లాఘించి కోడలు చేసిన అపచారాన్ని మరచిపోడానికి ప్రయత్నించేవాడు.

తమ్ముడు కేసు వుపసంహరించలేదు. వాదనల వరకూ వస్తే వంశమర్యాద భస్మమైపోతుంది. అన్నయ్య తమ్ముడు కల్పించిన నేరాలకన్నిటికీ ఒప్పుకున్నాడు. నగ లమ్మి పరువునష్టానికి పరిహారం కట్టాడు. యీ గృహకలహానికి యిదే యెదురుగా కనుపించే కారణం!

౮

లోకులు చేతు లెత్తి నీది తప్పని చూపించకుండా తనే స్వయంగా వెళ్లి తమ్ముని పిలిచాడు మృత్యుముఖంలో వున్న తండ్రిని చూడటానికి రమ్మని. రాలేదు సరికదా, తను భరించలేకపోతే తనయింటికి పంపించమన్నాడు. యీమాటలు నిండుచూలాలు రాధకూ, అల్లునికీ కష్టాన్ని కలిగించాయ్. కాని, ఆ రాతకునిదగ్గర ఆ వడిలో యెదురాడే ధైర్యం వారికి లేకపోయింది.

తనూ స్మశానానికి వెళ్లాడు. తనూ తనయింట్లో శ్రాద్ధం చేశాడు. తనపని అంతా తనకు తిన్నగానే వుంది. యింట్లోవారే హర్షించలేకపోయారు. ఎందుకీ ద్వేషం? కొందరు కళ్లు తెరిచి చూస్తారుగాని, నిదానం అలవరచుకోరు. ఎదురుగా వున్న గోముఖ వ్యాఘ్రాన్ని గోవు అనుకుంటారు. గట్టివాళ్లమని గెంతే యీరకంవాళ్లను యెలా కబళించటమో ఆ వ్యాఘ్రానికి తెలుసు!

తండ్రి చెప్పిన మాటలయందు విశ్వాసం వుంది ఐనా దేవుళ్లకు మ్రొక్కటం మానలేదు. రత్నమణి విషాక్తమయిన హృదయాన్ని మామయ్యగారి తదనంతరం మధుసిక్తం చేయవలసివచ్చింది. చెయ్యక విధిలేదు. ఇక యెవరిమీద ఆ విషబిందువుల వర్షం కురిపిస్తుంది? భర్తమీదనా? నన్ను బ్రతకనీయ్ అంటాడు. తండ్రిని తలుచుకొని చిన్నపిల్లాడిలా కన్నీరు కారుస్తాడు. లాలించవలసిన భార్య యింకేం కోపాన్ని చూపిస్తుంది?

'రాధను ఆస్పత్రిలో వేశారు. చాలా కష్టపడుతోంది. వెళ్దామా?' అని భార్యఅనుమతిని కోరాడు. త్రోవలో 'రత్నం! రాధంటే నీకు ప్రేమకదూ. అలాంటి మంచి కూతురుకు యెలాంటి ఆపద వచ్చిందో. నాన్న చెప్పారు. దాని ప్రాణానికి యేం అపాయం వుండదు' అన్నాడు వకీలు భార్యతో. ఆసుపత్రిలో పెద్దక్కా అని పరుగెత్తబోయాడు కుర్రవాడు. కొద్ది నిముషాలలోనే పెద్దక్కకు పాపాయి పుట్టిందని గంతులేశాడు.

శివాలయంలో అన్నదమ్ములు ఒకేనాడు యెదురవవలసివచ్చింది. అన్న ముఖం కళగా వుంది. తమ్ముని ముఖం ధుమధుమలాడుతోంది—కుమార్తెకు లేకలేక కలిగిన సంతానం ఆడపిల్ల అవటంచే ఆశాభంగం కలిగింది. రాధ పెదనాన్నను, రత్నమ్మను విడువలేకపోయింది. ఆమెకోసమేగా యీ పూజాపురస్కారాలన్నీ.

నాలుగు నెలలు గడిచాయ్. మా ముఖం చూచైనా క్షమించమని రాధ భర్తతో వచ్చి రత్నమ్మను, పెద్దనాన్నను బ్రతిమాలింది. ఒకేఒక పుత్రునిమీదనున్న ప్రేమకొద్దీ రత్నమ్మ గట్టిగా యేడ్చింది. న్యాయవాది ముఖంలో చిరునగవే తాండవిస్తోంది. వాళ్ల నద్దేశించి అన్నాడు:

'కాబోయే పెళ్లాన్ని చూడాలన్న ఆశతో మనవాడు దొంగతనంగా యెందుకు వెళ్లాడు?'

గాయాలకు కట్టిన కట్లతో వున్న కుర్రవాడికి తెలివివచ్చి కళ్లు తెరవగా కనపడ్డ రాధను 'పెద్దక్కా' అని ప్రేమవుట్టిపడే స్వరంతో కేకవేశాడు. రాధ తమ్మునిదగ్గర కూర్చుంది. తమ్ముడు, యింటికి రావద్దని మందలించినా దొంగతనంగా వెళ్లి పెద్దక్క కూతురు రోహిణి వుయ్యాలదగ్గర కూర్చొని వూసులాడేవాడు. కాని ఆనాడు మెట్లు దిగుచుండెగా చిన్న నాన్నకు దొరికిపోయాడు. ఆయన వేసిన కేకకు హడలిపోయి మెట్లమీదనుంచి క్రిందికి దొర్లాడు. గాయాలు తగిలాయ్.

న్యాయవాది తాతయ్యకోరకను యెఱుకపరిచాడు. 'దాని వయసెంత నాన్నా. అయినా కాదనటానికి మానో రెలా వస్తుంది?' అని ముక్తసరిగా తేల్చింది రాధ పొంగిపొరలే ఆనందాన్ని కప్పిపుచ్చటానికి ప్రయత్నిస్తూ.

యీ సంఘటన జరిగిన పదిహేనేండ్లతరువాతి విషయం: ఇంటియజమాని కళ్లుకప్పి దాచిన డబ్బుతో కొన్న కారులో ఆ యజమానికొడుకు స్వేచ్ఛగా తిరుగుతున్నాడు భార్య రోహిణితో. దాచిన గుర్రపు కాసులతో చేయించిన నగలు అన్నయ్యకోడలి ఒంట నున్నాయ్. అన్నయ్య చేతులారా ధనం వెచ్చించి కట్టించిన మేడలో అన్నయ్యకొడుకుదే సర్వాధికారం. తమ్ముడు విద్వేషాన్ని పెంచి న్యాయానికి కట్టుబడక ఆర్జించిన ఆస్తిపాస్తులకు వారసుడు అన్నయ్యకొడుకే అయ్యాడు.

ఒకనాడు వెలిగే ప్రపంచం యీనాడు ఆయన కంటికి గాఢాంధకారం. ఒకరోజు ఆనందసముద్రములో మునిగిపోయినవాడు యీరోజు శాశ్వతమనఃక్లేశంతో కూర్చుంటాడు రెప్పలు ఆడిస్తూ. తెల్లవారేక స్నానం చేయించి, తూరుపుదిశ మోము త్రిప్పి భార్య కూర్చోపెడితే, చేతు లెత్తి సూర్యభగవానునకు నమస్కరిస్తాడు. నేత్రదానం చేయమని కామెనుం-కొలవకమున ముకూచి వలన గ్రుడ్డివాడైన తమ్ముడు. ఆ దృశ్యాన్ని చూచి అన్నయ్య విచారిస్తాడు. రాధా, రోహిణీ కళ్లంట నీరు తెచ్చుకుంటారు.

కాలం శాసించిన శాసనాన్ని ధిక్కరించే తాహతు మానవునికి లేదు. అనవసరవిద్వేషాన్ని పెంచినవాడు న్యాయానికి కట్టుబడలేదు. న్యాయానికి కట్టుబడలేనివాడు దుర్బలుడు. వానికి పరాజయం తథ్యం!

ఇష్టియాగము - దర్శపూర్ణమాసలు

శ్రీ నిర్వికల్పానందస్వామి

ఇష్టియాగం శ్రౌతయజ్ఞశ్రేణిలో చేరుతుంది. ఆహితాగ్ని* అయిన ప్రతిగృహస్థూ అన్ని అమావాస్యల్లోనూ, పూర్ణిమల్లోనూ ఒక ఇష్టియాగాన్ని చెయ్యాలి. యావజ్జీవమూ చెయ్యాలనే విధి. లేకపోతే, అధమపక్షం ముప్ఫయియేళ్లైనా ఆచరించాలి. అమావాస్యనాడు ఆచరింపబడేది దర్శయాగం; పూర్ణిమనాడు చెయ్యబడేది పూర్ణమాస యాగం. ఈ రెండున్నూ ఇష్టియాగాలే. ఈ రెంటికిన్నీ విధివిధానాలు ప్రాయికంగా ఒకేమాదిరి. ప్రస్తుతం కేవలం పూర్ణమాసానుసరించే పద్ధతుల్లో చూద్దాం. దీన్ని గ్రహిస్తే సమస్తఇష్టియాగవిధానాలూ అవగతం అవుతాయి. యాజ్ఞికపరిభాషలో ఈ పూర్ణమాస ఇష్టియాగాలన్నిటికీ ప్రకృతి—మోడల్. మిగిలిన ఇష్టియాగాలన్నీ దీనికి వికృతులు. ఈ పూర్ణమాస యాగవిధులన్నీ మిగిలిన ఇష్టియాగాల్లో ప్రయోగింపబడితీరాలి. అయితే, కొన్నిటిలోమటుకు విశేషవిధు లుంటాయి.

పురోడాశం :

పూర్ణమాసయాగంలో ప్రధానాహుతులు రెండు. ప్రథమాహుతి అగ్నిదేవతకు. ఆహుతి ఇయ్యబడే ద్రవ్యం పేరు పురోడాశం. ఇది యవలతోగాని, బియ్యంతోగాని చెయ్యబడే రొట్టెముక్క; రుబ్బి నిప్పులో కాలిస్తే ఇది తయారవుతుంది. దీన్ని అధ్వర్యుడు తయారుచెయ్యాలి. సుప్పెటతో కొన్ని సుప్పెట్లు వ్రీహిధాన్యాన్ని గాని, యవధాన్యాన్ని గాని తీసికొని, ఉలూఖలంలో పోసి దంచాలి. తర్వాత చేటలో పోసి, ఊక చిట్టూ తవుడూ మొదలైనవాటిని చెరిగివెయ్యాలి. పిదప రుబ్బి పిష్టానికి అనుకూలంగా చేసి, నిప్పుమీద కాల్చాలి. ఇట్లా తయారైందే పురోడాశం. సెగమీద కాల్చటానికి చిన్నచిన్న మట్టిమూకుళ్లు—కపాలాలు—ఉంటాయి. ఇవి చతుష్కోణాకారంలో ఉంటాయి. కొన్నిటిని అంచులు విరగగొట్టి, ఒకపిడి పెట్టి అర్ధవృత్తాకారంగా మార్చుకోవాలి.

అష్టకపాలం :

చతుష్కోణకపాలాన్ని మధ్యలో పెట్టి, దానికి నలువైపులా అర్ధవృత్తాకారంగామార్చుకొన్న కపాలాల్ని మధ్య సందులేకుండా అమర్చుకోవాలి. అగ్నిదేవతాకమైన ప్రథమపురోడాశంనిమిత్తం ఈరీతిగా ఎనిమిది కపాలాల్ని సర్దాలి. ఇదే అష్టకపాలపురోడాశం. ప్రథమాహుతి.

ఏకాదశ కపాలం :

ద్వితీయపురోడాశం అగ్నీషోములకు. పదకొండు కపాలాలు కావాలి. అందువల్ల ఇది ఏకాదశకపాలపురోడాశం.

గార్హపత్యాగ్నితోనే ఈ కపాలాల్ని వేడిచేసి, రుబ్బుడుపిండిని నీట్లో పోసి, ఈ గార్హపత్యాగ్ని కపాలాలమీదనే రొట్టె కాల్చాలి. రొట్టె కాంగానే నెయ్యి రాచి, వేదిమీద యథాస్థానంలో ఉంచాలి.

---

* ఆగష్టు, సెప్టెంబరు సంచికల్లో వెలువడిన 'అగ్నిహోత్రము-అగ్న్యాధానము' అనే వ్యాసంలో ప్రాచీనవైదికసమాజంలో ఉన్న బ్రహ్మచర్యాశ్రమ విధానాన్ని వర్ణించి, గృహస్థుని ఆహితాగ్నిగా చేశాను. ఇది తదనంతరకృత్యం. క్రమంగా, పశుయాగ, సోమయాగ, క్రైస్తక-యాగ, పురుష-యజ్ఞాల్ని, సన్న్యాసాన్ని వర్ణించి, ఆ సంఘతత్త్వాన్ని విశదం చెయ్యటమే ఈ వ్యాసాల ప్రయోజనం. పూర్వవ్యాసంలో వివరింపబడ్డ గ్రంథాలే అంతకీ ఆధారం.

నిర్దిష్టసమయంలో ఈ పురోడాశాన్ని ఆహుతి చెయ్యాలి. ఇదంతా అధ్వర్యుడి పని. పనిలో ప్రతి అంశానికీ విహితమైన యజుర్మంత్రాలున్నాయి.

ఇది ప్రధానయాగవిషయం. ఈ యాగానికి పూర్వమున్నూ, తర్వాతా చెయ్యాల్సిన అప్రధాన యాగాలు కొన్ని ఉన్నాయి. ఇవి కర్మాంగాలు. కొన్ని హోమాలుకూడా ఉన్నాయి.

యాగం, హోమం : ❖

యాగానికీ, హోమానికీ తేడా ఉంది. యాగంలో ఆహుతి ఇచ్చేది అధ్వర్యుడు; మంత్రాల్ని పఠించేది హోత. మంత్రాంతంలో ఉచ్చరింపబడే 'వౌషట్' శబ్దమే వషట్కారం. ఈ వషట్కారోచ్చారణకాలంలోనే అధ్వర్యుడు అగ్నిలో ఆహుతుల్ని వ్రేలుస్తాడు. ఈ క్రమంతో కూడింది యాగం.

హోమరీతి ఇంతకంటేకూడా సంక్షిప్తం. దీనికి హోతతో పనిలేదు. అధ్వర్యుడు అగ్ని పార్శ్వాన ఆసీనుడై, తనే యజుర్మంత్రాల్ని చదువుతాడు. మంత్రాంతాన 'స్వాహా'శబ్దాన్ని ఉచ్చరిస్తాడు. ఇదే స్వాహాకారం. స్వాహాకారోచ్చారణకాలంలో అగ్నిలో ఆహుతిని వేస్తాడు. ఇది హోమక్రమం.

పూర్ణమాసకు పూర్వాపరంగా చెయ్యాల్సిన యాగహోమాల్ని గురించి యథాక్రమంగా వర్ణింపబడుతుంది.

ఋత్విక్కులు నల్గురు : ❖

అసలు పూర్ణమాసకు నలుగురు ఋత్విక్కులు కావాలి. యజుర్వేదాభిజ్ఞుడైన అధ్వర్యుడి అవసరం పైనే చూచాం. ఈ యాగంలో, చెప్పాలొస్తే, ఈయనే ప్రధానం. అధ్వరశకటనిర్వాహకుడు. రెండో ఆయన హోత. ఈయన ఆహుతికి పూర్వం మంత్రాల్ని పఠించి దేవతల్ని యజ్ఞభూమికి తీసుకొస్తాడు. ఈయన పఠించేవి ఎక్కువగా ఋఙ్మంత్రాలే (ఇష్టియాగంలో సామగానం చేసే ఉద్గాతతో ప్రయోజనం లేదు.). మూడవ ఆయన బ్రహ్మ. హోతాధ్వర్యుల కార్యక్రమాన్ని పర్యవేక్షించటమే ఈయనపని. పొరపాటు వస్తే దిద్దుతాడు. నాల్గవ ఆయన అగ్నీత్తు—బ్రహ్మకు సహకారి. ఈ నల్గుర్నీ కూడదీసికొనే పూర్ణమాసయాగాన్ని ఆరంభించాలి.

వ్రతగ్రహణం : ❖

యాగానికి పూర్వదినం అపరాహ్ణపూర్వాహ్ణ సమయాల్లో చెయ్యాల్సిన క్రియలు రెండున్నాయి. అవి వ్రతగ్రహణ, అన్వాధానాలు. పూర్వాహ్ణంలో యజమాని గార్హపత్య, ఆహవనీయ, దక్షిణాగ్నుల్లో క్రమంగా ఒక్కొక్క సమిత్తు వేసి, అగ్నిని యజ్ఞసకూలం చేస్తాడు. నేను రేపు యాగం చేస్తాను, సిద్ధంగా ఉండుసుమా అని అప్పుడే అగ్నికి చెప్పి ఉంచుతున్నా నన్నమాట. అపరాహ్ణం క్షురకర్మ చేసుకొని, స్నానం చేసి, కొంచెం ఏమైనా తింటాడు. తర్వాత అగ్నికి పక్కగా నిల్చి, నేను సత్యాన్నే పల్కుతాను మొదలుగాగల కొన్ని నియమాల్ని పాలించటానికి ప్రతిజ్ఞాబద్ధుడవుతాడు. ఇది వ్రతగ్రహణం. పత్నీసహితంగా రాత్రి యజ్ఞశాలలోనే గడపాలి.

వరణం : ❖

మరునాడు నిత్యాగ్నిహోత్రకర్మానంతరం ఇష్టియాగం ప్రారంభంచెయ్యాలి. ప్రథమం బ్రహ్మవరణం. వరణానంతరం బ్రహ్మ ఆహవనీయానికి దక్షిణంగా ఆసనాన్ని స్వీకరించి, కర్మ నంతటినీ పర్యవేక్షిస్తాడు. బ్రహ్మకు వామభాగం యజమాని కూర్చుండే చోటు. యజమానపత్ని గార్హపత్యానికి దక్షిణంగా అధివసిస్తుంది. ఆవిడ గృహిణి అయినందువలన గార్హపత్యంతోనే విశేషసంబంధం. వేదికి ఉత్తరంగా హోతా అగ్నీత్తులు ఉంటారు. అధ్వర్యుడికి యాగకాలంలో కూర్చుంటానికి వీలుండదు. దీనికీ దానికీ కదుల్తూ ఉండాలి.

ప్రణీత : ❖

వరణానంతరం బ్రహ్మ స్వస్థానాన్ని అలంకరించిన తర్వాత, ప్రణీతా—ప్రణయనకర్మ, ప్ర-అనే ఉపసర్గకు అర్థం సమ్ముఖం; అనగా పూర్వముఖం. ప్ర-నయనశబ్దార్థం పూర్వముఖంగా తీసికో

పోవటం — కావిని నీళ్లు పూర్వముఖంగా తీసికోవల్లి, ఆహవనీయానికి పక్కగా ఉంచాలి. వేదికి తూర్పుగా ఆహవనీయం ఉండాలి. ఈ నీటిపేరు ప్రణీత. యాగం ముగిసేవరకూ ఆ నీరు అక్కడే ఉండాలి, యజ్ఞరక్షణార్థం. "జలం అసురులకీ, రాక్షసులకీ వజ్రం. దీన్ని చూస్తే వాళ్లు యజ్ఞభూమికి రారు" అని శతపథ బ్రాహ్మణం.

వస్తువుల పద్దు : ❖

ఈలోగా అధ్వర్యుడు యజ్ఞానికి కావాల్సిన వస్తువులన్నిటినీ సంపాదించి, చక్కగా పేర్చి కూర్చుకొంటాడు. యథాసమయంలో వాటిని వేది మీద అమరుస్తాడు. ఇష్టియాగానికి కావల్సిన వస్తువులు చాలా ఉన్నాయి. అన్నిటినీ కాకపోయినా, కొన్నిటినయినా తెల్సుకోవాలి.

(౧) మూడుసమిత్తుల్తో ఆహవనీయాగ్నిని చుట్టాలి. ఈ సమిత్కాష్ఠానికి సంజ్ఞ పరిధి. యాగానికి పూర్వం అగ్నిని ప్రజ్వలింపజేయటానికి వేరుగా కొన్ని సమిత్తులు ఉంచుకోవాలి. ఈసమిత్కాష్ఠాన్ని యాజ్ఞికులు సమింధనం అంటారు. అధ్వర్యుడు ఒక్కొక్క సమిత్ఖండాన్ని ఆహవనీయంలో వేస్తాడు. హోత ఒక్కొక్క ఋక్-మంత్రాన్ని చదువుతూఉంటాడు. అగ్నిసమింధనానికి ప్రయుక్తాలయ్యే ఈమంత్రాల్ని సామిధేనిమంత్రా లంటారు.

(౨) దర్భపరకలు కొన్నిటితో పనిపడుతుంది. వేదిమీద వీటిని పరిచే యజ్ఞద్రవ్యాల్ని ఉంచాలి. కొన్నిపరకల్ని కలిపి కట్టాలి. ఇల్లా కట్టబడినదాని పేరు ప్రస్తరం. ఆహుతిసాధనమైన జుహువును ఈ ప్రస్తరంమీదే ఉంచాలని నియమం.

(౩) పూర్ణమాసయజ్ఞంలో ప్రధానయాగానికి ఆహుతి పురోడాశం. పూర్వాపరాల్లో చెయ్యబడే అప్రధానయాగాల్లో ఆహుతిద్రవ్యం ఆజ్యం. ఈ ఆజ్యం ఉంచబడే మూకుడే ఆజ్యస్థాలి. ఆజ్యాన్ని తీసికొంటానికిగాను నాల్గు కఱ్ఱగరిటెలు కావాలి. ఒకదాని పేరు ధ్రువం. వేదిపైన ఇది స్థిరంగా ఉంటుందికాబట్టే దీని కీ పేరు. ఆజ్యస్థాలినుంచి ఆజ్యాన్ని ఈ ధ్రువంలో పొయ్యాలి. యాగకాలంలో దీంట్లోనుంచే ఆజ్యాన్ని తీసికోవాలి. ఇల్లా తీసికొంటానికి ఉపయోగింపబడే చమ్చాపేరు స్రువం. ఇంకో పెద్ద గరిటె ఉంటుంది; దాని పేరు జుహువు. ఆహుతిసమయంలో అధ్వర్యుడు స్రువంతో ధ్రువం నుండీ ఆజ్యాన్ని తీసి, జుహువులో పోస్తాడు. నాల్గో గరిటెపేరు ఉపభృత్తు. ఇది జుహువుకంటె చిన్నదిగా ఉంటుంది. యజ్ఞసమయంలో అధ్వర్యుడు దక్షిణహస్తంతో జుహువునూ, వామహస్తంతో ఉపభృత్తునూ పట్టుకొంటాడు. ఉపభృత్తు జుహువుకు నిమ్నంగా ఉండాలి. జుహువులో ఉన్న ఆహుతి ద్రవ్యం నేలమీద పడకూడదు. దైవాత్తుగా పడితే, ఉపభృత్తులోనే పడుతుంది.

(౪) పురోడాశాన్ని తయారుచెయ్యటానికి గాను కొన్ని వస్తువులు కావాలి. నిత్యాగ్నిహోత్రంలో ఉపయోగింపబడే అగ్నిహోత్రహవణి. ఇష్టియాగంలో ఇది ధాన్యాన్నిగాని, యవల్నిగాని తీసికొనిరావటానికి పనికి వస్తుంది. ఉలూఖలముసలాలు : ఆ ధాన్యాన్ని రోట్లో వేసి రోకల్తో దంచాలి. శూర్పం : దంచినదాన్ని చెరగటానికి చేట. దృషదుపలాలు: రాతిపలకమీద ఆధాన్యాన్ని వేసి పొత్రంతో దాన్ని నూరాలి. శమ్య మనబడే కాష్ఠఖండం : దీన్ని రుబ్బేటప్పుడు కింద పెడ్తే పలక ఏటవాలుగా ఉండి, నూరటానికి వీలవుతుంది. కృష్ణాజినం: నల్లలేడిచర్మం. దంచేటప్పుడు ఉలూఖలానికి కిందా, నూరేటప్పుడు సన్నికల్లుకుకిందా దీన్ని పరచాలి. ఈ ఆరువస్తువులూ లేకపోతే పురోడాశాన్ని తయారుచెయ్యటానికి వీల్లేదు.

అంతా సిద్ధం : ❖

అధ్వర్యుడు వేదిమీద ఈ సరంజామా నంతట్నీ పరచిన దర్భలమీద ఉంచుతాడు. తర్వాత యాగం కోసం ఆహవనీయాగ్నిని బాగా మండించాలి. దీని పేరే అగ్నిసమింధనం అని పైనే చెప్పాను.

వస్తువుల నన్నిట్నీ సమకూర్చుకోటం అయింది. పురోడాశం తయారై వేదిమీద యథాస్థానాన్న

సుంది. ఆహవనీయాగ్ని జ్వలిస్తోంది. ఇంక దేవతల్ని ఆహ్వానించటమే తరవాయి. ఈ పిలవటం హోతపని.

దేవతాహ్వానం:

కాని, హోత సామాన్యమానవుడు. అతడు పిలిస్తేమటుకు దేవతలు ఎందుకు పల్కాలి? అగ్ని స్వయంగా దేవతల హోత. (అగ్నిం ఈళే పురోహితం, యజ్ఞస్య దేవం ఋత్విజం, హోతారం రత్నధాతమమ్, ఇత్యాది చూ.) అందువల్ల ఆయన్ని ఆ పనికి వినియోగించాలి. మళ్లా, అగ్ని నెవరు పిలవాలి? హోతాధ్వర్యులిద్దరున్నూ. వీళ్ల ఆహ్వానాన్ని మటుకు అగ్ని ఎందు కంగీకరించాలి? ఎందుకు వినాలి?

ప్రాచీనఋషులు మంత్రద్రష్టలు. అలౌకికశక్తి వల్ల లభించిన మంత్రాల్తో వాళ్లు అగ్నిని పిల్చేవాళ్లు. అది అగ్నికి వినిపించీ వినిపించటంతోనే, ఆయన కదలివచ్చేవాడు. ఎవరిమటుకు వాళ్లు వాళ్లవాళ్ల అగ్నినే పిల్చుకొనేవాళ్లు. ఆయా ఋషుల అగ్ని పేరు ఆర్షేయాగ్ని. ప్రవరాగ్ని అని ఇంకో పేరు. దేవతాహ్వానంకోసం చేసిన హోతృకరణం పేరు ప్రవరణం. ఈ యజమాననియుక్తహోత సామాన్యమానవుడు. కాని, అగ్ని దేవహోత. ఈ దేవహోతనుకూడా ప్రవరణం చెయ్యాలి. యజమానగోత్రప్రవర్తకులైన ప్రాచీనఋషుల పేరు చెప్పి పిలిస్తే, ఆ అగ్నికి ఆ పిలుపు అందుతుంది. అందువల్ల మొదట్లో ఆయా ఋషుల నామాల్ని అనుసరించి దేవహోతను పిల్చి, పిదప ఆ అగ్నికి ప్రతినిధిగా, మానవహోతను వరించాలి. ఈరీతిగా నియుక్తుడైన మానవహోత ఆ పూర్వఋషుల అగ్నిని ఆహ్వానిస్తాడు. ఈ అగ్ని దేవతనే దేవతాహ్వానంకోసం అనురోధిస్తాడు. వరణానంతరం హోత వేదికి ఉత్తరంగా కూర్చుంటాడు.

మనకు యజ్ఞోపవీతం అంటే గౌరవంపోయింది. కోటులాగా దాన్ని చిలక్కొయ్యకు తగిలించి ఇతర పనులు చూసుకొనే మహానుభావులు ఉన్నారు. మళ్లీ వాటికి ఇనప్పెట్టెతాళంచెవులు కోడించి నవీనంగా యజ్ఞోపవీతంయొక్క ఉపయోగిత్వాన్ని నిరూపించిన మహాశయులూ ఉన్నారు. వాళ్లలో ప్రవర చెప్పలేనివాళ్లూ, అసలు ప్రవరం టే ఏమిటో తెలియని వాళ్లూ ఉన్నారు. ౧౯౫ కోట్ల సంవత్సరాల్నించి వీటి కున్న మర్యాద మన తరంలో పోతుంటే, మనం నిర్లిప్తతతో చూస్తూఊరుకోటం మన సంస్కృతికే పరాభవం. ఒక శతాబ్దం పోయాక, మళ్లీ ప్రవరలకోసం రీసెర్చి చెయ్యాల్సిన ప్రారబ్ధం తగలకుండా ఉండేందుకు, ఇప్పుడే వాటిని ఎవరైనా శ్రమతీసికొని గ్రంథస్థంచేస్తే బాగుంటుందని ప్రాసంగికంగా ఉత్సాహపరులకు మనవి చేస్తున్నాను. ఇది ప్రసంగాంతరం. ఇక ప్రకృతానికి మరలుదాం.

హోత ఆసీనుడైనతర్వాత యాగం ఆరంభం. ఒక్కొక్కయాగాన్ని గురించి విచారిద్దాం.

ప్రయాజ:

(౧) ప్రధానయాగానికి ముందుగా చెయ్యాల్సింది ప్రయాజయాగం. ఆహుతిద్రవ్యం ఆజ్యం. అధ్వర్యుడు ఘృతంద్వారా మొదట్లో ఆఘారహోమం చేసి దీన్ని చేస్తాడు. ఐదుగురు దేవతల్ని ఉద్దేశించి ఐదు ఆహుతులు. దేవతల పేర్లు మనకు ఇప్పుడు విచిత్రంగా ఉండొచ్చు. వారి పేర్లు: సమిత్-దేవత, తనూనపాత్-దేవత, లేక యజమానిగోత్రభేదా న్ననుసరించి నరాశంస-దేవత, ఇడా-దేవత, బర్హి-దేవత, స్వాహాకార-దేవత.

ఆజ్యభాగం:

(౨) ఈ పంచప్రయాజానంతరం అగ్ని నుద్దేశించి ఒకసారి, సోముణ్ణి ఉద్దేశించి ఒకసారి ఆజ్యాహుతి ఇవ్వాలి. దీని పేరు ఆజ్యభాగదానం.

ఉపాంశుయాగం:

(౩) ఆజ్యభాగదానంతర్వాత ప్రధానయాగం. అగ్ని నుద్దేశించి ప్రథమపురోడాశం. అగ్నినీ, సోముణ్ణీ ఉద్దేశించి ద్వితీయపురోడాశదానం. ఈ రెంటికీమధ్య అగ్నిసోములకు కొంచెం ఘృతాహుతి.

ఈ ఘృతాహుతిసమయంలో మంత్రపాఠం అనుచ్చస్వరంలో జరుగుతుంది కాబట్టి దీని పేరు ఉపాంశుయాగం.

స్విష్టకృత్తు :

(౮) అనంతరం స్విష్టకృత్-యాగం. రెండు కపాలాల్లో ఉన్న పురోడాశాన్ని అంతటినీ ఆహుతి చెయ్యకూడదు. కొంచెం మిగల్చాలి. దీంట్లోంచి కొంచెం కోసి, తీసికొని అగ్ని-స్విష్టకృత్తు నుద్దేశించి ఆహుతివ్వాలి.

అగ్ని-స్విష్టకృత్తు రుద్రదేవతాకము. ఈ రుద్రదేవత అంటే ఎంతో భయం. ఇతని బాణాలంటే చెప్పలేనంత భయం. స్పష్టంగా ఇతనిపేరు ఉచ్చరించటానిక్కూడా జంకే. ఉగ్ర,భీమ, కపర్దిశబ్దాలీ భయానికే సూచకాలు. ఇతన్ని సంతోషింపజేయటానికే శంకరు డనే పిలుపు. వేదంలోని ఇతర దేవతలకీ, ఇతనికీ ఎంతో తేడా ఉంది.

ఒకప్పుడు దేవతలు ప్రార్థిస్తే, ఈయన ప్రజాపతిఅంతటివాడిమీద బాణాల్ని విసిరాడు. దానికి దేవత లెంతో సంతోషించి, పశుగణానికి ఈయన్ని అధిపతిగా చేశారు. అప్పటినుంచీ ఈయన పశుపతి.

పూర్వం ఈయనకు యజ్ఞభాగాల్లో పాలు ఉండేది కాదు. ఒకసారి ఈయన బలవంతంగా యజ్ఞభాగాన్ని గ్రహించాడు. అప్పట్నించే ఈ స్విష్టకృత్-యాగం ఆరంభమైంది. ఈ యాగంలో ఇయ్యబడే ఆహుతిని రుద్రుడే అగ్ని-స్విష్టకృత్ రూపంలో గ్రహిస్తున్నాడు.

ఇక్కడే దక్షయజ్ఞసంబంధమైన పౌరాణిక గాథను స్మరించుకోవాలి.

అనుయాజ :

(౯) స్విష్టకృద్యాగంతర్వాత అనుయాజ-యాగం. ప్రధానయాగానికి పూర్వం ప్రయాజ-యాగం ఉన్నట్టు, అనంతరం ఈ అనుయాజ. ప్రయాజకు పంచదేవతలు. కాని, అనుయాజకు దేవతలు ముగ్గురే. ఈ అనుయాజదేవతలపేర్లు: బర్హి, నరాశంస, అగ్నిస్విష్టకృత్తులు. ఆహుతిద్రవ్యం ఆజ్యం.

సామాన్యనియమక్రమం :

ఈ ప్రధానాప్రధానయాగాల్ని చేసేనిమిత్తం కొన్ని సాధారణనియమా లున్నాయి. అధ్వర్యుడే యాగకర్త. హోత ఆహ్వానకారి. ఆహవనీయంలోనే ఆహుతిసమర్పణ. అధ్వర్యుడి ఆసనం ఆహవనీయానికి ఉత్తరంగా. అక్కడే ఆయన నిలబడి ఉండాలి. ఏ యాగంలోనైనా సరే, ఆయన దక్షిణహస్తంతో జుహువును, వామహస్తంతో ఉపభృత్తును పట్టుకొని, వేదికి ఉత్తరంనుంచి దక్షిణంగా వస్తాడు. అక్కడ నిలబడి అగ్నీత్తును ఆదేశిస్తాడు: "ఓం శ్రావయ". అంటే దేవతల్ని మంత్రాల్ని వినమని ప్రార్థించు. ఈ అగ్నీత్తు వేదికి ఉత్తరంగా నిలబడతాడు, చేత్తో ఒక కఱ్ఱకత్తిని పట్టుకొని. ఈ కఱ్ఱకత్తిపేరు 'స్ఫ్యం'. ఆయన జవా బిస్తాడు: "అస్తు శ్రౌషట్". అంటే, మంచిది, దేవతలు వింటున్నారు అని. అప్పుడు అధ్వర్యుడు హోత కాదేశిస్తాడు, దేవతల్ని ఆహ్వానించమని. హోత రెండు మంత్రాలు చదవాలి. ఒకటి అనువాక్యం—ఇది ఋక్‌మంత్రం. ఈ మంత్రంవల్ల దేవతల్ని అనుకూలంగా చేసుకొంటున్నారు. ద్వితీయ మంత్రం యాజ్యం. ఇది కొన్నిపట్ల ఋక్కు; కొన్ని పట్ల యజుస్సు. ఇదే యాగమంత్రం. కనుకనే యాజ్యం. దేవత అగ్ని అనుకొందాం. అప్పుడు హోత మంత్రపాఠాన్ని "యే యజామహే అగ్నిం దేవమ్" అని ఆరంభిస్తాడు. దీని పేరు ఆగూః-మంత్రం. తర్వాత 'యాజ్య'మంత్రాన్ని చదివి "అగ్నే వీహి వౌషట్"—అగ్ని దీన్ని భక్షించి దేవతలదగ్గరకు తీసికోవెళ్లును గాక అని అంటాడు. ఈ వౌషట్ ఉచ్చారణే వషట్కారం. ఈ వషట్కారం ఉచ్చారితమవుతూ ఉన్నప్పుడే అధ్వర్యుడు ఆహుతిద్రవ్యాన్ని—అది పురోడాశమే కాని, లేక ఆజ్యమే కాని—అగ్నిలో వేస్తాడు. యజమాని ఆహుత్యనంతరం "ఇదం అగ్నయే న మమ"—ఈ ద్రవ్యాన్ని అగ్ని కర్పించాను, ఇది నాది కాదు అని త్యాగమంత్రాన్ని ఉచ్చరిస్తాడు. దేవతల్ని ఉద్దేశించి చెయ్యబడే ద్రవ్యత్యాగమే యాగం, లేక యజ్ఞం. యజమాని ఇప్పుడు ఇల్లాంటి త్యాగాన్ని చేశాడు. త్యాగమంత్రపఠనం అయింతర్వాత అధ్వర్యుడు స్వస్థానానికి తిరిగివస్తాడు.

ప్రతియాగానికీ ఇదే సాధారణవిధి.

హవిర్భక్షణ :

కార్యక్రమంలో ఇక మిగిలిపోయింది హవిశ్శేషభక్షణ. ఇది కాకపోతే ఏ యజ్ఞమూ సంపూర్ణం కాదు. పురోడాశాన్ని అంతా ఆహుతి ఇయ్యకూడదు. కొంచెం మిగిలేట్టు చూడాలి. యజమానీ, ఋత్విక్కులూ దీన్ని భక్షిస్తారు. మిగిలిన పురోడాశాంశాన్ని దీనినిమిత్తం కొన్ని ముక్కలుగా భాగిస్తారు. ఒకదాని పేరు ప్రాశిత్రం ; దీన్ని బ్రహ్మ భక్షిస్తాడు. ఇంకోదాని పేరు షడవత్తం ; ఇది అగ్నీత్తుకు చెందుతుంది. ఇంకో ఖండాన్ని మళ్లా నాల్గుముక్కలు చేసి, అధ్వర్యు, హోత, బ్రహ్మ, అగ్నీత్తులు నల్గురూ భక్షిస్తారు. ఇంకో రెండుముక్కలు మిగుల్తాయి. అంతా ముగిశాక బ్రహ్మ, యజమానీ దాన్ని భక్షిస్తారు.

ఇడాభక్షణ :

ఈ పురోడాశఖండాల్లో కొన్నిటిని ఘృతాక్తం చెయ్యాలి. వీటిపేరు ఇడ. యజమాని, నల్గురు ఋత్విక్కులూ కలిసి దీన్ని భక్షిస్తారు.

అసలు హవిశ్శేషభక్షణే చాలా ముఖ్యం. అందులో మళ్లీ ఈ ఇడాభక్షణ మరీ ముఖ్యం.

ఈ ఇడలో ఒక భాగాన్ని, మళ్లీ వేరుగా హోత తింటాడు. దీని పేరు అవాంతర-ఇడ.

ఈ హవిశ్శేషభక్షణానుష్ఠానం స్విష్టకృత్తు యాగానికి తర్వాత, అనుయాజ-యాగానికి పూర్వం. కేవలం, బ్రహ్మ యజమాను లిద్దరూ యజ్ఞసమాప్త్యనంతరం తింటారు.

మనలో "స్విష్టకృత్తుగా కూర్చొని భోం చేశాడు" అనే వాడుకఉంది. హవిశ్శేషభక్షణ స్విష్టకృద్యాగానంతరం అవటంవల్ల ఈ వాడుక నిల్చిందేమో!

సమాప్తిక్రమం :

అనుయాజయాగంతో పూర్ణమాసయజ్ఞానికి సంబంధించిన ప్రధానానుష్ఠానాలు ఒకరీతిగా ముగిశాయి అనే చెప్పొచ్చు. ఇహ సమాప్తి.

ప్రస్తర మనబడే దర్భకట్టనుగురించి పైన వచ్చింది. ఈ కుశగ్రంథిని కేవలం గడ్డిపోచ లని తృణీకరించటానికి వీల్లేదు. దీంతో యజమానశరీరాన్ని ఏకంగా భావించాలి. అనుయాజయాగానంతరం ఈ ప్రస్తరాన్ని ఆహవనీయాగ్నిలో పడెయ్యాలి. ఇది కాలిపోతున్నప్పుడు యజమాని స్వర్గానికి వెడుతున్నట్టు. సంపూర్ణంగా దగ్ధమైతే, యజమాని స్వర్గంలో దేవతల్తో ఐక్యమైనట్టు. ప్రస్తరం కాలిపోతున్నప్పుడు, హోత అధ్వర్యుడి అనుజ్ఞతో కొన్ని మంత్రాల్ని చదువుతాడు. వీటి పేరు సూక్తవాక్కు. పూర్తిగా కాలిపోయినాక మరికొన్ని మంత్రాల్ని చదువుతాడు. వీటి పేరు శంయువాక్కు. ఇవి ఆశీర్వాద సూచకాలు.

పరిధి అనబడే సమిత్కాష్ఠఖండత్రయాన్ని గురించికూడా పైన చెప్పాను. మానవహోత దేవహోతను పిల్చుకొచ్చాడుకదా, ఆ దేవతహోత శరీరమే ఈపరిధి. ఇక వీటిని అగ్నిలో వెయ్యాలి. అప్పుడు దేవహోత యజ్ఞస్థలంనుంచి వెళ్లిపోతాడు.

సంస్రవం :

ఈ సమయంలో అధ్వర్యుడు విశ్వదేవతల నుద్దేశించి, కొంచెంగా ఆజ్యాన్ని ఆహుతి ఇచ్చి హోమం చేస్తాడు. దీని పేరు సంస్రవహోమం. ఇది యాగం కాదు, హోమం. దీంతో యజమానిఅనుష్ఠానం సమాప్తం.

పత్నీకృత్యం :

కాని, యజమానపత్ని చెయ్యాల్సింది ఉంది ఇంకా. ఇంతవరకూ ఆవిడ ఓపిగ్గా గార్హపత్యాగ్ని ప్రక్కగా కూచొని ఉంది. ఇంతవరకూ జరిగిన కర్మకలాపం అంతా ఆహవనీయంలోనే.

ఇప్పుడు బ్రహ్మగాక మిగిలిన ముగ్గురు ఋత్విక్కులూ యజమానపత్నిదగ్గరకు వచ్చి, గార్హపత్యంలో కొన్ని ఆహుతుల్ని వేస్తారు. ఆహుతి ద్రవ్యం ఆజ్యం. దేవతలు : సోముడు, త్వష్ట, దేవపత్నీగణం, అగ్ని-గృహపతి. గృహపతిఅయిన అగ్ని, దేవపత్నీగణమూ ముఖ్యంగా ఆహుతుల్ని పొందకపోతే, గృహిణి అయిన యజమానపత్ని సహిస్తుందా?

ప్రధానయాగానంతరం హవిర్భక్షణ జరిగినట్టే ఇప్పుడుకూడా జరగాలి. ఈ యాగానంతరం హవిశ్శేషాన్ని యజమానపత్ని తింటుంది. భక్షణానంతరం పైలాగా సూక్తవాక్పఠనం లేదుకాని, శంయూవాక్పఠనం ఉంది. సంస్రవయాగం కూడా ఉంది. ఈ సంస్రవయాగం పేరు పత్నీసంయాజ యాగం.

సమిష్టిహోమం :

దక్షిణాగ్నిలో ఇంతవరకూ ఒక్క ఆహుతి కూడా పడలేదు. కనుక, ఇప్పుడు అధ్వర్యుడు దక్షిణాగ్నిలో ఆజ్యహోమాన్ని చేస్తాడు. పురోడాశం తయారుచెయ్యగా మిగిలిన కొంచెం రుబ్బుడుపిండిని, విశ్వదేవతల నుద్దేశించి అగ్నిలో వెయ్యాలి. దేవహోతఆహ్వానాన్ని అనుసరించి యజ్ఞక్షేత్రానికి వచ్చిన దేవతలందరూ ఇంకా వెళ్ళిపోలేదు. అధ్వర్యుడు వీళ్లందరినిమిత్తమూ ఆజ్యాహుతుల్ని ఆహవనీయంలో వేస్తాడు. అప్పుడు వాళ్లు సంతుష్టులై వెళ్ళిపోతారు. దీనిపేరు సమిష్టియజుర్హోమం.

రాక్షసులకు :

వేదిమీద పరచబడిన దర్భల నన్నిట్నీ ఆహవనీయంలో పడెయ్యాలి. ప్రణీతా-జలాన్ని వేదిమీద పొయ్యాలి. పురోడాశం తయారుచెయ్యటంలో వచ్చిన ఊక, తవుడు, చిట్టు మొదలైనవి రాక్షసులకు ప్రాప్యం. దీంతోనే వాళ్లు సంతోషిస్తారు. రాక్షసుల్ని ఉద్దేశించి వాటిని విసర్జించాలి.

దీంతో ఈ యజ్ఞం ముగిసింది.

ప్రక్రమణ :

ఈ యజ్ఞనిర్వహణఫలంగా యజమాని దేవత్వాన్ని పొందాడు. అంతే కాదు. దేవతల్లో సర్వశ్రేష్ఠుడైన విష్ణుపదాన్ని పొందటానికే అత డిప్పుడు అభ్యర్థి. విష్ణువు త్రిపదవిన్యాసంతో మూడులోకాల్ని ఆక్రమించాడన్న విషయం అందరికీ తెల్సు. ఈ వర్ణన వైదికసాహిత్యంలో ఎక్కడ పడితే అక్కడే కనిపిస్తుంది. దీనికి అనుకరణంగా యజమాని యజ్ఞస్థలంలో మూడు అడుగులు వేసి, తూర్పుగా ఆహవనీయంవరకూ ప్రక్రమిస్తాడు. దీని పేరు విష్ణుక్రమ-ప్రక్రమణ. పూర్వదిక్కు దేవతలస్థానం. యజమాని తూర్పుగా తిరిగి చూస్తూ, "నేను జ్యోతిలో గమనమొనరుస్తున్నాను, జ్యోతిలో కలిశాను" అనే అర్థం గల మంత్రాన్ని చదువుతాడు.

వ్రతవిసర్జన :

అనంతరం యజమాని సూర్యోపస్థానమూ, గార్హపత్య ఉపస్థానమూ జరిపి, "గృహపతిఅయిన ఓ అగ్నీ ! నేను నీద్వారా సుగృహపతిని అవుతాను గాక" అని అంటాడు. తర్వాత, పుత్రుడిపేరు చెప్పి, "నా ఈ పుత్రుడు ఈ వీరకర్మను అనుక్రమంగా విస్తరిల్లజేస్తాడుగాక !" అని ప్రార్థిస్తాడు. ఆపిదప ఆహవనీయ-ఉపస్థానం జరిపి, పూర్వదినం గ్రహించిన వ్రతానికి ఉద్యాపన చెప్తాడు.

విసర్జనానంతరం యజమాని బ్రహ్మతో కలిసి యజ్ఞశాలకు బయటకువచ్చి, తమకోసం అట్టేపెట్టిన పురోడాశభాగాల్ని స్వీకరిస్తారు.

సర్వశేషంగా బ్రహ్మ ఆహవనీయంలో సమిత్ఖండాల్ని వేసి, పూర్ణమాసేష్టిని సమాప్తం చేస్తాడు. యజ్ఞాంతంలో ఋత్విక్కులకు దక్షిణ ఇవ్వాలి.

దక్షిణ :

పూర్ణమాసయజ్ఞం ప్రతిగృహస్థుకూ అవశ్యం చెయ్యాల్సిన కర్మ. ధనికుడు, దరిద్రుడూ అనే విచారం లేదు. అందువల్ల దక్షిణ చాలా తేలిగ్గానే నిర్ణయమయింది. యజ్ఞారంభంలో దక్షిణాగ్నిమీద నలుగురు ఋత్విక్కులకూ సరిపోయే బియ్యం ఎక్కించాలి. అవి దక్షిణాగ్నిమీదే ఉడకాలి. ఈ అన్నమే దక్షిణ. అంతా అయ్యాక ఋత్విక్కులు ఈ అన్నాన్ని భుజిస్తారు. దీంతో యజ్ఞం దక్షిణాంతం అవుతుంది.

ఇది పూర్ణమాసయజ్ఞవివరణ. ఈ ప్రకృతియాగాన్నిబట్టి, మిగిలిన ఇష్టియాగాలరీతిని అర్థం చేసుకోవచ్చు.

శ్రౌతయజ్ఞాలన్నిట్నీ ఇష్టి, పశు, సోమ యాగాలని మూడువిధాలుగా విభజించవచ్చు. ఈ పూర్ణమాసయాగం ఇష్టియాగాలన్నిటికీ నమూనా. ఇంకో విభజనననుసరించి, అగ్నిహోత్ర, అగ్న్యాధేయ, దర్శపూర్ణమాసలున్నూ, ఆగ్రాయణ, చాతుర్మాస్య, నిరూఢపశుబంధ, సౌత్రామణి యాగాలున్నూ, ఆశ్వయుజకూలగవాదులున్నూ సప్తహవిర్యజ్ఞాలుగా పఠింపబడుతున్నాయి.

వెలుగు - చీకటి

"సంపత్"

జిలజిల కవియు తిమిరసంకులము దాటి
అహరనుభవాభిగమ్యము నభిలషింతు;
మత్ప్రణీతశబ్దాళి నా నేత్రయుగళి
వలెనె వెలుగుకేంద్రములు లోపలనె వెదకు;
మత్కృతానేకవివిధకర్మములుకూడ
అహరనుభవాభిగమ్యము నభిలషించు.
ఈదృగీప్సితవిపరీత మింట మఱొక్క-
తలపు దినమన్న బెదరి, సంత్రాసవశత
ఈ మహాంధకారమె నిల్వరింపజూచు.
కాంతి కని కుంచుకొనిపోవు కనులవోలె
వెలుగన తలంకు మద్గిరాం విమలవీథి;
మత్కృతానేకవివిధకర్మములుకూడ
రిక్తసూత్రము లగుచు పరిభ్రమించు
నొక పరిధివెంట, కేంద్రము నుజ్జగించి;
ఇచట తేజోధ్వముల పర్వులెత్తు నాస
నాహృదంతరదౌర్బల్య మాహరించు
నంత, అభిభూతసంకల్పమై గమించు;
ఇనుపగడియలు పడి నాయభీష్ట మిట్లు
క్షరితమై, సుఖస్వప్నమై, కరగిపోవు.
ఇటు లుషఃకాంతి తోచినప్పటికికూడ
అటు మహాంధ్యము క్రమ్మినప్పటికికూడ
పరిధి, కేంద్రము రెండు నా భావితాశ
లందు తడబడు దౌర్బల్య మని తలంతు;
ఇదే మహాద్భుత మీ రెంటి కిట్టి సంధి;
వెలుగుకెరటాలు సుడులుగా విస్తరిల్లు
నంతలో నంధకారము లావరించు
ఒకటి సర్వేంద్రియమ్ముల నుపచరించు—
ఒకటి సర్వేంద్రియమ్ముల నుమ్మలించు.

శైవపరిక్రమము

శ్రీ భావరాజు వెంకటకృష్ణరావు

ఆంధ్రదేశమునకు త్రిలింగదేశ మని మరియొక పేరు. ప్రసిద్ధిగన్న త్రిలింగము లుండుటను బట్టియే ఆంధ్ర భూమికి ఆ పేరు వచ్చియుండెను. శ్రీశైలము, దక్షారామము, కాళేశ్వరము—ఈ మూడును త్రిలింగ క్షేత్రములని అప్పకవి మొదలగువా రనేకులు తెలిపి యున్నారు. ఆంధ్రదేశీయులు బౌద్ధధర్మమును పరిత్యజించి, శైవ-బ్రాహ్మణవైదికధర్మమును స్వీకరించిన నాటనుండి, ఆంధ్రభూమి శైవమున కాటపట్టయ్యెను. ఆంధ్రశైవమునకు ఒక విశిష్టత యేర్పడెను. ఆంధ్ర దేశమునందలి శైవక్షేత్రము లన్నిచోట్లను శివుడు దక్షిణామూర్తి. శివుడు సద్బ్రహ్మచారి. దక్షారామాది పంచారామక్షేత్రములందు శివుడు బ్రహ్మచారియే. దాక్షాయణి పతీత్వము నొందినతరువాత శివుడు పార్వతిని పరిణయ మాడుటకు దక్షిణామూర్తిగా నుండినాడు. ఒక్క పంచారామక్షేత్రములందే కాదు—ప్రసిద్ధిగన్న ప్రతిశైవక్షేత్రమునందును శివుడు దక్షిణామూర్తియే. తెలియనివారు శివార్చకులై వెలయుచుండుటచేతను, మూఢజనులకు శైవాగమములవిషయము ఆవంతయు తెలియకపోవుటచేతను క్షీరారామ(పాలకొల్లు)మునందును, అమరారామమునందును శివునికిప్రక్క పార్వతిని నెలకొలిపి పూజలు చేయుచున్నారు. శివునికి ప్రసిద్ధములయిన క్షేత్రములం దెచ్చటను, ఆంధ్రభూమిలో శివరాత్రి నాడుగాని, మరి ఎన్నడుగాని కల్యాణోత్సవము జరుగదు. ఈ పట్టింపు కోటప్పకొండమీద వెలసియున్న త్రికూటేశ్వరశివునకు మరింత యెక్కువ. దక్షవాటిక భీమనాథేశ్వరశివుడు సంప్రదాయసిద్ధముగా నగ్నపాశుపతమూర్తి. ఆయనకు మాణిక్యేశ్వరిని వింధ్యవాసిని యను శక్తిని భోగపత్నిగా నుంచినారు. ఆమె పార్వతి కాదు. భీమనాథేశ్వరశివునకు పార్వతి చెంత లేదు. అట్లే చాళుక్యభీమేశ్వరశివునకుగూడ. శ్రీశైలమందు గూడ మల్లికార్జునశివునకు శక్తి భ్రమరాంబ. ఆ పరాశక్తికూడ పార్వతి కాదు. అట్లే కాళేశ్వరమందలి కాళేశ్వరునికిగూడ. కాళహస్తీశ్వరునకు పార్వతి లేదు. ఆయనకు శక్తి జ్ఞానప్రసూనాంబిక. అట్లే పంపావిరూపాక్షపతికి పంపాదేవి, భువనేశ్వరులు శక్తిస్వరూపిణులు. పీఠికాపురవాసిని పురుహూతికకూడ శక్తిస్వరూపిణిగాని పార్వతియంశ కాదు. ఆంధ్రదేశపు శైవధర్మమునొక్క విశిష్టతను పైన సూచించినదంతయు ఒక తార్కాణము. ఆంధ్రశైవమునుగురించి పరిశోధన జరుగవలసి యున్నది.

ఆ విషయ మటుండనిండు. శివాలయము లనేకము లున్నవి - ఆంధ్రదేశమునందు. శివాలయములకు బోయి శివుని ఆరాధించు ఆచారము, సంప్రదాయము కూడ దేశమునందు క్రమక్రమముగా క్షీణించిపోవుచున్నది. అసలు ఆంధ్రదేశమునందు శివాలయములకు బోవుట జనులు మానుకొనుచున్నారు. చాలవఱకు ఇట్టి దుష్టపరిస్థితి యేర్పడుటకు వీరేశలింగముగారి నాటనుండి యేర్పడిన మన సంఘములలోని మార్పులు, ఆచారములు, నాస్తికత్వము ఇత్యాదులు కారణము. "రాళ్లు దేవుళ్లయితే రాసులు మ్రింగవా" అన్న వేమనగారి మాటమీద జనులకు గురి కుదిరినది. దైవ మున్నాడనిగాని, శైవధర్మముగాని, వైష్ణవధర్మముగాని అవలంబింపదగిన దనిగాని జనులకు ఈనాడు తోచుటలేదు. నాస్తికత, దానితోపాటు కుశంకలు, ధర్మమునందు అవిశ్వాసమును కల్గించి, ప్రజలయందు అనాదిపూర్వముండిన శమదమనియమాదిగుణములు, సత్యసంధత ఋజువర్తనము, నీతి, శిక్షణలో నుండుట—ఇత్యాది మంచి గుణములన్నియు నశించిపోయెను. జాతికి క్షీణదశ స్థిరముగా నెలకొనెను.

శివాలయములకు బోవనివారి మాట నేను తల పెట్టను. శివాలయములు ఏ పద్ధతిమీద నిర్మితము

లయ్యెనో, శివపరిక్రమ మెట్టిదో చాలమందికి తెలియక పోవచ్చును. ప్రతిశివాలయమందును, అనగా, ప్రాచీనములును, ప్రసిద్ధిగన్నవియునగు శివాలయములందు విమానము, దానిచుట్టు ప్రదక్షిణపథము, చుట్టును సప్త మాతృకలు, భృంగీశ్వరుడు, రుద్రుడు, కాలభైరవుడు, ఢుంఠివినాయకుడు, కుమారస్వామి, చండికేశ్వరుడు మొదలయిన పరివార దేవతలకు, క్షేత్రపాలకులకు చిన్న చిన్న విమానము లుండును. శివలింగమున కెదురుగా ముఖ మంటపమునందుగాని, అర్ధమంటపమునందుగాని నందీశ్వరు డుండును. ఈ దుష్టకాలమున, పరివార దేవతల విమానములు సరియైన తావులందు ఉండుటలేదు. పుణ్య కార్యములు చేయుచున్నామని భావించు సద్భక్తులు కొందరు తెలిసీ తెలియని పండితబ్రువుల సలహామీద తమ యిష్టమువచ్చినచోట పరివార దేవతలకు విమానములు నిర్మించుచున్నారు. కార్తికేయుని గుడి ఊడ పెరికినారు కొన్నిచోట్ల. ఆ కార్తికేయ (శివు)ని వెనుక నుండవలసిన సప్తమాతృకలు ఉండవలసిన తావులందు గానరారు. గణపతి యెక్కడ నుండవలయునో, భృంగి ఎచ్చట నుండవలయునో, అచ్చట ఆ ప్రతిమలు గానరావు. కొన్ని శివాలయములందు చండీశ్వరుని ఊడ పెరికినారు. చండీశ్వరుడు శివయోగులకు అధిపతి. అతడు నగ్నమూర్తి. ఒకప్పుడు రెండుచేతులు, మరియొకప్పుడు నాలుగుచేతులుకూడ నుండును ఆ దేవునికి. చండికేశ్వరుని ముఖము ఉజ్జ్వలమై యుండును. చేతులలో నొకదాని యందు త్రిశూలము, ఒకదానియందు కలశము, మరియొక దానియందు డమరుకముకూడ నుండును. శివునివలె మూడవకన్నుకూడ నుండును. శిరోజములు నడినెత్తిమీద యోగివలె జటగా చుట్టబడియుండును. శివనిర్మాల్యము, శివుని నర్చించివచ్చినపిదప, చండికేశ్వరుని మ్రోల పారవేయుదురు. శివలింగమునకు అభిషేకించిన జలమంతయు కొన్ని దేవాలయములందు సోమసూత్రముగుండ బలికివచ్చి, ఒక తొట్టిలోనికిగాని, అక్కడ కట్టిన బావివంటి గోతిలోనికిగాని ప్రవహించును. సోమసూత్రముదగ్గరకు వచ్చినపుడు జనులు అక్కడ అభిషేకజలమును నెత్తిమీద జల్లుకొనకుండ పోవుట పాపము. శివాలయమునకు బోయినపుడు శివార్చనావిధము ననుసరింపకపోయినచో శివపూజా ఫలము దక్కదని శైవాగమములు ఘోషించుచున్నవి. పెద్దలనోట తఱచుగా ఈ క్రింది శ్లోకము పూర్వము వినుచుంటిమి. ఈనాడు ఈ శ్లోకము నెఱిగినవారరుదుగా నున్నారు. శివుని దర్శించురీతి యిందు విశదీకరింపబడినది:

"వృషం చండం వృషం చైవ
సోమసూత్రం పునర్వృషమ్
చండంచ సోమసూత్రంచ
పునశ్చండం పునర్వృషమ్."

ఈ శ్లోకార్థ మిది: ముందుగా శివుని అర్చింప గోరువాడు నందిని సమీపించి, ఆ నందివెనుక నిలువబడి శివునకు నమస్కార మాచరింపవలయును. తరువాత, ఎడమప్రక్కగా ప్రదక్షిణ మాచరించి కుడినైపున నున్న చండీశ్వరుని సందర్శించి నమస్కరింపవలయును. అక్కడనుండి మరల నందికడకు వచ్చి, లింగార్చనము చేయవలయును. అటుపిమ్మట మునుపటివలెనే, ప్రదక్షిణము చేయుచు సోమసూత్రమును సమీపించి, అభిషేకజలములో కన్నులు తుడుచుకొని చండికేశ్వరుని సమీపించి నమస్కరింపవలయును. పిమ్మట నందిని సమీపించి, మూడవసారి శివలింగమునకు నమస్కార మాచరించి, తిరిగి చండికేశ్వరుని కడకు రెండవసారి పోవలయును. అచ్చట చండీశ్వరునకు వందన మాచరించి సోమసూత్రమువఱకు బోయి, ధ్వజము వంక దృష్టి నిలిపి మేకలమునకు నమస్కరించి, పిమ్మట చండిని సమీపించి, నమస్కార మాచరించి, నంది కడకు శివునికి కడపటి నమస్కారమును సమర్పింపవలయును.

ఇది శైవపరిక్రమ విధానము. ఈ సంప్రదాయము దేశములో అంతరించిపోయినది. గుడికి పోవుటయే మహాకష్టమైన కార్యము ఈ కాలమున— దానికితోడు పెక్కు శివాలయములందు చండీశ్వరుడే కానబడడు. ఇక పూజావిధానము ఎట్లున్నదో యోచించుకొనుట సులభము.

రుచీదేవి

[నాటిక]

'పో. శా.'

౧

[ఒక గొల్లపల్లి. తటాకకూలాన్న వృక్షచ్ఛాయలో చారవేషధారి శ్రీకృష్ణదేవరాయలు.]

రాయలు :—ఈ రాజ్యం అప్పాజీచాతుర్యవిశేష సంప్రాప్తం. నా భోగాలన్నీ ఆ బృహస్పతిత్యాగాల ఫలితం. ఆ బహుళ మేధాశక్తి నా రత్నఖచితకిరీట మస్తకం వినమ్రమవుతుంది. ఆయన నిర్దాక్షిణ్యకార్యక్రమ శక్తి అఖండవిద్యానగరసామ్రాజ్యమే ధారపోస్తూ లనిపిస్తుంది. ఆయన నన్ను ఆదుకుంటూవచ్చింది యీ సామ్రాజ్యరంగంలోనే కాదు, గృహరంగంలో కూడా—

అప్పాజీదయ పెదతల్లి విషప్రయోగంనుంచి కాపాడింది. కొడుకు సామ్రాజ్యాధినేత కాకపోతా డన్న భయంతో అన్నగారు నా గ్రుడ్లు పెరికించమంటే కాపాడింది అప్పాజీ. అప్పాజీ లేకపోతే కృష్ణరాయడు ఉండేవాడే కాడు. నా గురువు, నామంత్రి—నా సర్వస్వం ఆయనే.

నా ప్రణయసమస్యల్లోకూడా సౌఖ్యం కలిగించుకోగల సామర్థ్యం అప్పాజీకిమాత్రమే.—నా చిన్నాదేవిని నాకు సమకూర్చాడు. గజపతిరాకుమారి కలు యీపాటికి నన్ను తమ ఛురికలకు ఆహుతిగాని ఉండేవారు, అప్పాజీచాతుర్యం నాకు శ్రీరామరక్షగా లేకపోతే—

...ఆఁ...మళ్లీ సాయంత్రానికి విజయనగరం చేరాలి...అప్పాజీ ఆదేశం. నిదాఘంకూడాను. ఈ పాత్రలో తటాకజలం నింపుకు బయలుదేరితే—

(తటాకసోపానాలమీద ఒక కాషాయాంబర ధారిణి కృష్ణరాయని చూచి కొంచెం తప్పుకుంటుంది. అక్కడి శిలాశాసనాన్ని చదువుతాడు రాయలు.)

"శ్రీమన్మహారాజాధిరాజ, రాజపరమేశ్వర, మూరురాయరగండ..." నా బిరుదనామాలా ?...ఎవరిదీ శాసనం ? (అడుగున చూచి) "శ్రీ కృష్ణదేవరాయ చరణభక్తురాలు...కట్టించిన తటాకం—"

శ్రీ వీరప్రతాపుని పాదదాస్యాన్ని ఆకాంక్షిస్తున్న యీ నిరాడంబరజీవి...స్త్రీ!...స్త్రీ ?

హృదయపూర్వకంగా నన్ను లోగొని తాను నాకు లోబడిన ప్రణయైకజీవి ఒక్క చిన్నాదేవి మాత్రమే. తిరుమలదేవికూడా పరివర్తితహృదయ. సరే, రుచీదేవిఅంకురాంకు లానాటితోనే అంతమయ్యాయి. మరి నిష్కామకర్మగా నన్నారాధిస్తున్న యీ అజ్ఞాత నారి...! (కాషాయాంబరధారిణిదగ్గరకు వెళ్లి) ఇదిగో ...యీ శిలాశాసనం ఎవరిది ?

ఆమె :—ఏవూరు పాంథుడా ?

రాయలు :—మాది విద్యానగరం.

ఆమె :—ఇంకేం ? మీరాయల చరణదాసిది.

రాయలు :—ఎవ రామె ? పేరు...

ఆమె :—వరదరాజమ్మ.

రాయలు :—వరద...రాజమ్మ...మా గజపతి విభాధుని ఆరాధిస్తున్న ఒక అజ్ఞాతనారి...పేరు వరద రాజమ్మ...గ్రామం ?

ఆమె :—అసలు వినుకొండ. ఇప్పుడు గొల్లపల్లి. ఆమె యిక్కడ ఆశ్రమం స్థాపించి ధ్యానముద్రలో భాసిస్తూ ఉంటుంది.

రాయలు :—ఆఁ - ఇంకా ?

ఆమె :—అంతే. నాకూ అంతకన్నా తెలియదు. ఆమెమాధ్యాహ్నికాలకు నీతో కూచుంటే జాప్యం కాదూ ?

రాయలు :—(నెమ్మదిగా) నిలు... (ఆగి) ఎందుకూ ? వెళ్లు...రేపు అప్పాజీతో సమాలోచించండే...చూడడం మంచిదికాదు...

విశాఖాంక...గొల్లపల్లి. వరదరాజమ్మ...అరి రాయవిభాళుని (శాసనం మరోసారి చూసి)...చరణ భక్తురాలు...

విచిత్రం, విపరీతం...

౨

[రాజప్రాసాదం. అంతఃపురం. తిరుమలదేవి, రాయలు.]

దేవి :—శ్రీమన్మహారాజాధిరాజ, రాజపరమేశ్వర, మూరురాయరగండ...

రాయలు :—ఏమిటి, పరాకులు పలుకుతున్నావు? (కొంచెం చలించి) ఆ శిలాశాసనం... తటాకం... (తల పంకించి) ఏమీ లేదు. (నాలిక కొరుక్కుంటాడు.)

దేవి :—ఏ శిలాశాసనం? ఎక్కడ?

రాయలు :—లేదు, లేదు...ఏమీ లేదు... అప్పాజీ...

దేవి :—అలా చంచలిస్తారెందుకూ? గొల్లపల్లి పర్యటన చేసి వచ్చిన శ్రీకృష్ణదేవరాయలవారు—విశ్రమిస్తారా?

ఆ తటాకం...ఒకనాటి రాకుమారి...

రాయలు :—(పట్టించుకోక) గొల్లపల్లి శిలాశాసనం. (నిశితంగా) దేవి కీవిషయంలో సంబంధమేమిటి?

దేవి :—ఆమె...నాలోటిదే.

రాయలు :—ఏం రామె...ఒక ఆధ్యాత్మికజీవి ...తిరుమలదేవితో సమానమా?

దేవి :—ఆమె మీ చరణభక్తురాలు...

రాయలు :— అవును. మూరురాయరగండని రక్తంకూడా తియ్యగా ఉంటుందని చవిచూచి చెప్పిన తిరుమలదేవి ఆ అజ్ఞాతాధ్యాత్మికస్త్రీతో సామ్యం చెప్పబోవడం.. (నవ్వు).

దేవి :—ఆమెకూడా మీరక్తం చవిచూడాలనుకుంది ప్రభూ!

రాయలు :—రాయల రక్తం రుచిచూడాలన్న వాంఛ ఒక గొల్లపల్లి స్త్రీలోనా జనించింది?

దేవి :—ఆమెది అసలు విశాఖాంక—మనవి చేస్తున్నాను.

రాయలు :—రాజ్యాన్ని పాలిస్తున్న రాయలకన్నా రహస్యాలు అంతఃపురరమణులకే ఎక్కువ తెలుసా? (తీక్ష్ణంగా) చెప్పు

దేవి :—ఇందులో ప్రత్యేకత ఉంది ప్రభూ! ఆమె ఒక నిష్కళంకజీవి. తమ నామసంస్మరణతోనే దినాలు వెళ్లబోస్తున్న ఒక పవిత్రవ్యక్తి. మీ దాస్యాన్ని పునస్సంపాదితం కావించుకోలేనేమోనని మనస్సు నొవ్వచేసుకుంటున్న ఒక అమాయికయువతి—

రాయలు :—నా దాస్యాన్ని పునస్సంపాదితం కావించుకో...

దేవి :—తథ్యం స్వామీ! తెలియదా, తెలిసీ ఉపేక్షిస్తారా? నావలె ఆమెకూడా పరివర్తిత హృదయ.

రాయలు :—తిరుమలా! ఈ ప్రచ్ఛన్నసంభాషణ దేనికి?

దేవి :—ప్రభూ! ఆమె మనోదౌర్బల్యాన్ని పోకార్చుకోడానికి వహించిన తపోదీక్షతప్ప అది—

స్వామీ!—కాషాయాంబరం కట్టుకున్నా హృదయం రాగరంజితమే. మానముద్ర వహించినా చిత్తం యుష్మదాయత్తమే. ఆమె మీకోసమే— మీరు నిజాన్ని లెక్కచేయక పరిగ్రహించకపోతే మృత్యువుకోసమే—స్వీయాంతఃకరణాన్ని పరిశుద్ధం కావించుకుంటోంది...మీ విజయలక్ష్మీపరీరంభంలో ఆమె ఒక పులకరింపు. మీ అష్టదిగ్గాజమనోభయంకరత్వాన్ని చిరస్థాయి కావించిన ఒక నవనోన్మేషలావణ్యమయి.

రాయలు:—నా జీవితంలో అంత ప్రధానపాత్ర వహించిందా ఆమె?

దేవి :—పూర్వదక్షిణపశ్చిమసముద్రాధీశ్వరులు జరిగిందాన్ని యింతగా విస్మరిస్తారా?

రాయలు :—(ఆలోచిస్తూ) నేను పరిగ్రహించకపోతే మృత్యువును పరిగ్రహిస్తుందా?...నా జీవితంలో అడుగుమోపిన యువతి...నన్ను బలిగొనదలిచింది—తిరుమలదేవికాదు...మరి? రుచీదేవి అనాడే వదలిపోయింది...అయితే రుచీదేవే!? (గద్గదగా) పశ్చాత్తాపమా? అపూర్వపరివర్తన...

దేవి :—అపూర్వం కాదు స్వామీ!

రాయలు :—(వినిపించుకోకుండా) కత్తినెత్తిన కాఠిన్యం కమనీయాశ్లేషాన్ని కాంక్షిస్తోంది. అపూర్వ

పరిశ్రత...శ్రీకృష్ణదేవరాయల చరణభక్తురాలు... రుచీదేవి...

దేవి :—వీణకు ఉండే యినుపతీగెలే సుమధుర గానాన్ని పలుకుతాయి ప్రభూ!

రాయలు:—దేవీ...లేదు...ఆ ఉదంతం స్మృతి పథాల్లోకి రాలేని లోతుల్లో—

దేవి :—అభిమానవతి. తన భావాన్ని తానుగా వెలిబుచ్చుకోలేక జీవితాన్నే భగ్నపరుచుకొని త్యాగం చేయదలిచింది.

రాయలు :—ఎవడురా అక్కడ! (వచ్చిన సేవకునితో) త్వరగా అప్పాజీని ప్రవేశపెట్టు.

...కాను. అప్పాజీతో సంప్రదించాను. ఆమె క్రౌర్యాన్ని తెలియజెప్పాను. ఆయనఅనుమతిమీదనే నగరు విడిచి పొమ్మన్నాను...

దేవి :—రాజాజ్ఞతో ఆమె అంతఃపురాన్ని విడిచి వెళ్ళింది. తిరిగి రాజాజ్ఞతోనే ఆమె అంతఃపురానికి చేరాలి.

రాయలు :—అసంభవం—అప్పాజీ...

దేవి :—వస్తూఉంటారు. రాజ్యంలోని గుట్టు మట్టులన్నీ ప్రభువు స్వయంచారత్వంతో బహిర్గత పరచాలన్నది శ్రీ అప్పాజీవిధానం.

రాయలు:—ఇంతకూ ఇందుకోసం పనికట్టి నన్ను పంపించావా...గొల్లపల్లి ప్రాంతానికి?

దేవి :—ప్రభువులు ఉద్రేకిస్తే నేను నిరుత్తరను. మీది విశాలహృదయం. మీరు దాక్షిణ్యాగారులు... అదుగో అప్పాజీ...

రాయలు :—(లేచి) రండి, అప్పాజీ!

అప్పాజీ :—(ప్రవేశించి) ఇంత అసమయంలో చర్చించాలిసిన అత్యవసర విషయం...

దేవి :—(రాయల వంక చూస్తూ) రుచీదేవి...

అప్పాజీ :—(చిరునవ్వుతో) ఏనాడో నగరు విడిచి పొమ్మని ఆజ్ఞాపిస్తే శిరసావహించిన ప్రాతరాణి మీద మనసుపారిందా రాయలవారికి? సరి...మీ పర్యటన సుఖాంతమా ప్రభూ!

రాయలు :—(ఉద్వేగంతో)వరదరాజమ్మ రుచీదేవా అంటోంది తిరుమలదేవి.

అప్పాజీ :—దేవి అసత్యమాడుతారా ప్రభూ?

రాయలు :—గొల్లపల్లి ... శాసనం ... రేపు మీతో చర్చిద్దా మనుకున్నాం. 'ఆ శాసనకర్త్రి రుచీదేవి' అని హృదయంలో కల్లోలాన్ని లేపింది తిరుమల. అప్పాజీ! అంత క్రౌర్యానికి యింత సాధుత్వమా?

అప్పాజీ :—ప్రభూ! ఆవిషయం ఇప్పుడెందుకూ?

రాయలు:—నిర్దోషిత్వం నిర్ణయింపబడితే ఆమె గౌరవార్హ.

అప్పాజీ :—అంతమాత్రాన జరిగేది?...ఆమె దోషి అని ప్రభువులు ఇతఃపూర్వమే నిర్ణయించారు.

రాయలు :—అప్పాజీ! మీ అభిప్రాయం, రాయలఆమోదం ఏనాడూ విడిపోవు.

అప్పాజీ :—క్షంతవ్యుణ్ణి...

గజపతిరాకుమారి ఆనెవుల్లో కాయగసగులు తిని బ్రతుకుతోంది. కాంతివిస్ఫూర్తిని వదలి కాషాయశాటి ధరించింది. ఆమెమనస్సులో క్రాంతి కల్లివిరుస్తోంది. పరితాపవహ్నిమధ్య మీక్షై ఆమె ప్రతిక్షణం ప్రార్థనచేస్తోంది. అప్పటి ఆమెజీవిత శకలం—చంద్రునిలో కళంకం—

చెలులు చెప్పిన పలుకులు విని రుచీదేవి మీ మీద జాలు చూపింది. అంతే. ఆమెహృదయం నిష్కళంకం. ఆనాడు అందరూ ప్రేరేపిన ఉద్రేకం ఆమె కన్నుకప్పింది. ఈనాడు ఆత్మలో మీపైగల ప్రేమ ప్రబోధించిన అనుతాపం ఆమెకన్ను విప్పింది. ఆమె పవిత్రహృదయం ప్రతినిత్యం స్వీకృతికి తగిఉంది ప్రభూ!

మీభావాన్ని ఆనాడే కాదంటే నన్నే అన్యథా తలిచేవారు...

రాయలు :—ప్రథమసమాగమ సమయంలో ప్రాణాపహరణప్రయత్నం...

అప్పాజీ :—(తిరుమలదేవివంక చూస్తూ) మీ హత్యాప్రయత్నంలోనే అనంతప్రేమప్రబోధం ఉందేమో?

రాయలు :—నన్ను పరిరక్షిస్తూవచ్చిన మీకు నేను చెప్పవలసిందేమీ లేదు.

అప్పాజీ :—రాయలవారాగ్రహిస్తే తిమ్మరుసు చేసేదికూడా ఏమీ లేదు.

రాయలు :—ఆగ్రహం కాదు అప్పాజీ, అనుమతి. కాని—

అప్పాజీ :—ప్రత్యక్షంగాకాని, పరోక్షంగా కాని మీపరీక్ష కామె నిలుస్తుంది.

రాయలు :—(తల ఊపుతాడు.)

3

[పటకుటీరం. వరదరాజమ్మ అప్పాజీలు ఒక కక్ష్యలో; వాళ్లను విలోకిస్తూ వాళ్లకు కనబడకుండా రాయలు మరో కక్ష్యలో.]

రాజమ్మ:—స్త్రీహృదయం అప్పాజీ! హృదయం చీల్చి నివేదించుకుంటున్నాను. ఈ కలుషశరీరం ప్రభువుల పాదతాడనంతో పునీతం కావాలి... అప్పాజీ, నా కశ్మలాన్ని మీతో వెళ్లబోసుకుంటున్న నా జీవితచర్యాప్రవచనంతో పుట్టిన వెచ్చకన్నీటితో కడుక్కోవాలని భావిస్తున్నాను. ఆయన అంతిమదర్శనానికే నా తపోదీక్ష—సహజమృదులమైన స్త్రీస్వభావాన్ని అరికట్టలేకపోతోంది యీ తపస్వినీజీవితంకూడా... (తలవంచి) ఏముంది నాకు ఆశించడానికి? ఆయన్ని ఆఖరుసారి కళ్లతో త్రాగి యీ ప్రపంచంనుంచి వినిర్గమిస్తాను, అప్పాజీ...

అప్పాజీ:—యువతికా వైరాగ్యం?

రాజమ్మ:—రుచీదేవికి...రాయలప్రక్కలో త్రాచుబామనిపించుకున్న రుచీదేవికి అంతకన్నా గతి ఉందా అప్పాజీ!

అప్పాజీ:—రాయలు మిమ్మల్ని ఆదరిస్తారేమో!

రాజమ్మ:—(తల వూపుతూ) కనికరం యీ పాపినిమీదా? అప్పా, ఆ మహామహుని జీవితచూతఫలంలో నేను గ్రంథిలాన్ని. నన్ను విసర్జించాలిసిందే.

అప్పాజీ:—గతం మరవాలి.

రాజమ్మ:—అని ఊరుకుంటారా? చేసినదానికి చెయిపెట్టి దేవుతోంది నామనస్సు. జరిగిందానికి విచారిస్తోంది మీ మనస్సు. ఈ దౌర్భాగ్యాన్ని దూరీకృతం కావించినందుకు నిజం తెలియక సంతోషిస్తూ ఉంటుంది శ్రీ వీరప్రతాపుల మనస్సు. నా జీవితానికి ఆయనమనోభావమే ప్రధానం. ఈపశ్చాత్తాపతప్త రుచీదేవి ఆయనదృష్టిలో లేనంతవరకు ఆయన సంతోషాన్ని పొందేట్లయితే నే నసలాయనదృష్టిపథంలోనే పడను. ఆయనసంతోషమే నాకు చాలు. అప్పాజీ, మీ కేదైనా సాధ్యమే. నా అంతర్నైర్మల్యాన్ని మీకైనా వివరించుకోగలిగాను.

అప్పాజీ:—మూరురాయరగండడు మీరు తపస్వినీజీవితాన్ని వదలాలని భావిస్తున్నారు.

రాజమ్మ:—ఆఁ! ఆయనమనస్సులో నే నింకా మెదులుతున్నానా?...పిమ్మట?

అప్పాజీ:—తిరిగి దేవేరిగా...

రాజమ్మ:—అని మీ ఆశీర్వాదమా? అంత రిక్తవాంఛ లేదప్పాజీ!

అప్పాజీ:—రిక్తవాంఛ కాదు, యుక్తవాంఛ...మిమ్మల్ని పరిగ్రహించడానికి రాయలే అంగీకరించి వస్తే?—

రాజమ్మ:—(హర్ష బాష్పాలు) అనూహ్యం. ఆయనపాదరాజీవాలు పంకిలమౌతాయి.

అప్పాజీ:—రాజీవాలు పంకజాలేకదూ!

రాజమ్మ:—అప్పా, మీ వాత్సల్యంతప్ప... (దుఃఖం)

రాయలు:—(ప్రవేశించి) పవిత్రహృదయానికి (గాద్గద్యం) ఏనాటికైనా విజయనగరసామ్రాజ్యంలో అర్ధస్థానం ఉంది.

రాజమ్మ:—(జంకుతూ) స్వామీ... (అప్పాజీని చూచి) అప్పాజీ...

అప్పాజీ:—తథా భవతు. రాజమార్తాండుని ఆదేశానికి అడ్డు ఉందా?

రాజమ్మ:—(రాయల పాదాభివందనం) స్వామీ, ...క్షమ...

రాయలు:—(అంతస్సు గ్రహించి)నీ హృదయనైర్మల్యం తిరిగి నన్ను నీవాణ్ణిగా మార్చింది.

రాజమ్మ:—అప్పాజీచాతుర్యవిశేషానికి (తలవంచి)...కృతజ్ఞతలు.

రాయలు:—నీకు, నాకే కాదు అప్పాజీ విద్యానగరసామ్రాజ్యానికంతకూ అప్పాజీ.

మాధవస్వామిలో మహస్సు అప్పాజీలో అంతర్లీనమైంది.

(ఇద్దరూ అప్పాజీకి మ్రొక్కుతారు)

అప్పాజీ:—దిగంతవిశ్రాంతసంస్తవనీయకీర్తిమూర్తీ! అరివీరతామసవిధ్వంసనం నీ కుఠారధారా పరమావధి.

వేములవాడ చాళుక్యులు

(గత సంచిక తరువాయి)

శ్రీ నేలటూరి వెంకటరమణయ్య

౮

ఇమ్మడి యరికేసరి

ఇమ్మడియరికేసరికి రాష్ట్రకూటరాజకుటుంబముతో గాఢమైన సంబంధము గలదు. ఇతని తల్లియగు జాకవ్వ ప్రాయశః ముమ్మడి యింద్రవల్లభుని సోదరియై యుండవచ్చు ననియు, దనభుజముచే తొల్లకేసి యింద్రవల్లభు డితని నెత్తిపెంచెననియు పూర్వప్రకరణమున వ్రాసియున్నాను. మఱియు నాయింద్రవల్లభుడు దన కుమార్తెయగు రేవకనిర్మడి నీతని కుద్వాహము గావించెనని వేములవాడశిలాశాసనమువలన దెలియుచున్నది. రాష్ట్రకూటకులసంజాతయగు లోకాంబిక యను మఱియొక రాజకన్యకనుగూడ నితడు పెండ్లియాడినట్లు పరభణితామ్రశాసనమున గలదు. ఇతనిగూర్చి తెలియవచ్చు చరిత్రాంశములు నాలుగు.

(౧) గోవిందరాజుకోపమునకు పాత్రుడైన చాళుక్యవిజయాదిత్యుని కాశ్రయమిచ్చి రక్షించెను. ఈ విజయాదిత్యుడే వేములవాడశిలాశాసనమున బిజ్జ డని పేర్కొనబడియున్నాడు.

(౨) సకలచక్రవర్తి గొజ్జిగ డొక గొప్ప సేనతో నొక మహాసామంతు నితనిపై కంపగా నిత డాతని నోడించి తఱుముగొట్టెను.

(౩) బద్దెగదేవుని కిత డాశ్రయ మిచ్చెను; అందులకు గినిసి చక్రవర్తి యెత్తిరాగా నతని గడపి బద్దెగదేవునికి సామ్రాజ్యము నొసగెను.

(౪) కక్కలని తమ్ముడగు బప్పని యంక కాఱు డెత్తిరాగా వాని నోడించి పాఱదోలెను.

వీనియందు కడపటి యంశ మొక్కటి దప్ప దక్కిన వన్నియు రాష్ట్రకూటచరిత్రకు జెందినవి. విషయమును జక్కగ నవగాహనము జేసికొనుటకు రాష్ట్రకూటరాజకుటుంబవృత్తాంతమును గొంత తెలిసికొనవలసియున్నది.

ఇమ్మడికృష్ణుకు చేదిరాజగు కక్కలదేవుని కుమారితను పెండ్లియాడెను. ఈమెయం దాతనికి జగత్తుంగు డను పుత్రుడు గలిగెను. ఇతడు తన మేనమామ కక్కలరాజకుమారుడగు శంకరగణ రణవిగ్రహుని కుమారితలను లక్ష్మిగోవిందాంబలను వివాహమాడెను; లక్ష్మియందు ముమ్మడి యింద్రుడును, గోవిందాంబయందు బద్దెగనామాంతరుడగు ముమ్మడియమోఘవర్షుడు నను నిరువురు కుమారులు పుట్టిరి. ముమ్మడి యింద్రవల్లభుడు కొక్కల్లని మనుమడగు నర్జున అమ్మణదేవుని కుమార్తెను విజాంబ నుద్వాహముజేసికొని యామెవలన నిమ్మడియమోఘవర్ష నాల్మడిగోవిందులను నిరువురు పుత్రుల బడసెను. మఱియు నితని కుమారితను రేవకనిర్మడిని చాళుక్య అరికేసరి పెండ్లాడెను. ఇంద్రవల్లభుని తమ్ముడగు ముమ్మడియమోఘవర్షుడు చేదిరాజుకొక్కల్లని మనుమడగు ముగ్ధతుంగయువరాజదేవుని కూతురగు కుండకదేవిని వివాహముజేసికొనెను. వీరికి ఖొట్టిగదేవు డను కుమారుడు పుట్టెను; ఖొట్టిగని కంటె పెద్దవాడు ముమ్మడి కృష్ణు డను పుత్రు డొకడు ముమ్మడియమోఘవర్షునకు గలడు. ఇతని తల్లి పేరెద్దియో, యామె యేరాజకుటుంబమున నుద్భవించెనో తెలియదు. రాష్ట్రకూటవంశావతరణమును వంశవృక్షరూపమున నిట్లు లిఖింపవచ్చును.

ఇమ్మడి కృష్ణవల్లభుడు
భా. కొక్కలరాజపుత్రిక.

జగత్తుంగుడు
(భార్యలు చేదిశంకరగణరణవిగ్రహుని
కుమారితలు)

(౧) లక్ష్మీదేవి
- ముమ్మడి యింద్రుడు.
  భార్య (చేదిరాజు కొక్కలుని మనుమడు అర్జునఅమ్మణదేవుని కూతురు) విజాంబ.
  - కేవకనిర్మడి — భర్త: చాళుక్యయిమ్మడి యరికేసరి
  - ఇమ్మడి యమోఘ వర్షుడు
  - నాల్మడి గోవిందుడు

(౨) గోవిందాంబ
- బద్దెగడు లేకముమ్మడి యమోఘవర్షుడు
  - ముమ్మడికృష్ణుడు
- భార్య (చేదిరాజు కొక్కలుని మనుమడు యుగ్ధతుంగ యువరాజ దేవునికూతురు) కుండకదేవి.
  - ఖొట్టిగడు

క్రీ. శ. ౯౨౯-౩౦ సం॥న ముమ్మడి ఇంద్రవల్లభుడు కాలగతి నందెను. అతని యనంతర మతని జ్యేష్ఠపుత్రు డిమ్మడి యమోఘవర్షుడు రాజ్యాభిషిక్తుడాయెను; కాని యతని యేలుబడి యొక సంవత్సరము లోపల సమాప్తినందెను. అతని దొలగద్రోసి యతని తమ్ముడు నాల్మడిగోవిందుడు రాజాయెను. ఇతనిని గొజ్జిగడనియు జనులు పిలచెడివారు. ఇతడు తన యన్నను హింసించి వధించెనని దూరు కలుగుటవలనను, విషయాసక్తు డగుటవలనను ప్రజ లితనియెడ విముఖులైరి. స్వార్థపరులైన సామంతులు కొందఱదియ యదను జేసికొని యతనిపై దిరుగబడిరి. వీరియందు గోవిందుని పినతండ్రియైన బద్దెగడును, నాతని జ్యేష్ఠపుత్రుడగు కృష్ణుడును ముఖ్యులు. కావున వీరు చక్రవర్తికోపమునకు పాత్రులై రాజ్యమునుండి పాఱిపోయి త్రిపురియందు చేదిరాజుయాస్థానమున తలదాచుకొనిరి.[1]

మఱియు బూర్వసముద్రమువఱకు గల రాష్ట్రకూటసామ్రాజ్యమున నల్లరులు చెలరేగను. ముమ్మడి యింద్రరాజుయొక్క రాజ్యాంతదశయందో, లేక నాల్మడిగోవిందరాజురాజ్యప్రారంభకాలముననో వేంగిదేశము రాష్ట్రకూటులకు హస్తగతమాయెను. వేంగిదేశాధీశ్వరుడైన మొదటియమ్మరాజు క్రీ. శ. ౯౨౫-౬ లో పరమపదించెను; మొదటి యమ్మరాజుపుత్రుడు కంఠికావిజయాదిత్యుడు తండ్రియనంతరము రాజ్యాభిషిక్తుడైనను ఒక పక్షమునకంటె నెక్కువకాలము రాజ్యముసేయజాలకపోయెను. తరువాత గుణగవిజయాదిత్యుని తమ్ముడగు మొదటి యుద్ధమల్లుని పుత్రుడు మొదటి తాళరాజొక నెలదినములు రాజ్యమేనఁగ్పను. అతని జంపి ద్వితీయవిక్రమాదిత్యుడు పదునొకండు మాసము లేలెను. తరువాత క్రీ. శ. ౯౩౫ లగాయతు

1. ఈవిషయము నుడితామ్రపట్టికలవలన దెలియుచున్నది.

"తస్యానుజో నిజభుజార్జితసంపదగ్రో
భూవల్లభం సముపగమ్య డహాళదేశే
శ్రీబద్దెగం తదను తస్య సుతాం సహైవ
వాక్కన్యయా వ్యవహ దుత్తమధీ స్త్రిపుర్యాం."
(ఎపి. ఇండి. సం. ౩. పుట ౧౮౦.)

వేంగియం దంతఃకలహములు పెఱిగి యరాజకము ప్రబలెను. ఈ పరిస్థితు లప్పటి పూర్వచాళుక్యుల శాసనముల జక్కగ వర్ణింపబడియున్నవి.

"పశ్చా దహమహమికయా విక్రమాదిత్యాస్తమయనే రాత్రిసా ఇవ ప్రజాబాధనపరా దాయాదరాజపుత్రా రాజ్యాభిలాషిణో యుద్ధమల్లరాజమార్తండకంఠికావిజయాదిత్యప్రభృతయో విగ్రహీభూతా ఆసన్. విగ్రహేష్వేవ పంచవర్షాణి గతాని. 2"

పై చేర్కొనిన రాజులలో యుద్ధమల్లుడు ముఖ్యుడు. ఇతనికి స్వబలముకంటె మిత్రబల మెక్కుడు. ఇతడు మొదటి యుద్ధమల్లుని మనుమడు. కంఠికావిజయాదిత్యుని పదచ్యుతుని జేసి నెలరోజులు వేంగిసింహాసనము నధిష్ఠించియుండిన ప్రథమతాళరాజపుత్రుడు; రాష్ట్రకూటచక్రవర్తి నాల్మడిగోవిందవల్లభుని కాశ్రితుడు; అతడు దన సహాయార్థ మంపిన దళముల బలిమిచే వేంగిసింహాసనము నాక్రమించుకొని యేడేండ్ల కాలము రాజ్యమొనర్చెను. నామకార్థమాత్ర మితడు రాజు; అధికారమంతయు రాష్ట్రకూటులచేత జిక్కెను. ఈవిషయము అమ్మరాజవిజయాదిత్యుని మాంగల్లు తామ్రశాసనమువలన విదితమగుచున్నది.

"సామన్తశబరవల్లభ
దణ్డాశ్వానీకచయ దులంప న్నద్ధాశా
షష్ఠాశ్ నశేఒత్ర మల్ల
రపరాజకృతపట్టబన్ధ మవ త్యబలాత్."3

ఇందువలన నాల్మడిగోవిందచక్రవర్తి మాన్యఖేటసింహాసనము నధిష్ఠించినవెంటనే రెండవ యుద్ధమల్లునికి గొప్ప సైన్యము నిచ్చి వేంగిమీది కంపి పూర్వచాళుక్యరాజ్యమునం దతని ప్రతిష్ఠించెను. ఇది నాల్మడిగోవింద చక్రవర్తియొక్క యజ్ఞాతఘనకార్యములయం దొక్కటి. ఇట్లు తన యాశ్రితుడు వేంగి నేలుచుండినను, గోవిందుని యధికారము వేంగియందు నిరాఘాటముగ సాగలేదు. మొదటి యమ్మరాజవిష్ణువర్ధనుని ద్వైమాతురుడైన రెండవ చాళుక్యభీముడు నిజదేశమును రాష్ట్రకూటదాస్యమునుండి తప్పించి కీర్త్యమైన రాజ్యమును స్వాధీనపఱచుకొనుటకొఱకు పోరాడదొడగెను. ఇతని రక్షించుటకై నాల్మడిగోవిందరా జొక్క గొప్పసైన్యము నంపెను. రాష్ట్రకూటసామంతులను ధలగ, న్యంబది మున్నిఱివరాజమార్తండులను జయించితినని చెప్పికొనియున్నాడు.

"యస్తాతవిక్యనాఖ్యం ధలగం న్యంబది మున్నిఱివ రాజమార్తణ్డౌ అజౌ విజిత్య……"

అని కొలవెన్ను శాసనము 4. ఈవిషయమునే మఱికొంచెము విస్తరించి రెండవ యమ్మరాజు కలుచంబఱ్ఱుతామ్రశాసనమునందు చెప్పియున్నది.

"శ్రీమత్స్వరాజమయ్యం ధలగమురుతరం
తాతవిక్కిం ప్రచణ్డం
బిజ్జం సజ్జంచ యుద్ధే బలిన మతితరా
మయ్యపం భీమ ముగ్రం
దణ్డం గోవిందరాజప్రణిహితమధికం
చోలపం లోవవిక్కిం
విక్రాన్తం యుద్ధమల్లం ఘటితగజఘటాన్
సన్నిహ త్యైక ఏవ"5.

ఇట్లు రాష్ట్రకూటసామంతసైన్యమును ద్వితీయచాళుక్యభీముడే నిర్జించినట్లు పైశాసనములయందు జెప్పియున్నను, సహాయులు లేక యతనికి జయము చేకూడియుండదు. చక్రవర్తికి బ్రతికూలురైన రాష్ట్రకూటసామంతు లతనికి బ్రత్యక్షముగనో, గూఢముగనో తోడ్పడియుండవలయును. ఈసందర్భమున నీక్రింది యంశములు దృష్టియం దుంచుకొనదగియున్నవి. రెండవచాళుక్యభీముడు గోవిందరాజసైన్యములతో బోరాడుచుండిన కాలమునందే తూర్పుతెలింగాణమున పెద్ద అల్లరి యొకటి రేగినది. దీనికి బ్రధాననాయకుడు వేంగిగడిదేశమున నుండిన వేములవాడచాళుక్యరాజ్యమున కధిపతియైన యిమ్మడి యరికేసరి. రెండవ చాళుక్యభీమునకును, నిమ్మడి యరికేసరికిని నాల్మడి గోవిందవల్లభుడు సామాన్యశత్రువు. ఇద్దఱును గోవిందుని

2. ఎపి. ఇండి. సం. ౯. పు. ౪౩.
3. Cp. 1. of 19:6-17.
4. SII. 1. No. 37.
5. ఎపి. ఇండి. సం. ౩. పుట ౧౩౩ తరువాయి.

మీఁద విజయమందిరి. క్రీ. శ. ౯౩౫ లో గోవిందుడు రాజ్యభ్రష్టు డాయెను; ఆ సంవత్సరముననే ద్వితీయ చాళుక్యభీముడు వేంగిసింహాసనము నధిష్ఠించెను. ఈ యంశములను చక్కగ విచారించిచూడగా గోవింద రాజు సైన్యములతో ద్వితీయచాళుక్యభీముని పోరాటము ప్రత్యేకమైనది కా దనియు దానికిని దూర్పు తెలింగాణవిప్లవమునకును గాఢసంబంధము గల దనియు దోచుచున్నది.

ఇక దూర్పుతెలింగాణవిప్లవమునుగూర్చి విచారింతము. దీనికి గారణము వేములవాడశిలాశాసనము వంటును, పంపని విక్రమార్జునవిజయమునందును నిట్లు చెప్పియున్నది: చాళుక్యవంశజుడగు బిజ్జడు, లేక విజయాదిత్యు డనువతడు నిజప్రభువగు గోవిందచక్రవర్తియొక్క కోపమునకు బాత్రుడయ్యెనట. ఇమ్మడి యరికేసరి యాతని కాశ్రయ మొసగి రక్షించెనట. అందులకు జక్రవర్తి యతనిపై గలుషించి యుద్ధము బ్రకటించెనట. ఇట్లు చక్రవర్తికోపమునకు బాత్రుడై యరికేసరిచే గాపాడబడిన బిజ్జడు, లేక విజయాదిత్యు డెవ్వడో, యతనిపై జక్రవర్తి కేల కోపముగలిగెనో తెలియదు. పరిశోధకు లితని యాచూకీని నిశ్చయింప నేరక పలుతెరగుల నూహించియున్నారు. కొందఱిత డు పూర్వచాళుక్యవంశజుడగు కొల్లభిగండ విజయాదిత్యు డనిరి6. ఈ వ్యక్తినిర్ణయ మసంగతము. కొల్లభిగండవిజయాదిత్యుడు క్రీ. శ. ౯౨౧ యందు కళింగముపై దండెత్తిపోయి విరజాపురయుద్ధమున రణశయ్య నలంకరించెను. బిజ్జని యల్లరి నాల్గవ గోవిందవల్లభుని రాజ్యకాలమున క్రీ. శ. ౯౩౦ తరువాత జరిగినది. కావున గోవిందుని కోపమునకు బాత్రుడైన బిజ్జడు కొల్లభిగండవిజయాదిత్యు డని చెప్పుట సరికాదు. రెండవ అమ్మరాజవిష్ణువర్ధనుని పుత్రుడగు జేత, లేక కంఠికావిజయాదిత్యుడే బిజ్జడను తలంపు కొందఱికి గలుగవచ్చును 7. కంఠికావిజయాదిత్యుడు తన తండ్రిమరణానంతరము క్రీ. శ. ౯౨౫-౬లో నొక పక్షకాలము మాత్రమే రాజ్యము సల్పియుండినను, రాజ్యపునస్సంపాదనకై యతడు క్రీ. శ. ౯౩౫ మధ్య వఱకును నిమ్మడి చాళుక్యభీమునితో బెనగులాడుచుండినట్లు సమకాలిక శాసనములవలన దెలియుచున్నది 8; కాని జేతవిజయాదిత్యు డరికేసరిచే సంరక్షింపబడిన బిజ్జడుకాడని శ్రీ భావరాజు వెంకటకృష్ణరావుగారు వాదించుచున్నారు. "పూర్వచాళుక్యశాసనము లితని జేతవిజయాదిత్యు డనియే పేర్కొనుచున్నవి; కాని బిజ్జడని కాదు. మఱియు నతడు (గుజ్జిగగోవింద)నికి గోపమువచ్చునట్లు ప్రవర్తించినట్లును గానరాదు. బిజ్జని వలె నాతడు గోవిందుని కాశ్రితుడును గాడు. మన ప్రస్తుత (వేములవాడ) శాసనముగాని, పంపని విక్రమార్జునవిజయముగాని బిజ్జడు పూర్వచాళుక్యరాజకుమారుడని తెలుపవు. బిజ్జడే వేంగిరాజవంశజుడైయుండిన నాయంశమును నిమ్మడి యరికేసరి సగర్వముగ జెప్పియుండును; ఏలన నది యతని ఘనతను, పరాక్రమమును హెచ్చించియుండును9." ఇట్లు కృష్ణరావుగారు జేతవిజయాదిత్యుడు బిజ్జడు గాడని సకారణముగ రుజువు చేసినను, నత డెవ్వడో నిరూపింపక విడిచిపెట్టిరి. వేంగిపూర్వ చాళుక్య, వేములవాడచాళుక్యవంశములుగాక మఱియొక రాజవంశ మాంధ్రదేశమున రాజ్యముసేయుచుండెను. వీరికి చరిత్రపరిశోధకులు ముదిగొండ చాళుక్యులని నామకరణము చేసియున్నారు. వీరి తామ్రశాసన మొకటి వెలువడియున్నది. దీని కాలమును స్పష్టముగ నిర్ణయించుటకు దగు నాధారము లందు గానరాకున్నను, నక్షరస్వరూపమును బట్టి తత్సంహా

6 Dynasties of the Kanarese Districts, P. 381.

7. JAPRL. VI. P. 176.

8. ఎపి. ఇండి. సం. ౯. పు ౪౩.

"యుద్ధమల్లరాజమార్తణ్డకంఠికావిజయాదిత్య ప్రభృతయో విగ్రహీష్యతా అష్ట. విగ్రహైనైవ పంచ వర్షాణి గతాని. తతః—

యో౽ష్టచంద్రరాజమార్తణ్డస్తేషు యేన రణో కృతా, కంఠికావిజయాదిత్యయుద్ధమల్లౌ విదేశగౌ."

వీరిని తఱుముగొట్టియే క్రీ.శ. ౯౩౫లో నిమ్మడి చాళుక్యభీముడు రాజ్యాభిషిక్తుడైనది.

9. JAHRS. VI. P. 176.

వేంగియం దంతఃకలహములు పెచ్చెరిగి యరాజకము ప్రబలెను. ఈ పరిస్థితు లప్పటి పూర్వచాళుక్యుల శాసనముల జక్కగ వర్ణింపబడియున్నవి.

"పశ్చా దహమహమికయా విక్రమాదిత్యా స్తమయసే రాక్షసా ఇవ ప్రజాబాధనపరా దాయాదరాజపుత్రా రాజ్యాభిలాషిణో యుద్ధమల్లరాజమార్తండకంఠికావిజయాదిత్యప్రభృతయో విగ్రహీభూతా ఆసన్. విగ్రహేష్వేవ పంచవర్షాణి గతాని.2"

పై పేర్కొనిన రాజులలో యుద్ధమల్లుడు ముఖ్యుడు. ఇతనికి స్వబలముకంటె మిత్రబల మెక్కుడు. ఇతడు మొదటి యుద్ధమల్లుని మనుమడు. కంఠికావిజయాదిత్యుని పదచ్యుతుని జేసి పండ్రెండేండ్లు వేంగిసింహాసనము నధిష్ఠించియుండిన ప్రథమతాళరాజపుత్రుడు; రాష్ట్రకూటచక్రవర్తి నాల్మడిగోవిందవల్లభుని కాశ్రితుడు; అతడు దన సహాయార్థ మంపిన దళముల బలిమిచే వేంగిసింహాసనము నాక్రమించుకొని యేడేండ్ల కాలము రాజ్యమొనర్చెను. నామకార్థమమాత్ర మితడు రాజు; అధికారమంతయు రాష్ట్రకూటులచేత జిక్కెను. ఈవిషయము అమ్మరాజవిజయాదిత్యుని మాంగల్లు తామ్రశాసనమువలన విదితమగుచున్నది.

"సామస్తశబరవల్లభ
దణ్డాశాన్యశ్చభువ దులంప న్నద్ధాన్
సప్తాశ్వస్తదెఽత్ర మల్ల
రసరాజకృతపట్టబన్ధ మచ త్యబలాన్."3

ఇందువలన నాల్మడిగోవిందచక్రవర్తి మాన్యఖేటసింహాసనము నధిష్ఠించినవెంటనే రెండవ యుద్ధమల్లునికి గొప్ప సైన్యము నిచ్చి వేంగిమీది కంపి పూర్వచాళుక్యరాజ్యమునం దతని ప్రతిష్ఠించెను. ఇది నాల్మడిగోవిందచక్రవర్తియొక్క యజ్ఞాతఘనకార్యములయం దొక్కటి. ఇట్లు తన యాశ్రితుడు వేంగి నేలుచుండినను, గోవిందుని యధికారము వేంగియందు నిరాఘాటముగ సాగలేదు. మొదటి యమ్మరాజవిష్ణువర్ధనుని ద్వైమాతురుడైన రెండవ చాళుక్యభీముడు నిజదేశమును రాష్ట్రకూటదాస్యమునుండి తప్పించి పిత్ర్యమైన రాజ్యమును స్వాధీనపఱచుకొనుటకొఱకు పోరాడదొడగెను. ఇతని శిక్షించుటకై నాల్మడిగోవిందరా జొక్క గొప్పసైన్యము నంపెను. రాష్ట్రకూటసామంతులగు ధలిగ, వ్యంది మున్నగువరాజమార్తండులను జయించితినని చెప్పికొని యున్నాడు.

"య స్తాతవిక్యశాఖ్యం ధలిగంవ్యందిం మున్నగుతవ రాజమార్తణ్డా అకా విజిత్య......"

అని కోలవెన్ను శాసనము4. ఈవిషయమునే మఱికొంచెము విస్తరించి రెండవ యమ్మరాజు కలుచుంబఱ్ఱుతామ్రశాసనమునందు చెప్పియున్నది.

"శ్రీమ స్త రాజమయ్యం ధలిగమురుతరం
తాతవిక్కిం ప్రచణ్డం
బిజ్జం సజ్జంచ యుద్ధే బలిన మతితరా
మయ్యపం భీమ ముగ్రం
దణ్డం గోవిందరాజప్రణిహితమధికం
చోలపం లోవవిక్కిం
విక్రాన్తం యుద్ధమల్లం ఘటితగజఘటాన్
సన్నిహ త్యైక ఏవ"5.

ఇట్లు రాష్ట్రకూటసామంతసైన్యమును ద్వితీయ చాళుక్యభీముడే నిర్జించినట్లు పైశాసనములయందు జెప్పియున్నను, సహాయులు లేక యతనికి జయము చేకూడియుండదు. చక్రవర్తికి బ్రతికూలుడైన రాష్ట్రకూటసామంతు లతనికి బ్రత్యక్షముగనో, గూఢముగనో తోడ్పడియుండవలయును. ఈసందర్భమున నీక్రింది యంశములు దృష్టియం దుంచుకొనదగియున్నవి. రెండవచాళుక్యభీముడు గోవిందరాజుసైన్యములతో బోరాడుచుండిన కాలమునందే తూర్పుతెలింగాణమున పెద్ద అల్లరి యొకటి రేగినది. దీనికి బ్రధాననాయకుడు వేంగిగడిదేశమున నుండిన వేములవాడచాళుక్యరాజ్యమున కధిపతియైన యిమ్మడి యరికేసరి. రెండవ చాళుక్యభీమునకును, యిమ్మడి యరికేసరికిని నాల్మడి గోవిందవల్లభుడు సామాన్యశత్రువు. ఇద్దఱును గోవిందుని

---

2. ఎపి. ఇండి. సం. ౯. పు. ౮౩.
3. Cp. 1. of 1916-17.
4. SII. 1. No. 37.
5. ఎపి. ఇండి. సం. ౩. పుట ౧౩౩ తరువాయి.

పడెను. లేదరెండు సి. రెండలుగా రది క్రీ. శ. ౧౧ వ శతాబ్దము (క్రీ. శ. ౧౦౦౦—౧౧౦౦)నకు జెందిన దని నిశ్చయించి యున్నాడు. అందలి చాళుక్యవంశాను క్రమణిక యిట్లు వర్ణింపబడియున్నది :10

కొక్కరాజు
|
మొదటి కుసుమాయుధుడు.
|
విజయిత
|
రెండవ కుసుమాయుధుడు
|
విజయాదిత్యుడు
|
మూడవ కుసుమాయుధుడు
|
నిజ్జయరాజు — మలబోదురాజు — లోభచలుశ
భార్య అచికలి
|
వాగ్గవ కుసుమాయుధుడు

ఈవంశమున గడపటివాడైన వాగ్గర కుసుమాయుధుడు క్రీ. శ. ౧౦౫౦ ప్రాంతమున నుండె నని తలచిన తరమునకు విరువదియైదేండ్లచొప్పున పరిగణించిన నీవంశపు రాజుల కాలము నిట్లుజ్జాయించి చెప్పవచ్చును:

(1) కొక్కరాజు ౮౭౫— ౯౦౦
(2) మొదటికుసుమాయుధుడు ౯౦౦— ౯౨౫
(3) విజయిత ౯౨౫— ౯౫౦
(4) రెండవకుసుమాయుధుడు ౯౫౦— ౯౭౫
(5) విజయాదిత్యుడు ౯౭౫—౧౦౦౦
(6) మూడవ కుసుమాయుధుడు ౧౦౦౦—౧౦౨౫
(7) విజ్జయరాజు ౧౦౨౫—౧౦౫౦
(8) వాగ్గర కుసుమాయుధుడు ౧౦౫౦—౧౦౭౫

ఈ యుజ్జాయింపు కాలానుక్రమణిక ననుసరించి రాష్ట్రకూటవాల్లభిగోవిందరాజు కాలమున (క్రీ. శ. ౯౩౦-౯౩౬) ముదిగొండచాళుక్యవిజయితుడు రాజ్యము సేయుచుండినట్లు తేలుచున్నది. ఈయంచన సరియైనదే యని నిరూపించుటకు గొంత శాసనసాక్ష్యము గలదు. విజయితుని తండ్రి మొదటికుసుమాయుధుడు పైని కాలానుక్రమణికప్రకారము ౯౦౦-౯౨౫ల మధ్య రాజ్య మొనర్చియుండవలయును. క్రీ.శ. ౮౯౨-౯౨౧ ల నడుమ వేంగీదేశమును బరిపాలించిన మొదటి చాళుక్య భీముని సామంతు డొక కుసుమాయుధుడు గలడు. ఇతడు దన్నేలిన ప్రభువునకు శాసటరై నిలచి రాష్ట్రకూటబలముల నోడించి యతని నిజరాజ్యమున సుప్రతిష్ఠితుని గావించెనని కొఱవిశిలాశాసనమునందు చెప్పియున్నది11. కావున ముదిగొండచాళుక్యప్రథమకుసుమాయుధుడు మొదటి చాళుక్యభీమునికి సమకాలికుడనుటకు మనము సంశయ మందవలసినదిలేదు. ఇతని కుమారుడగు విజయితుడే యిమ్మడి యరికేసరిచే రక్షింపబడిన చాళుక్యబిజ్జ-విజయాదిత్యుడు. ఇతడు పాలించుచుండినది రణమర్దకసీమ. కృష్ణాజిల్లాలోని కొండపల్లి మొదలుకొని వరంగలుజిల్లాయందలి కొఱవిపర్యంతము గల భూమి యితని పాలనక్రింద నుండినది. మంచికొండసీమ యతని రాజ్యమునకు జెందినదే. ఇతని రాష్ట్రమున కుత్తరపుసరిహద్దు వేములవాడ చాళుక్య రాజ్యము. రాష్ట్రకూట వాల్లభి గోవిందరాజు రాజ్యము దూర్పున సముద్రముపర్యంతము వ్యాపించియుండినందున ద్వితీయయుద్ధమల్ల అరికేసరులవలెనీ ముదిగొండ విజయితుడుగూడ రాష్ట్రకూటసామంతుడని నిశ్చయించి చెప్పవచ్చును.

వాగ్గవ గోవిందరాజునకు బిజ్జనిమీద నేల కోపము కలిగెనో నిశ్చయముగ మనకు దెలియదు. కాని యూహసేయవచ్చును. బిజ్జనివంశమువారు పూర్వచాళుక్యరాజుల కాశ్రితులైన సామంతులు; అతని తండ్రియగు మొదటి కుసుమాయుధుడు ప్రథమచాళుక్య భీమునికి సామంతు డనియు, వేంగిదేశముపై నెత్తివచ్చిన ఇమ్మడికృష్ణవల్లభుని నిగ్రహించి తన రాజును రాజ్యమున సుప్రతిష్ఠితుని గావించె ననియు బూర్వప్రకరణమున దెల్పియున్నాడను. నిజరాజ్యస్వాతంత్ర్యస్థాపనకై రాష్ట్రకూటులతో బోర సమకట్టిన ద్వితీయ చాళుక్య

10. Ind. Ant. XXXII PP. 281-84.
11. తెలిం. శాస. ఇతర. పెం. ౧౨.

భీమునకు బిజ్జడు ప్రత్యక్షముగనో, రహస్యముగనో సహాయము చేసియుండవచ్చును. అందులకు గినిసి నాల్గవ గోవిందచక్రవర్తి యతని శిక్షించుటకు బ్రయత్నింపగా నతడు దన పొరుగున నుండు వేములవాడ ప్రభువును, దనవలెనే చాళుక్యవంశసంభూతుడును నగు నిమ్మడి యరికేసరిసాయము నపేక్షించెను. అరికేసరి నాల్మడి గోవిందరాజునకు బావమరిదియైనను నతని యెడ విముఖుడై యతని శత్రుల కేల తోడ్పడెనో చెప్పుటకు వీలుగాదు; కారణ మేదైయైనను నీతడు చక్రవర్తిని బ్రతిఘటించి యతని పతనమునకు గారకుడాయెను. వేములవాడ శిలాశాసనమందును, విక్రమార్జునవిజయమందును నరికేసరి నాల్మడి గోవిందరాజు నత్యంతసులభముగ నోడించి రాజ్యపరిభ్రష్టుని గావించె నని చెప్పియున్నది. ఇది కేవల మతిశయోక్తి. నాల్మడి గోవిందచక్రవర్తి యతని శత్రువులును, వారివాక్యములే వేదవాక్యము లని విశ్వసించి యతనిచరిత్రను రచియించు నాధునికపరిశోధకులును చెప్పునట్లు దుశ్చరిత్రుడును, దుర్బలుడును గాడు. కర్ణాటకమునందలి సామంతు లందఱును నతనియందు విశ్వాసమును గోలుపోలేదు. పాశ్చాత్యగంగరాజగు రాజమల్లుడును, కదంబబిజ్జడు మొదలగు పెక్కురు యతనిపక్షముననే యుండిరి. గోవిందుని బ్రతిఘటించిన సామంతులలో బ్రముఖులు తెలింగాణ వేంగిదేశములను బాలించుచుండిన చాళుక్యప్రభువులే. ఇమ్మడి యరికేసరి, బిజ్జడు, ద్వితీయచాళుక్యభీముడును విప్లవకారులయం దగ్రేసరులు. నాల్మడి గోవిందరాజు వీరి నడచుటకు రెండుమూడుపర్యాయములు బ్రయత్నము జేసెను.

(౧) తన సామంతుడైన పూర్వచాళుక్యద్వితీయ యుద్ధమల్లునికి బాసటగ రాజమయ్యమొదలగు దండనాయకుల యాధిపత్యముక్రింద నొక గొప్ప సైన్యమును వేంగిపై కంపెను. ఈసైన్యము నొక మహాభీకర సంగ్రామమున ద్వితీయచాళుక్యభీము డోడించె నని కలుచుంబఱ్ఱు తామ్రశాసనమువలన దెలియవచ్చుచున్నది. 12

(౨) ఇమ్మడి యరికేసరి చాళుక్యబిజ్జని కాశ్రయ మిచ్చినందులకు గినిసి యాతని శిక్షించుట కొక సైన్యము నంపెను. వేములవాడశిలాశాసనమునందిట్లున్నది:

"సామన్తా ద్దణ్ణముఖ్యా
న్నిజ భుజపరిఘాప్రస్ఫురత్ఖడ్గధారా
నీరాంభోరాశిమగ్నాం
స్తురగకరి ఘటాపత్తి సంపత్తియుక్తాన్
కృత్వా పశ్చా (?) ద్యుద్ధ మాయ్యం
స్వజనపరిజనైః సన్నిహత్యాఽఽజిరంగే
కృద్ధే గోవిందరాజే శరణ ముపగతో
రక్షితో యేన బిజ్జః." 13

ఈయంశము పంపని విక్రమార్జునవిజయమందును సూచింపబడియున్నది. "చళుక్యకులతిలక నప్ప విజయాదిత్యంగె గోవిందరాజం ముళిదొడెరెవర దెసెగిక్కె కాద శరణాగతజలనిధి యపెంపునం, గొజ్జిగనెంబ సకళచక్రవర్తియ సెసస దండుబంద మహాసామంతరం మరలిఱిదు గెల్ద సామంత చూడామణియబీరముమం", "గొజ్జిగనెంబ సకలచక్రవర్తి ముళిదొ తనగ శరణాగతనాద విజయాదిత్యన కాద బల్లాళ్తనదొళ్ శరణాగతజలనిధియుం."14

(౩) ఇట్లు గోవిందరాజు పంపిన సామంతబలము నోడించినను నతనితోటి పోరంతట ముగియలేదు. మరల గోవిందరాజెత్తి రాగలడు; అతని నెదుర్కొనుటకు దను ప్రయత్నము చేయవలసియుండెను; కావున నతడు తన దృష్టిని త్రిపురివైపునకు ద్రిప్పెను. బద్దెగని పక్ష మవలంబించిన నతనితోగూడ చేదిబలము దనకు సహాయము రాగలదు. అతని మామగారగు యువరాజదేవు డతని రాష్ట్రకూటసామ్రాజ్యమున బ్రతిష్ఠించుటకు దన యాశక్తిని వినియోగించును—అని చింతించి గోవిందుని రాజ్యభ్రష్టుని గావించి, యతని స్థానమున బద్దెగని స్థాపించుట తనకు శ్రేయస్కరమని నిశ్చయించి బయలువెడలి వేములవాడకు రమ్మని యాహ్వానించెను. బద్దెగడు వెంటనే త్రిపురినుండి తరలివచ్చి వేములవాడ జేరెను. తరువాత యుద్ధము ప్రారంభమైనది. ఈ పోరాటమునుగూర్చి మన కేమియు దెలియదు; కాని తుద నరికేసరి విజ

12. ఎపి. ఇం డి. సం. ౭, పుట ౧౭౭ తరువాయి.
13. తెలిం. శాస. ఇతర రెం. ౨౧.
14. విక్ర. వి. ౯-౫౨-౫౩ ల మధ్య వచనము, ౧౪: ౩౭-౩౮ ల మధ్య వచనము.

యను నంది పనియు, నాల్మడి గోవిందుని యేలుబడి యంతటితో సమాప్తినంది బద్దెగని పాలన యారంభ మాయె ననియు, 'నవతివర్తియాగి మార్మలెవచక్రవర్తియుం కిడిసి తన్న నంబి వంద బద్దెగదేవంగె సకళ సామ్రాజ్యమనోరంతుమాడి నిఱిసిదరికేసరియ తోళ్వలమమం' అను పంపకవివాక్యముపలన దెలియు చున్నది15. ఈయుద్ధమున నిమ్మడి యరికేసరి నాల్మడి గోవిందరాజును జంపె నని కొందఱు పరిశోధకుల లభిప్రాయ పడుచున్నారు16. ఈ యభిప్రాయము సరియైన దని యంగీకరించుటకు వీలులేదు. ఏలనగా, సమకాలికచోళశాసనములవలన నాల్మడి గోవిందరాజు దన పరాజయానంతరము తనకు పిల్లనిచ్చిన మామగారగు చోళరాజు పరాంతకుని రాజ్యమున గనీసము క్రీ. శ. ౯౩౭ వఱకు నివసించుచుండినట్లు తెలియవచ్చుచున్నది.17

ఇమ్మడియరకేసరిఘనకార్యములలో వివరింపవలసిన దింకొక్కటి మిగిలియున్నది. కక్కలుని తమ్ముడైన బప్పుకనియంకకాఱునిపై నితని విజయము. కక్కలుని యానవాలుపట్టుటయందు పరిశోధకులు భిన్నాభిప్రాయములను వెలిబుచ్చియున్నారు. డాక్టరు బార్నెటు, ఇతడు కక్కడను నామాంతరముగల కడపటి రాష్ట్రకూటచక్రవర్తియగు ద్వితీయకక్కలుడు గావచ్చు ననిరి18. ఈ వ్యక్తినిర్ణయమునే శ్రీ భావరాజు వి. కృష్ణరావుపంతులుగా రంగీకరించిరి. మఱియు నితని తమ్ముడగు బప్పువడే యొక సైన్యముతోగూడ నిమ్మడియరికేసరిపై యుద్ధమునకువచ్చి యతనిచే నిర్జితుడై యతనికి లొంగెనని వ్రాసియున్నారు19. డాక్టరు బార్నెటుగారి వ్యక్తినిర్ణయము సరియైనది కాదని ఆచార్య కె. ఎ. నీలకంఠశాస్త్రిలవారు త్రోసిపుచ్చిరి. వీ రిట్లు చెప్పుచున్నారు: "ఇచట పేర్కొనబడిన కక్కలుడు తరువాత చాల కాలమునకు రాజ్యమునకు వచ్చినట్టి యాపేరిటి కడపటి రాష్ట్రకూటరాజు కాజాలడు. అతడప్రకటితమైన శిలాహారతామ్రశాసనమున ముమ్మడి యమోఘవర్షునిచే బరాభూతుడైనట్లు చెప్పియుండు నాపేరిటి మనుజుడై యుండవలయును. బప్పుగడు గోవిందుని పక్షము నవలంబించి నిజగజదళములతో నతని వెదుకొని యుద్ధముజేసి యోటమి నందియుండవలయును"20. ఈ రెండు వ్యక్తినిర్ణయములలో నాచార్య నీలకంఠశాస్త్రిలవారిదే సమంజసముగను, నంగీకార్యముగను నున్నది. కాని డాక్టరు బార్నెట్టుగారి కక్కలునికిగాని, యాచార్యనీలకంఠశాస్త్రిలవారి కక్కలునికిగాని బప్పువ డను తమ్ముడుండె ననుట కెట్టి యాధారమును గానరాదు. మఱియు శ్రీ భావరాజు వి. కృష్ణరావుపంతులుగారును, నాచార్య నీలకంఠశాస్త్రిలవారును బప్పువడే స్వయముగ నిమ్మడి యరికేసరితో బోట్లాడి యోడిపోయినట్లు వ్రాసియున్నారు; కాని వీరి యభిప్రాయముతో పంపకవివాక్య మించుక విరోధించుచున్నది. "కక్కలన తమ్మనప్ప బప్పువనంకకాఱన నొందు మదాంధగంధసింధురద నోడిసిద వైరిగజఘటావిఘటనపటుమం"21 అను వాక్యమువలన నిమ్మడి యరికేసరి వెదిరించినవాడు బప్పువని యంకకాడుగాని బప్పువడు కాడని స్పష్టమగుచున్నది. అంకయుద్ధమున నొకనికై మఱియొకని

15. విక్ర వి. ౯ : ౨౨-౨౩ ల మధ్యవచనము.

16. శ్రీభావరాజు వి. కృష్ణరావుపంతులుగారు ఇట్లనుచున్నారు: "రాష్ట్రకూటరాజగు గొజ్జిగడు దన యధికారమున కెదురుదిరిగిన సామంతరాజులను శిక్షించుటకై గొప్ప దండుతో గూడ స్వయముగ వారిపై నెత్తిపోయెను; కాని యటుపిమ్మట నడచిన యుద్ధములో నత డోడి నిహతుడాయెను." (J. A. H. R. S. VI. P. 184). 'నదిచక్రవర్తియుం కిడిసి' అను పంపకవిమాటలపై నాధారపడియున్నది. 'కిడిసి' యనగా 'చెఱచు' అని యర్థము. దీనికి 'చంపి' యను నర్థ ముండునట్లు తోచదు.

17. ఏ. ఎస్. రామనాథయ్యరు. ఎపి. ఇండి. సం. ౨౬. పుటలు ౨౩౦-౨౩౨.

18. ఎపి. ఇండి. సం. ౧౩, పుట. ౩౨౯.

19. JAHRS. VI. P. 184.

20. Journal of the Madras University XV, No.2, P.124.

21. విక్ర. వి. ౯ : ౨౨-౨౩ ల మధ్యవచనము.

యుద్ధముసేయు ప్రతినిధి యంకకా డనబడుచున్నాడు22. ప్రతినిధి పొందిన జయాపజయములు నియోజకునివే యైనను సాధారగ్రంథాదులం దుండు విషయము నుండునట్లే చెప్పుట మంచిది.

ఇమ్మడి యరికేసరినిగూర్చి మనకు తెలియ వచ్చెడు విశేషాంశము లింకేమియు గానరావు. ఇతనికాలుపున(సోలదగండ)బద్దెగని తంత్రపాలుడైన నాగమార్యుని పుత్రుడు పెద్దణార్యుడను బ్రాహ్మణుడు తంత్రపాలుడుగ నుండెను. తంత్రపాలు డనగా సేనాధిపతి. దీనివలన వేములవాడ చాళుక్యుల యేలుబడిక్రింద పెద్దణార్యుని కుటుంబమువారు కులక్రమాగతులుగ, సేనాధిపతులుగ నుండిరని తేలుచున్నది23. పెద్దణార్యునిచే ప్రార్థింపబడి ఇమ్మడి యరికేసరి యతనిచే నిర్మితమైన యాదిత్యగృహమునకు వచ్చు నభ్యాగతజనుల సత్రముకొఱకు భూదానమొసగెను. ఈదానమును ప్రకటించుటకొఱకే వేములవాడ శిలాశాసన ముల్లేఖింపబడినది. ఈ పెద్దణార్యుడు గాక ఇమ్మడి యరికేసరియనుచరులలో మఱియొకనిపేరీశాసనమువలన తెలియవచ్చుచున్నది. ఇతని పేరు గుణకశర్మయని డాక్టరు మారేమండ రామారావుగారు పఠించిరి. శ్రీకృష్ణరావుపంతులుగారు 'గుణకరశేష'యని చదివిరి. ఆచార్య నీలకంఠశాస్త్రిలవారు కృష్ణరావుగారి పాఠమునే యంగీకరించిరి. శాసనప్రతిబింబములను తెప్పించుకొని వానిని జక్కగ పరిశీలించి 'గుణాంకుశేశ' యనునది సరియైన పాఠమని శ్రీ. శే. రావుబహదూరు సి. ఆర్. కృష్ణమాచార్యులవారు నిర్ణయించిరి. ఇతడు ఇమ్మడియరికేసరి యొక్క మహాసాంధివిగ్రహికుడు. గుణాంకుశుని వేములవాడశాసనమునందు పేర్కొనుటకు గారణము లేకపోలేదు. సాంధివిగ్రహులు మంత్రులనియు, నన్యరాజులతో సంధిగాని, యుద్ధముగాని వీరి మూలముననే జరిగెడిదనియు జరిత్రపరిశోధకు లభిప్రాయపడుచున్నారు. కానిలభ్యమైన సాక్ష్యమును బట్టి చూడగా వీరి వృత్తిధర్మమునకు సంధివిగ్రహములతో నెట్టిసంబంధ ముండినట్లు గానరాదు. వీరు శాసనములయందు సర్వసామాన్యముగ శాసనగ్రంథరచయితలుగనే పేర్కొనబడియున్నారు. సాంధివిగ్రహిపదముల కీచట షాడ్గుణ్యముతో నెట్టి సంబంధ ముండునట్లు తోచదు. వీని కీచట వాక్యరచనయందు శబ్దములను గూర్చుట, సమస్తపదములను విడదీయుట యని యర్థముచేసికొనుట యుక్తము24. కావున గుణాంకుశుడు వేములవాడశాసనగ్రంథమును రచియించుటచేత నతడందు పేర్కొనబడియెను.

"సంధివిగ్రహచింతాస్య పదవిద్యా స్వభూ త్పరం
ధౌతయాతస్యపక్షస్య క్వ సంధానం క్వ విగ్రహః"

ఈశ్లోకముపై గన్నడవ్యాఖ్య: "భరతరాజనిగె సంధియ చింతెయూ విగ్రహద చింతెయూ ముఖ్యవాగి వ్యాకరణశాస్త్రగళల్లిద్దవు. సంధియూ యుద్ధవూ ఇరలిల్లవెం దర్థవు. శత్రుపక్షవన్ను నాశమాడిదవనిగె సంధి యెల్లి? యుద్ధవెల్లి?"

(సశేషము)

---

22. చూ. భారతి సం. ౨౪. పుటలు ౪౯౩-౬.

23. ఆచార్య నీలకంఠశాస్త్రిలవారీ బద్దెగడు వేములవాడ చాళుక్యబద్దెగడు గాడనియు, ముమ్మడి యమోఘవర్ష బద్దెగడు గావలయుననియు నభిప్రాయపడుచున్నారు. పెద్దణార్యుని తండ్రియైన నాగమార్యుడు బద్దెగని సత్రపాలుడని వ్రాసిరి. ఇది డాక్టరు మారేమండ రామారావు, శ్రీ భావరాజు వి. కృష్ణరావు పంతులుగారల యుపపాఠము నాధారముచేసికొని వ్రాసినది. శాసనప్రతిబింబమున (చూ. ఆంధ్రేతిహాస పరిశోధన పత్రిక, సం. ౬. పుట ౧౭౯ ఎదుట)—

౭౫. "శ్రీమాన్నృధి బ్బద్దిగభూమిభర్త్తుస్త[ం]
౭౬. త్రాధిపాలో౽జని నాగమార్య్యః"

అనియే యున్నది.

24. cf. జినసేనకృతపూర్వపురాణము. త్రింశతమ పర్వము, ౧౧.

మధురస్మృతి

శ్రీ వేదాల తిరువేంగళాచార్యులు

ఇది స్మృతిచిహ్న మీమెడ పయింబయి పొంగు మహోజ్జ్వలంపు నె
మ్మది; మధురంపు వేదనల మాలిమి తాలిమి తూలజేయగా
నొదవెడు చిత్తమం దెసగు నూహలు కూర్చిన రూపురేఖలన్
పదిలమొనర్చు భావనలు పల్కుట భావ్యము కాదు పైటికిన్.

మనసున కూరటల్ సలుపు మాటల తేటల నూటలూరగా
ననుకొనినాను; తానుగ నయంబు భయం బసయంబు జూపు మో
మును కనినాను లోన;- తలపోయని పోకల దూకు దైవచిం
తన గమనించినంత వితథంబగు నంతయు వంత సంతనై.

తరచుగ నెవ్వరున్ జనని దారిని తారుచునుండు దివ్యసుం
దరతరుణారుణారుణకనత్కనకాధమయూఖమాలికా
దరవికసత్సరోజమధుధార సుధారసమాధురీపరం
పర యది యాని యాని తనుపారు కృపారసమున్ దలంచెదన్.

కలిగిన యన్నినాళ్లు తణకన్ బెణకన్ పనిలేక ద్రాక్ష తీ
వెల ఫలగుచ్ఛముల్ విరియు వెల్లువ పెల్లుబుకంగ మోవి తీ
పుల పులకండముల్ గలిపి భావపరంపదమందు పట్ట భ
ద్రులమయి ఖేదమోదముల త్రోవలు దాటుట గుర్తువచ్చెడిన్.

జిలిబిలి వ్రేళ్లు చెక్కులను జేరిచి, కన్నుల వన్నెచిన్నెలన్
గలిపి మొగంబు భావన వికస్వరమైన పికస్వరంబు చి
ప్పిల మధుమాధురీలహరివీచిక లొయ్యన తియ్యనైన అం
ఘ్రుల లయమున్ మనోలయముగూర్చుట గూర్చిన గుర్తువచ్చెడిన్.

ఒకమెడ నొక్కమాటమె అయోమయమైన దిదేమి ఎట్లు దీ
నికి వివృతిక్రియల్ ? పలుకునిల్వని చెల్వది చెల్వ ? నిల్వ మిం
తకు నను భావ మేది ? నవనవ్యతభావము పైకొనన్ మనం
బొకమెడ తన్నుతా దలచి ఊహయొనర్చుట యెట్లు చూపుటల్!

మన యనుబంధ మెట్టి దనుమానము లేక వచింపుమా! సునం
దనము రచింపుమా! హృదయదారకమర్మము చింపుమా! తనం
తన సుధ పొంగిపొంగి విన తానతిదాస్యము వాయజేయు మో
హనమన, కామమన్న, ప్రణయంబన మాటల చుల్క నేకదా!

అది మన మైత్రియా! ప్రణయమా! నయమా! భయమా! విరోధమా!
మది ననురోధమా! శపథమా !పథమా! మనలోని మోదమా!
వదలగజాలనట్టి అనువాదమ! వాదమ! ఖేదమా! దురా
నదమగు వాఙ్మనస్సులకు జల్పిన సంగతి యోజనాగతిన్.

ఏమనబోయినన్-మరి ఎదేవిధి తల్పగబోయినన్-ఇకే
గోమున చూడబోయిన నగోచరమేసుమి నీచరిత్ర మీ
జామున ఈనిమేషమున సాగిన లోగిన బాగొ! ఓగొ!! ఇం
తే మరి దక్క-తక్కనది తేలదు పోలదు బుద్ధి కెన్నడున్.

తేలదు పొమ్ము చింత జలధిన్ ; మనజాలదు పొమ్ము భావనా
జాలమునన్-కుమారి లెదు సాగదు దుఃఖపు గుమ్ములో, మరే
వేళకునైన ఏపొలము ప్రేగులనైన తనంత నే మనే
పోలికలే కనంబడదు పొమ్మిక నేల వృథాప్రయాసముల్!



మమకారం

[కథానిక]

●

శ్రీ గోపీచంద్

జోగయ్యమామ కర్రపోటు వేసుకుంటూ వచ్చి కాలవకట్టమీద వున్న నేరేడు చెట్టునీడను నుంచున్నాడు. సూర్యుని కిరణాలకు చెయ్యి అడ్డంపెట్టుకుని తన పొలాన్ని ఒక్కసారి చూచుకున్నాడు. తన చేల గట్లమీద వున్న తుమ్మచెట్లన్నీ అతనికి గుర్తే. అవికూడా తనతో పుట్టి, తనతోపాటు పెరుగుతూ వస్తున్నాయి. అందులో, తన హయాంలో, అవసరంగా నాగలిదుంపలకు కావలసివచ్చి రెండు తుమ్మచెట్లనుమాత్రం నరికించాడు. అవి వుండే స్థలం యిప్పటికీ అతనికి బోసిగా కనిపిస్తూనేవుంటుంది. ఆ స్థలాన్ని చూచినప్పుడల్లా చేతికింద కొచ్చిన యిద్దరు కొడుకులు తన్ను విడిచి వెళ్లినట్లు బాధపడుతూ వుంటాడు.

జోగయ్యమామ నిట్టూర్పువిడుస్తూ తలకు చుట్టుకున్న గుడ్డ పరచి, నేరేడు చెట్టుకింద కూర్చున్నాడు. అతనికి ముగ్గురు కొడుకులు. పెద్దఅతను నర్సయ్య. పొలం పని చూచుకుంటున్నాడు. రెండో అతను దొరయ్య. బట్టలదుకాణం పెట్టి, సొంతంగా నాలుగు రాళ్లు సంపాదిస్తున్నాడు. ఆఖరి కొడుకు వెంకటసుబ్బయ్య. ఇంగ్లీషుచదువు చదువుతున్నాడు. వీళ్లుకాక అతని కిద్దరు కూతుళ్లు. అతని పిల్లలందరికీ అతనంటే యిష్టమే. అతనికీ వాళ్లంటే ప్రేమే. కాని అవసరమైతే వాళ్లను చూడకుండా వుండగలడు గాని, తన పొలాన్ని మాత్రం చూచుకోకుండా ఒక్క పూటకూడా వుండలేడు. తన పిల్లలందరూ పొలంమీద పాటుపడాలని వుంటుం దతనికి. పొలాన్ని వృద్ధి చెయ్యటానికే వాళ్లు పుట్టింది అనిపిస్తుంది. అందుకనే బట్టలదుకాణం పెట్టిన కొడుకుమీద మనసులో కొంచెం కోపం. 'వాడూ మంచివాడే. పెళ్లాంమాట విని చెడిపోయాడు' అని చెపుతాడు.

జోగయ్యమామ కిపుడు వందెకరాలు వుంది. ఆస్తిలో ఎక్కువభాగం తాను రెక్కలమీద సంపాయించినదే. అందుకని మిగిలిన బాంధవ్యాలన్నీ ఆస్తిముందు స్వల్పంగా కన్పిస్తయి అతనికి.

పొలాన్ని ప్రాణప్రదంగా కాపాడతాడు. పొలం బాగా పండటానికి ఏపనైనా చేస్తే అనేకసార్లు తన ప్రాణాలను లెక్క చెయ్యకుండా అవతలవాళ్లు వేయించిన అడ్డకట్టును తీయించి, తన చేనుకి నీళ్లు పెట్టుకున్నాడు జోగయ్య. ఎవ్వళ్లొస్తారో

రండి అని దుడ్డుకర్రి బట్టుకొని చేనుగట్టు మీద నుంచుంటే వూరు వూరంతా హడలెత్తిపోయేది. బాగా నెర్రెగొట్టిన తన చేను ఆ నీటిని గుటగుటా తాగుతుంటే పసివానికి స్తన్యాన్నిస్తూ పరవశత్వంతో కూర్చునే తల్లిలా నుంచునేవాడు. కొడుకులు పెరిగొచ్చింతర్వాత "మేం వుండగా నీకెందుకీ తాపత్రయం, కృష్ణా రామా అనుకుంటూ కాలం గడుపుకోక" అంటున్నారు. వాళ్లకేం తెలుసు పసిగాయలు! యీ తాపత్రియంవల్ల తనెంత సుఖపడుతున్నదీ వాళ్లకు అందే అనుభవం కాదు.

నెల రోజుల క్రితం జోగయ్యమామ భార్యకు జబ్బుచేసి ప్రాణంమీదకు వచ్చింది. అప్పటికి పది రోజులనుంచీ ఆమె ముక్కుతూ మూలుగుతూ వుందే గాని, జోగయ్యమామ అట్టే పట్టించుకోలేదు. ఆ విషయం యింట్లోవాళ్లు ఎవళ్లు కదిలించినా, "రోగాలు మనుష్యులకు రాక మానులకు వస్తయ్యా?" అంటూ వెళ్లేవాడు. దమ్ముచేసే రోజులవి. అతనికి తీరేది కాదు. ఏదైనా జబ్బు అంతతొందరగా మూసుకొస్తుం దనుకోలేదు అతను. "నువ్వింట్లో వుండు, అమ్మని కనిపెట్టుకొని; నేను చేను తడిపించి వస్తాను" అని పెద్దకొడు కన్నాడేగాని జోగయ్యమామ యింటిదగ్గర వుండలేకపోయ్యాడు. అసలే నీటికి ఎద్దడిగా వుంది. ఎవరు అడ్డం వేస్తారో. తన పెద్దకొడుకు బుద్ధిమంతుడే కాని వుట్టి అర్భకుడు. అవతలవాళ్లు నోరుచేసుకుంటే వెనక్కు తగ్గుతాడు. తీరా, పొలం తడవకపోతే, తరువాత ఏమనుకునేం లాభం? అందుకని వూళ్లో వైద్యుడిచేత భార్యకు నాలుగు మాత్రిలు యిప్పించి, కాసిని నీళ్లు తాగించి "కళ్లు మూసుకు పడుకో; కునుకు పడుతుంది" అని చెప్పి, తను పొలం బయలుదేరాడు. వూరిచివర చింతచెట్టుదగ్గరికి వచ్చేసరికి కొడుకు పంపిన మనిషి ఎదురుగుండా వచ్చాడు. "అవతల వాళ్లు కర్రిలూ బల్లాలూ పుచ్చుకుని సిద్ధంగా వున్నారు. నర్సయ్యకి కాలూ చెయ్యీ ఆట్టంలేదు" అని చెప్పాడు.

జోగయ్యమామ గబగబా పొలానికేసి నడిచాడు. కాలవకు వేసిన అడ్డు తెంచి నీళ్లని తన చేలోకి మలిపాడు. అవతలి వాళ్లు కర్రిలూ, బల్లాలూ పట్టుకొని చూస్తూ నుంచున్నారేగాని ఏమీ అనలేక పోయారు. తన చేలోకి నడుస్తున్న నీటి గలగల వింటూ సర్వం మరచి నుంచున్నాడు చేనుగట్టుమీద జోగయ్యమామ.

"అమ్మ కెట్లా వుంది?"— అడిగాడు నర్సయ్య.

"ఉంది" అన్నాడు జోగయ్యమామ.

"తగ్గిందా?" అడిగాడు నర్సయ్య.

"తగ్గ కేం చేస్తుంది?" అన్నాడు జోగయ్యమామ.

"ఇంక మనం వెళ్దాం" అన్నాడు నర్సయ్య. యీ మాటకు జోగయ్యమామ వులిక్కిపడ్డాడు. "చేనంతా తడవక ముందే విడిచి వెళ్లడమే?" అన్నాడు జోగయ్యమామ.

"ఇంట్లో ఎవరూ లేరు, మంచికైనా చెడుకైనా" అన్నాడు నర్సయ్య, ఆదుర్దాగా. "నువ్వు వెళ్లు. నే నిక్కడ వుంటా" అన్నాడు జోగయ్య. నర్సయ్యకు తెలుసు—

తన తండ్రి పనిమధ్యలో విడిచిపెట్టి రాడని. ఇష్టంలేకపోయినా, ఏమీ అనలేక తన తండ్రిని చేనుగట్టుమీద విడిచిపెట్టి, యింటికి వెళ్లాడు నర్సయ్య.

కాకులు కూస్తుంటే కబురు వచ్చింది-- జోగయ్య మామను తక్షణం రమ్మని. అతనికి తెలుసు తనకూ, తన భార్యకూ ఋణానుబంధం తీరిపోతూ వుందని. కాని చేను యింకా వొకకొన తడవాల్సివుంది. చూస్తూచూస్తూ పని మధ్యన వెళ్లలేక పోయాడు.

నీళ్లు నెమ్మదిగా పారుతూ నెర్రెల్ని, బొరియల్ని నింపుతూ ఆ కొసని తడిపింది. అప్పుడు జోగయ్యమామ గబగబా యింటికి బయలుదేరాడు భార్యని చూద్దామని.

అతను వెళ్లేటప్పటికి ఆమె అవసాన దశలో వుంది. ఆ అవస్థలో వుండికూడా ఇంటి సంగతులే మాట్లాడుతూ వుంది. "మూడో వాడికి ముడివెయ్యమంటే నా మాట విన్నారుకాదు" అని భర్తని నిష్ఠూరాలాడింది. రెండో కోడలు తన మాట వింటం లేదని అక్కసు వెళ్లబోసుకుంది. "ఎలుకలు పురుల్ని కొట్టిపోస్తున్నయ్. కాస్త మట్టి రాయించమంటే రాయించలేకపోతిరి" అన్నది. "బట్టలకి బాగా గంజి పెట్టడంలే"దని చాకలిదానిమీద కేకలువేసింది. తనే మజ్జిగ చెయ్యాలని కవ్వంకోసం లేవబోయింది. "పెద్దకోడలికి వెన్న తియ్యటమే చేతగాదు. సగానికి సగం మజ్జిగలోనే విడిచిపెడుతుంది" అని చెప్పింది. తాను గుటుక్కుమన్న తర్వాత యీ కాపరం ఏ మవుతుందో అని వేదనపడ్డది.

"ఆమాటలన్నీ ఇప్పు డెందుకు? ఒక్క క్షణం నిశ్చలంగా వుండు" అన్నాడు జోగయ్యమామ.

కాని ఆమె నోటికి మూత పడలేదు. ఆఖరినిమిషంవరకూ మాట్లాడుతూనే వుంది. అందరికీ ఏదో వకటి చెపుతూనే వుంది. పనులు పురమాయిస్తూనేవుంది. చివరికి 'అబ్బో అబ్బో' అంటూ బాధ పడుతూ జోగయ్యమామ చెయ్యి గట్టిగా పట్టుకుంది. అతని చెయ్యి పట్టుకునే యీ లోకాన్ని విడిచింది.

* * *

సరిగా యిప్పటికి నెల, ఆమె యీ లోకాన్ని విడిచి. భార్యజబ్బు లెక్కచెయ్యకుండా, ప్రాణాలను లెక్కచెయ్యకుండా అంత కష్టపడి నీరుపెట్టిన చేను మూస తిరిగింది. కూలివాళ్లు కలుపు తీస్తున్నారు. హుషారుగా పాడుతున్నారు, ఆడవాళ్లూ మొగవాళ్లూ కలిసి.

జోగయ్యమామ అట్లాగే నేరేడు చెట్టు నానుకుని కూర్చున్నాడు. అతని మనస్సు ఇదివరకంత స్థిరంగా వుండటం లేదు. తన భార్య చనిపోయేటప్పుడు పడిన తాపత్రియం అతను మరిచిపోలేక పోతున్నాడు. ఆమెకు తెలుసు తను పోతున్నానని. కాని ఒక్క నిద్రపోయి లేచే దానికి మల్లే మాట్లాడింది. పోయేదానికి తన కెందు కివన్నీ? ఒకళ్లకు మాత్రం ఎందుకు? అంతా పోయేవాళ్లే. అయితే యిక కావలసిం దెవరికి? పొలంలోనుంచి పాట వినిపించింది.

ఒక్కసారి కన్ను తెరచి తన పొలం అంతా పారజూశాడు జోగయ్యమామ.

ఆ మధ్య తన మనమడు తనతో పొలం వచ్చాడు. "తాతయ్యా, మన పొలం ఏదీ?" అని అడిగాడు. "నీకు కనబడుతున్నదంతా మందేరా" అన్నాడు. వందయెకరాల ఏక కండ్రిక. తన మనమడికి అవతలితట్టు కనపడకుండా సముద్రంలా వున్న పొలం చూపిస్తూ "ఇదంతా మందేరా" అన్నప్పుడు అతని మనస్సు ఆనందంతో నిండింది. మొట్టమొదట తా నీవూరు ఎడ్లబేరానికి వచ్చాడు. తా నెవరికయితే ఎడ్లని అమ్మాడో, ఆ ఆసామీకే ఇల్లరికపు టల్లుడయాడు. తన నడవడిక చూచి, తన వ్యవహారికజ్ఞానంచూచి ఆ ఆసామీ మోజుపడి కూతుర్ని తన కిచ్చి చేసి ఇంట్లో పెట్టుకున్నాడు. ఆనాటినుంచీ వళ్లు దాచుకోకుండా తాను పనిచేశాడు. తను అడుగు పెట్టినపుడు తన మామకి అయి దెకరాలు వుండేది. తన చెమటతో తడిపి, పండించి పది సంవత్సరాలు తిరిగొచ్చేటప్పటికి ఆ అయిదెకరాలకీ మరొక అయి దెకరాలు జతజేశాడు. తన మామకి తనమీద గురి ఏర్పడ్డది. ఆయన పోతూపోతూ "నిన్ను దగ్గరికి తీసినందుకు నాపరువు నిల్పావు" అన్నాడు. తను పడిన కష్టమంతా ఆ ఒక్క మాటతోనే తీరిపోయింది. తన మామ చనిపోయినప్పటికి వందెకరాలు చేశాడు. కాని వృద్ధిచేస్తున్నపుడు తనకు కలిగిన ఆనందం యిప్పుడు కల్గటంలేదు. రోజూ పొలం రావడం, పొలాన్నంతా ఒక్కసారి చూచుకోవడం, పాలేళ్లను గదమాయించడం— ఇంతవరకే మిగిలింది. అంటే ఆ ఆనందం పోయి అలవాటే మిగిలింది.

జోగయ్యమామ నేరేడుచెట్టు కానుకుని అట్లాగే కూర్చున్నాడు. పొద్దు నెత్తిమీదికొచ్చింది. నేరేడుచెట్టు ఆకుల్లోంచి ఎండ జోగయ్యమామముఖంమీద పడ్డది. ఆ వేడికి ఆయన నెమ్మదిగా కన్ను తెరచి చూశాడు. పొలంలో కూలీలు లేరు. సర్దుకుని గబుక్కున లేవబోయాడు. కదిలాడు. ఎదురుగా చెట్లకు కట్టిన మూటలు విప్పుకుని కూలీలు బువ్వ తినటం చూశాడు. కొంతమంది అన్నంముద్దలు మింగుతున్నారు. కొందరు బట్టలకి చేతులు తుడుచుకొంటున్నారు. కొందరు తలగుడ్డలు విప్పుకొని గట్టుమీద పరుచుకొని పడుకున్నారు.

'లేవండ్రా' అని కేకలేశాడు జోగయ్యమామ. "ఇంత వయస్సులో దొరకెంత యావ" అని నవ్వుకున్నారు అంతా. "ఇప్పుడేగా దొరా, కూటికొచ్చింది" అన్నాడొకడు కేరింతలు కొడుతూ. ఒక్కొక్కళ్లూ మళ్లీ చేలోకి దిగారు.

జోగయ్యమామ ఒక్కసారి పూరి వైపు చూశాడు. మధ్యాహ్నంపూట ఆ నేరేడుచెట్టుకింద అన్నం తినటం జోగయ్యమామకి అలవాటు. యిప్పటికీ ఆయన మనుమరాలు రోజూ అన్నం తెచ్చి పెడుతుంది. దూరంగా అన్నంగిన్నె నెత్తిమీద పెట్టుకొని మనమరాలు రావటం చూశాడు. మబ్బు బాగా వేసింది. వర్షం వస్తుందేమో. తాను తడిస్తే ఫరవాలేదు కాని, తన మనమరాలు తడుస్తుందేమో! వర్షం ఎక్కువైతే పనసచెట్టుక్రింది గుడిశలోకి వెళ్లాలి. ఎప్పటి గుడిశ. మొట్టమొదట

తాను చేసుకొన్నప్పుడు వేసిన గుడిశ. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ అట్లాగే నిలబడివుంది.

"తాతా, అన్నం తెచ్చా" అని మనమరాలు గిన్నె కిందబెట్టి గిన్నెకు కట్టిన గుడ్డ విప్పింది. ఒకపక్క గోంగూర పచ్చడి, నల్లగా నిగనిగలాడుతూ వుంది. ఒక పక్క ఆవకాయపచ్చడి, ఎర్రగా నెత్తురుముద్దలా వుంది. ఆ రెంటిమధ్యా తెల్లటి అన్నం.

"నువ్వు తింటూవుండు తాతయ్యా, నేను చేలోకి వెళ్లివస్తా" అంటూ రివ్వున పరిగెత్తింది మనమరాలు. జోగయ్య మామ నెమ్మదిగా లేచాడు. బట్టలు దులుపుకుని తలకు చుట్టుకొని కర్రపోటు వేసుకుంటూ గట్టు దిగాడు. కాలవలో నీళ్లు దోసెడు తీసికొని నోట్లో పోసుకొని పుక్కిలించి వూశాడు. నెమ్మదిగా మళ్లీ నేరేడుచెట్టుదగ్గర కొచ్చి కూర్చున్నాడు. కర్ర పక్కన పెట్టుకొని అన్నంగిన్నె ముందుకు లాక్కున్నాడు. ఆవకాయ పచ్చడి వేలితో తీసుకొని నాలిక్కి రాసుకున్నాడు. ఒక్క లొట్ట వేశాడు. ధ్వని కలగలేదు. అలవాటుప్రకారం ఆవకాయ పచ్చడి నాలిక్కి రాసుకొని, అలవాటు ప్రకారం లొట్ట వేశా ననుకున్నాడు బాగుం దనుకొని.

* * * *

చేలో కూలీవాళ్లు కలుపు తీస్తున్నారు. జోగయ్యమామ మనమరాలు కాసేపు గట్టుమీద నుంచుని చూసింది. కూలివాళ్లు 'చిన్న దొరసాని వచ్చిం'దని పరియాసకాలాడారు. పరికిణీ కాళ్లకు తగలకుండా చేత్తో పట్టుకొని చేనుగట్టుమీదుగా తాతదగ్గరకు పరిగెత్తడం మొదలుపెట్టింది. దారిలో తండ్రి కనిపించాడు.

"జరీపరికిణీ వేసుకొచ్చావేం అమ్మా! చేలోకి? బురద కాదూ?" అని అడిగాడు.

"తాత వేసుకురమ్మన్నాడు నాన్నా. యీపరికిణీ కట్టుకొస్తే చూడా లన్నాడు" అన్నది.

"చూశాడా?"

"మరిచిపోయాడు"

"తాత అన్నం తిన్నాడా అమ్మా?"

"పెట్టొచ్చాను."

"ఎక్కడున్నాడు?"

"అదేం, ఆ నేరేడుచెట్టుకిందే."

ఇద్దరూ నేరేడుచెట్టుదగ్గరకు బయలుదేరారు. ఆకాశం మబ్బేసింది. వర్ష మొస్తుందేమో అనుకున్నాడు నర్సయ్య. అరవయి ఏళ్లు నిండినా తండ్రి పొలం రావటం నర్సయ్యకి యిష్టంలేదు. పొలానికి అన్నం తెప్పించుకోవటం అసలు ఇష్టంలేదు. అతను వూళ్లో పంచాయితీబోర్డుప్రెసిడెంటు. కొంచెం పరువుగా బ్రతకా లంటాడు. కాని ఏం లాభం? తండ్రి తనమాట వినడు చేను గట్టుమీద అన్నం తింటే పరువు పోతుందా అంటాడు.

ఎక్కడో ఉరిమింది. మెరుపు కూడాను. చిటపట చినుకులు పడుతున్నాయి. కూతురు తన చిట్టినాలుక చాచి చినుకులు రుచిచూస్తోంది. నడుస్తూ

గబగబా వర్నయ్య నేరేడుచెట్టుదగ్గరకు నడిచాడు. చెట్టు నానుకుని కూర్చుని వున్నాడు తండ్రి.

చేతికర్రా, తలపాగా ఒకపక్కన పడి వున్నాయి. కళ్లు మూసుకుని ఏమిటి ఆలోచిస్తున్నాడు? అవసరం వున్నా లేక పోయినా ఆలోచించడం తప్పదు. గుప్పిడి ముక్కుకి ఆనించుకుని ఏదో వాసన చూస్తు న్నాడు. గుప్పెట్లో ఏముంది? పువ్వా? కాదు. పొగాకా? కాదు. మన్ను......


పట్టె మన్ను!—నేరేడు చెట్టుక్రింది రేగడి మన్ను.


'అయ్యా, అయ్యా' అని పిలిచాడు కొడుకు.—మళ్లా పిలిచాడు.

'అబ్బాయ్'—నీరసంగా తండ్రిమాట. గుప్పిడి సడలి చెయ్యి క్రిందికి వాలి పోయింది. మన్ను ధారగా పడింది. మట్టి మట్టిలో కలిసింది.

'అయ్యా, అయ్యా!'

అయ్య మరి పలకలేదు.





శ్రీ మామిడిపూడి వెంకటరంగయ్య

అక్టోబరుమాసములో అనేకమహాసభలు జరిగినవి. కాని వాటి అన్నిటిలో పేరెన్నికగనదగినది బ్రిటిష్ అధినివేశరాజ్యప్రధానుల సభ. ఇందు బ్రిటన్, కనడా, ఆస్ట్రేలియా, న్యూజీలండు, దక్షిణాఫ్రికా, ఇండియా, పాకిస్థాన్, సింహళప్రధానులో, వారి ప్రతినిధులో పాల్గొనిరి. ప్రపంచములోని ౨౦౦ కోట్ల ప్రజలలో సుమారు ౬౦ కోట్ల ప్రజలతరఫున వీరు మాట్లాడగలిగినవా రగుటచేత ఈ సమావేశమునకు ఒక ప్రాధాన్యము కలిగినది. వీరందరు కలిసి ఒక తీర్మానమునకు వచ్చినయెడల వీరిని ప్రతిఘటించుట కెవరికిని సాధ్యము కాదుగదా ? ఈ సమావేశము ఎందుకు జరిగినది ? ఇందులో ఏవిషయములనుగురించి చర్చలు జరిగెను ? వీటి ఫలితము లెట్టివి ? అను విషయములను గురించి సంక్షిప్తముగానైన తెలిసికొనుట అత్యావశ్యకము.

విప్లవ యుగము

ప్రపంచమందంతట ప్రస్తుతము విప్లవపరిస్థితులు ఏర్పడియున్నమాట అందరికి తెలిసినదే. విప్లవ మనగా మహత్తరమైన మార్పును తెచ్చుటకు చేయబడు మహాప్రయత్నము. సామాన్యమైన మార్పుల నుద్దేశించు ఉద్యమమునకు విప్లవ మన్న పేరు ఎవరును పెట్టరు. ఈ కాలములో అన్నిదేశము లందును విపరీతములైనట్టియు, అసాధారణములైనట్టియు మార్పులు తెచ్చుటకే ప్రయత్నములు జరుగుచున్నవి. ఇదిగాక, ఈ ప్రయత్నములుకూడ సామాన్యములైనవి కావు. ఇవికూడ అసాధారణములని చెప్పదగియున్నవి. ఈ రెండును కలిసియుండుటచేత— ఉద్దేశము మహత్తరము, ప్రయత్నముకూడ మహత్తరము—ప్రస్తుతకాలము విప్లవయుగమని చెప్పుటకు తగియున్నది.

ఆధునిక యుగ లక్షణము

ఇప్పటి విప్లవమునకు ఒక ప్రధానోద్దేశము, ఒక విశిష్టమైన లక్ష్యము ఉన్నవి. గడచిన నాలుగువందల సంవత్సరముల కృషిఫలితముగ ప్రకృతిశాస్త్రపరిజ్ఞానము విస్తార మభివృద్ధిగాంచినది. ఈ జ్ఞానము మూలమున భూమినుండి పండించుటకు వీలైన ఆహారపదార్థములు, గనులనుండి త్రవ్వదగిన ఖనిజములు, పరిశ్రమలనుండి తయారుచేయదగిన వస్త్రాదివస్తుసముదాయము, రైళ్లు, బస్సులు, విమానములు మొదలైన ప్రయాణసౌకర్యములు విపరీతముగ వృద్ధిగాంచినవి. ఇప్పటికంటెనుకూడ ఎక్కువగ వీటి నన్నిటిని ఉత్పత్తిచేయుటకు అవకాశము లేర్పడినవి. మానవజీవితమున ఐహికసుఖముల ననుభవించుటకు ఏయే పదార్థము లవసరములో వాని నన్నిటిని అపరిమితముగ ఉత్పత్తిచేయుటకు మనుష్యునికి శక్తి లభించియున్నది. ప్రాచీన, మధ్యయుగములకును, ఆధునికయుగమునకును దీనినిబట్టియే భేదము కలిగినది.

కాని ఈవిధముగ ఉత్పత్తిచేయదగిన వస్తుసమూహము అభివృద్ధిగాంచుచుండినను దానిని అనుభవించుటకు అందరికి సమానమైన అవకాశములు ఇప్పటికికూడ లభించియుండలేదు. మహదైశ్వర్యము ననుభవించు దేశములని పేరుగాంచిన ఇంగ్లండు, అమెరికాలలో కూడ లక్షలకొలది నిరుపేదలున్నారు. ఏషియా,

ఆఫ్రికాఖండపు దేశములలో ప్రజలందరు దారిద్ర్యమందు మునిగియున్నారు. వస్తుసముదాయమును ఎంత ఎక్కువగ ఉత్పత్తిచేయుటకు అవకాశ మున్నదో అంత ఎక్కువగ ఈదేశములలో ఉత్పత్తి జరుగుటలేదు. ఉత్పత్తి ఎక్కువగ జరుగుచుండినను దాని ఫలితమును ఏ కొద్దిమందోమాత్రమే అనుభవించుచున్నారుగాని జనసామాన్యమంతయు అనుభవించుట లేదు.

విప్లవకారణము

ఇప్పుడు జరుగుచుండు విప్లవమునకంతకు ఈ వైపరీత్యమే ప్రధానకారణము. ప్రకృతిశాస్త్రజ్ఞానము మూలమునను, యంత్రములమూలమునను ఎంత ఎక్కువగ వస్తుజాలమును వృద్ధిచేయుటకు వీలున్నదో అంత ఎక్కువగ వాటిని తయారుచేసి, అట్లు తయారైన వానిని ఏకొద్దిమందో అనుభవించుటకు బదులు ప్రజాసామాన్యమంతయు అనుభవించునట్లు చేయుటయే ప్రస్తుతవిప్లవముయొక్క ప్రధానోద్దేశము. అందుచేతనే ఈ యుగమును యంత్రయుగ మనియు, ప్రకృతిశాస్త్రయుగ మనియు, ప్రముఖుల యుగము గాక సామాన్యప్రజల యుగ మనియు అనేకులు చెప్పుచుండుట.

విప్లవ మవసరమా ?

ఇట్టి విప్లవము జరగవలసియున్నదని అందరును అంగీకరించుచునే ఉన్నారని చెప్పవచ్చును. అంగీకరించనివారు లేక పోలేదు. అంగీకరించనివారిలో మహాత్మాగాంధీగారు ఒకరు. నిరాడంబరజీవితమే వారి ఆదర్శము. మన మనుభవించు వస్తువుల సంఖ్య మితముగ నుండవలె ననియు, వానిని యంత్రసహాయమున గాక మన శరీరకష్టసహాయముననే ఉత్పత్తిచేసికొనవలె ననియు, ఎవరికి కావలసిన వస్తువులను వారే సొంతముగ తయారుచేసికొనవలె ననియు వారు బోధించిరి. కొందరు వారి ఉపదేశమే ఉత్తమమైనదని చెప్పెదరు. కాని నూటికి తొంభైతొమ్మిదిమంది ఆ తత్వమును విశ్వసించుటలేదు. విశ్వసించునట్లు పైకి కనుపించినను దాని ననుసరించ సిద్ధపడువారు కారు. కనుక ఎవరో కొందరుతప్ప తక్కిన వారందరును—అన్ని దేశములలో—పైజెప్పిన విప్లవమును కాంక్షించువారే.

విప్లవ సాధనము

కాని ఈ విప్లవమును తెచ్చుటలో ఒక గొప్ప అభిప్రాయభేద మేర్పడియున్నది. ఈ అభిప్రాయభేదమే ప్రస్తుతము మన మెదుర్కొనుచుండు అశాంతి కంతకు కారణము. కొందరి అభిప్రాయములో ఈ విప్లవమును శాంతియుతముగను, సామరస్యముమీదను సాధించవలసినదేగాని రక్తపాత, దౌర్జన్యముల మూలమున సాధించరాదు. దౌర్జన్యసాధనము ధర్మవిరుద్ధము. తక్కినవారి అభిప్రాయములో దౌర్జన్యము, రక్తపాతము లేక ఏ విప్లవముగాని విజయవంతము కాజాలదు. సాధించదగిన ఉద్దేశము ప్రశంసనీయమైనప్పుడు దానిని సాధించుటకు మన ముపయోగించు సాధనవిషయమై ధర్మాధర్మవిచక్షణము అనవసరము. ఉద్దేశము నెరవేరుటకు ఏసాధనము—దౌర్జన్యమైనను సరే, రక్తపాతమైనను సరే—ఉపయోగించునో అదియే ధర్మముతో కూడిన సాధనము. విప్లవోద్దేశమును దౌర్జన్యముద్వారా సాధించుటయా, శాంతిమార్గమున సాధించుటయా, అన్న కారణముచేతనే ప్రపంచమందు ప్రస్తుతము రెండు రాజకీయవిధానములు, రెండు రాజకీయతత్వములు పరస్పరము పెనగులాడుచున్నవి. ఈ పెనగులాట ప్రపంచశాంతికి భంగకర మగుటయే కాక మూడవ ప్రపంచయుద్ధమునకుకూడ దారితీయుచున్నది.

ప్రజాస్వామ్యసిద్ధాంతము ననుసరించువారిది రక్తపాతములేని సామరస్యవిధానము. నిరంకుశతత్వసిద్ధాంతము ననుసరించువారిది రక్తపాతముతో కూడిన దౌర్జన్యవిధానము. కాని ఇట్టి భేదముండుటచేత ప్రజాస్వామ్యసిద్ధాంతము ననుసరించువారు యుద్ధముచేయుటకు సిద్ధపడినవారు కారని అనుకోరాదు. వారుకూడ యుద్ధముచేయ సిద్ధులైనవారే. కాని సామరస్యసాధనము నిష్ఫలమైనప్పుడును, దౌర్జన్యసాధనమును ఉపయోగించువారు దానిని ఉపయోగించుటకు సన్నాహము గావించునప్పుడును వారు యుద్ధములోనికి దిగుచున్నారు. దౌర్జన్య మొక్కటియే సాధన మని ఒక పక్షమువారును, తక్కిన సాధనము లన్నియు నిష్ఫలము లైనప్పుడే దౌర్జన్యము సాధన మని అంగీకరించవలసియున్న దని రెండవపక్షమువారును వాదించుచున్నారు.

రెండు పక్షములు

ఈ తత్వవిభేదముల కారణమున ప్రస్తుతము ప్రపంచమందు రెండు రాజకీయపక్షములు బయలుదేరియున్నవి. ఒకపక్షమున రష్యావా రున్నారు. వారిది కమ్యూనిస్టుతత్వము. వారు దౌర్జన్యమును ప్రతిపాదించువారు. రెండవపక్షమున ఇంగ్లండు అమెరికా కనడా

ఆస్ట్రేలియా హాలెండు బెల్జియం మొదలైన ప్రజాస్వామ్యము గల రాజ్యములు ఉన్నవి. ఎంత ప్రయత్నము చేసినను ఈ రెండుపక్షములమధ్య రాజీ కుదరక పోవుటయే కాక రోజురోజుకు వైషమ్యము విపరీతమగుచున్నది.

ఐక్యరాజ్యసమితియొక్క శక్తిహీనత

ఇట్టి వైషమ్యములు వృద్ధిగాంచినపుడు వీని మూలమున యుద్ధము రాకుండచేయుటకును, వివాదములను రాజీమార్గముగ పరిష్కరించుటకును మూడు సంవత్సరముల క్రిందట ఐక్యరాజ్యసమితి స్థాపింపబడెను. అక్టోబరు ౨౪ వ తేదీన సమితియొక్క వర్థంతిని అన్ని దేశములలో జరిపిరి. అందరును దానినిగురించి అనేకప్రశంసావాక్యములను చెప్పిరి. కాని శాంతిని స్థాపించుటకు కావలసిన శక్తిసామర్థ్యములు దానికింకను లేవనియు, అట్టివి త్వరలో దానికి లభించునన్న సూచన లేవియు కనుపించుట లేదనియు, వారివారి విభేదములను ప్రచారముచేసికొనుటకే అగ్రరాజ్యములవారు సమితిసభలను ఉపయోగించుకొనుచున్నారనియు, అగ్రరాజ్యపరిపాలకులలో హృదయపరివర్తనము కలిగినగాని సమితిద్వారా శాంతిసంస్థాపన జరుగజాలదనియు వక్తలనేకులు తెలియపరచిరి. యుద్ధమునకు సన్నాహములు జరుగుచున్నప్పుడును వానిని ఆపుటకుగాని, యుద్ధము రాకుండచేయుటకుగాని సమితికి యోగ్యత లేనట్లు స్పష్టమైనప్పుడును, ప్రపంచములోని రాజ్యములు చేయవలసిన పని ఎట్టిది?

సాధనాంతరముద్వారా యుద్ధము రాకుండ చేయుటకును, యుద్ధము సంభవించినయెడల అందు విజయము సంపాదించుటకును తక్కిన రాజ్యములు ప్రయత్నించుట స్వభావము. అందుచేతనే బ్రిటిష్ అధినివేశరాజ్యముల ప్రధానులు లండనులో అక్టోబరు మాసమున సమావేశమగుట సంభవించినది.

బ్రిటిష్ కామన్‌వెల్తు ప్రధానుల సమావేశము

ప్రస్తుతము ఇండియా ఈ అధినివేశరాజ్యములలో ఒక్కటిగ నున్నది. ఇంగ్లండును పాలించు జార్జి ప్రభువు చట్టరీత్యా ఇండియాకుకూడ ప్రభువుగ ఉండుటయే దీనికి చిహ్నము. ఒక్కొక్క అధినివేశరాజ్యము (డొమినియన్ : Dominion) సర్వస్వతంత్రము కలదై తన వ్యవహారముల నన్నిటిని జరపుకొను హక్కు కలిగియున్నను ఇంగ్లండు రాజునే విధిగ తమ రాజుగ అంగీకరించుటచేత ఇవన్నియు ప్రస్తుతము ఒకే రాజకీయగణమునకు చెందియున్నవి. ఆ గణమునకే ఇప్పటివరకు బ్రిటిష్ కామన్‌వెల్తు అను పేరు వ్యవహారములో ఉన్నది.

ఈ సమావేశపు విశిష్టత

లండనులో అక్టోబరుమాసమున సమావేశమైన సభకు ఒక విశిష్టత కలిగినది. ఇదివరకు అధినివేశ మను హోదా బ్రిటిష్‌వారియొక్కయు, ఇతర శ్వేతజాతులవారియొక్కయు సంతతివారు నివసించుచుండు కనడా, ఆస్ట్రేలియా, న్యూజీలెండు, దక్షిణఆఫ్రికాలకు మాత్రమే ఉండెడిది. ప్రస్తుతము అధినివేశస్వాతంత్ర్యము ఇండియా పాకిస్థాన్ సింహళములకు కూడ లభించినది. శ్వేతజాతులవారుకాని భారతీయులు మొదలైనవారి దేశముల ప్రధానులు అధినివేశ హోదాతో సమావేశమునందు పాల్గొనుట కిదియే మొదటి పర్యాయము. వర్ణవివక్షను పాటింపక శ్వేతజాతి అధినివేశముల ప్రధానులును, వర్ణాంతరఅధినివేశముల ప్రధానులును కలిసి అనేకవిషయములనుగురించి సమాన ప్రతిపత్తితో, ఈ సమావేశమందు సంప్రతించిరి. దీనినిగురించి గుర్తించదగిన ప్రధానవిషయ మిదియే.

సభ్యుల ఏకోద్దేశము

ఇందు సమావేశమైన రాజ్యము లన్నియు ప్రజాస్వామ్యసిద్ధాంతములందును, ఈ సిద్ధాంతమును ఆధారముచేసుకొనిన సోషలిజం (Democratic Socialism) సిద్ధాంతవిధానములందును విశ్వాసము కలవి. కమ్యూనిష్టుసిద్ధాంతములు వీటికి ప్రస్తుతము నచ్చినవి కావు. దౌర్జన్యముద్వారా కమ్యూనిష్టువిధానమును ప్రపంచమందంతట వ్యాపింపచేయుటకు ప్రస్తుతము అంతర్జాతీయకమ్యూనిస్టుపార్టీ వారు రష్యానాయకత్వమున జరపుచుండు ప్రయత్నముల నన్నిటిని ఏవిధముగనైన అణచివేయుటకు ఈ రాజ్యముల ప్రధానులు సమకట్టినవారు.

ఫలితములు

ఈ సమావేశములో జరిగిన సంప్రతింపుల ఫలితముగ కొన్ని విషయములనుగురించి ప్రధానులందరు ఒకే అభిప్రాయమునకు వచ్చినట్లు తెలియుచున్నది.

(౧) ప్రపంచశాంతి ప్రజాస్వామ్యసిద్ధాంతముద్వారా

స్థాపించవలసియున్నది. కమ్యూనిస్టుసిద్ధాంతముద్వారా స్థాపించుటకు చేయబడు ప్రయత్నముల నన్నిటిని ప్రతిఘటించుట అవసరము. (౨) కమ్యూనిస్టువిధానమును యుద్ధముద్వారా అణచుటకు ప్రయత్నించుట కంటె ఆర్థికపునర్నిర్మాణము గావించి, కార్మికులు కర్షకులు మొదలగు సామాన్యప్రజల స్థితిగతులను చక్కబరచుటద్వారా ఎదుర్కొనుటయే ఉత్తమ మార్గము. అందుచేత అధినివేశములందుమాత్రమే కాక, బ్రిటనుకు లోబడియున్న వలసరాష్ట్రములన్నిటి యందును, ఇతరసామ్రాజ్యముల పాలనలో ఉండు వలసరాష్ట్రములందును (Colonies and Dependencies) ఇప్పటి పరిపాలనవిధానము మారుటకును సోషలిస్టు సిద్ధాంతానుసారముగ ఆర్థికసంస్కరణములు జరుగుటకును వెంటనే ప్రయత్నించవలెను. సామాన్య ప్రజల స్థితిగతులు ప్రజాస్వామ్యవిధానముద్వారా చక్కబడు నను నమ్మకము సిద్ధాంతరీత్యా గాక ఆచరణ ద్వారా ఋజువైనప్పుడే సామాన్యజనులకు కమ్యూనిజంపట్ల గల వ్యామోహము తగ్గును. శుష్కవాదోపవాదములవలన ఎట్టి ప్రయోజనము లేదు. (౩) కమ్యూనిజమును రష్యాను ఎదుర్కొనుటకు బ్రిటన్‌వారు పశ్చిమయూరపుదేశములతో ఏర్పరచుకొన్న సమాఖ్య యుక్తమైన దనియు, అట్టి సమాఖ్యకును కామన్‌వెల్తు గణమునకును ఎట్టి వైరుధ్యము లేదనియు, ఆ సమాఖ్య మరింత బలపడుట ప్రపంచశాంతికి సాధన మగు ననియు సమావేశమైన ప్రధానులు అభిప్రాయపడిరి.

ముఖ్యమైన విషయములనుగురించి వీరు ఏకాభిప్రాయమునకు రాగలుగుట ప్రశంసింపదగిన విషయమే. ౬౦ కోట్ల జనులను పాలించువారు ఏకాభిప్రాయముతో ప్రపంచశాంతికై పాటుబడ సిద్ధమైనయెడల ప్రపంచశాంతికి భంగము ఎన్నటికిని కలుగజాలదు. కాని ఇప్పటి అధినివేశరాజ్యము లన్నియు కలిసి శాశ్వతముగ కామన్‌వెల్తుగణములో సభ్యత్వము వహించియుండగలవా అన్న విషయములో అనేక సందేహములు ఇప్పటికే పుట్టియున్నవి. ఇవన్నియు కలిసియుండుట మానవకల్యాణసాధనమే. కాని ఇవి కలిసియుండగలవా ?

ఇట్టి సందేహము భారతీయు లనేకులలో ఇదివరకే పుట్టియున్నది. దీనినిగురించి వాదప్రతివాదములు జరగుచున్నవి. రాజ్యాంగపరిషత్తువారు తీర్మానించవలసిన ప్రధానవిషయములలో ఇది ఒకటి.

కామన్‌వెల్తు శాశ్వతముగ నిలబడునా ?

ఇట్టి సందేహము కలుగుటకు కారణము లేక పోలేదు. అధినివేశరాజ్యములన్నియు ఇదివరకు ఇంగ్లండురాజును తమ రాజుగ అంగీకరించియున్నవి. కాని ప్రస్తుతము రాజ్యాంగపరిషత్తువారు తయారు చేయుచుండు రాజ్యాంగ ప్రణాళికలో ఇండియా సర్వస్వామ్యము గల స్వతంత్ర ప్రజారాజ్య మని చెప్పబడి యున్నది. ఇంగ్లీషులో దీనికి రిపబ్లిక్ (Republic) అని పేరు. రిపబ్లిక్ అనగా రాజు లేని ప్రజారాజ్య మన్న మాట. ఈ రాజ్యాంగ ప్రణాళికను పరిషత్తువారు ఆమోదించుపక్షమున ఇండియాకు ఇకమీదట రాజు ఉండడు; ఉండ కూడదు. అట్టి సందర్భములో చట్టరీత్యా ఇంగ్లండునకును, ఇండియాకును ఎట్టి అనుబంధము ఉండజాలదు. చట్టరీత్యా రాజురూపమైన అనుబంధము లేని రాజ్యములు కామన్‌వెల్తుగణములో కలిసియుండుటకు వీలగునా ? మంగళసూత్రమో, ఉంగరమో, మరేదో ఒక బాహ్యచిహ్నమో లేక భార్యాభర్త లనుపేర స్త్రీ పురుషులు వ్యవహరించదగియుందురా అన్న విషయము వంటిదే ఈ విషయముకూడ. ఒకేరాజు లేకపోయినను ఇంగ్లండు ఇండియాలు చట్టరీత్యా ఒకే సమాఖ్యలో చేరియుండుటకు వీలగు నని తీర్మానించినపక్షముననే ఈ రెండు దేశములకును తక్కిన అధినివేశములకును ప్రస్తుత మేర్పడిన సంబంధము నిలిచియుండును. ఇట్టిది జరగనియెడల ఈ సంబంధము తెగిపోవును.

ఇండియాకు సభ్యత్వము లాభకరమా?

ఇంతకంటె ప్రధానములైన అంశములు మరి కొన్ని ఉన్నవి. ఇంగ్లండుతో రాజకీయమైన సంబంధము ఇండియాకు అవసరమా ? లాభకారియా, నష్టకారియా ? ఆలోచించదగినవిషయ మిదియే. సంబంధము అవసర మని స్పష్టపడినయెడల దానిని దృఢపరచుటకు ఏదియో ఒక బాహ్యచిహ్నమును కల్పించుకొనుట కష్టసాధ్యము కాదు.

లాభము

కామన్‌వెల్తుతో కొంతకాలమువరకైనను సంబంధము కలిగియుండుట ఇండియాకు అవసర మనియు, లాభకారి అనియు చెప్పుటకు కొన్ని కారణములు కలవు. (౧) ఇండియాకు స్వరాజ్యము లభించినను, దానిని నిలబెట్టుకొనుటకు కావలసిన సైన్య

సామగ్రి, నౌకాబలము, విమానబలము ఇంకను లేదు. ఈ బలమువంతను సంపాదించుటకు కొంతకాలము పట్టును. ఈమధ్యకాలములో శత్రువు లెవరైన దేశము పైకి వచ్చి, జయించుటకు ప్రయత్నించినయెడల వారి నెదుర్కొనుటకు ఇండియా అగ్రరాజ్యముల సహాయమును కోరవలసియున్నది. (౨) అనేకసంవత్సరముల నుండి ఇంగ్లండుతో ఇండియాకు ఒక విధమైన అనుబంధ మేర్పడియున్నందున దానియొక్క సహాయమును అపేక్షించుటయే మంచిది. రష్యా, అమెరికాలను గురించి భారతీయులకు ఎక్కువ అనుభవము లేదు. ఎరిగినవారితో సంబంధము నేర్పరచుకొనుట శ్రేయస్కరము. (౩) ఈ కాలములో పారిశ్రామికముగ దేశము వృద్ధిగాంచినగాని సైనికసామగ్రిని సమకూర్చుకొనుటకు వీలులేదు. పారిశ్రామికముగకూడ ఇండియా మిక్కిలి వెనుకబడియున్నది. దానికి కావలసిన యంత్రాదులు, యంత్రములను నడుపగల నిపుణులు దేశాంతరములం దుండి రావలసియున్నది. ఈ విషయములోకూడ ఇంగ్లండుతోడి సంబంధము ఇండియాకు లాభకారి. (౪) ఇట్టి సహాయము రష్యా చేయ దగిన స్థితిలో లేదు. పారిశ్రామికముగ ఆ దేశము ఇంగ్లండుకంటె వెనుకబడియున్నది. ఇతర దేశములకు యంత్రాదిపరికరములను పంపు స్థితిలో రష్యా లేదు. కనుక ఈ కారణములచేత ఇండియా ఇంగ్లండుతో రాజకీయసంబంధము నేర్పరచుకొనుట అవసరము. (౫) ఇంగ్లండు అమెరికాలు మిత్రులై ఉండు కారణమున అమెరికాసహాయముకూడ ఇండియాకు లభించుటకు ఈ సంబంధము ఉపయోగపడును. (౬) ఇంగ్లండు అమెరికాలను కాదని స్వతంత్రముగ విదేశ రాజ్యాంగనీతి నొకదాని ననుసరించి ఆగ్నేయఏషియా లోని బర్మా, సయాం ఇండోచైనా ఇండోనీషియా మొదలగు దేశముల నన్నిటిని కలిపి అట్టి సమూహమునకు నాయకత్వమును వహించుటయే ఇండియాకు గౌరవము కాని ఇంగ్లండునకు అనుచారియై ఉండుట గౌరవభంగకర మను వాద మొకటి ఉన్నది. కాని ఇట్టి నాయకత్వము ప్రస్తుతము ఇండియాయొక్క అందుబడిలో లేదు. కొంతకాలమైన తర్వాతగాని అట్టి నాయకత్వమును వహించుటకు వీలుకాదు.

నష్టము

లాభము లిన్ని ఉన్నను ఇంగ్లండుతో ఏలాటి సంబంధము ఉండరాదని చెప్పువా రెందరో ఉన్నారు. వారుసూచించు హేతువులుకూడ ఆలోచింపదగినవియే. (౧) ప్రస్తుతము అగ్రరాజ్యములమధ్య ఏర్పడిన విరోధములలో ఇండియా బహిరంగముగ ఇంగ్లండుతో సంబంధ మేర్పరచుకొనుట రష్యాతో శత్రుత్వమును కోరుటయే. ఏపక్షమును వహించకుండుట ఉత్తమము గాని అనవసరముగ ఒకరికి మిత్రులుగను, ఇంకొకరికి శత్రువులుగను ఉండుట నష్టకారి. (౨) కామన్‌వెల్తుతో సంబంధము పెట్టుకొనుటద్వారా ఇండియాకును పాకిస్థానుకును, ఇండియాకును దక్షిణఆఫ్రికాకును మధ్య ఏర్పడిన వివాదములు శాంతియుతముగ పరిష్కారము కాజాలకయ్యెను. అట్టి కామన్‌వెల్తుతో సంబంధ మున్నను లేకపోయినను ఒకటే. (౩) ఈ వివాదము లన్నిటిలో ఇంగ్లండు, తక్కిన శ్వేతఅధినివేశములును పాకిస్థాన్ పక్షమునే వహించి ఇండియాయెడల విరోధభావమును చూపెట్టినవి. సమావేశములలో తక్కిన రాజ్యము లొక పక్షమునను, ఇండియా మాత్రము ఇంకొకపక్షమునను ఉండవలసిన పరిస్థితులు ఏర్పడునట్లు కనపించుచున్నవి. ఇట్టి సందర్భములో కామన్‌వెల్తునుండి విడిపోవుటయే గౌరవమార్గము.

ఈ విషయములోని సాధకబాధకములు కొన్ని మాత్రమే ఇచ్చుట సూచింపబడినవి. ఇప్పుడు సమావేశమైఉండు రాజ్యాంగపరిషత్తులోని ప్రముఖులందరు వీటినిని, పండితసౌహ్రహా విశదీకరించు ఇతరవిషయములను సమగ్రముగ పరీక్షించి దేశమునకు గౌరవకరమును, లాభకరమును అగు నిర్ణయమునకు రావలె నని కోరుటయే కర్తవ్యము.

ఇంగ్లీషువారి కాంక్ష

ఇండియాతోడ ఏదో ఒకవిధమైన సంబంధమును ఏర్పరచుకొనుటకు కామన్‌వెల్తులోని శ్వేతఅధినివేశ రాజ్యములవారందరు కాంక్షించుచున్నారు. భూగోళ దృష్ట్యా ఇండియాకు గల ప్రాధాన్యమే దీనికి కారణము. ఈ ప్రాధాన్యముద్వారా యుద్ధకాలమందు ఇండియాకు ఎక్కువ ప్రాధాన్యము కలుగుచున్నది. రష్యాకును, అమెరికా ఇంగ్లండులకును ఎప్పుడైన యుద్ధము సంభవించినయెడల మధ్యప్రాచ్యము ప్రధాన యుద్ధరంగములలో ఒకటి కాగలదు. గతరెండుప్రపంచ యుద్ధములలో మధ్యప్రాచ్యము ఇట్టి యుద్ధరంగ మయ్యెను. అచ్చటి పెట్రోలుగనులు ఈ ప్రాధాన్యమునకు హేతువు. ఇదిగాక, హిందూమహాసముద్రమందుండు బ్రిటిష్‌వలసరాష్ట్రములను, ఆస్ట్రేలియా న్యూజీలండులతోడి సంబంధమును ఇంగ్లండు రక్షించుకొను

టకు మధ్యప్రాచ్యము రష్యావశము కాకుండుట అత్యావశ్యకము. కాని మధ్యప్రాచ్యము రష్యావశము కాకుండచేయుటలోను, హిందూమహాసముద్రమున తమ ప్రాబల్యమును నిలబెట్టుకొనుటలోను ఇండియా ఇంగ్లండుకు ఎంతో అవసరము. ఈకారణము లన్నిటిచేత ఏదినముగనైన ఇండియాతోడి అనుబంధము సడలకుండ ఉండవలె నని ఇంగ్లండు కాంక్షించుచున్నది.

పశ్చిమయూరపు సమాఖ్య

కామన్‌వెల్తు ప్రధానుల సమావేశము చాలవరకు ఫలవంత మగుటచేత ఆ సమావేశము ముగిసినవెంటనే బ్రిటిష్ విదేశాంగమంత్రి బెవిన్ పశ్చిమయూరపు సమాఖ్యలో చేరిన బెల్జియం, హాలెండు, లక్సెంబర్గు, ఫ్రాన్సుదేశముల విదేశాంగమంత్రులతో యుద్ధసన్నాహములవిషయమై రహస్యచర్చలు జరిపెను. దీనికి ఫలితముగ రష్యాతో యుద్ధము సంభవించినయెడల ఎట్టి వ్యూహములను పన్నవలసియుండునో వారు నిర్ణయించుకొన్నట్లు తెలియుచున్నది. యునైటెడ్ స్టేట్సు కనడారాజ్యములు ఇట్టి యుద్ధములో పశ్చిమయూరపుసమాఖ్యకు చేయవలసిన సైనికసహాయమును గురించికూడ వివరములన్నియు ఈసంప్రతింపులలో స్పష్టపరచబడెను. ఈసందర్భములో ఇంకొక విశేషముకూడ గమనింపదగియున్నది. స్పెయిన్ దేశము ఫాసిస్టునాయకుడైన ఫ్రాంకోకు లోబడియున్నదనియు, ప్రజాస్వామ్యసిద్ధాంతవిరోధియు, హిట్లరు ముసోలినీల మిత్రవర్గములో నొకడును అగు ఫ్రాంకో నియంతగ ఉన్నంతవరకు స్పెయిన్‌తో ఎట్టి సంబంధమును పెట్టుకొనరా దని చెప్పుచు వచ్చిన అమెరికావారు అతని కిప్పుడు సుముఖులై అతని సహాయమును సంపాదించుటకు కొన్ని రహస్యసంప్రతింపులు జరుపుచున్నట్లు తెలియవచ్చుచున్నది.

ఫ్రాన్సులోని పరిస్థితులు

దీనికి రెండు ప్రధానకారణములు గలవు. పశ్చిమయూరపులోని దేశములన్నిటిలో ఫ్రాన్సుకీలకస్థానమును వహించియున్నది. ఫ్రెంచివారి పరిపూర్ణ సహాయము లేక అమెరికావారు రష్యాతో యుద్ధము జరుపుట సులభసాధ్యము కాదు. సైనికశిబిరములు, నౌకాశ్రయములు, విమానాశ్రయములు ఫ్రాన్సులో సంపాదించుట వారి కత్యావశ్యకము. కాని ఫ్రాన్సులో ప్రస్తుత పరిస్థితులు మిక్కిలి ప్రమాదకరములుగ నున్నవి. దీనికి కారణములు గత సంచికలో సూచింపబడెను. అక్టోబరులో ఈ పరిస్థితులు మరింత ప్రమాదకరము లయ్యెను. బొగ్గుగనులలో పనిచేయు అయిదులక్షల కార్మికులు గొప్ప సమ్మెను ప్రారంభించి ఇప్పటివరకు జరపుచున్నారు. మరికొందరు కార్మికులుకూడ వారియెడల సానుభూతి చూపు ఉద్దేశముతో సమ్మెలో చేరిరి. సమ్మెదారులు దౌర్జన్యముద్వారా కొన్ని గనులకు విపరీతనష్టమును కలిగించిరి. ఆకారణముచేత వారిపై పోలీసులను, సైనికులను ఉపయోగింపవలసిన అవసరము కలిగెను. ఆఘర్షణలలో అనేకులు మరణించిరి. ఏలాగో కొన్ని గనులను ప్రభుత్వమువారు వశపరచుకొనిరి. ఇప్పుడిప్పుడు కార్మికులు కొందరు సమ్మెను మాని యథాపూర్వముగ పనిలో ప్రవేశించుచున్నారు. కాని వారు శాశ్వతముగ సమ్మెలధోరణిని మానుకొన్నవారు కారు. ధరలు పెరుగుటచేత ఎక్కువ కూలీ కావలెనని వీరు సమ్మెలు చేయుచున్నను ఈ సమ్మెలద్వారా దేశమందు అల్లరులను లేవదీసి, ప్రజాప్రభుత్వమును తొలగించి కమ్యూనిజమును స్థాపించుటకు కమ్యూనిస్టుపక్షం వారు ప్రయత్నించుచున్నారు. ఫ్రాన్సు ఇట్టిస్థితిలో ఉండుటచేత అచ్చట శిబిరాదులను ఏర్పరచుకొనుట క్షేమము కాదని అమెరికావారు తలచి ఫ్రాంకోతో రాయబారములు జరపుచున్నారు.

బర్లిన్ ప్రతిష్టంభన

బర్లిన్ సమస్యపై రష్యా, పశ్చిమరాజ్యముల మధ్య ఏర్పడిన వివాదము ఇంకను పరిష్కారము కాలేదు. భద్రతాసంఘమువారు దీనినిగురించి ఆలోచించి, ఉభయపక్షములవారి గౌరవమునకు ప్రతిష్ఠకు భంగము కాని రాజీమార్గము నొకదానిని సూచించినను రష్యావారు దానికి సమ్మతించనందున, సమస్య సమస్యగానే ఉన్నది. ఈమధ్య రష్యాప్రధాని స్టాలిన్ ఇందువిషయమై తన అభిప్రాయమును వ్యక్తపరచుచు, పశ్చిమరాజ్యములవారు యుద్ధమునకు కాలు ద్రవ్వుచున్నా రనియు, రష్యాప్రభుత్వము శాంతిసంస్థాపనకు ఎన్ని ప్రయత్నములను చేసినను పశ్చిమరాజ్యములవారి అధికారకాంక్ష కారణమున ఈ ప్రయత్నములు సఫలములు కాలేదనియు వారిని నిందించెను. ఈవివాదములో తప్పొప్పులు ఫలానివారి దని నిర్ణయించుట సులభము కాదు. కాని బర్లిన్ ప్రతిష్టంభనను ప్రారంభించినవారు రష్యావారు. ఎవ రెన్ని చెప్పినను, ఆ ప్రతిష్టంభనలో ఎట్టి మార్పు కను

పించలేదు. అందులో రష్యావారు కొంచెము మెత్తబడినగాని శాంతి యుండజాలదు.

అమెరికా ఎన్నికలు

బర్లిన్ ప్రతిష్టంభనయే గాక పాలెస్టైయిన్లోని ప్రతిష్టంభనకూడ ఏమాత్రము అక్టోబరులో మారలేదు. దీనికి ఒక కారణము కనుపించుచున్నది. పాలెస్టైయిన్ విషయమై అమెరికావారు ఒక నిశ్చితాభిప్రాయమునకు ఇంకను రాకున్నారు. అధ్యక్షుని ఎన్నికలు నవంబరు ౨వ తేదీన జరుగనున్నవి. ఈఎన్నికలలో పోటీచేయుచుండు రెండు పక్షములవారు యూదుల సహాయమును అపేక్షించువారు. అమెరికాలో సుమారు ౫౦ లక్షల యూదులు వోటర్లుగా ఉన్నారు. వారి వోటును సంపాదించుటకు రెండు పక్షములవారును ప్రయత్నించుచున్నారు. పాలెస్టైయిన్గురించి ఏ అభిప్రాయమును వ్యక్తపరచినను, ఏదో ఒక ఇబ్బంది కలుగునని భయముచే ఎన్నికలు పూర్తియగువరకు ఈ విషయమై తమ అభిప్రాయమును తెలుపుటకు అమెరికనులు జంకుచున్నారు. అందుచేత పేరునకు పాలెస్టైయిన్లో యుద్ధవిరమణ ఉన్నను రెండుపక్షములవారు యుద్ధము చేయుచునే ఉన్నారు. ఈ యుద్ధములో యూదులదే పైచెయ్యి. దేశములో కొన్ని ప్రాంతములను వారు ఈమధ్య వశపరచుకొనిరి.

చైనాలో విషమపరిస్థితులు

గత మాసములో జరిగిన విషయములలో ఎక్కువగ విచారించదగినది చైనాలోని అంతర్యుద్ధము యొక్క విషమపరిణామము. చైనాలోని ఐశ్వర్యవంతములగు రాష్ట్రములలో మంచూరియా మిక్కిలి ప్రధానమైనది. దీనిని వశపరచుకొనుటకు మూడు సంవత్సరములుగ కమ్యూనిస్టులు పోరాడుచుండిరి. జాతీయప్రభుత్వనాయకుడైన చియాంగ్ కై షెక్ వారిని కొంతవరకు ఎదిరించగలవాడయ్యెను గాని, క్రమక్రమముగ వారిబలమే అభివృద్ధిగాంచి తుదకు కొన్ని రోజులక్రిందట మంచూరియా ప్రధానపట్టణముకూడ వారి స్వాధీనమయ్యెను. దీనితో మంచూరియాకు కమ్యూనిస్టులు పరిపాలకులగుటయే కాక, ఉత్తరచైనాలోని మరికొన్ని ప్రాంతములు కూడ వారికి చిక్కు పరిస్థితులు సంప్రాప్తించెను. చియాంగ్ కై షెక్ యొక్క నాయకత్వముగాని అధికారముగాని మరి నిలబడునట్లు లేదు. అతని జాతీయప్రభుత్వము యొక్క దౌర్బల్యము కొన్ని సంవత్సరముల క్రిందటనే స్పష్టమయ్యెను. ప్రజల ఆమోదమును తాను, తన ప్రభుత్వము కోల్పోవుచుండుటను గుర్తెరిగినను దానికి కారణములైన తన అనుచరుల స్వలాభపరత్వము, లంచగొండితనము మొదలైన లోపములను అతడు రూపుమాపలేకపోయెను. జాతీయప్రభుత్వమునకు ఫలితముగ జమీందారీలయు, సాహుకార్లయు దుండగములు నశించి తమ ఆర్థికస్థితి బాగుపడునని కర్షకులు, కార్మికులు ఎంతో కుతూహలపడియుం కాని, వారు కోరిన సంస్కరణములను వేనిని చియాంగ్ చేయలేకపోయెను. అతని పతనమునకై విషాదము చెందువారెవ్వరు ప్రజాసామాన్యములో కనుపించుటలేదు. జపాన్ వారి దురాక్రమణమునుండి దేశమును రక్షించిన మహామహుడను ప్రఖ్యాతిగాంచినవాడు స్వరాజ్యరథమును న్యాయమార్గమున నడుపని కారణమున ఇట్టి అధోగతికి రావలసివచ్చెను. కమ్యూనిస్టుల విజృంభణము దేశమందంతట వ్యాపించుటకు పూర్వమే వారితో రాజీ చేసికొని అవసరమైనయెడల వారితో కలిసి మిశ్రమప్రభుత్వము నొకదానిని స్థాపించి, అంతర్యుద్ధమును మాన్పుటకు మితపక్షనాయకులనేకులు ప్రయత్నించుచున్నారు. ౪౦ కోట్ల జనము కలిగి, ఆర్థికసదుపాయములన్నిటిని కలదై, సమస్తభోగభాగ్యములతో తులతూగుచు తూర్పు ఏషియాకంతకు నాయకమణియగునని ప్రపంచమంతయు అనుకొన్న చైనాదేశము ప్రస్తుతము ఇట్టి పరిస్థితిలోనికి వచ్చుట విషాదకరమైన విషయమే. కమ్యూనిస్టుపక్షమువారు ఇచ్చట ఇంతటి అఖండమైన విజయమును సంపాదించిన కారణమున ఏషియాలోని ఇతరదేశములందుండు కమ్యూనిస్టు పక్షమువారు మరింత ఉత్సాహముతోను, పట్టుదలతోను పనిచేయగలరని చెప్పవచ్చును.

కమ్యూనిస్టువిధానమును అరికట్టు ఉద్దేశముతో తమ రాజ్యాంగనీతి నంతను నడుపుచున్న అమెరికావారు చైనావిషయమై ఇకమీదట ఏమి చేయుదురో చెప్పుట కష్టసాధ్యము. మంచూరియా, ఉత్తరచైనాలయందే కాక కొరియాలో కూడ కమ్యూనిస్టుపక్షమువారు ముందుకు వచ్చుచున్నారు. పశ్చిమయూరపుదేశములలోని కమ్యూనిస్టుపక్షముల నణచుట అమెరికన్లకు సులభము కావచ్చును. కాని, చైనా, కొరియాలలో అట్టి పని చేయుట కష్టసాధ్యమని తోచుచున్నది.

కాంగ్రెసు అధ్యక్షుని ఎన్నిక

గతమాసమున భరతఖండములో కాంగ్రెసు అధ్యక్షపదవికి శ్రీయుతులు భోగరాజు పట్టాభి సీతారామయ్యగారికిని, పురుషోత్తమదాస్ టాండన్ గారికిని పోటీజరిగి శ్రీ పట్టాభిసీతారామయ్యగారు విజయము గాంచిరి. సుమారు నలభై సంవత్సరములనుండి దేశోద్ధరణమునకును, స్వరాజ్యసంపాదనమునకును సమస్త త్యాగములు జేసిన శ్రీ సీతారామయ్యగారు కాంగ్రెసు అధ్యక్షు లగుట భారతీయు లందరికి గర్వించదగిన విషయము. ఇన్నాళ్లకు ఆంధ్రనాయకు డొకడు అధ్యక్షు డగుటకు ఆంధ్రులకు ప్రత్యేకముదావహము. పోటీలేకయే వారు అధ్యక్షులై యుండిన బాగుండెడిది అని అనేకుల అభిప్రాయము. కాని అట్లు జరగలే దని విచారించవలసిన జరూరు లేదు. ప్రజాస్వామ్యవిధానములో పోటీలేని ఎన్నిక లుండుట అసహజము, అసాధ్యముకూడను. పోటీ లేకపోవుట వాంఛనీయముకూడ కాదు. పోటీ ఉన్నప్పుడే ఎన్నికలు రాణించగలవు. నిరంకుశవిధానమునకే పోటీ లేకపోవుట లక్షణము. మహాత్మాగాంధీగారి నిరంకుశత్వము (ప్రజల ఆమోదమును పొందిన నిరంకుశత్వము కావచ్చును) మూలముననే ఇదివరకు పోటీలేక అధ్యక్షుని ఎన్నికలు జరిగినవి. అట్టి ఆమోదమును పొందిన నాయకుడు దేశమునకు లభించజాలడు. ప్రస్తుతపరిస్థితులలో పోటీలో గెలిచి శ్రీ పట్టాభిగారు అధ్యక్షులగుట ప్రశంసింపదగినదే.

ప్రభుత్వమునకును అధ్యక్షునకును సంబంధము

అయితే దేశము ఇప్పుడు ఎదుర్కొనవలసిన గడ్డుసమస్య అధ్యక్షుని ఎన్నికలో పోటీ ఉండవలెనా, కూడదా అన్నది కాదు. కాంగ్రెసు పక్షమునకును నెహ్రూ, పటేల్ గార్లతో కూడిన ప్రభుత్వమునకును ఎట్టి సంబంధ ముండవలె ననుటయే ప్రధాన మైన సమస్య. కాంగ్రెసు అధ్యక్షుడును అతని కార్యనిర్వాహకవర్గమును చెప్పినట్లు కాంగ్రెసుప్రభుత్వము సాగవలెనా? లేక ప్రభుత్వము చెప్పినట్లు అధ్యక్షుడును, అతని కార్యనిర్వాహకవర్గమును నడుచుకొనవలెనా? తాను చెప్పినట్లు ప్రభుత్వమువారు నడుచుకొనుట లేదను కారణముచేతనేగదా శ్రీ కృపలానిగారు అధ్యక్షపదవికి రాజీనామా ఇవ్వవలసివచ్చినది. శ్రీ పట్టాభిగారు అధ్యక్షులగుటమూలమున భాషాప్రయుక్త రాష్ట్రముల నిర్మాణము వెంటనే జరుగునని అనేకులు అభిప్రాయపడియున్నారు. ఇప్పటివరకు అట్టి నిర్మాణము జరగకుండుటకు నెహ్రూ, పటేల్ గార్ల విముఖత్వము కారణము గదా? ఇట్టి సందర్భములో శ్రీ పట్టాభిగారు వారిని కాదని భాషాప్రయుక్తరాష్ట్రములను సాధించగలరా? పరిస్థితులను మనము చక్కగ గమనించినయెడల అట్టిది వీరు సాధింపజాల రనియే చెప్పవలసియున్నది. కాంగ్రెసు అధ్యక్షుడు ప్రభుత్వవర్గమును అనుసరించి వెళ్లవలసినవాడే గాని అతనిని అనుసరించి ప్రభుత్వము నడుచుట జరగనట్లు కనపించుచున్నది.

అధ్యక్షుని కర్తవ్యము

ఇట్టి స్థితిలో శ్రీ పట్టాభివంటి సమర్థుడు కాంగ్రెసుఅధ్యక్షుడై సాధించవలసిన పను లేవైన ఉన్నవా? అను సంశయము కలుగక తప్పదు. చేయవలసిన పను లనేకము లున్నవి. వాటిలో ప్రధానమైనది కాంగ్రెసు పేరుప్రతిష్ఠలను దేశమందు పునరుద్ధరించుట. గతరెండుసంవత్సరములమధ్య ఇవి చాలవరకు తగ్గిపోయినవి. కొందరు తెలిసియు, కొందరు తెలియకయు కాంగ్రెసుప్రభుత్వములను తీవ్రముగా విమర్శించి ఖండించుట మామూలైనది. కాంగ్రెసువిరోధుల ప్రాబల్యము అనేకప్రదేశములలో వృద్ధిగాంచుచున్నది. ఈ విరోధులలో ప్రజాస్వామ్యసిద్ధాంతముల నంగీకరించని దౌర్జన్యవాదు లనేకు లున్నారు. వారిప్రాబల్యము అధికమైనయెడల దేశములో అల్లరులు ఎక్కువై అరాచకము సంప్రాప్తించును. ప్రజాస్వామ్యమందు విశ్వాసముగల సోషలిష్టులు మొదలగువారుకూడ వారిపక్షమును బలపరచుకొనుటకు తీవ్రకృషి చేయుచున్నారు. కాంగ్రెసుయొక్క ఆదర్శములు, పరిపాలనవిధానము తక్కిన పక్షములవారి ఆదర్శములకంటె ఉత్తమములైన వని ప్రజలకు తెలుపవలసిన అవసరము ఎక్కువగ నున్నది. ఒక సంవత్సరములో క్రొత్త ఎన్నికలు రానున్నవి. అప్పటికి వివిధరాజకీయపక్షముల మతములలోని గుణాగుణములు ప్రజాసామాన్యమునకు స్పష్టముకావలెను. అట్టి పని చేయుటకు గొప్ప శక్తియు, నాయకుడును అగు శ్రీ పట్టాభి తగినవాడు. వారు చేయవలసిన పనులలో ఈ ప్రచారమే ముఖ్యము. కాంగ్రెసుప్రభుత్వమువారి పరిపాలనమును ప్రజల యెదుట సమర్థించవలసిన అవసర మేర్పడియున్నది. ఆ అవసరమును వారు తీర్చవలెను. ప్రస్తుతము కాంగ్రెసు

నాయకులకు ప్రజాసామాన్యముతో గల సంబంధము చాలవరకు తగ్గిపోయినది. అట్టి సంబంధమును తిరిగి స్థాపించుటకు వారు ప్రయత్నించవలెను. ఇదిగాక కాంగ్రెసులో అనేకచీలికలు బయలుదేరియున్నవి. అధికారవ్యామోహము వృద్ధిగాంచియున్నది. స్వలాభపరత్వము ప్రబలియున్నది. ఇట్టి లోపములనన్నిటిని పోగొట్టి కాంగ్రెసుపక్షమును బలపరచుటయే అధ్యక్షుడు చేయవలసిన పని.

ధరలు తగ్గించుటకు సూచనలు

ధరలు విపరీతముగ పెరుగుచుండుటచేత సామాన్యప్రజలయందు అసంతృప్తి దినదినాభివృద్ధి గాంచుచున్న దనియు, దానిమూలమున శాంతిభద్రతలకు ప్రమాదము సంభవించు ననియు గ్రహించి ధరలు తగ్గించుటకై కొన్ని సాధనములను ప్రయోగించు ఉద్దేశమును తెలుపుచు గతమాసప్రారంభమున ప్రభుత్వమువారొక ప్రకటనను గావించిరి. ధరలు పెరుగుటకు రెండే ప్రధానకారణములు. దేశములో ఉత్పత్తి తగ్గుట మొదటి కారణము. చెలామణిద్రవ్యము అత్యధికముగ వృద్ధియగుట రెండవ కారణము. ధరలు తగ్గవలయు ననిన ఉత్పత్తియగు ఆహారాదిపదార్థములు అధికము కావలెను; చెలామణిద్రవ్యము తగ్గిపోవలెను. చెలామణి ద్రవ్యమును హెచ్చుచేయుటకును, తగ్గించుటకును ప్రభుత్వమువారికే అధికార మున్నది. వారు చేయు ఖర్చులకు కావలసిన ధనమును పన్నులమూలమునను, ఋణములమూలమునను ప్రజలనుండి వసూలుచేయుటకు ఇష్టపడక, క్రొత్తనోట్లను అచ్చువేసి వాటిని ఉపయోగించుటచేత చెలామణి ఎక్కువగుట సంభవించినది. ఇదంతయు ఎక్కువ జీతములు పుచ్చుకొన్న ఉద్యోగస్థులు, గవర్నమెంటుకంట్రాక్టర్లు, గవర్నమెంటుకు వస్తువులను అమ్మిన వర్తకులు మొదలగువారివద్ద చేరియున్నది. ఇప్పుడు ధరలు తగ్గవలయు ననిన ధనికుల వద్ద నుండు ఈ చెలామణిద్రవ్యములో చాలభాగమును గవర్నమెంటువారు స్వాధీనముచేసికొనవలెను. అనగా అధికపన్నులను విధించవలెను. ఆవిషయమునే గవర్నమెంటుప్రకటనలో అధికారులు సూచించిరి. ఇదిగాక, ప్రభుత్వమువారు వారుచేయు ఖర్చులను తగ్గించుకొనవలెను. తగ్గించుకొనుటకు ఇష్టములేనిపక్షమున ఖర్చులకు కావలసిన ద్రవ్యమును పన్నులమూలమున సంపాదించవలెనేగాని, క్రొత్తనోట్లను అచ్చువేసియు, ఇదివరకు దాచికొనుచున్న ద్రవ్యమును ఉపయోగించియు క్రొత్త ఉద్యమములను ప్రారంభించరాదు. మొత్తముమీద తేలిన దేమనగా: ధనికులనుండి పన్నుల మూలమున ఎక్కువ ద్రవ్యమును రాబట్టినగాని వెంటనే ధరలను తగ్గించుటకు వీలులేదనుట.

కాని ధనికులపై ఎక్కువ పన్నులు విధించుటకు కేంద్రప్రభుత్వముగాని, రాష్ట్రప్రభుత్వములుగాని ఇంకను సిద్ధపడియుండలేదు. ఇట్టి సందర్భములో ఎంత వరకు ధరలు తగ్గునో చూడవలసియున్నది. ఇందుకై ఎంతటి తీవ్రచర్య తీసికొనవలెనో అంతటి తీవ్ర చర్యను ఏ ప్రభుత్వమువారును తీసికొనుట లేదు. ప్రస్తుతప్రభుత్వవిధానములో ఉండు లోపము ఇదియే.

జమీందారీల రద్దు

ఇట్టి పరిస్థితులలో, రాష్ట్రప్రభుత్వమువారు జమీందారీలను రద్దుచేయు చట్టమును గావించిరి. కాని జమీందారుల కియ్యవలసిన పరిహారద్రవ్యము $12\frac{1}{2}$ కోట్లను ద్రవ్యరూపముగ వెంటనే ఇచ్చినయెడల దేశములోని చెలామణి మరింత పెరిగి ధరలు మరింత హెచ్చు ప్రమాద మున్నది. ప్రజలపై పన్నులను విధించి ఈ $12\frac{1}{2}$ కోట్ల ద్రవ్యమును సంపాదించుటకు రాష్ట్రప్రభుత్వమునకు ధైర్యము చాలదు. కేంద్ర ప్రభుత్వమువారు ఇంతటి ద్రవ్యమును ఉచితముగగాని, ఋణముగగాని రాష్ట్రమున కిచ్చుటకు అంగీకరించలేదు. ఇట్టి సందర్భములో జమీందారీచట్టము నొకదానిని చేసినామనిమాత్రమే మద్రాసుమంత్రివర్గమువారు చెప్పుకొను స్థితిలో ఉన్నారుగాని, దానిని అమలులో నుంచుటకు సమర్థులు కాకున్నారు. ప్రజలు ఈ విషయమును గమనించవలెను. నష్టపరిహార మీయక జమీందారీలను రద్దుచేయుట చట్టవిరుద్ధ మనియు, ఆకారణముచేత జమీందారీచట్టము న్యాయసమ్మతము కాదని ఫెడరల్ కోర్టులో వాదించుట కవకాశ మున్న దనియు కొందరు బెదిరించుచున్నారు. [2-11-48]

పట్టాభి


సూరుల్ శూరులు నీదు సర్వాతరతన్ సూచింప నెవ్వారు నీ
పేరే పల్కు మహాసభాపతివిగా వేంచేసి పట్టాభి సీ
తారామా! నడిపింపుమా అల స్వతంత్రజ్యోతికిన్ జ్యోతివై
పారావారహిమాద్రిదీపితము యావద్భారతద్వీపమున్.

జాతిన్ జాతిని మేలుకొల్పగల భైషజ్యంబు నీ చేతిలో
చాతుర్యం బని పిన్నపెద్ద లెచటన్ శంఖంబు పూరించి నీ
నేతృత్వంబున నగ్నికుండమున నేనిన్ దూక సంసిద్ధు లో
సీతారామ! సుధైకభాండమునకుం జేకొంచుబో మిమ్మందరన్.

ముక్తిన్ భుక్తినిగూడ నీగల మహీప్రాజ్యన్ స్వరాట్పూరుషున్
భక్తిన్ భారతసింహపీఠికపయిం బట్టాభిషేకక్రియా
యుక్తుం జేయుచు విశ్వమంగళమహాసూక్తంబులన్ నీదు సద్
వక్తృత్వంబున వెల్లడింపు మిక సీతారామమంత్రీశ్వరా!

విశ్వ మెచ్చట నొక్క వేశ్మంబుగా దోచు బురుషు డెచ్చట విశ్వపురుషు గలియు
చుక్కలు దేనిపై శుభదృష్టి పరగించు, దిక్కాలములు దేని తేరిచూచు
దేనితో నల త్యాగదేవికి సంగాత మగ్నిదేవునితోడ నాట యెచట
విశ్వమానవుని పెన్నెత యెందు వాణియై రాల్ గోసికొంచు సంద్రములు దాటు
ఎచ్చటను హాస్యరసము దా రచ్చదీర్చు-నచ్చటను బొల్చు నీగద్దె, యందునుండి
తూర్పుపడమరలకును సేతువు నొనర్చు-దివురగదవయ్య పట్టాభి! తెలుగుమీర.

—వేలూరి శివరామశాస్త్రి



కలగూరగంప



నీరాజనం

మొదట్లో ఆశ్చర్యం వేసింది. తరువాత ఓ నాలుగురోజులు కంగారు పడకపోనూలేదు. చివరికి మహదానందం లభించింది. అవును, పట్టాభిని 'మన పట్టాభి' అని దేశం అంతా అనకోవడం, అలాగ క్రోడీకృతమయిన అభిప్రాయాన్ని సమీకరించి, వారినే కాంగ్రెస్సుకి అధ్యక్షులుగా యెన్నుకోవడం-యింతకన్నా సంతోషవార్త వుంటుందా?

శ్రీ సీతారామయ్య పంతులుగారు యెప్పుడు, యెన్నాళ్లు వైద్యం ప్రాక్టీసుచేసేరో లెక్కకి రాదు కాని, వారు ప్రాక్టీసుచేసిన త్యాగం, చూపిన సేవానురక్తి, కలిగించిన జాతీయతా ప్రతీభారతీయుని రక్తనాళాల్లోకి యెక్కిపోయింది, యింజక్షను మందులాగ. లోగడ ఓసారి మహాత్ములే వాపోయేరు—"పట్టాభి వోటమి నా వోటమి" అని. అమాటే ఆ రోజుల్లో ఒక నెల్లాళ్లు ముందుగా వెలువడివుంటే పరిస్థితులు యెలాగ ఉండేవో! జాతికి జీవగర్ర అయిన బాపూజీ హృదయంలో ఒక ఉన్నతస్థానాన్ని భోగరాజువారు ఆక్రమించుకొన్నారన్న సంగతి విస్మరించరానిది, విస్మరించలేనిదిన్నీ.

* * *

గాంధీజీ గతించేరు. బాపూజీ యిక లేరు. మహాత్ములు మరి రారు. కాంగ్రెసుసంస్థ అనే పేరుతో జాతికి చైతన్యం కలిగించి, స్వాతంత్ర్యం సముపార్జించి, దేశానికీ, ప్రజకీ ఒక అంతస్తు ఏర్పరిచిన ఆ ప్రాణి పరోక్షంలోనే వుండిపోయింది. వారి ఉపదేశాన్ని ఆదేశంగా గ్రహించి స్వతంత్రభారతిని ప్రగతిమార్గాలలో చిరస్థాయిగా నెలకొల్పే భారం మనమీదా, మన సంస్థలమీదా, మన నాయకులమీదా ఆధారపడివుంది. సంస్థలన్నిటిలోకీ ఆదినుంచీ దేశాభ్యుదయానికి బద్ధకంకణమయినది కాంగ్రెసు. దానినే అంటిపెట్టుకుని, ఆ మహాదాదర్శాల వరవళ్లలోనే నడుచుకుపోతూ, కలలోనైనా కదం తప్పని అశ్వికుడు పట్టాభి. మేరుపర్వతంలాగ అవుపించిన అడ్డంకులన్నీ బూరుగదూదిలాగ తేలికఅయి గాలికి ఎగిరిపోగా, పుంజీభూతమయిన తేజోరాశి అయి నిలిచేరు ఆయన. ఆ వర్చస్సు అంతా కాంగ్రెసు అధినేతగా దేశానికి వినియోగిస్తారు అంటే మహదానందమే కలిగింది.

భారతరాజకీయ వాఙ్మయంలో అత్యుత్తమస్థానం ఆక్రమించుకున్నవి రెండే రెండు గ్రంథాలు—ఒకటి ***Discovery of India***; రెండోది కాంగ్రెసు చరిత్రాను. ఈ రెండూ చదివి జీర్ణంచేసుకో గలిగితే భారతీయ ఔన్నత్యాన్ని తెలుసుకున్నవాళ్లే అవుతాం. వీటికి ఒకేసాటి. ఒకటి సూర్యుడూ, రెండోది చంద్రుడున్నూ. మొదటిది జీవసంచలనాన్ని కలిగిస్తుంది; రెండోది ఆ సంచలనజీవితంలో కాంతిభద్రతలనీ, శ్రేయస్సౌభాగ్యాలనీ చేకూరుస్తుంది. కాంగ్రెసుసంస్థనుగురించి ఆమూలాగ్రంగా తెలుసుకోవాలిఅంటే నాటికీ, నేటికీ, ఏనాటికీకూడా పట్టాభిగారు రచించిన చరిత్రే మూలాధారం.

ఛలోక్తికి యీయన పెట్టినది పేరు. నిదర్శనం కావాలంటే వీరి ***"Feathers and stones"*** అన్న పుస్తకం చూడండి. "మెటానమీ," "సినక్డకీలు" (***Metanomy***) (***Synecdochil***) పెద్దమని కలవరపరిచే రోజుల్లో 'మెటక్డకీ' (***Metacdoche***) అని ఒక కొత్తపదం సృష్టించి, యీ రెండిటిపోరూ వొదుల్చుకున్నట్టు!

పట్టాభి రచయితమాత్రమే కాదు. వక్త; ప్రతివాది భయంకరుడు.

ఈయన గొప్ప ఆర్థికశాస్త్రవేత్తకూడాను. ఆంధ్రాబ్యాంకు మొదలయిన సంస్థలని నెలకొల్పి ఆర్థికపరిస్థితులకి క్రమయోగం కల్పించేరు. చాణక్యుడి రక్తం పంచుకుపుట్టినవాడు కాడూ!

అంతేనా! అమాత్యపుంగవులకి ఉండవలసిన కార్యదక్షతా, ధీరత్వమూ, పరిశీలనాచాతుర్యమూ,

వివేచనజ్ఞానమూ నిశితంగా వున్నాయి ఆయనలో. ఆ త్యాగమూర్తి ముఖంలో బ్రహ్మవర్చస్సు ఉట్టిపడుతుంది. సత్యాసత్యాలని అన్వేషించి, ఆవేశానికీ ఉద్వేగానికీ తావు యివ్వక, ఊహాతీతమయిన శక్తులు కనపరిచేడు—మంత్రి యుగంధరుడి మాతృభూమిలో వెలిగిన యీ మహనీయుడు.

ఆయన మేధావి. వారికి ఉన్న జ్ఞాపకశక్తి వివిధవిషయాల్లోనూ వారు సేకరించి సప్రమాణంగా ఋజువుచేసే వివరాలూ (*Statistics*) దిగ్భ్రమగొలుపుతాయి. ఇటువంటిశక్తియుతుడు కాంగ్రెస్సుకి నేడు ఎంతో అవసరం. కాంగ్రెసునే నమ్ముకుని, దాని ఆశయాలే పరమావధిగా పెట్టుకుని వర్తించి మన అందరి ఆమోదంతోనూ పదవులని అలంకరించిన మంత్రివర్గానికీ తనకీ రుచులు సరిపోలేదని వనుక కృపాలినీ రాజీనామా యిచ్చేడు. ఆ సంగతి జ్ఞాపకం వుంచుకుంటే కాంగ్రెసుకీ ప్రభుత్వానికీ సమైక్యతాభావం కుదర్చవలసిన అవసరం యెంతైనా వుంది అని తెలుస్తుంది. కాగా, కాంగ్రెసుపథకంలోనే యింకా యెన్నో మార్పులు, సవరణలు రావలసివున్నాయి. దాని దృక్పథం సునిశితంగా కేంద్రీకరించాలి. ప్రభుత్వానికీ ప్రజకీ సామరస్యం, సన్నిహితత్వం కుదర్చగలిగింది ఒక్క కాంగ్రెసు సంస్థ.

దేశంలో వున్న చిన్నరాష్ట్రాలు అన్నీ ఇంకా ఐక్యంకాలేదు. స్టేటుపీపుల్సు కాన్ఫరెన్సుకి అధ్యక్షుడుగా వుండి అమోఘసేవ చేసిన పట్టాభిగారివల్లనే యీ దవ్వంతకొంతా తీరవలసివుంది. ఇట్టి పరిస్థితుల్లో వారు అధ్యక్షులుకావడం. కాంగ్రెసుకేకాక అఖిల భారతావనికీ శ్రేయస్కరం అని వేరేచెప్పాలా? పట్టాభిది ఎన్నో ఢక్కామొక్కలు తిని పండిపోయిన బుర్ర. యువకులకన్నా కొంచెం అధికంగావుండే ఉత్సాహమున్నూ, ఆ అనుభవాన్నీ యీ శక్తినీ దేశానికి వినియోగించడానికి వీలుగా పరమాత్ముడు వారిని చిరంజీవులని చెయ్యాలనీ, యితోధికమయిన ద్రఢిమా పటిమా కైసేయాలనీ మన అందరి కోరికా, ప్రార్థనాను. యావద్భారతం వారికి జేజేలు అర్పిస్తోంది.

క్రొవ్విడి లక్ష్మన్న

కొన్ని ప్రాచీన విషయములు

దక్షిణాఫ్రికాలో నీమధ్య స్టెర్క్‌ఫాంటైన్ వానరుని (ape-man) గర్భాశయ మొకటి లభించినది. ఈ వానరుడు మనుష్యాకృతిని బోలిన కోతులలోనివాడని ఇంతవరకు విజ్ఞులభిప్రాయపడుచుండెడివారు. డాక్టర్ బ్రూంకు దొరకిన ఈ వానరుని ఎముకలద్వారా— "ఈతడు మానవుల కతిసన్నిహితుడని చెప్పవీలున్నది. ఈ గర్భాశయము చాలవరకు మనుష్యునిదిగానే కన్పడుచున్న" దని అనినాడు. వెన్నుపూస అడుగుభాగమున ఉండు త్రికోణాకారమగు ఎముక మొదలైనవికూడ దీనితో కలిసియున్నవి. దీనితోపాటు అస్థిపంజరములో ననేకభాగములు దొరకినవట. ఉత్తర ట్రాన్సువాల్‌లో మకపన్‌గుహలవద్దనీ ఆదిమనివాసులనుగురించి పరిశోధించువా రనేకు లిప్పుడున్నారు. గార్డ్నర్, కిచింగ్ మొదలగువారు దాదాపు ఐదులక్షలక్రితమున్న జనుల గృహములు మొదలగువానిని దక్షిణాఫ్రికాలో శోధించుచున్నారు.

సర్ ఆర్థర్ కీత్ ఆదిమమానవులు ఆఫ్రికాలోనివారని చెప్పుచున్నాడు. క్రోధము, అసూయ, ద్వేషము అనునవి మానవుల అభివృద్ధికి చాల తోడ్పడినవని ఈతని అభిప్రాయము. ఆదిమవాసులలో ననేక తెగలు, వర్గములు ఉన్నవి. ప్రతివ్యక్తికి తన వర్గముపై అమితఅభిమానము, ఆదరము, గౌరవము కలవు. ఎవరైనా ఒక వ్యక్తి కెగ్గుసల్పినచో ఆ కూటమికే అది పరాభవముగా కన్పించుటచే అందరును కలిసి ప్రతీకారము చూపుదురు. అనగా నీ వాదముప్రకారము అంతర్జాతీయత కుదురదు. సర్వదేశములలోని మానవుల నేకత్ర చేర్చవలెనని యెంచిన సంస్థలన్నియు కూలిపోయినవి. ముమ్ముందు దేశీయతయే బలవత్తరము కాగలదని కీత్ యొక్క అభిప్రాయము. దీనితో మన మంగీకరించినను, లేకున్నను, ఆఫ్రికాఖండమున మానవసృష్టి ప్రప్రథమమున జరిగిన దని స్పష్టము.

కొన్ని వేలయేండ్లక్రిందట ఆఫ్రికాఖండము వింధ్యకు దక్షిణమున నున్న భారతదేశము, ఆస్ట్రేలియాలు కలిసియుండెడివి. గుజరాత్ ప్రాంతములోని అగ్నిపర్వతములు పైకి పొంగుటచే నీ ఖండములు విడిబడినవి. కాగా దక్షిణహిందూదేశముననే మానవోత్పత్తి జరిగిన దని చెప్పవీలున్నది. సింధులోయలో కన్పించు నాగరకత దక్షిణదేశములోని నదీముఖద్వారము లన్నింటిలోను కన్పించగలదు. మానవనాగరకత దక్షిణదేశముననే జరిగిన దని చెప్పుటకు అనేక ఉపపత్తులు గలవు.

ధర్మశాస్త్రమున ప్రాచీనులు చాలా అభివృద్ధి నందినారు. మనుస్మృతికి తుల్యములగునవి చాలచోట్ల కన్పించుచున్నవి. మనుశాసనము చాల ప్రాచీనము. బాబిలోనియాలోని నిప్పూర్ ప్రాంతమున కొన్ని ముఖ్యమగు పత్రములు, శాసనములు దొరికినవి. దాదాపు క్రీ. పూ. ౧౫౦౦ లో పాలించిన హమ్మురాబి యను బాబిలోనియారాజే ప్రథమధర్మశాస్త్రకర్త యని నేటి వరకు విజ్ఞుల యభిప్రాయము. కాని ఇతనికంటె ౧౫౦ సంవత్సరములు ప్రాచీనుడగు లిపిట్ ఇష్టర్ రాజే ప్రథమ మానవధర్మశాస్త్రకర్త యని ప్రస్తుతము లభించిన శాసనాదికములవలన తెలియుచున్నది. క్యూనిఫారమ్ లిపిలో, సుమేరియన్ భాషలో నివి యున్నవి. ఈ ధర్మవిధులవు సుమేరియన్ ఆచారవ్యవహారములే మూలము.

ఏదేని తప్పును చేసిన వ్యక్తి శిక్షింపబడవలెను. ఈ శిక్షకు తప్పుకు అవినాభావసంబంధ ముండితీరవలెను. తప్పుకు శిక్ష చక్కగా సరిపోయియుండవలెనని చాలకాలముక్రిందటనే సుమేరియనులు గ్రహించినారు. 'ఇతరుని తోటలో నన్ను చెట్టు నొకదు నరకి వేసినచో నీతడు 'మేనా' యను వెండినాణెములో సగము చెల్లించవలెను' అను సుమేరియను శాసనము హమ్మురాబిశాసనములలోగూడ కలదు. కాని "ఆతోట యజమానుని అనుజ్ఞ గైకొనక నరకినచో" అను విశేష విధియొకటి చేర్చబడినది. "ఇతరుని ఎద్దును బాడుగకు తెచ్చి దాని కంటికి దెబ్బ కలుగజేసిన దాని ప్రస్తుతపు ఖరీదులో సగ మీయవలెను" అని సుమేరియనులు. "ఆ యెద్దుయొక్క యజమానున కీయవలె"నని విశేషణముతో హమ్మురాబిలో కలదు. ఈ విధముగా సుమేరియనుల శాసనకలాపము చాలవరకు హమ్మురాబీలోనికి వచ్చినది. కాని సుమేరియనులలోని కొన్ని విధులు తర్వాతిశాస్త్రమున చేరలేదు.

"అన్యుని తోటలోని కనుజ్ఞలేక పళ్ళుగా, నెవడైన పట్టుకొనబడినచో, దొంగతనముక్రింద పది వెండినాణెములు చెల్లించవలె"నని సుమేరియనులు. ఈ న్యాయవిధుల నిచ్చినతర్వాత నీ క్రిందివాక్య మున్నది. "ఉతు (=ఆదిత్యుడు) యొక్క క్రమబద్ధమగు న్యాయమువలన, సుమేర్, అక్కడ్ (=బాబిలోనియా)లలో ఒడుదుడుకులు లేని న్యాయ ముండునట్లు చేసితిని. ఎన్లిల్ (=సుమేరులోని ప్రధానదేవత) యొక్క అజ్ఞచే, ఎన్లిల్ యొక్క పుత్రుడు, లిపిట్ ఇష్టర్ అను నేను శత్రుత్వమును, హింసను పోగొట్టగలిగితిని."

ఈవిధముగా అనాదికాలమునుంచి న్యాయశాస్త్రమర్యాద, నైతికప్రవర్తన అన్నిచోట్ల కాపాడబడినది. ఈ ప్రవర్తన చక్కగా భారతదేశమే క్రీ. పూ. ౩౦౦౦ నాటికే విరచించి గీతారూపమున ఆవిష్కరించినది. ఈ పనిమతుల్యమైన గీతాశాస్త్రమును మించిన గ్రంథము ఇంతవరకును రాలేదనుటలో అతిశయోక్తి లేదు.

ఇక సాంఘికవ్యవస్థను గమనింతము. చలితో నీరు, శరీరము కరడుగట్టి పోవు ఆర్కిటిక్ ప్రాంతమున, చాలా శతాబ్దములక్రిందటనే మార్క్సు బోధించిన కమ్యూనిజము అవలంబింపబడినది. ఎస్కిమోల సాంఘికవ్యవస్థకు క్రొపాట్కిన్, ట్రాట్స్కీలు చెప్పినదానికిని పోలిక చాల కలదు. సంఘములో నెవరివద్ద నున్నను మొడిపదార్థములపై నందరకును సమానహక్కున్నది. కాని వానినుంచి తయారగు పదార్థముల కీ స్వభావము లేదు. వానికి వ్యక్తియే అధికారి, హక్కుదారుడుకూడ. కారిబౌ ఎస్కిమోల ఆచారవ్యవహారములు, అతిప్రాచీనములు, ఆదిమనివాసులవికూడ. వీరి యిండ్లు చర్మములతో చేయబడినవి. వీనికి వెచ్చదనము కలుగజేయు మార్గము లేవియు వీరికి తెలియవు. సముద్రతీరస్థులగు ఎస్కిమోలకు నిప్పు చేయు పద్ధతులు బాగుగా తెలియును. కారిబౌలు చర్మమునే ధరింతురు. వీరందరు ఆక్రమించిన స్థలవైశాల్యము ౨,౫౦,౦౦౦ చదరపుమైళ్లు. వీరి జనాభా ౨,౫౦౦. బల్లెము, విల్లు మొదలగువానితోనే వీరు వేటాడుదురు. గ్రీన్లాండునుంచి అలాస్కావరకు వీరి భాష ఒక్కటే. కనీసము పదివేల మాటలను ప్రతి ఎస్కిమో నేర్చుకొనకతప్పదు. ఇది అతిక్లిష్టమగు భాష యని విజ్ఞుల అభిప్రాయము. ఈ సాంఘికవ్యవస్థ ఆదిమనివాసులందరిలోను కన్పించుచున్నది.

విమర్శనము

ప్రజావిరోధి

హెన్రిక్ ఇబ్సెన్ అనే సుప్రసిద్ధ నాటక రచయిత వ్రాసిన ఒక సుప్రసిద్ధనాటకానికి ఇది తెనుగుసేత. అనువాదకుడు: విద్వాన్ విశ్వంగారు. ప్రకాశకులు: నవ్యసాహిత్యమాల, అనంతపురము. వెల ౨ రూ.

"ఒక పట్టణాన్ని సమాజప్రతికృతిగా తీసుకొని, అందులో అధికారివారుల స్వార్థపరత్వం, మొండిఘటాల కనుపెలకువ, మాటలలో మహదాశయాలు చెబుతూ కన్నకూటికి ఆశించేవారి కక్కుర్తి, సత్యదీక్షగలవారు పడవలసిన పాట్లు" మొదలైన సమాజంలోని క్రొంత కుళ్లు కుళ్లగించి కడిగివేశాడు—మహానుభావుడు ఇబ్సెన్ ఇందులో. ఇటువంటి సంఘసంస్కరణకార్యకలాపాల్లో అతడు అందెవేసిన చేయి. ఇందులో అతడు చిత్రించినది పరాయిసంఘం కాగా దానికి తెలుగుసంఘంతో సమన్వయం కల్పించి, తెలుగువాతావరణం తెచ్చి, తెలుగుదనం సమకూర్చి, ఘట్టాలంలోని జిగినీ, బిగినీ పైవంతమట్టుకు సాధించి తెచ్చి విద్వాన్ విశ్వంగారు ఈ తెలుగుపరివర్తనంలో కూడా తమ శేముషీవిశేషాన్ని చక్కగా చూపెట్టారు. ఇది అందరూ చదివి తప్పకుండా మననం చేయవలసిన నాటక మనడానికి సందేహంలేదు. కొన్ని కొన్ని సవరణలతో ఇది ప్రదర్శనయోగ్య మవుతుం దని కూడా చెప్పవచ్చు.

*　　*　　*　　*

లీలాసుందరి

చిన్నపిల్లల చిత్తాలను హత్తుకొని, వారి సుఖాతభూపించే కట్టుకథలాంటి కల్పనాకథ. కథకులు: చింతా దీక్షితులుగారు. ప్రకాశకులు: త్రివేణీ పబ్లిషర్సు, మచిలీపట్టణము. వెల తెలియదు. అచ్చు కూర్పు, పుస్తకము తీరూ ముచ్చటగా ఉండి పిల్లలనిట్టే ఆకర్షింపగలిగేవిగా ఉన్నాయి. దీక్షితులుగారు మనసాలికి బాలవాఙ్మయోద్ధారకు లనవచ్చు. పసిపిల్లల మనస్తత్త్వం చక్కగా కనిపెట్టినవారు వారు. అందుకు ఈ చిన్నరచనే తార్కాణం. ఇటువంటి రచనలను వారింకా ఇంకా సాగించి బాలవాఙ్మయశాఖను చక్కని తీరుతో వృద్ధికి తీసుకొని వస్తా రని ఆశిస్తున్నాము.

ఆశ్వినమాహాత్మ్యము

రచయిత: గట్టి లక్ష్మీనరసింహశాస్త్రిగారు, ప్రకాశకులు: సాధనగ్రంథమండలి, తెనాలి. వెల రూ. ౨.

ఆశ్వయుజమాసమాహాత్మ్యమును, శ్రీ దేవీనవరాత్రివ్రతమహిమను సప్రమాణముగా, పురాణోక్తులతో నిరూపించు అయిదాశ్వాసముల పద్యకావ్య మిది. కవిత సలక్షణమై, సాంప్రదాయకమై సాగుచున్నది.

గ్రంథ స్వీకారము

అభిషేకనాటకము

భాసకృతికి అనువాదము. అనువాదకుడు: బులుసు వెంకటరమణయ్యగారు. ప్రకాశకులు: ఆర్. వెంకటేశ్వర్ అండు కో., లా సేల్సు, మద్రాసు. వెల రూ. ౧-౮-౦.

ప్రాచీనయోగులు

రచయిత: కొడాలి లక్ష్మీనారాయణగారు, బి. ఏ., మోపర్రు, తెనాలితాలూకా. వెల ౮ అ.

అజాతశత్రు

నాటకము. రచయిత: శ్రీ చంద్రశేఖర కణ్వశ్రీ. ప్రకాశకులు: వి. వి. నాయుడు అండ్ సన్సు, నెల్లూరు. వెల ౧౨ అ.

బాపూజీ నిర్యాణము

పద్యకవిత. రచయిత: పోలూరి హనుమజ్జానకీరామశర్మగారు, బి. ఎ. (ఆనర్సు)., వి. ఆర్. కాలేజి, నెల్లూరు. వెల ౮ అ.

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press. No. 7. Thambu Chetty St., G. T., Madras. Editor—S. Sambhu Prasad.